RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 10 Monthly October 2024 ISSN No. 2456-4702 Rs. : 15/-



## అడవి బాపిరాజు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)




# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(MONTHLY MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **అక్టోబర్ - 2024** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***

Kolla Sri Krishnarao (Late)

***E-mail :***

bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 21 - Issue. 10 - October 2024 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Honourable Editor*

**Dr. PITTA SANTHI**

*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*

**Dr. PAYARDA NAGAIAH**

*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*

# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

## ADVISORY COMMITTEE

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Hyderabad Central University, Hydetabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   Associate Professor, Dept. of Telugu &
   Chairman, BOS Philothrophy & Religion Studies,
   Andhra University, Visakhapatnam, A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
   Principal,
   St.Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

## ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI,
   Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.


గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**


Edited, Printed and Published by Dr. P. Nagaiah, #135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, GUNTUR - 522 034. Andhra Pradesh. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com. Printed at : GLS Enterprises, Guntur - 2. Ph. 94 94 660 509.

# అడవి బాపిరాజు

జననం : 1895 అక్టోబర్ 8 మరణం : 1952 సెప్టెంబర్ 22

అడివి బాపిరాజు ప్రముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర సమరయోధుడు, తెలుగు సాహితీ వేత్త, కళాకారుడు, నాటకర్త. చిన్నతనం నుంచి బాపిరాజు సాహిత్యంపై ఆసక్తి చూపించేవాడు. హ్యాపీరాజు పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో అక్టోబర్ 8 1895న ఒక నియోగ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు కృష్ణయ్య, సుబ్బమ్మ. భీమవరం స్కూల్లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసి, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో బి.ఎ. చేసి, మద్రాస్ లా కాలేజీలో బి.ఎల్ పట్టాను పొందారు.

కొంతకాలంలో న్యాయవాద వృత్తి నిర్వహించిన తర్వాత తను సాహిత్యం వైపు దృష్టి మళ్లించారు. తొలుత 1934 నుంచి 39 వరకు బందరు నేషనల్ కాలేజీలో అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా పని చేశారు. 1944లో హైదరాబాద్ నుంచి వెళ్లేవాడే తెలుగు దినపత్రిక అయిన మీ జాన్ సంపాదకుడుగా పనిచేశాడు. తర్వాత విజయవాడ ఆకాశవాణి వీడియో కేంద్రంలో సలహాదారునిగా కొంతకాలం పనిచేశారు. నవ్య సాహిత్య పరిషత్ అనే సాహితీ సంస్థ స్థాపించారు చిత్రకళను నేర్పడానికి గుంటూరులో ఒక ఫౌండేషన్ కూడా ప్రారంభించాడు.

బాపిరాజుకు చిన్నతనం నుంచి తెలుగు సాహిత్యం అన్న తెలుగు భాష అన్న ఎంత మమకారం కవితలు చాలా చక్కగా రాసేవాడు. భారతరత్ రచించిన నారాయణవులకు ఆంధ్ర విశ్వ కళాపరిషత్ అవార్డుల లభించింది. చిత్రకారుడిగా ఆయన చిత్రించిన చిత్రాల్లో సముద్రగుప్తుడు, తిక్కన ప్రసిద్ధమైన చిత్రాలు. విశ్వనాథ సత్యనారాయణ గేయ సంపుటి కిన్నెరసాని పాటలకి బాపిరాజు గీసిన చిత్రాలతో వెలువడింది. నవరంగ సంప్రదాయ రీతిలో అడవి బాపురాజు ఎన్నో అద్భుతమైన చిత్రాలు చిత్రించారు. శబ్ద బ్రహ్మ అనే చిత్రం డెన్మార్క్ ప్రదర్శనశాలలో ఉంది. భాగవత పురుషుడు, ఆనంద తాండవం మొదలైన చిత్రాలను తిరువాన్ గురు మ్యూజియంలో ఉన్నాయి. 1951లో అప్పటి మద్రాస్ ప్రభుత్వం కోరికపై సింహాలములోని సిరిగియా కుండ్య చిత్రాలను ప్రకృతులను సత్కరించారు.

అడవి బాపు రాజు రచనలు :

నవలలు :

| | |
|---|---|
| నారాయణ రావు 1934 సాంఘిక | కోనంగి 1946 సాంఘిక |
| తుఫాను 1945 సాంఘిక | గోన గన్నారెడ్డి 1945 చారిత్రక |
| హిమబిందు చారిత్రక | అడవి శాంతి శ్రీ చారిత్రక |
| అంశుమతిమతి చారిత్రక | నరుడు సాంఘికం |
| జాజిమల్లి సాంఘికం | మధురవాణి |
| శిలా రథం | కైలాస ఈశ్వరుడు |
| రేడియో నాటికలు | దుక్కి తేద్దులు |
| ఉషా సుందరి | భోగిరలోయ |

నారాయణరావు శైలబాల
పారిజాతం నవోదయం
ఏరువాక

కథా సంపుటిలు :

తరంగణి 7 కథా సంపుటి
రాగమాలిక 9 కదా సంపుటిలు
అంజలి 6 కదా సంపుటిలు
తూలికా నృత్యం 3 కథా సంపుటి
భగీరలోయ 6 కథా సంపుటిలు
విద్యాచలం 4 కదా సంపుటిలు

కథలు :

తూలికా నృత్యం
హంపి శిథిలాలు
శైలబాల
వీణ
నాగలి
నేలతల్లి
బొమ్మల రాణి
సోమ సుత
సూర్య సత

అడవి బాపిరాజు 1922 సంవత్సరంలో భారత స్వాతంత్ర సంగ్రాముల పాల్గొని అరెస్ట్ అయ్యాడు. జైలులో ఉండగానే శాతవాహన నేపథ్యంలో సాగే హిమబిందు అని నవల ప్రారంభించారు. ప్రమోద్ కుమార్ చట్రోపాధ్యాయ దగ్గర శిష్యరికం చేసి భారతీయ చిత్రకళలో నైపుణ్యం సాధించాడు. అడవి పాపారాజు ప్రముఖ ప్రజ్ఞాశాలి ప్రముఖ రచయితగా ఎన్నో విజయాలు సాధించి చివరకు 1952 సెప్టెంబర్ 22న మద్రాసులో కన్నుమూశాడు.

- చీఫ్ ఎడిటర్

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | జాషువా వర్ణించిన తెలుగుజాతి వైభవం | - డా॥. డి. జోత్యమ్మ | 9 |
| 2. | బడి.... గుడి... స్మశానము | - డా॥. మహ్మద్ హసేన | 11 |
| 3. | శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి మనిషి - మనసు - ఆధ్యాత్మిక ప్రభావం | - డా॥ యం. పద్మగౌరి | 14 |
| 4. | ఇందూరు చిందు యక్షగానం | - డా॥. ఎన్. అంబర్ సింగ్ | 17 |
| 5. | స్వప్నాల దుప్పటి కావ్య పరిశీలన | - డా॥. కె. జ్యోతిలక్ష్మి | 22 |
| 6. | బహుభాష కోవిదుడు నలిమెల భాస్కరుడు | - రేణ ఈశ్వరయ్య | 26 |
| 7. | తెలంగాణ కథా ప్రక్రియలో కాలువ మల్లయ్య కథలు | - బీరెల్లి కృష్ణవేణి | 34 |
| 8. | జీవితం బ్రతుకు లోతును చిత్రించిన బి.ఎస్. రాములు కథలు | - డా॥. సంగాల కోమల | 40 |
| 9. | ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన | - డా॥. బానోత్ స్వామి | 47 |
| 10. | జానపద కళారూపాలు - పరిచయం, ప్రత్యేకత | - మేకల శిరీష | 55 |
| 11. | రెండు కళ్ళు మూడు కాళ్ళు నవల - బిచ్చగాళ్ళ దీన స్థితి | - డా॥. పురుషోత్తం గుంట | 62 |
| 12. | ఆదివాసీ జీవితం - జీవిత సమస్యలు | - లాలం అచ్చియ్యమ్మ | 65 |
| 13. | దాశరథి రంగాచార్య జీవితం - రచనలు | - ప్రసన్న లక్ష్మి మాదిరాజు | 67 |
| 14. | భాగవత కథలు - చతుర్థ, పంచమి స్కంధాలలో భక్తి | - వి. ఎల్. నరసింహారావు | 73 |
| 15. | పెరిక కులం పెండ్లి తంతులో సూర్య భక్తుల ప్రాధాన్యత - ఒక పరిశీలన | - దుండె రాజేశ్వరి | 79 |
| 16. | మనిషి మర్మము తెలిపే - 'తెలంగాణ రుబాయిలు' | - కళ్లెం ధనోజ | 86 |
| 17. | వేంపల్లి గంగాధర్ నవలలు - సామాజిక విశ్లేషణ | - జి. రత్నకుమారి | 90 |

# జాషువా వర్ణించిన తెలుగుజాతి వైభవం

- **డా॥. డి. జోత్స్నమ్మ**, ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

జాషువా 1895 సెప్టెంబర్ 28వ తేదీ వినుకొండలో జన్మించాడు. 1971వ సంవత్సరం మరణించాడు. కవికోకిల, నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, పద్మశ్రీ, కవితా విశారద, కవిదిగ్గజ, పద్మవిభూషణ్, కళాప్రపూర్ణ బిరుదులున్నాయి. పిరదౌసి, ముంతాజ్ మహల్, కాందిశీకుడు, క్రీస్తుచరిత్ర, స్వయంవరం, స్వప్నకథ, రాష్ట్రపూజ మొదలైన కావ్యాలు, 200కు పైగా ఖండకావ్యాలు, నాటకాలు, నవలలు రాసాడు. ఉపాధ్యాయునిగా ప్రారంభించి, మద్రాసు ఆకాశవాణిలో స్పోకెన్ వర్డ్ ప్రొడ్యూసర్ వరకు వివిధ ఉద్యోగాలు చేసాడు.

వేదనతో కూడిన జీవితానుభవంతో మానవ జీవితాన్ని వ్యాఖ్యానించిన కవి గుర్రం జాషువా. నిజాయితి, ఆర్తి, ఆవేశం, ప్రతిఘటన, జాషువా కవిత్వానికి జీవలక్షణాలు. ఆయన జీవితం నుండే ఆయన కవిత్వం పుట్టింది. జాతీయాభిమానం, సంఘ సంస్కరణాభిలాష స్ఫుటంగా కన్పిస్తాయి. బుద్ధుడు, క్రీస్తు, గాంధీజీల జీవకారుణ్యభావం జాషువాలో కన్పిస్తుంది. ఆధునిక కవులలో జాషువా ఒకరు. సంఘంలో వుండే అసమానతలకు బాధపడి వీటన్నిటిని కవిత్వరూపంలో రాసాడు.

గబ్బిలం కావ్యంలో ఆంధ్రప్రశస్తిని వర్ణించాడు. విజయనగరం, తంజావూరు, నెల్లూరు, నంద్యాల, వినుకొండ, పల్నాడు, కొండవీడు, రాజమహేంద్రవరం అనే ప్రాంతాలలో ఆంధ్రజాతి వైభవం గురించి ఈ వ్యాసంలో వర్ణించబడింది.

## జాషువా వర్ణించిన పుణ్యక్షేత్రాలు :

ఆంధ్రుల శిల్పకళ హంపీక్షేత్రంలో వర్ణించడం జరిగింది. ఈ క్షేత్రంలో నిర్మించిన దేవతా విగ్రహాలు ఆకర్షణీయంగా వున్నాయి. ముఖ్యంగా ఉగ్రనరసింహ స్వామి విగ్రహాన్ని చెప్పవచ్చు. శత్రువులు అసూయతో ఈ విగ్రహాన్ని కొంతవరకు నాశనం చేసినా ఈ విగ్రహం కళ్లల్లో కన్పించే భయంకరత్వం ఎంత ధైర్యవంతుల్నయినా భయకంపితులను చేస్తుంది. ఎవరైనా దానిముందు కొంచెం సమయం నిలబడగలిగితే వాళ్లని ధైర్యవంతులనే అనుకోవచ్చు.

ఉ. ఏనికవంటి సానువు గణేశుని నున్నని బొజ్జమీదగా
లూనఁగ లేదు తుమ్మెద తదుజ్జ్వల శిల్ప మఖండ తుంగభ
ద్రానది కప్పగించుకొని దద్దమలైన తెలుగువారి వి
ద్యానగరాన జిందు మొక యశ్రుకణంబు నుపాయ నంబుగన్

తర్వాత చెప్పుకోదగ్గ విగ్రహం గణేశుడు. పెద్ద ఏనుగంత రాతిమీద చెక్కారు. ఇది నున్నగా వుంటుంది. ఈ విగ్రహం బొజ్జమీద తుమ్మెద వాలినా జారిపోతుంది. అంత నున్నగా చెక్కారు. మరో పుణ్యక్షేత్రం కారెంపూడి. ఇక్కడ పల్నాటివీరులు తమలో తాము యుద్ధం చేసుకుని తమ పరాక్రమాన్నంతా నాగులేటి పాలు చేసారు. సంవత్సరానికొకసారి ఇక్కడ తిరునాళ్లు జరుగుతాయి. ఈ తిరునాళ్లలో పల్నాటివీరులు యుద్ధంలో ఉపయోగించిన కత్తులు ప్రదర్శింపబడుతాయి. ఈ కత్తుల్ని చూసినప్పుడు ఆ పల్నాటివీరుల పరాక్రమం కళ్లముందు ప్రత్యక్షమౌతుంది.

కృష్ణానదీ తీరంలో వున్న అనేక పుణ్యస్థలాలను గురించి ప్రశంసించడం జరిగింది. ద్రాక్షారామం గురించి వర్ణించబడింది. ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామి వున్నాడు. ఈ స్వామి చాలా దయగలవాడు. ఈ దేవుడితో సమానం ఏ దేవుడు రాడు. ఈ స్వామి మూడుపూటలా నాట్యం చేస్తాడు. ఈ స్వామి దర్శనం జరిగితే కష్టాలు తొలగినట్లేనని వర్ణించాడు. కైలాసంలో శివుడు ఒక్క సాయంత్రం మాత్రమే నాట్యం చేస్తాడు.

## హంపీక్షేత్ర వైభవం :

మ. పరదా పద్ధతి మాన్పిరో సిరికిఁ గుప్పల్ వోసి యంగళ్ళ యం

దురుమాణిక్యము లమ్మినారచట మున్నో పక్షిణి! మూరురా
యరగండండు మహేంద్ర వైభవముతో నాంధ్రక్షమామండలిన్
పరిపాలించిన నాఁటి పెంపును దలంపన్ ఏను గంపించెడిన్

శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పాలిస్తున్నప్పుడు హంపీక్షేత్రం స్వర్గసంపదలతో తులతూగింది. వీధులలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారు. బేరగాళ్లు పారసీక దేశం నుంచి మేలుజాతి గుఱ్ఱాల్ని తెప్పించి పట్టు డేరాలలో నిలిపితే కృష్ణదేవరాయలు వాటిలో మేలైన గుఱ్ఱాన్ని కొని సైన్యంలో అశ్వబలాన్ని వృద్ధి చేసాడు. ఏనుగుల తొండాలకి ఇనుపరోకళ్లు అందించి వాటిచేత సాధన చేసేవాడు. ఇట్లా సైన్యంలోని గజబలం పటిష్టం చేయబడేది. విదేశాల నుంచీ వచ్చిన తెల్లవాళ్లని కూడా రాయలు తన సైన్యంలో చేర్చుకునేవాడు. వాళ్లకి మరఫిరంగులు పేల్చటంవచ్చు. ఈ విధంగా రాయలు తన సైన్యాన్ని అన్ని విధాలా బలిష్టంగా చేసుకునేవాడు. హంపీ క్షేత్రం శిల్పకళకి ప్రసిద్ధి చెందింది.

## గుంటూరు మండల విశిష్టత :

ఆంధ్రదేశంలో గుంటూరు మండలం ఎంతో విశిష్టత కల్గివుండి పరాక్రమ విషయంలోనూ, సాహిత్య విషయంలోనూ గుంటూరు మండలం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈనాటి నంద్యాల పట్టణం ఒకప్పుడు గుంటూరు మండలంలోదే. ఈ నంద్యాలను ఏలిన కంచర్ల కృష్ణరాజు గొప్ప సాహిత్యపోషకుడు. గుంటూరు మండలంలోని వినుకొండ ప్రాంతాన్ని రాయని భాస్కరుడు పరిపాలించాడు.

క. ప్రొద్దునకు వన్నెఁ బెట్టిన
యిద్దఱు భాస్కరులు పుడమి నేలఁగ సొగసుల్
దిద్దినది మేన వయసునఁ
బెద్దది గుంటూరుసీమ పెఱ్ఱ సీమలలో

ఇతను గొప్ప పరాక్రమశాలి. ఆకాశంలో సూర్యుడు ఏ విధంగా ప్రకాశిస్తాడో ఆ విధంగా ప్రకాశించాడు. పల్నాడు వీరభూమి. పల్నాడు అంటేనే పరాక్రమం. కాని ఏం లాభం? కోడిపందెపు తగాదాలు చివరకు మహాయుద్ధంగా మారి అన్నదమ్ముల మధ్య యుద్ధం జరిగి మహావీరుల రక్తమంతా అక్కడ ప్రవాహించే నాగులేటి వాగులో కలిసిపోయింది. గుంటూరు మండలంలోనిదే కొండవీటి సామ్రాజ్యం. కొండవీటి సామ్రాజ్యాన్ని రెడ్డి రాజులు పరిపాలించారు. వీరి సాహిత్య పోషణ అద్భుతం. ఈ విధంగా గుంటూరు మండలం. ఆంధ్రదేశంలోని ఇతర మండలాల కంటే ముందుగా ఏర్పాటు చేయబడటమే కాదు. గొప్ప గుణాల్లో కూడా మిగతా మండలాల కంటే ముందే వుంది.

## కొండవీటిరెడ్డిరాజుల సాహిత్య పోషణ :

ఆంధ్రదేశంలో విలసిల్లిన సామ్రాజ్యాల్లో కొండవీటి రెడ్డి రాజుల సామ్రాజ్యమొకటి. రెడ్డిరాజుల కాలంలో తెలుగు సాహిత్యం మూడుపువ్వులూ ఆరుకాయలుగా విలసిల్లింది. ఈ రాజులు స్వయంగా కవులూ, కవిపండిత పోషకులునూ కావ్యాలు రాసి ఇతరులకు అంకితమిచ్చారు. ఈ రాజవంశంలో వేమన యోగి తెలియని ఆంధ్రుడుండడు. ఇతను సంసార జీవితంతో విసిగి విరక్తి చెంది పిచ్చివాడిలాగా దేశమంతా తిరిగాడు. గొప్పకవి. ఆశువుగా చెప్పిన పద్యాలు తెలుగు భాష యొక్క తియ్యదనాన్ని వ్యక్తం చెయ్యటమే కాకుండా ఎంతో గొప్ప భావంతో నిండివునాయి. ఈ పద్యాల్లోని మాధుర్యం తెలుగువారిని ఆకర్షించింది. కొండవీటి సామ్రాజ్య వైభవాన్ని గూర్చి ఎంతోమంది కవులు కావ్యాలు రాసారు.

## జాషువా వర్ణించిన చారిత్రక వైభవం :

కృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యం పాలించే రోజుల్లో వీధుల్లో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారు. రాయలు తన సైన్యాన్ని గురించి చాలా శ్రద్ధ తీసుకునేవాడు. పారసీకదేశం నుంచి తెప్పించిన గుఱ్ఱాల్ని కొని అశ్వబలాన్ని పెంచాడు. మరఫిరంగులను పేల్చే తెల్లవారిని తన సైన్యంలో చేర్చుకున్నాడు. ఏనుగులచేత ఇనుపరోకళ్ల సాధన చేయించేవాడు. ఈ విధంగా సైన్యాన్ని పటిష్ఠం చేసాడు. రాయల తర్వాత కొద్దికాలంలోనే విజయనగర సామ్రాజ్యం పతనమైంది. తమిళదేశంలో తెలుగు

నాయకరాజులు తంజావూరును ముఖ్యపట్టణంగా చేసుకొని రాజ్యాన్ని పాలించారు. వీరిలో రఘునాథ నాయకుడు బహుకళాపోషకుడు. తెలుగులో మంచి కవి. చేమకూర వేంకటకవి, ముద్దుపళని, క్షేత్రయ్య రఘునాథ రాయలచేత ఆదరింపబడినవారే.

తెలుగుదేశంలో నెల్లూరు పట్టణం తిక్కన మహాకవి నివాసస్థలం కనుక ప్రఖ్యాతి చెందింది. కంచర్ల కృష్ణరాజు నంద్యాల ప్రాంతానికి ప్రభువు. కవిపోషకుడు. వినుకొండ నేలిన రాయని భాస్కరుడు మహాదాతగా ప్రఖ్యాతి గాంచాడు. పల్నాటిసీమనేలిన దొరలు మహాపరాక్రమ వంతులు. అన్నదమ్ముల మధ్య కోడిపందాలతో ప్రారంభ మైన వైరం చివరకు యుద్ధంగా పరిణమించింది. ఈ మహావీరుల పరాక్రమం నాగులేటివాగులో కలిసింది. కొండవీటి రెడ్డిరాజులు స్వయంగా కవులు, కవి పండిత పోషకులు. కావ్యాలు రాసి అంకితమిచ్చారు. రాయించి అంకితం పుచ్చుకున్నారు. ఈ రాజవంశంలోని వేమన సంసార జీవితంతో విసిగి విరక్తి చెంది పిచ్చివాడిలాగా ఊళ్లు తిరిగినా తెలుగులో వేలకొలది పద్యాలు, ఎన్నెన్నో సాంఘిక విషయాల్ని విమర్శిస్తూ రాసాడు. గుంటూరును భాస్కరమంత్రి పాలించాడు. ఇతను కూడా ఆకాశంలో సూర్యునివలే (భాస్కరుడివలె) ప్రకాశించాడు.

తూర్పు చాళుక్యరాజులు రాజమహేంద్రవరం కేంద్రంగా వేంగీ సామ్రాజ్యాన్ని స్థాపించారు. ప్రజల వేషభాషల మీద వాళ్లకెంతో గౌరవం. ఈ రాజులు ఆస్థానం కవి పండిత నిలయం. రాజరాజనరేంద్రుడు వేంగీ రాజ్యాన్ని వీరభూమిగా తీర్చిదిద్దాడు. చిత్రాంగి సారంగ ధరుల కథ కూడా రాజమహేంద్రవరంలోనే జరిగిందని చెపుతారు. చిత్రాంగి మేడ అని ఒక కట్టడాన్ని నిదర్శనంగా చూపిస్తారు. ఈ విధంగా జాషువా తెలుగుదేశంలోని చారిత్రక వైభవాన్ని, ఎన్నో వీరభూములను, పుణ్య క్షేత్రాలను వర్ణించి తెలుగు జాతి యొక్క వైభవం కళ్లకు కట్టినట్లు వర్ణించాడు.

**ఆధార గ్రంథాలు :**

1. జాషువా - గబ్బిలం
2. గబ్బిలం - జాషువా తాత్విక స్వప్నం.

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 10, October 2024

భావవీణ

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# బడి.... గుడి... స్మశానము

– డా॥. మహ్మద్ హసేన, అధ్యక్షులు, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హాలియా, నల్లగొండ జిల్లా.

బడి, గుడి, స్మశానము (సమాధి) ఈ మూడు ఒకదాని కొకటి సంబంధం లేనివి కానీ ఈ మూడు ప్రశాంతమైన ప్రదేశాలే. ఒకటి విజ్ఞాన్ని మరియు వికాసాన్ని అందిస్తే, రెండోది మానసిక ప్రశాంతతను అందిస్తుంది. మూడోది మనిషి జీవిత కాలంలో ఏర్పరచుకున్న విలువలు మరియు పాటించిన ఆదర్శాలను ఆవిష్కరిస్తుంది. మనిషి పాశవిక దశ నుండి పౌరుడిగా ఎదిగిన తీరును కళ్ళ ముందుచుతుంది ఎలా బ్రతకాలో ఎలా బ్రతక గూడదో నేర్పిస్తుంది. మనిషిని మనీషిగా తీర్చిదిద్దేది సంఘంలో మంచివ్యక్తిగా, చరితార్ధుడిగా తయారు చేస్తుంది బడిలోనే. మనిషి అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు, చీకటి నుండి వెలుగుల వైపు పయనించగలడు. అంతమాటకొస్తే చదువుకున్న వారు చాలా మంది ప్రపంచ చరిత్రలో నేరస్థులుగా, నియంతలుగా, హంతకులుగా, అసమర్థ పాలకులుగా చరిత్రకెక్కిన వారు వున్నారు. అక్షరం ముక్కరాని అక్బర్ చక్రవర్తి చక్కగా పాలించి గొప్ప పాలకుడిగా ఎదిగిన విధానం చరిత్రలో మనం చదువు కున్నామ్, అలాగే ఏమి ఆశించకుండా సమాజానికి తన జీవితాన్ని ధారపోసిన వారు కూడా వున్నారు.

మరి చదువుకున్న వ్యక్తికి ''చదువు'' సంస్కారం నేర్పిస్తుందని ప్రారంభంలోనే చెప్పుకున్నామ్ కదా మరి ఈ రకమైన వ్యక్తులు అలా ఎందుకు ప్రవర్తించారు అంటే ''తరగతి గది'' నుండి బయటకు వచ్చే ప్రతి వ్యక్తి సంఘసేవకుడిగానో, సన్యాసిగానో మారి సమాజానికి ఉపయోగపడాలని ఏమిలేదు. అలాగే తరగతి గదిలో ఉన్న పిల్లలు ఒక విధమైన అభ్యసనా సామర్ధ్యాలు, మానసిక వికాసాలు, కుటుంబ నేపధ్యం కల్గి ఉండాలని ఏం లేదు కదా...! పేదరికంలో వుండి చదువు ద్వారా గొప్ప స్థాయికి ఎదిగి ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వారు వున్నారు, గొప్ప కుటుంబంలో పుట్టి చదువుకోని చరిత్రహీనులుగా మారిన వారు ఉన్నారు. కాబట్టి ఒకే అంశము నుండి అనేక రకాల ఫలితాలు వచ్చాయి అని మనం అర్థం చేసుకోవచ్చును.

“మానవుడు సంఘజీవి” అంటాడు ప్రముఖ తత్త్వవేత్త అరిస్టాటిల్ సంఘం ద్వారా మనిషి సామూహిక జీవనానికి అలవాటు పడతాడు. సంఘంలో బడి, గుడి రెండూ ఉంటాయి. శిశువు, ఆదశ దాటేంత వరకు కుటుంబం పర్యవేక్షణలో పెరుగుతాడు ఆదశ దాటినా తర్వాత మిగిలిన జీవితాన్ని కొత్త వాతావరణంలోకి ప్రవేశించి గురువుల ద్వారా అనేక కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు సాగుతాడు. బ్రతకడానికి కావాల్సిన అన్ని రకాల నైపుణ్యాలను తరగతి గదిలో నేర్చుకొని మిగిలిన జీవితాన్ని సమర్ధవంతంగా పూర్తి చేయడానికి ప్రతిరోజు ప్రయత్నిస్తూ ఉంటాడు. విద్య నేర్పమని ''ఏకలవ్యుడు'' గురు ద్రోణ చార్యుడిని ఆశ్రయిస్తే విలువిద్యలు నేర్చుకోవడానికి ఆటవిక తెగలు అనర్హులని అవమానిస్తాడు, అదేవిధంగా కర్ణుడు విలువిద్యలు గురువు పరుశరాముడి వద్ద నేర్చుకున్న చేసిన తర్వాత అనుమానించి శపిస్తాడు. ఇక గురుద్రోణాచార్యుడు కురు - పాండవుల అభిరుచి మేరకు అస్త్రశస్త్ర విద్యలను నేర్పిస్తాడు. అలా అర్జునుడు మేటి విలుకాడిగా కురుక్షేత్ర యుద్ధంలో చేసిన వీరోచిత పోరాటాలు మనకు తెల్సిందే, అంతెందుకు ద్రోణా చార్యుడి కుమారుడు అశ్వద్ధామ బ్రహ్మాస్త్రాన్ని దుర్వి నియోగం చేసి కురు వంశం నాశనం చేయాలని ప్రయత్నం చేసిన విషయం తెలిసినదే. అంటే నేర్చుకొన్న విద్యను ఎలా ఉపయోగించుకొన్నాము. అనేది ఇక్కడ ఆయా సందర్భాలను వ్యక్తుల ఉద్దేశ్యాలను బట్టి ఆధార పడి వుంటుంది. సాందీపని ఆశ్రమంలో శ్రీ కృష్ణుడు కుచేలుడు ఎలా చదువుకున్నారో జగమెరిగిన సత్యమే.

మరి ప్రస్తుతం సమాజంలో గొప్ప చదువులు చదువు కున్న వారు మేధావులు గాను, ఉద్యోగస్తులుగాను, వ్యాపారస్థులుగాను, రాజకీయ నాయకులుగాను, సంఘ

సేవకులు గాను ఎన్నో వివిధ రంగాలలో స్థిరపడి ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి అవినీతికి పాల్పడి, రాజకీయాలలో వుంటే అక్రమాలకు పాల్పడటం వ్యాపారస్థులు నీతి నిజాయితీకి తిలోదకాలు అందినకాడికి దోచుకోవడం చూస్తూనే ఉన్నామ్. అంటే వీరు పాఠశాలలో చదువుకున్న, నేర్చుకున్న విద్యా విలువలు ఎటు పోయినట్టు, ఎందుకు ఇలా అక్రమ సంపాదనకు తెర తీసినట్లు అంటే వీరు ఏం నేర్చుకున్నారు? చదువు ఈ రకంగా వారిని పక్కదారి పట్టించింది అని భావించాలి. సరే తల్లి ఒడి నుండి బడిలో చేరిన వాడు "గురువు" ద్వారా నేర్చుకున్న విలువలు  సామాజిక సర్దుబాటు ఇవన్ని తరగతి గది నుండే నేర్చుకొని సమాజం అనే విశాలమైన క్షేత్రంలోకి వస్తాడు. అలా వచ్చిన తర్వాత తరగతి గది వాతావరణం వేరు సమాజపు వాతావరణం వేరు అన్నింటిని సర్దుబాటు చేసుకొని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. అంతెందుకు మహాత్మ గాంధీ, అబ్దుల్ కలాం, అంబేద్కర్, కందుకూరి, గురజాడ, టంగుటూరి ప్రకాశం, గిడుగు రామ్మూర్తి మొదలైన వారంతా తరగతి గది నుండి సమాజాన్ని ప్రభావితం చేసి చరిత్రక్కి మనకు మార్గదర్శకాలు అయ్యారు. సరే మరి నేటి అవినీతి నాయకుమాటేమిటీ వారు కూడా తరగతి గది నుండి వచ్చిన వారే కదా! మరి వారు ఆదర్శాలు, విలువలు తరగతి గదిలో నేర్చుకున్నా వారే కదా! వాటిని పాటించడంలో విఫలమైనారని అర్థం చేసుకోవచ్చు. అందుకే వారు చరిత్రహీనులుగా, మరికొద్ది మంది చరితార్డులుగా మిలిలారు.

ఇక "గుడి" విషయానికొద్దాం "గుడి" అంటే కొద్దిమంది "మందిరం" అని, మరికొద్ది మంది "చర్చి", "మసీదు", "గురు ద్వారా", "తోరా", అని రకరకాల పేర్లతో సాంప్రదాయాలు ఏవైనా వివిధ పేర్లతో పిలుచుకుంటారు. ఏ పేరుతో పిలిచినా మనిషి అసలు "గుడి"కి ఎందుకు వెళ్తాడు. అనేది ప్రశ్న? ప్రకృతిలో భాగమైన మనిషి చెట్టు, పుట్టను పూజించాడు, కాల గమనాలను గమనిస్తు తన దిన చర్యను నిర్దేశించుకొని ముందుకు కదిలాడు, తనను తాను కాపాటుడుకుంటూ ఆహార అన్వేషణకు బయలు దేరాడు. యాదృచికంగా కాల్చిన మాంసం ఒకరోజు దొరకటం ఆరుచి వేరుగా ఉండటం ఆదిమానవుడి జీవన శైలి ఆహారపు అలవాట్లు క్రమంగా మారుతు వచ్చాయి.

ఆ తర్వాత సామాజిక కట్టుబాట్లు, మేధో వికాసం ఫలితంగా ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, మనుషుల మధ్య క్రమంగా పురుడుపోసుకున్నాయి. సమాజం కులాలుగా, మతాలుగా, జాతులుగా విభజింప బడటం మూలంగా ఏ మతం వారు ఆ మతాన్ని అను సరించి, ఆ మతగ్రంధాలను, నియమాలను అనుసరించి ఆయా ఆచారాలను, పండుగలను, పర్వదినాలను, వస్త్రా ధారణను క్రమంగా పాటించి మనుషుల మధ్య విభజన రేఖలు గీశారని భావించాలి. ఇదంతా ఒక ఎత్తైతే మనిషి మానసిక విజ్ఞానం కోసం బడికి వెళ్తే మానసిక, శారీరక సౌఖ్యం కోసం, తన నిత్య జీవితంలో ఎన్నో రకాల ఆటు పాట్లు, సంఘర్షణలు ఎదుర్కొంటూ ప్రశాంతత కోసం ఒక ప్రదేశాన్ని ఎంచుకున్నాడు అదే, "మందిరం, మసీదు, చర్చి, గుడి, గురుద్వారా" మొదలైనవి వాటిని ఇతరులు అందులోకి రాకుండా అడ్డుపడ్డాడు. ఆనాడు మొదలైన విషపు ఆలోచన నేటికి మనుషుల మధ్య విభజన రేఖలు ఇంకా పెరిగి పెద్దౌతున్నాయంటే వాటికి మూలాలు అక్కడే పడ్డాయి, అందుకు తగినట్లుగానే మనుషులను "మతం" ఆధారంగా విడగొట్టి మానవత్వం అనేది మరచి సంకుచితంగా మత యుద్ధాలు చేసుకున్నారంటే ఎంత మూర్ఖంగా మనుషులు ఆనాడు మత యుద్ధాలు, ప్రపంచ యుద్ధాలు చేసుకొని లక్షల మందిని బలిపశువులుగా బాధితులుగా, మిగిల్చారు? అంతెందుకు నేటికి కూడా యుద్ధాలు జగుతున్నాయి, అంటే దాని వెనుక గల సున్నితమైన అంశం "మతం" దాగి వుందనేది చారిత్రక సత్యం అంటే మతగ్రంధాలు మనుషుల మధ్యన విభజన రేఖలు గీశాయా? లేదా మనుషులే మత గ్రంధంలో ఉన్నది సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారా? అన్నది ప్రశ్న.

గుర్రం జాషువా అన్నట్లుగా "కుల మతాల గీతలు గీచుకొన్న గీతల చొచ్చి పంజరాన కట్టుపడును నేను" అన్నట్లుగా బడిలో లేని అడ్డుగోడలు "గుడి" విషయంలో

ఎందుకు అన్నది ప్రశ్న? బడిలో అందరు చదువు కున్నట్లుగా గుడిలోకి కూడా అందరికి అవకాశం వుంటే ఎంత బాగుండేది అంటే మనిషి బడికి వెళ్తాడు, గుడికి వెళ్తాడు బడిలో లోకజ్ఞానం పొందిన మనిషి గుడి విషయంలో మళ్ళీ సంకుచితంగా ప్రవర్తించడం ఏమిటి? అనేది మనుషులుగా మనం వేసుకోవాల్సిన ప్రశ్న!

ఇక "స్మశానము" గూర్చి మాట్లాడుకుందాం ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి దగ్గరికి వెళ్ళి మృత్యువు సమీపిస్తున్నట్లుగా నువ్వు రేపు చావబోతున్నావ్ అంటే నేను ఎందుకు చస్తాను, నువ్వే చస్తావు అంటాడు, పండు ముసలికి కూడా నువ్వు చచ్చిపో ముసలిదానా అంటే నువ్వు చావు అంటు ఎదురు సమాధానం ఇస్తుంది. మరి ఇదే ముసలావిడ మరియు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగస్తుడు ఇద్దరూ బాల్యంలో బడికి వెళ్ళిన వారే, పెరిగి పెద్దైన తర్వాత ఏ గుడికో, చర్చికో లేదా మందిరానికో సంతోషంగా వెళ్ళిన వారే కానీ వృద్ధాప్యాన్ని మాత్రం ఎవరు ఆపలేరు కదా! దాన్ని ఆపే శక్తి మనుషులకు లేదు కదా! మరి చావు దగ్గరకొస్తున్నకొద్దీ ఎందుకు భయపడ్తాడు అంటే ఇంకా ఈ భూమిపై బ్రతకాలి.

వీలున్నంత వరకు మనుషుల మధ్య విభజన రేఖలు గీస్తు అనేక రకాల సంఘర్షణలకు కారకుడిగా మారాలి అనేది అంతర్గతంగా దాగివున్న పైశాచికానందం. ఎంత పరిపక్వత వుంటే మనిషి మృత్యువును సంతోషంగా ఆహ్వానించగలడు? అంతటి పరిపక్వత వున్న వ్యక్తి స్థితప్రజ్ఞుడే అవుతాడు? చావు వస్తున్నట్లు ముందే తెలిస్తే తప్పించుకొని తిరుగడామరి? బడికి వెళ్ళడానికి ఇష్టపడక పోయినా గుడికి వెళ్ళడానికి ఇష్టపడకపోయిన మృత్యువును తప్పించుకోలేం కదా ! అందుకే "జాతస్యహి ధ్రువో మృత్యు: ధ్రువం జన్మ మృతస్య చ తస్మాదపరిహార్యే అర్థేనత్వం శోచితుమర్హసి" కాబట్టి మరణించే ప్రతి జీవి మంచిగా బ్రతకడానికి ప్రయత్నం చెయ్యాలి, ఓ మాంసాహార జీవిని శాఖాహార జీవిగా మార్చలేం, కానీ మనిషి మాత్రం అనేక రకాల ఆహారపు అలవాట్ల ఆధారంగా మనుగడ కొనసాగించగలడు.

అందుకే స్మశాన వైరాగ్యంను ఆవాహన చేకొని ఎవరికీ హాని తలపెట్టకుండా భూమిపై బ్రతికినన్ని రోజులు బాగా బ్రతికాడురా అనిపించుకుంటే చాలు, కానీ చెడ్డవాడిగా ముద్రవేయించుకొని వెళ్ళిపోవడం వల్ల ఉపయోగ మేమిటి అన్నది ఆలోచించాలి, కనిపించని దేవుడు, దయ్యాలకు, స్వర్గ, నరకాలకు భయపడే వ్యక్తి కళ్ళ ముందున్న వ్యక్తిలో కులం, మతం, పేదవాడు, ధనికుడిగా విభజనరేఖలు గీస్తు ప్రశాంతమైన సమాజంలో అలజడికి మనమే కారకులమౌతున్నాం అనేది అక్షరాల నిజం.

ఏ మతస్థుడైన ఎలాంటి కుటుంబంలో పుట్టినా చనిపోయిన తర్వాత చివరిగా వెళ్ళేది స్మశానానికే అంటే తల్లి గర్భములో ప్రారంభమైన ప్రయాణం చివరికి మట్టిలో కలిసే వరకు ఈ మధ్య కాలంలో గడిపిన జీవితం, మనం సమాజంతో, వ్యక్తులతో ఏర్పరచుకున్న బంధాలు వాటి తాలూకు జ్ఞాపకాలతో మనిషి చేసిన ప్రయాణం స్మశానం (సమాధి)తో ముగుస్తుంది. రాజ్ ఘాట్, (గాంధీ) చైత్ర భూమి (అంబేడ్కర్) మొదలైన సమాధులను పర్యాటకులు, రాయబారులు, దేశాధ్యక్షులు వచ్చినప్పుడు సందర్శించి నివాళి అర్పిస్తున్నారంటే వారి గొప్పతనం ఏమిటో అర్థం చేసుకోవచ్చును. అంటే ఏ మనిషి పుట్టిన తర్వాత భూమిపై శాశ్వతంగా జీవించలేడు ఎదో ఒక రోజు మృత్యువు దరిచేరుతుంది కాబట్టి అటువంటి మృత్యువుకు సైతం "కన్నీరు" తెప్పించేలా మనిషి బ్రతకాలి. అలా "జన్మ సార్థకత" జీవిత సాఫల్యాన్ని పొందితే ఎప్పుడు చనిపోయినా ప్రజల జ్ఞాపకాలలో చిరస్థాయిగా "చిరంజీవిగా" నిలబడిపోతాం. అందుకే నీతిగా నిజాయితిగా విలువలతో కూడిన జీవితాన్ని గడిపి మన జ్ఞాపకాలను పదికాలాలపాటు నిలుపుకుందాం.

**పరిశీలనా గ్రంథాలు :**

1) పెద్ద బాలశిక్ష 2) మహాభారతము 3) బైబిల్ 4) ఖురాన్ 5) భగద్గీత 6) అష్టాదశ పురాణములు

★★★

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి మనిషి - మనసు - ఆధ్యాత్మిక ప్రభావం

- డా॥ యం. పద్మగౌరి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు, రాజమహేంద్రవరం.

## ఉపోద్ఘాతం :

శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి 'ప్రస్థాన స్ఫూర్తి ' గ్రంథంలో మనిషి -మనసుతత్వాన్ని వివరించారు. ఆలోచనా విధానంలో మంచి - చెడులను అనుసరించాలంటే మనసే ప్రధానం. ఆ మనసు మనిషిపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుంది, ఆలోచనా ధోరణి ఏ విధంగా ఉంటుందో తెలియజేశారు. మనిషి సత్ మార్గంలో ప్రయాణించాలంటే మనిషి - మనసు - ఆధ్యాత్మిక భావనను కలిగి ఉండాలనే సంకల్పంతో దానికి గల మార్గాన్ని సూచిస్తూ రచించారు.

## ముఖ్య ఉద్దేశ్యం :

మనిషి తన జీవిత గమనాన్ని ప్రారంభించేటప్పుడు ముందుగా తన మనసులో ఉండే ఉద్దేశ్యానికే ప్రాధాన్యతనిస్తాడు. ఫీలింగ్ ఆఫ్ థాట్ అంటే అంతా మనసే. ఈ మనసులో పుట్టే ఆలోచన, ఆచరణ, ఉద్వేగాలు అన్నీ మనసుకు సంబంధించినదే అంటే మనిషి వేరు -మనసు వేరు అని ప్రశ్నించుకుంటే ఈ రెండు ఒకరివేకానీ రెండు విరుద్ధమైన భావాలను కలిగి ఉంటాయి. ఇలాంటి విరుద్ధమైన భావాలు రెండు ఒకటిగా ఏర్పడడానికి కారణాలను తెలియజేస్తూ, మనసు మనిషిపై ఎలాంటి ఆధ్యాత్మిక ప్రభావాన్ని చూపిస్తుందో తెలియజేయడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## విషయం - వివరణ :

ఆధ్యాత్మిక బోధకుడిగా ఉన్న వ్యక్తిని సంస్కృతంలో 'గురు' శబ్దంతో 'దేవ' అనే శబ్దం కలిపినప్పుడు 'గురుదేవా' అని పిలుస్తాం. అలా ఆధునిక వైజ్ఞానిక ఆధ్యాత్మిక భావనలతో సమసమాజానికి విలువైన అమూల్యమైన సందేశాన్ని ''ప్రస్థాన స్ఫూర్తి'' అను గ్రంథం ద్వారా అందించిన వారు శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి గారు.

## మనిషి - మనసు :

ఒక వ్యక్తి యొక్క బ్రెయిన్‌లో ఇంద్రియం (సెన్సోరియా) అనేది విషయ గ్రహణ శక్తిగా పరిగణిస్తాం. బ్రెయిన్ విషయ జ్ఞానాన్ని వినియోగించడానికి 'మనసే' ప్రధాన ప్రేరణగా చెప్పవచ్చు.

ఈ మనసు అనేది ఒక భావన, నిలకడ లేనిది, మారి పోతూ ఉంటుంది. దీనికి ఒక రూపం ఉండదు, స్పష్టత ఉండదు. ఫీలింగ్ ఆఫ్ థాట్ అనేది మనసుతోనే ప్రారంభమవుతుంది.

మనిషి - మనసు ఈరెండు ఒకరివే కానీ రెండు విరుద్ధమైన భావనలు కలిగి ఉంటాయి. తెలివి, విషయ పరిజ్ఞానం, గుణం, బుద్ధి మొదలైనవన్నీ మనిషి చేస్తాడు. కానీ ఆ ఆలోచన విధానాన్ని ఆచరించేటప్పుడు దాని యొక్క ప్రభావాన్ని 'మనసే' చేయగలదు, నియంత్రించగలదు. మనిషి యొక్క ఆలోచనలు ఒక్క క్షణంలో మార్పును చేయగలదు మనసు.

మనసు గూర్చి పుస్తకాల మాటలలో ఉనికి లేనిది, చలనాన్ని కలిగినది, స్మృతి నిక్షిప్తంగా ఉందని వివరణ ఇస్తారు.

మనిషి - మనసు ఈరెండు ద్వంద్వ స్వభావాన్ని పోలి ఉండటానికి కొన్ని ప్రేరకాలు పనిచేస్తాయి. అవి

మంచి - చెడు

పాజిటివ్ - నెగిటివ్

భౌతికం - ఆధ్యాత్మికం

ఇవన్నీ ద్వంద్వ స్వభావాన్ని కలిగి మనిషిని మనసు తన ఆధీనంలో ఉంచుతుంది.

## మంచి - చెడు :

జీవితంలో తను చేస్తున్న పనే మంచి చెడులు. ప్రకృతి

సహజంగా ఆలోచన మంచి అయితే, అది వినియోగించడంలో విచక్షణ కోల్పోయి, ఉద్రేకం చెందినట్లైతే చెడు ఆలోచనలు వస్తాయి. మంచి - చెడు అనేవి రెండూ మనిషికి సంబంధించినదే. జీవిత గణంలో రెండింటికి గల అనుభవాలు, స్వరూప స్వభావాలు వేరు. మంచి మనిషికి మానవత్వాన్ని నేర్పిస్తే, చెడు క్రూరత్వాన్ని నేర్పిస్తుంది. మంచి, చెడు రెండూ మన వెంటే ఉంటాయి. ఏది మంచిది, ఏది చెడ్డది అని ఆలోచనను మనసు నియంత్రణ చేస్తుంది. ఆ ప్రభావం మనిషిపై పడుతుంది.

మంచి ప్రవర్తనకు దేవతలుగా, చెడు ప్రవర్తనకు రాక్షసులుగా ఉన్నవారు ఇద్దరూ ఒక తండ్రికి జన్మించిన వారే. యుగ కాలాన్ని చూసుకుంటే కృతయుగంలో, త్రేతా యుగంలో, ద్వాపర యుగంలో దేవాసురుల మధ్య మంచి, చెడుల మధ్య, యుద్ధాలు జరిగాయి. కలి యుగానికి వచ్చేసరికి మంచి -చెడు అనేవి స్వభావాలు. ఒకే మనిషిలో కనిపించడం ప్రారంభించాయి. మనిషిని మనసుతో నియంత్రించాలంటే శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి మాటల్లో

"ఇంద్రియ మనసును విచక్షణ విధానంలో మంచిని మాత్రమే అనుసరించే విధంగా తయారించాలి. అందుకు మత బోధనలతో పాటు యోగ, ప్రాణాయామ, మెడిటేషన్ దరిమిలా ధ్యాన మనోప్రస్థానం సాధన ద్వారా లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలి."

(ప్రస్థాన స్ఫూర్తి - పుట -23)

## పాజిటివ్ -నెగిటివ్ :

మనిషి తన దైనందిక జీవితంలో సానుకూలమైన వైఖరిని కలిగి ఉండటాన్ని పాజిటివ్ అంటారు. మనిషి తన జీవితంలో ప్రతికూల దృక్పథం కలిగి ఉండటం అంటే వ్యతిరేకతను కలిగి ఉండటాన్ని నెగిటివ్ థాట్స్ అంటారు. అంటే మనిషి తన లక్ష్యాన్ని చేరుకోవాలనుకున్న, నిర్ణయాలను తీసుకునేటప్పుడు సానుకూలమైన దృక్పథాన్ని కలిగి ఉండటానికి మనసే ప్రధాన కారణం అవుతుంది. తను, తన చుట్టూ ఉన్న సమాజానికి సహాయం చేయాలనే దృక్పథంతో పాజిటివ్‌గా ఆలోచిస్తాడు.

మనిషి చెడు ఆలోచనలతో తన శ్రేయస్సుకు ఎక్కడ భంగం కలుగుతుందో అనే భయాన్ని కలిగి, తను చేసే పనిపై విశ్వాసం, నమ్మకం లేకుండా ఆందోళన కలిగి, అపనమ్మకాన్ని కలిగి నెగిటివ్ ఆలోచనలతో ఉన్న వ్యక్తి యొక్క మనసును నియంత్రించడానికి శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారు పరిష్కార మార్గాన్ని సూచించారు.

"కఠోరమైన సాధనతో తన మనసును అదుపు చేయాలంటే యోగ, ఆసనాలు మెడిటేషన్ చేయడం ద్వారా, మనసు, జ్ఞానం, తెలివి, బుద్ధి, గుణము, చిత్తం స్వభావం, జాతి సహజత, వ్యక్తిత్వం - ఇవి మనిషి బ్రెయిన్‌లో పంచభూత ప్రకృతి సహజాతగా పాజిటివ్ - నెగిటివ్ ద్వంద్వ రీతిగా కలుగుతూనే ఉంటాయి".

- (ప్రస్థాన స్ఫూర్తి పుట - 44)

## భౌతికం - ఆధ్యాత్మికం :

పంచేంద్రియ జ్ఞానంతో ప్రాణ శక్తిని కలిగి ఉన్న ఆకారమే భౌతికం. ఆధ్యాత్మికత అనేది ఆత్మకు సంబంధించినది.

మనిషి యొక్క రూపం భౌతికం. కంటికి కనిపిస్తుంది. జీవితంలో ఆధ్యాత్మికత అంటే పవిత్రమైన అర్థంగా చూస్తే వ్యక్తి యొక్క శోధనగా చెప్పవచ్చు. భౌతిక జీవితానికి ప్రత్యేకతను కలిగింపజేసినది ఆధ్యాత్మికం. మానసిక అనుభవంతో పాటు ఆత్మానుభూతిని కలిగించేది ఆధ్యాత్మికం మాత్రమే. ఈ రెండింటి సమన్వయం ద్వారా మనిషి శరీరంలోని మనసు ఆత్మ ఉన్నదనే వాస్తవం తెలుస్తుంది. తన శరీరంలో ఒక సొంతంగా అంతర్గత కోణాన్ని ఆవిష్కరించడానికి మనసే ప్రధానం.

మానవ జీవితం మానవత్వంగా మారాలన్నా, తన జీవితాన్ని సార్థకత చేసుకోవాలంటే, భౌతిక మనసును ఆధ్యాత్మిక చింతనగా మార్చాలంటే శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారు ఈ విధంగా సూచించారు.

"మనసుకు విషయ జ్ఞానం ఆధ్యాత్మికానికి ఆత్మజ్ఞానం మనిషికి తాను తెలియడంతోనే మానవ జీవితానికి సార్థకత చేకూరుతుంది."

- (ప్రస్థాన స్ఫూర్తి : పుట - 26)

**ముగింపు :**

శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి గారు రచించిన ‘ ప్రస్థాన మూర్తి’ అనే గ్రంథంలో ఆధునిక విజ్ఞానంతో పాటు ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని మేళవించి నేటి సమాజానికి అవసరమైన అంశాలను, పాటించే విధానాన్ని తెలియజేశారు.

నేడు మనిషిని శాసిస్తున్నది సైన్సు, టెక్నాలజీ, యాంత్రిక జీవన విధానం ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, మనిషికి మనిషికి ఈ మధ్య ఉన్న మావన శక్తికి ప్రాధాన్యత తగ్గిపోవడంతో మనుషుల మధ్య ఉన్న విలువలు మాయమై మనిషి యంత్రంలా మారుతూ మానవత్వాన్ని మరచిపోతున్నాడు అని తెలియజేశారు.

శారీరక బాధల నుండి, మానసిక వైకల్యాల నుండి అంతర్గతంగా తనను తాను రక్షించుకోవాలంటే ఆధ్యాత్మిక ధ్యాన సాధన ద్వారా మనిషి ఈ బంధాల నుండి విముక్తుడు అవుతాడని తెలియజేశారు.

శరీరం కన్నా మనసుకు, మనసు కన్నా ఆత్మకు గల ప్రాధాన్యం ఉన్నదని తెలియజేశారు. ధ్యాన, యోగ, శోధన ద్వారా మనిషి నిరాడంబరమైన జీవన విధానాన్ని, ఉన్నతమైన భావనలను, మానవత్వాన్ని కలిగి ఉంటాడు. ధ్యానప్రస్థానం మార్గమే, దివ్యమైన శాశ్వత మార్గమని తెలియజేశారు. చెడును మంచితోనూ బాధను సంతోషంతోనూ, ఆధునిక, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక భావనతో జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఏకైక మార్గం ‘ధ్యానప్రస్తావన’ మార్గం. మానవ జీవితం పరమార్థానికి చేరుకోవా లంటే ధ్యానాన్ని ఆశ్రయించాలి. ఈ విషయాన్ని అందరూ తెలుసుకొని శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి మార్గాన్ని ఆశ్రయిద్దాం.

**ఆధార గ్రంథాలు :**

1. అపసామాన్య మనో విజ్ఞానము - జి. భారతి.
2. తెలుగు సాహిత్య చరిత్ర - ధ్వానా శాస్త్రి .
3. ప్రస్థాన స్ఫూర్తి - శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి.
4. మహతి - వ్యాస సంకలనం.

★★★

# ఇందూరు చిందు యక్షగానం

– డా॥. ఎన్. అంబర్ సింగ్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీకళాశాల, ఆర్మూర్.

తెలంగాణాలోనే అరుదైన సంస్కృతికి నిలయంగా పేరు తెచ్చుకున్న నిజామాబాదుకు పూర్వనామమే ఇందూరు. ఇందూరు పూర్వనామం (ఇంద్రపురి). ఈ నగరం రాష్ట్రకూట రాజు నిత్యవర్షేంద్రుడు క్రీ.శ. 915 ప్రాంతంలో బోధన్ నగరంలో ఇంద్రనారాయణ దేవాలయాన్ని నిర్మించి తన పేర 'ఇంద్రపురం' నగరాన్ని నిర్మించాడని కొందరు చారిత్రికుల అభిప్రాయం. క్రీ.శ. 1876లో మొదటి సాలార్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు 'ఇందూరు' నగరాన్ని జిల్లా కేంద్రంగా మార్చాడు. క్రీ.శ. 1905లో జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆరవ నిజాం పేరు మీదుగా ఇందూరును నిజామాబాదు జిల్లాగా నామకరణం చేయడమైనది.

ఈ ప్రాంతాన్ని మినీ భారత్‌గా పిలుస్తారు. ఎందుకంటే ఉత్తర భారతీయులైన పంజాబీలు, మార్వాడీలు , రాజ్‌పుత్‌లు, మహారాష్ట్రీయులు తదితర విభిన్న సంస్కృతుల మేలుకలయికగా, ఐక్యతను పుణికి పుచ్చుకున్న విశిష్ఠ సంప్రదాయాల కలబోతకు ప్రతిబింబంగా నిలుస్తుందీ దక్షిణ భారత ధరణి ఈ ఇంద్రపురి- ఇందూరు - నిజామాబాదు.

ఇందూరు ప్రాంతంలో ఎన్నో జానపద కళలు ఆవిర్భవించాయి. ఇక్కడ వెలువరింపబడ్డ జానపద సాహిత్యం అమూల్యమైనది. ఎందరో కవులు జానపద సాహిత్యాన్ని పోషించారు. యక్ష గానాలు, కీర్తనలు, భజన పాటలు, కోలాట పాటలు రచించారు. ఇవేగాక శ్రామికులు, కర్షకులు తమ శ్రమను మరచిపోవడం కోసం పాడుకొనే పాటలెన్నో వెలువడ్డాయి. మోట కొట్టేటప్పుడు, ఎడ్ల బండి నడిపేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, తూర్పార బట్టేటప్పుడు పాడే వ్యవసాయదారుల పాటల్లో ఎన్నో రహస్యాలు దాగి ఉంటాయి. అంతేగాక గాయకుల హృదయాల్లో నుండి పొంగిపొరలే భావం ప్రస్ఫుటమౌతోంది. ఈ సాహిత్యమంతా మౌఖికమే. ఒకరి నుండి మరొకరు నేర్చుకొన్నదే.

## చిందు యక్షగానం :

ఇందూరు జానపద కళారూపకాలలో చిందు భాగవతం రమ్యమైనది. బాగోతం అన్నా, యక్షగానం అన్నా రెండూ ఒకటే. చిందోల్ల ఆట అంటే చిందు యక్షగానం అంటారు. వివిధ ప్రాంతాలలో చిందుభాగవతం నేటికీ సజీవంగా ఉన్న జానపద అభినయకళ. ప్రజల్లో పుట్టి శతాబ్దాలుగా ప్రజలలో జీవిస్తున్న భారత, భాగవత, రామాయణాలను పామర జనరంజకంగా ప్రచారం చేస్తున్న జానపద కళయే "చిందు భాగవతం". ఆనందం, బాధ కలిగినపుడు మానవుడు చిందులేస్తాడు. అదేవిధంగా చిందు తొక్కుతూ భాగవతంలోని కథలను రక్తికట్టే విధంగా ప్రదర్శించడం వల్ల దానిని చిందు భాగవతం అని అంటున్నారు. చిందు భాగవతం ప్రత్యేకంగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కళయని పరిశోధనల వల్ల తెలుస్తున్నది.

జాంబమహర్షికి తిలోత్తమకి పుట్టిన సంతానమే చిందు కళాకారులని, వాళ్లు మాదిగలని, యాచక వృత్తిలో జీవిస్తూ కళా ప్రదర్శనలిస్తారనీ మాదిగ కులపురాణం 'జాంబపురాణం' చెబుతుంది. భాగోతం ఆడే వారు ప్రత్యేక కులంగా గుర్తింపబడ్డారు. అంటరాని ఉపజాతిగా పల్లెకు దూరంగా భారంగా బ్రతుకు బండినీడుస్తారు.

## శబ్ధం – పుట్టుక, అర్థం :

చిందు శబ్దం సింధు శబ్దభవమని కొందరు, సింధూ నదీ పరీవాహక ప్రాంతకళగా భావించారు.కాని ఇది అచ్చ తెనుగు పదం 'చిందు'.ఆంధ్రశబ్ధరత్నాకరం 'చిందు' పదానికి ఒక విధమైన నాట్యము అని తెలిపింది. వావిళ్ల వారి నిఘంటువు 'చిందు' పదం దేశ్యమని తెల్పి ఈ క్రింది ప్రాచీన ఉదాహరణాలనిచ్చింది.

- "మాతంగ నాట్యనామంబగు జిందు" - వావిళ్లవారి నిఘంటువు"

- ''గీతంబుదురువు జిక్కిణి, చిందు మొదలుగా నొక్కొక్క వర్ణంబునగ్గడించి''- ఆంధ్రభాషార్ణవము
- ''చిందాడు- గంతులు వేయుట: విష్ణుపురాణము''

ఇంతేగాక 'చిందు' శబ్దంతోనున్న కొన్ని క్రియాపదాలైన చిందుగొను, చిందుద్రొక్కు, చిందాట, చిందులు వారు - ఇవన్ని దేశ్యపదాలే. మొత్తం మీద చింది పదము తెలుగు పదమే.

సాధారణంగా ఒక కుటుంబంలోని వారో సన్నిహితులో కలిసి ఒక జట్టుగా ఏర్పడుతారు.తమ ప్రాంతంలోని పల్లెలు ఒక్కొ జట్టుకు పోషకులుగా ఉంటాయి. ఒక్కొక్క మేళంలో 15 నుంచి 30 మంది కళాకారులు వుంటారు. కొన్ని మేళాలు కలసి, వూళ్ళు పంచుకుంటారు. పంచుకున్న గ్రామాలలో వేరొక మేళం వెళ్ళి ప్రదర్శన ఇవ్వరాదని కట్టుదిట్టం చేసుకుంటారు. ఒక మేళం పంచుకున్న గ్రామాల్లో ప్రదర్శనలు ఇస్తూ, ఐదేళ్ళకొకసారి మాత్రమే ఒక గ్రామానికి వెళతారు. భాగవతుల బృందాన్ని ''భాగవతుల మేళం'' అని కూడా పిలుస్తారు. ఒక చిందు కుటుంబం సభ్యులతో ఒక భాగవత మేళమేర్పడుతుంది. ఇలాంటి మేళాలు నిజామాబాద్ జిల్లాలో 30కి పైగా వున్నాయి. కాబట్టి వీరు వాడలలోనే బస చేసి వారిచ్చే సీదా సాహిత్యం (వంట సామాగ్రి, బియ్యం వగైరా)తో వంట చేసుకుంటారు.

వీరు ప్రదర్శనలు ప్రారంభించడానికి ముందుగా ''త్యాగం తెంపటం'' పేరున తమని ఆదరిస్తున్న హరి జనుల కోసం మూడు ఆటల్ని ఉచితంగా ప్రదర్శిస్తారు. ఇందులో 'ఎల్లమ్మ కథ'ను విధిగా ప్రదర్శిస్తారు. 'రేణుకా దేవి' కథని (అదే ఎల్లమ్మ కథ) చెబితే సకాలంలో వర్షాలు పడి గ్రామాలు పాడి పంటలతో అష్ట ఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉంటాయని వీరి నమ్మకం. ఎన్ని యక్షగానాలు వేసినా, చివరిగా ఎల్లమ్మ కథను తప్పని సరిగా ప్రదర్శిస్తారు. ఇది ప్రదర్శించే రోజున నియమ నిష్టలతో కఠినమైన దీక్షతో ఎల్లమ్మ పాత్ర ధారులు రేణుకాదేవికి తెల్లటి కొత్త చీర, ధూపదీపనైవేద్యాలు సమర్పించి ఆట మొదలెడతారు. ఈ ఖర్చు మాత్రం భాగవతం ఆడించే వారే భరిస్తారు. అంతే కాకుండా బోధన్ మండలంలోని 'అమ్దాపూర్' గ్రామానికి చెందిన చిందుల ఎల్లమ్మ ఈ వేషం వేయడంలో తనకు తానే సాటి! ఈమె ఒక్క స్త్రీ పాత్రలే కాదు పురుష పాత్రలు కూడా ధరిస్తుంది. పోషకులు లభించనప్పుడు తామే ఆటను ప్రదర్శించి ప్రేక్షకులు ముందుకు వచ్చి డబ్బులు యాచిస్తారు. ఒక్కోసారి కడుపు నింపుకోవడం కోసం ఇంటింటికి వెళ్ళి భిక్షం తెచ్చుకుంటారు.

వీరు ఎక్కువగా పగటి పూటనే ప్రదర్శనలు ఇస్తారు కాబట్టి వీరిని 'పగటి వేషగాళ్ళు' అని కూడా పిలుస్తారు. వీరు తబలా, మద్దెల, హార్మోనియం, గజ్జెల తాళాలు ఉపయోగిస్తారు. తాళాలు వాయించడానికి స్త్రీలు మాత్రమే ఉంటారు. రూపకతాళం, జుల్వ, ఆదితాళం, త్రిపుట తాళాలలో ఎక్కువగా పాడుతారు. అసావేరి, మోహన, కాంభోజ రాగాలతో కూర్చిన పాటలు, పద్యాలు యెక్కువగా పాడతారు. వీరి ప్రదర్శనలకు ఉపయోగపడే వేదిక, ఆభరణాలు, మేకప్ సామాను రంగులు, వీరే స్వయంగా తయారు చేసుకుంటారు. అప్పటి కప్పుడు, ఆరు పొడవాటి కర్రలు పైన పెద్ద చాందిని వేసి రెండు పరదాలతో నిరాడంబర మైన తాత్కాలిక రంగస్థలాన్ని తయారు చేస్తారు.

ప్రదర్శిస్తున్నప్పుడు వారి ఆభరణాలను చూస్తే నిజంగా అవి బంగారు ఆభరణాలేమోననిపిస్తుంది.వీరు ధరించే ఆభరణాలు 'పొణికి' కర్రలతో తయారుచేస్తారు. పొణికి చెట్టుకు ఒక మంచి రోజు పూజచేసి కావలసినంత కర్రను నరుకుకొని తెస్తారు.ఆ కర్రతో కిరీటాలు, భుజకీర్తులూ, జడలచిలుకలు, మల్లెదండలు, నెక్లెస్లు తయారు చేసి బంగారు రంప పూత పూస్తారు. ఈ కర్రతో చేసిన ఆభరణాలు చాలా కాలం చెడకుండా ఉంటాయి. ఇవి తయారు చేయడానికి సుమారు ఆరునెలల సమయం పడుతుంది. ముఖానికి పూసుకొనే పసుపును ''సేవిడి'' అంటారు. దీన్ని జింక్ ఆక్సైడ్ మిశ్రమంతో తయారు చేసుకొంటారు. కళ్లకు పెట్టుకునే కాటుకను ఆముదం దీపపు మసిని వేపాకులను రంగరించి తయారుచేస్తారు.

చిందు బాగోతం ఆటకు నేపథ్యగానం ఉండదు పురాణాల ప్రధాన ఘట్టాలను, కథలను, ఆకళింపు

చేసుకొని సన్నివేశాలకనుకూలంగా భావోద్రేకాలను ప్రదర్శిస్తుంటారు. వీరు ఎవరికి వారే తమ ఆహార్యం (మేకప్) చేసుకొంటారు.

ఈ ప్రదర్శన బాలకృష్ణుని రాకతో మొదలౌతుంది. తర్వాత రంభ, ఆతరువాత ప్రధాన నాయికా నాయకులు వస్తారు. సంభాషణలతో, పాటలతో, చిందులతో కథ సాగుతుంది. ముఖ్యంగా ఆటచివరి ఎల్లమ్మ వేషం వేస్తారు. ఈ వేషాన్నికన్యలు మాత్రమే వేస్తారు.

వీరు సతీసావిత్రి, బభ్రువాహన, భక్త ప్రహ్లాద, సత్యహరిశ్చంద్ర, చెంచులక్ష్మి రుక్మాంగద, మాయల మరాఠి, మార్కండేయ, బాలనాగమ్మ మొదలైన అనేక కథలను వీరు ప్రదర్శిస్తారు.వీరి పాటలకు వాయిద్యాలుగా, మద్దెల, తాళాలు, గజ్జెలు, హార్మోనియం వాడుకొంటారు. స్త్రీలు తాళాలు వాయిస్తూ దరువులు పాడుతూ సహకరిస్తారు.

నిజాంబాదు జిల్లాలో చిందు భాగోతం కళలో ప్రశస్తికెక్కిన వారెందరో ఉన్నారు. అందులో ముఖ్యంగా చిందుల ఎల్లమ్మ చెప్పుకోదగినది.ఎల్లమ్మవేషధారణతో మంచి పేరు సంపాదించారు.చిందుల ఎల్లమ్మను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రనృత్య అకాడమి ద్వారా సన్మానించింది. ఆమెకు 'ఫెలోషిప్' ఇచ్చి, సాహిత్య అకాడమి విశిష్ట సభ్యత్వాన్ని ఇచ్చి గౌరవించింది.

## చిందు యక్షగానం - చిందుల ఎల్లమ్మ ప్రస్థానం:

చిందుల ఎల్లమ్మ 1914 ఏప్రిల్ 1న పిల్లిట్ల నభిసాజ్, ఎల్లవ్వ దంపతులకు ఆదిలాబాద్ జిల్లా బాసరలో జన్మించింది. ఆమెకు తల్లిదండ్రులు మొదట సరస్వతిగా నామకరణం చేశారు. కాని తండ్రికి కలిగిన ఆపద పోవడానికి ఇంటి ఇలవేల్పు ఎల్లమ్మకు మొక్కుకోవడం వల్ల తండ్రి బాగుపడడంతో ఆమె పేరు ఎల్లమ్మగా మారింది. చిందు బాగోతానికిఎల్లమ్మఆటప్రధానమైంది. ఆటలో ఎల్లమ్మ వేషం అతి ముఖ్యమైనది. ఆ వేశాన్ని మన ఎల్లమ్మయే ధరించి ఆడేది. అలా సరస్వతి ఎల్లమ్మగా అవతారం ఎత్తింది.

ఈమె బోధన్ మండలం అమ్దాపూర్‌లో నివసించారు. వారి కులవృత్తి చిందు బాగోతం ఆడడం. చిందు బాగోత ప్రదర్శనలిస్తూ ఊరూరా తిరగడం వారి ఆచారం. కుటుంబంతోపాటు ఎల్లమ్మ సంచార జీవితం గడిపింది. ఆమెకు రాగాలు, తాళాలు, పాటలు, పదాలు సహజ సిద్ధంగానే అబ్బినాయి.

మహిళా నటీమణులు పురుష వేషాలతో మెప్పించిన వారున్నారు. కాని ఒకే వేదికపై స్త్రీ పురుష పాత్రలను ధరించి రక్తికట్టించడం అసాధారణమైనవిషయం. అంతటి అసాధారణ ప్రజ్ఞ గలిగిన ఎల్లమ్మ ఒకేవేదికపై కొద్ది నిమిషాల తేడాలో నాయికా నాయక పాత్రలను పోషించి మెప్పించడం ఆమెకే సాధ్యం.

ఈ కళాకారులకి ప్రదర్శన పరంగా కొన్ని నియమాలున్నాయి. ఎల్లమ్మ దేవతా పాత్రను కన్యలే వేయాలనడం వాటిలో ఒకటి. ఆ కారణంగా పదకొండేళ్లకే యక్షగాన ప్రదర్శనలివ్వడం మొదలు పెట్టిన ఎల్లమ్మ పెళ్లయినా వైవాహిక జీవితానికి దూరంగా వుంది. 'పెనిమిటి (సైదయ్య)'కి కష్టం కలగకూడదని ఆయన ఆలనా పాలనా చూసుకునేందుకు చెల్లెలు రామవ్వనిచ్చి ఆయనకి మళ్లీ పెండ్లి చేసి తన జీవితాన్ని కళకి అంకితం చేసింది.

ఎల్లమ్మ పుట్టి పెరిగిన అమ్దాపూర్ గ్రామంలో దాదాపు ముప్పయి ఆరు చిందు కుటుంబాలున్నాయి. 'చిన్నగపుట్టి చిన్నగా పెరిగి - పెంపయినను' అని ఎల్లమ్మ చెప్పే మాటల్లో ఆమె జీవన ప్రయాణానికి సంబంధించిన తాత్వికత యిమిడి వుంది. డెబ్బై ఏళ్ల పాటు తెలుగునేల నాలుగుచెరగులా ప్రదర్శనలిచ్చిన ఎల్లమ్మఅంతర్జాతీయ ఖ్యాతిని గడించడం వెనుక దుర్భరమైన మైన జీవితం వుంది. అంటరానితనం, కులం పేర అవమానాలు, పేదరికం - వీటన్నింటి నుంచి రాష్ట్ర సాంస్కృతిక మండలి యిచ్చే అత్యున్నత పురస్కారం 'హంస' అవార్డును పొందిన కళాకారిణిగా ఎదగడం (1998)లో తాను నమ్ముకున్న కళ పట్ల అనితరసాధ్యమైన అంకితభావం వుంది. పొట్టకూటి కోసం మొదలైన ఆమె విద్య, పండితుల ప్రశంసలు పసిడి కాంతులు పండించింది.

ప్రహ్లాద, మైరావణ, మాంధాత చరిత్ర, రామాంజ

నేయ, సతీ అనసూయ. సతీతులసీ, బభ్రువాహన, బాలనాగమ్మ, హరిశ్చంద్ర, సుగ్రీవ విజయం, సతీసావిత్రి, సుందరకాండ వంటి పౌరాణికాంశాలతో పాటు చెంచు లక్ష్మి, అల్లిరాణి, మైరావణ, గాంధారీ గర్వభంగం, మోహినీ రుక్మాంగద, జాంబపురాణం వంటి సమాంతర పౌరాణిక కథలతో దాదాపు యాభై ఆరు రకాల కథల్ని యక్ష గానాలుగా ఎల్లమ్మ చివరిశ్వాస వరకూ ప్రదర్శించారు. ఆ వీధి భాగవతాల్ని ప్రదర్శించే బృందానికి నాయకత్వం వహించారు. వీటిల్లో మేటి వేషాలు ధరించింది. అవసరమయితే మగ వేషాలు వేసి, ఆయా వేషాల యొక్క ఠీవిని, దర్పాన్ని ఆవిష్కరిస్తుంది.

ఈ కళాకారుల వేషధారణలు, దుస్తులు, హావ భావాలు, హంగులు సినీ నాటకజగత్తునేలిన నటరత్న, నటసార్వభౌమ, నటసామ్రాట్లకు ఆదర్శ ప్రాయ మయ్యాయి. దేశాధినేతల ప్రశంసలకు పాత్రమయ్యాయి.

అందునా ఏకకాలంలో నిమిష వ్యవధిలో స్త్రీ పురుష వేషాలు మార్చే అపూర్వ కళాప్రతిభ ఎల్లమ్మ సొంతం. పురుష పాత్రలకవసరమైన గాంభీర్యం, స్త్రీ పాత్రల కవసరమైన లాలిత్యం ఆమె గొంతులో అద్భుతంగా పలికేవి. శృంగార వీర రౌద్ర రసాలు ఎల్లమ్మ కంటి చూపుల్లో అలవోకగా ఒదిగేవి. చెంచులక్ష్మి వెనుక నరసింహస్వామి, అల్లిరాణి (ప్రమీల) అర్జునుడు పాత్రల్లో ఆమె చూపే అభినయ వైవిధ్యం చూపరులని అబ్బుర పరిచేది.

ఎల్లమ్మ వేషం కట్టినప్పుడు ఆమె సాక్షాత్తూ మూర్తీ భవించిన దేవతలా వుండేది. అందుకే ఆమె నాయకత్వం వహించిన బృందానికి ఆరాధ్యదైవం అయింది. జానపద రంగస్థలిలో ప్రజల నీరాజనాలందుకొంది. చివరి దశలో ఉబ్బసం వ్యాధితో మాట్లాడటానికి ఆయాసపడినా తన జ్ఞాపకాలను తవ్వి తీసే సందర్భాల్లో ఒక ఆవేశంతో గొంతెత్తి పాడటం మానలేదు. కీళ్లనొప్పులతో నడవలేని పరిస్థితుల్లో సైతం తన బృందంలో కళాకారులకి శిక్షణనిస్తూ ఊరూరూ తిరిగేది.

రాష్ట్రంలోని 16 జిల్లాలోను, తమిళనాడు, కర్ణాటక దేశ రాజధాని ఢిల్లీలోనూ ప్రదర్శించి పలువురి ప్రశంసలను పొందారు. చిందు కళకి జీవితాన్ని అంకితం చేసిన చిందుల ఎల్లమ్మను రాష్ట్ర ప్రభుత్వ అకాడమీ సన్మా నించారు. ఫెలోషిప్ మంజూరు చేసింది. 1982లో సాహిత్య ఎకాడమి విశిష్ట సభ్యత్వం పొందిన గౌరవం కూడా ఈమెకు దక్కింది. చిందు కళాకారుల అభివృద్ధి కోసం శ్రీ మాడవేటి నారాయణ 'చిందు కళాకారుల సంఘం' స్థాపించి 1983లో చిందును ముమ్మరంగా ప్రదర్శించారు. తెలంగాణా స్థాయిలో ఆర్మూర్, నిజామాబాద్ లో జరిగిన ప్రదర్శనలకి శ్రీ నటరాజ రామకృష్ణ, హాజరైనారు. అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీమతి షీలా బేడి వీరి సంక్షేమానికి ఎంతో కృషి చేశారు.

1986లో ఢిల్లీలో జరిగిన "అప్నా ఉత్సవ్"వేడుకల్లో చిందు కళాకారులు అలంకరణలోను, నృత్య నటనలోను తమ ప్రత్యేకతను నిలుపుకొని లక్షలాది ప్రేక్షకుల ప్రశంసలను పొందారు. ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ, సోవియట్ అధినేత శ్రీ మిఖాయిల్ గోర్బచెవ్ కోసం ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేయించారు?

ఎల్లమ్మ బృందం గాక తెలంగాణలో దాదాపు 20 చిందు బృందాలున్నాయి. వీళ్ళంతా ఆ కళనే నమ్ము కుంటూ బతుకుతున్నారు. ఎల్లమ్మ సమాంతర పౌరాణిక గాథల ద్వారా దళిత సౌందర్య శాస్త్రాన్ని, రంగస్థల విశిష్టరీతుల్నే కాక, దళిత జీవన వాస్తవికతని తరతరా లుగా కాపాడుకుంటూ వస్తున్న చిందుకళనీ, కళాకారుల్నీ ఆదుకోవడం మన అందరి బాధ్యత. ప్రపంచీకరణ పేరుతో మంచినీటి చెరువులో గుర్రపు డెక్కలా విస్తరిస్తున్న సాంస్కృతిక సామ్రాజ్యవాదం మన కలల్ని కళల్నిధ్వంసం చేస్తున్న నేపథ్యంలో దళిత కళాకారులు వారసత్వంగా నిలుపుకుంటూ వస్తున్న చిందుభాగోతాన్ని రక్షించు కోవడమే ఎల్లమ్మకు మనమిచ్చే నిజమైన నివాళి.తన చిందుగానంతో, నటనతో, తెలంగాణతోపాటు అనేక ప్రాంతాల వారిని మెప్పించిన చిందు ఎల్లమ్మ, 2005 సంవత్సరంలో నవంబరు 9వ తేదీన నిజామాబాదు జిల్లాలో అమ్దాపూర్లో మరణించింది.

మహోజ్వలంగా విలసిల్లి, మరుగున పడి పోతున్న

'చిందు భాగవతం' కళాకారులకు ప్రోత్సాహం లేక వారిలో నైరాశ్యం చోటు చేసుకుంది. చిందు కళాకారుల జీవితం నానాటికి దుర్భరమై పోతోంది. కళారాధనే జీవిత ఆదర్శంగా పెట్టుకుని జీవిస్తున్న వీరికి ప్రతిఫలం పస్తులు మాత్రమే! ఇంతటి గొప్పకళాకారులు ప్రదర్శనలు యేర్పాటు చేసే వారు లేక, తినడానికి తిండి కరవై వ్యవసాయ కూలీలుగా మారి జీవనం సాగిస్తున్నారు.

తమిళనాడులోని తెరుకుత్తు, కేరళలోని కథాకళికి, వచ్చినంతటి ప్రపంచ ఖ్యాతి, తెలుగు యూనివర్సిటీ వారు శ్రద్ధ వహిస్తే, చిందుభాగవతానికి కూడా ఆర్జించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. ఇందూరు సీమ విజ్ఞాన సర్వస్వం- శాస్త్రుల రఘు రామ శర్మ
2. నేను చిందుల ఎల్లమ్మను- డా. కె.ముత్యం (సం)
3. చిందుల ఎల్లమ్మ యాది - డా. కె.ముత్యం (సం)
4. తెలుగు జానపద గేయ సాహిత్యం (బిరుదురాజు రామరాజు)
5. తెలుగు జానపద గేయ గాథలు - నాయని కృష్ణకుమారి

★★★

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# స్వప్నాల దుప్పటి కావ్య పరిశీలన

– డా॥. కె. జ్యోతిలక్ష్మి, తెలుగు లెక్చరర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ.ప్ర.), శ్రీకాకుళం.

శ్రీ ఉత్పల సత్యనారాయణ చార్య సాహితీ జగత్తుకు బహుపరిచితులు బహు గ్రంథకర్తలు మీరు 34 రచనలు చేశారు. వ్యాఖ్యానాలు, శతకాలు, ఖండకావ్యాలు, అధిక్షేప కావ్యాలు, అనువాదాలు, వ్యాసం, నవల, బాల, గేయ సాహిత్యం మొదలగు ప్రక్రియలు అన్నింటిలోనూ ఆరితేరిన వారు. ఉత్పల గారి రచనలలో స్వప్నాల దుప్పటి ఒక అధిక్షేపకావ్యం.

ఇది హాస్య వ్యంగ్య రచన. భావగతమైన ఏకసూత్రత ఇందులో కొంత కనిపిస్తున్నందువల్ల దాన్ని ఒక ప్రయోగ విశేషంగా భావించవచ్చు.

"ఈ స్వప్నాల దుప్పటి" కావ్యంలో కథా వస్తువు, మన దైనందిన జీవితంలో నిత్యమూ జరిగే అనేక సంఘటనల సమాహారం.

మిత్రుడైన ఒక కవి, ఒక సంపన్నుని ఇంట జరిగిన వివాహ సందర్భంలో తనకు కలిగిన కొన్ని విషయానుభవాలను గురించి చెప్పగా, వాటి నుంచి ప్రేరణను పొందిన మరొక కవి కవితావేశపరుడు కావటం ఈ కావ్యంలోని ప్రధానాంశం.

ఒక సంపన్నుడు మిత్రకవి ఇంటికి కారులో వచ్చి తన కుమార్తె పెండ్లి ఆహ్వానాన్ని అందచేసి వధూవరులను ఆశీర్వదిస్తూ పంచరత్నాలను వ్రాసి తీసుకుని రమ్మని చెప్పాడు. దాంతో ఎంతో ఆనందించిన మిత్రకవి పంచ రత్నాలు సొంత ఖర్చుతో అచ్చువేయించి వాటిని చంక బెట్టుకొని వివాహానికి వెళ్లాడు. అక్కడి అతని అనుభవాలు, ఎదుర్కొన్న సన్నివేశాలు, ఎంతో సహజ సుందరంగా వర్ణించారు శ్రీఉత్పల. ఒక రకంగా చెప్పాలంటే ప్రస్తుత సమాజానికి నిలువుటద్దం వంటిది ఈ కావ్యం అని చెప్పవచ్చు.

వేకువ పేదయింటికిని పెన్నిధిమాదిరి పెద్దకారు మా
వాకిట నాగె----------------------
ఆదివారమిర్వది యేడు తేది-జ్ఞప్తి
పెట్టుకొనుడు మా అమ్మాయి పెండ్లి, మీరు
పంచరత్నాల తోడ రావలయు ననుచు
ఒక్క శుభ లేఖ తీసి నాకొసగినాడు

ఈ పద్యాలు అంతకు ముందు ఎవరి పెండ్లి కోసమో వ్రాసిన పద్యాలు. అందుకే కవి వారి పేర్లు మార్చారు. పై విధంగా చెపుతునే "మఱి యీ దినముల కల్తీలేని దినుసున్నదియే?" అంటూ ప్రస్తుత సమజపు తీరును కూడా చమత్కారంగా ప్రశ్నిస్తారు కవి.

ఆ విధంగా పంచరత్నాలను తీసుకుని స్వయంగా తానే అచ్చువేయించుకొని, పెళ్ళికి బయలుదేరారు.

పెళ్లి గృహానికి చేరుకున్నారు కవి. అక్కడ అతన్ని ఎవరూ ఆహ్వానించలేదు. అందరూ కార్లలో వస్తూన్న వారే తప్ప కాలినడకన వచ్చేవారు అసలు కనపడలేదు అతనికి. అపుడు అతనికి కలిగిన ఆలోచనలు క్రింది విధంగా ఉన్నాయి.

ఖద్దరు కట్టుకొన్నతడు కారున రావలె, వాని మూపునన్
కొద్దిది యేని బంగరపు గొల్సొకటుండ వలెన్, జనమ్ము లా
దొద్దు శరీరు వేడ్క మెయి తోడ్కొని వత్తురు కాని, నావలెన్
ఖద్దరు కట్టి కాలి నడకన్ చనువానిని గౌరవింతురే !

ఈ విధముగా ఆహ్వానించి కూడా ఆదరించని, ఆసంపన్నుల ధోరణికి నిశ్చేష్టుడైపోయిన కవి, పైకి కాకపోయినా మనసులో ఎంతో వ్యధ చెందారు. "చిత్ర! మిట కానబడు పరిచితులు కూడా నన్నెఱుంగని యట్టులున్నా రదేమి"! అని ఆశ్చర్యపోయారు: "ధనికు లెదుట నెంత ఘనమైనదయ్యును పేదవాని కవిత పేలవమ్ము" అని నిశ్చయించుకున్నారు. అక్కడ తనకు తెలిసిన నలుగురిలోను ముగ్గురు వచన కవులున్నారట. కాని వాళ్ళు తనకు పద్యాన్ని విన్నట్టు చుశారట.

1930-40ల మధ్య శ్రీశ్రీ, శిష్టా, నారాయణబాబు, పఠాభి వంటి కవులు వచన కవిత్వం ఎక్కువగా వ్రాసారు.

నా ఈ వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో
పద్యాలనడుముల్ విరగదంతాను
చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని
చాలదండిస్తాను.

అని పఠాభి తన “ఫిడేలు రాగాలడజన్” అను కవితా సంపుటిలో తెలుగువ్యాకరణంపై, చందస్సుపై దాడి చేశాడు. వచన కవిత్వం గొప్పదనాన్ని చెప్పాడు. ఒక్కో కవికి ఒక్కో కవితా ధోరణిపై మక్కువ ఉంటుంది.

కవికి ప్రతిభ అంతర్గతమైన లక్షణం. వ్యుత్పత్తి బాహ్యమైన లక్షణం. వ్యుత్పత్తి లోపించినపుడు ప్రతిభ రాణించదు. ప్రతిభా శూన్యమైన వ్యుత్పత్తి నిష్ప్రయోజన మైనది. పూర్వకవికైనా, వచన కవికైనా ఉండవలసిన లక్షణాలివి. కాకుంటే ప్రాచీన పద్యం కంటే ఆధునిక వచనమే గొప్పదనుకునే యువకవులు నేడు అనేకం ఉన్నారు. తమకు తెలిసిందే గొప్ప. మిగిలినదేదీ విలువైనది కాదు అనుకున్నారు, అమాయకులు. మన కవికి కనిపించిన వచనకవులు కూడా అలాంటి వారే అందుకే కవి ఈ విధంగా అనుకున్నారు.

పందిట నలంకరించిన ప్రముఖులందు
నాకు తెలిసినవారలు నల్గురేను
వారిలైనా ముగ్గురు వచన కవులు
కనుగొనిరి నన్ను పద్యమ్ము వినిన మాడ్కి

పెళ్లి పందిట్లో కవికి తెలిసిన వారు లేరు. వారిలో అతడికి ఒక్క నలుగురు తెలుసు కాని వారు కూడా పలుకరించలేదు. దాంతో కవి మనస్తు చిన్నబోయింది. తన పట్ల వాళ్లు చూసిన నిర్లక్ష్యాన్ని కవి, వచన కవిత్వం పద్యం పట్ల చూపే నిర్లక్ష్యంతో పోల్చారు. బాధలో కూడా కవిత్వం జాలువారుతోంది కవి హృదయంలో.

ధనమెచట పొందవలెనొ కొందఱికి తెలియు
అద్ది నిరుపేద ఱెక్కల యందు గలదు
పేదలను పిండి పిప్పి గావించు వాని
భవనమందున బంగారు పూవులు పూయు

ఈ పద్యాన్ని మరీ మరీ మననం చేసి అర్థం గ్రహించి అమలుపరిస్తే మొత్తం మానవ సమాజమే మరోమెట్టు పైకి ఎదుగుతుంది. గాంధి-మార్క్స్-బుద్ధుడు- క్రీస్తు మొదలైన ప్రవక్తలే కాక ‘ సర్వేజనా: సుఖినోభవంతు’ అంటూ మన వేద ఋషులు చెప్పిన సోషలిజం క్షణాల మీద ఏర్పడుతుంది.

పెళ్ళికూతురి తండ్రి మిర్చి వ్యాపారి. లక్షాధికారి. అతని లారీ క్రింద గాజులమ్ముకునే వ్యక్తి పడి మరణించాడు.

గాజులవాడు కేవలం ఒక వ్యాపారి కాడు. గాజులు కేవలం అలంకారాలు కావు. అవి మాంగల్య ప్రతీకలు. సుమంగళీత్వ చిహ్నాలు. మరి అతడు సౌభాగ్యదాత. ఇంతటి అర్థప్రవృత్తులు. భావరంజితముగా కదలాడినని కవి మనస్సులో గాజుల వాని దిక్కులేని చావును తలచుకోగానే.

నాగరికులైన నేటి మానవుల మధ్య
దిక్కు మాలిన చావు ప్రాప్తించె నీకు
నిన్ను ఊహించి స్మరియించి నేటికిపుడు
నా చదువుకొన్న తనము ధన్యత గడించె.

అనే వంక్తులు ‘స్మృతి కావ్య’ గంభీరతను పుణికి పుచ్చుకున్న సువర్ణ కణికలు. ఈ పద్యం దగ్గరకు వచ్చేసరికి అంతవరకు నవ్వుకున్న నవ్వులన్నీ తడిసి ముద్దయినట్లుగా అనిపిస్తుంది. కవి ప్రతిభలోని మర్మమే ఇది.

అపుడు అక్కడికి ఒక స్త్రీ పెద్దకారులో వచ్చి దిగింది. ఆ సమయంలో కవి వర్ణన ఇలా సాగింది.

కేశపాశమ్ము చూడగా కృష్ణవేణి
అధర బింబమ్ము చూడగా అద్ది శోణ
కేవలము తాను సురతరంగిణియె కాక
తద్వియోగ మెవ్వారికి తపతి కాదు?

కోమల భావుకతలోనే కాదు, చేమకూర కవికి కూడా చవులూరించే శ్లేషలోనూ శ్రీఉత్పల నిపుణత ఈ కావ్యంలో అడుగడుగునా అన్పిస్తుంది. ముదిత అవయవ సౌందర్యాన్ని వర్ణించిన ఈ శ్లిష్ట కల్పన ప్రౌఢ రసికుల ఇష్ట స్పందన.

లోకపుతీరు తెన్నుల పట్ల. అవకాశ వాదుల దోపిడి విధానం పట్ల. పేదల నిష్కారణ సహనం పట్ల విసిగి పోయిన కవి నిర్వేదంతో అన్న వాక్యాలివి.

పెళ్ళికి వచ్చిన పెద్దలకు పెళ్ళికుమార్తె తండ్రి ఆమెను పరిచయంచేస్తున్న సమయంలో ఆమెను చూసిన ఉత్పలగారి, భావపరంపర ఇలా ఉంది.

తరుణి! నీ పాదముల శనైశ్చరుడు గలడు
రాహువున్నాడు నీకుంతలముల యందు
కాని, నీ యందమున కెట్టి హాని లేదు
భవదురోజు గుర్వీక్షణ బలము చేత

అంటూ ప్రబంధకవుల తలపించు వర్ణన చేశారు.

పెళ్ళికి వచ్చిన పెద్దలకు ఆమె తండ్రి ఇలా పరిచయం చేశాడు.

"ఈమె మా అమ్మాయి ఈయేడు బంగారు మెడల పొందినది. ఎమ్మెపరీక్ష తమ కళాశాల కంతకు శోభయని మెత్తు రాచార్యు లీమెను చూచినపుడు తెలుగు శాఖాధి పతికి ఈమె యనిన నెంతభిమానమో చెప్పదరము కాదు. చదువన్నది పూర్వజన్మంపు సుకృతంబు చూచి చదివిన వచ్చునది కాదు."

వ : అని భావించుచుం నాతండు కూతం జూచి "బిడ్డా!
ఈ యధికారులు
చిక్కుపడుదునని ఎంచకు
మక్కువ వడ్డించువాడు మనవాడైనన్
తక్కుం గల వారలలో
ఎక్కడ కూర్చున్న నేమి ఎగ్గగు చెపుమా!"

నేటి సమాజంలో విద్య-ఉద్యోగాల విలువపెరిగింది. అలాగే అక్కడ అవినీతి, లంచగొండితనం, మొ॥ లక్షణాలు కూడా పెరిగాయి. ఇంత ఘోరమైన, దారుణమైన, క్రూరమైన అవినీతిని, లోకం తీర్పు కోసం ఇంత సూక్ష్మంగా, వ్యంగ్యంగా, భంగ్యంతరంగా చెప్పగలగం బుషియైన వారికే సాధ్యం. గొడ్డలి దెబ్బలు కూడా పనికి రాని ఈనాటి మందచర్ములకు ఇలాంటి మర్మభేదక నర్మ సూచనలు పనిచేస్తాయా? అని ఆలోచించాలి. కాని చేస్తాయనేదే సారస్వత ప్రయోజనం కనుక అటువంటి చర్యలకు పాలుపడేవారికి ఈ ఘట్టం ఒక కనువిప్పు వలె పనిచేస్తుందని చెప్పవచ్చు.

ధనికులకు విద్య, బంగారమునకు తావి
వోలె శోభిల్లు, పేదల కేల చదువు?
కాయ కష్టము సేయుచు శ్రీయుతులకు
త్రవ్వి తలకెత్తుటె వారి ధర్మమేము

అంటూ ధనికులకు విద్య బంగారమునకు తావి వలె శోభిల్లుతుందని, పేదలకిక చదువెందుకు. అని ఎంతో నిరాశా, నిస్పృహలతో పేదవాని, భవిష్యత్తును దర్శిస్తు, దు:ఖిస్తున్నారు కవి. చదువే ఆధారమైన జీవితాలకు, అది కూడా పనికిరాకుండా పోతే ఇక ఎలా బ్రతకాళి అనే నిరాశా భావం వ్యక్తం చేశారు కవి.

అనుచు నాదారి తిన్నగా నగరి యింట
బడితి నొక్క తమలపాకు తొడమలేక,
చేటలోని బియ్యమ్మును చెఱుగుకొనుచు
నాతి నావాలకము చూచి మూతి ముడిచె.

పెళ్లికి వెళ్లకుండా కనీసం బియ్యం లోని రాల్లు ఏరినా, భార్యకు సహాయం చేసినట్లయినా ఉండేది కదా అని అనుకున్నారు. భోజనం చేసి పడుకున్నారు. దోమల బాధ తట్టుకోలేకపోయారు. దాంతో మంచం తెచ్చుకుని బయట వేసుకున్నారు. నిద్రపట్టలేదు. నక్షత్రాలతో నిండి ఉన్న ఆకాశం అతనికి అర్థం కాని గ్రంథంవలె కనిపించింది.

రేయి నిదుర రాక యటు పొర్లి యిటు పొర్లి
కదలి యాలోకనము సేయ గానబడెను
అమిత నక్షత్ర ముద్రితమ్మయిన గగన
తలము - అర్థమ్ము, కాని గ్రంథమ్ము వోలె.
అప్పు డుదయ శిఖరి నితం బావలంబి
విషమ కాండ కుటుంబికు వీక్ష చేసి
ప్రక్కనున్న స్వప్నాల దుప్పటిని తీసి
ముసుగు బిగదన్ని కన్నులు మూసికొంటి

శ్రీ ఉత్పల వస్తుత: భావనాష్యగ్రుడైన కవి. ఊహాశక్తి ఉగ్గుతో అలవరచుకున్నవాడు. తమాషాగా తరగపైన తేలుతూనే ఒక్క విసురులో కలిలోతు ముట్టేవాడు. ఇందుకు ఉదాహరణే పై పద్యం.

## ముగింపు :

అత్యాధునికము దైనందిన వ్యవహారాలలోని ఒక సామాన్యాంశాన్ని వస్తువుగా తీసుకుని రసానందకరంగా కావ్యసృష్టి చేయగల శక్తి గలవారు ఉత్పల. సాంఘిక,

రాజకీయ, ఆర్థిక దుర్విదగ్దలో పడి ఆకలి దప్పులతో కొట్టుకుపోతున్న ఆధునిక ధోరణిని లెక్క చేయకుండా తన స్వంతమైన స్వయం సృజనలో నిమగ్నుడైపోయిన కవితాతపస్వి ఉత్పల. ఆ తపస్సులో నుంచి పెల్లుబికి వచ్చిన మహాకావ్యమే ఈ స్వప్నాలదుప్పటి. ఈ కావ్యంలో ధనికుల దోపిడీ ధోరణులు, లంచ గొండి పద్దతులు, లాఠీల రాక్షసత్వాలు, ధనికుల, అధికారుల దాసోహాలు, ఒకటేమిటి ఒకో పద్యం, ఒకో ఘట్టం ఒకో రసార్ణవం. అని రసాలు, అన్ని అలంకారాలు ఆపాదమస్తకం కలబోసుకున్న సుందర 'వధూదయ లక్ష్మి' ఈ కావ్యం.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. ఫిడేలురాగాల డజన్: ఆత్మకథ
2. ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు ప్రయోగములు- సింగిరెట్టి నారాయణ రెడ్డి
3. సాహత్య దర్శనము - కె.వి.ఆర్. నరసింహం.

★★★

# బహుభాష కోవిదుడు నలిమెల భాస్కరుడు

- **రేణ ఈశ్వరయ్య**, తెలుగు సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాల, హనుమకొండ జిల్లా.

'నేను భాషను ప్రేమిస్తాను
యాసను ప్రేమిస్తాను
తల్లిని ప్రేమించనివాడు మనిషేకాదు
అని అంతకన్నా కాదు
ఏ భాషైనా ఇష్టమే
నా భాష, యాస నాకు మరీ ఇష్టం
ఏ భాషను ఎవడు ఖూనీ చేసినా
వాడిని ఖూనీ చేయాలనేంత కోపం"

ఈ కవితా చరణాలు డా॥. నలిమెల భాస్కర్‌కు అచ్చుగుద్దినట్లు సరిపోతాయి. ఆయనకు తెలంగాణ భాష పట్ల ఎనలేని అభిమానం. ఏ భాష పట్ల దురాభిమానం లేనటువంటి వ్యక్తి. పద్నాలుగు భాషలను అలవోకగా నేర్చుకున్న బహుభాషా పిపాసి నిరంతర భాష కృషీవలుడు, నిత్య అధ్యయన శీలి. బహు భాషా కోవిదులు. భాష పరిమళాలను నలువైపుల పంచుతున్న భాష భానుడు నలిమెల భాస్కరుడు.

డా॥. నలిమెల భాస్కర్ ప్రస్తుత సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట తాలూకా నారాయణపూర్ గ్రామంలో రాంచంద్రం బుచ్చమ్మ పుణ్యదంపతులకు 1956 ఫిబ్రవరి 12 జన్మించారు. 1977లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరిన తర్వాత 1979లో ఎం.ఏ. తెలుగు పూర్తి చేసారు. 1979 నుండి 1985 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులను నిర్వర్తించారు. ఆ తర్వాత పదోన్నతి పొంది జూనియర్ లెక్చరర్‌గా, డిగ్రీ లెక్చరర్‌గా విధులు నిర్వర్తించి 2011లో స్వచ్ఛంద పదవి విరమణ చేసి ప్రస్తుతం భాషా సాహిత్య ఔన్నత్యానికి తనవంతు కృషి చేస్తున్నారు.

ఏదైనా ద్రావిడ భాష నేర్చుకుందామనే తపనతో 30 రోజులలో 'తమిళం'తో ఆయన భాషా యాత్ర ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లా కొలనూరులో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ముప్పైరోజుల్లో భాషలు నేర్చుకోవచ్చు అనే పుస్తకాలు కొనుక్కొని ఒక్కొక్క భాషను అధ్యయనం చేస్తూ పద్నాలుగు భాషలను నేర్చుకున్న బహుభాష వేత్త డా॥. నలిమెల భాస్కర్. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, ఉర్దూ, ఆంగ్లం, మరాఠీ, బెంగాలీ, పంజాబీ, సంస్కృతం, ఒరియా, అస్సామీ, గుజరాతి తదితర పద్నాలుగు భాషలను అవపోసన పట్టాడు.

తెలుగు సామెతలు - ద్రావిడ భాషలతో తులనాత్మక పరిశీలన'పై యం.ఫిల్ చేశారు. ఆ తర్వాత 'తెలుగు - మళయాల సామెతలు, కుటుంబ జీవన చిత్రణ' అనే అంశంపై పిహెచ్.డి పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నాడు.

## నరలిమెల భాస్కర్ గారి ముఖ్య రచనలు :

1. స్మారక శిలలు (కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.)
2. అద్దంలో గాంధారి మరి పదకొండు అనువాద కథలు
3. నూరేళ్ల పది ఉత్తమ మలయాళ కథలు
4. మంద మరి పదమూడు అనువాద కథల
5. భారతీయ కథలు
6. మానవుడా ( గేయ సంపుటి)
7. కిరణాలు (వచన కవితా సంకలనం)
8. సాహితీ సుమాలు (వ్యాసాలు)
9. తెలంగాణ పదకోశం
10. మట్టి ముత్యాలు (నానీలు)
11. ఈ తరం పాటలు
12. భారతీయ సామెతలు
13. జీవద్రవ్యం (కవితా సంపుటి)

డాక్టర్. నలిమెల భాస్కర్ గారికి 2024 సంవత్సరానికి గాను కాళోజి స్మారక పురస్కారం లభించింది.ఇదే కాకుండా సుమారు 25 పురస్కారాలు వీరికి లభించాయి.

**తెలంగాణ భాషకు ద్రావిడ భాషకు ఉన్న దగ్గర సంబంధం:**

తెలంగాణ భాషకు, ద్రావిడ భాషలకు దగ్గరి

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

సంబంధం ఉందని నిరూపించాడు డా॥. నలిమెల భాస్కర్. ఉదాహరణకు కొన్ని పదాలను నిదర్శనంగా ఎత్తి చూపాడు. తెలంగాణలో 'ఒడిశిపోవడం అనే పదానికి అర్థం అయిపోవడం, నిండుకోవడం ఇదే సమానార్థంలో మలయాళంలో 'ఒడువిల్ అనే పదానికి చివరికి, ఆఖరుకు అని అర్థం ఓడిపోవడం అంటే చివరికొచ్చి అయిపోవడమే కదా అని రెండిరటికి మధ్య గల సామ్యాన్ని వివరించాడు. తెలుగులో ఉచ్ఛరించే పిల్లనగ్రోవిని తమిళంలో 'పుళ్ళాంగుళల్ అని వ్యవహరిస్తారు. ఈ రకంగా తెలంగాణ భాషకు తమిళ భాషకు సామ్యం ఉందని చూపాడు. తెలంగాణాలో అడకత్తెర పదానికి మలయాళంలోని అడమ్క్క పదానికి సామిప్యం ఉందని తెలిపారు.

**తెలంగాణ పదకోశ నిర్మాణానికి ప్రేరణ :**

2001 సంవత్సరం అక్టోబర్ నెలలో మంజీర రచయితల సంఘం - సిద్దిపేట వారు పదిహేనవ వార్షికోత్సవాల సందర్భంగా 'తెలంగాన సంస్కృతి - సాహిత్యంపై రెండురోజుల సభ నిర్వహించారు. రెండవ రోజు డా॥. నలిమెల భాస్కర్‌కు చిరకాల మిత్రుడ్కైన నందిని సిద్ధారెడ్డిగారు తెలంగాణ భాష గురించి మాట్లాడమని ఆహ్వానించాడు. ఆ సందర్భంలో ఇంటినుంచి బయలుదేరేముందు ధర్మపత్ని సావిత్రి గారు 'పిలిచేటోడు మంచిగానే పిలిచిండు, పోయేటోనివి మంచిగానే పోతున్నవ్ ఇంతకీ నీకు తెలంగాణ భాషొత్తదా' అని ప్రశ్నించింది. ఆ ప్రశ్న డా॥. నలిమెల భాస్కర్ గారిని తెలంగాణ భాషాపదాల గురించి ఆలోచించేలా చేసింది. సిద్దిపేటకు బస్సులో బయలుదేరగానే తెలంగాణ పదాలను తవ్వుకోవడం మొదలు పెట్టి తాను బాల్యం నుండి మాట్లాడిన పదాలను నెమరువేసుకుంటూ సభకు వెళ్ళి ఏకధాటిగా అరగంట సమయం తెలంగాణ భాష గురించి తెలంగాణ యాసలోనే మాట్లాడారు.

**తెలంగాణ పదకోశ నిర్మాణం :**

భాషాశాస్త్రవేత్తలు తెలుగు ప్రాంతాన్ని నాలుగు భాషా మండలాలుగా విభజించారు.

1. పూర్వమండలం
2. దక్షిణమండలం
3. ఉత్తర మండలం
4. మధ్య మండలం

ఈ భాషా మండలాలలో ఒక్కొక్క విధమైన మాండలికాలు అమలులో ఉన్నాయి. తెలంగాణ మాండలికం ఉత్తరమండలానికి చెందింది. మిగతా మండలాల భాషకంటె తెలంగాణ భాష విభిన్నమైనది, ప్రత్యేకమైనది. ఈ తెలంగాణ మాండలిక భాష నాదవంత మైనది. మాధుర్యమైనది. అయినప్పటికి ఈ ప్రాంతం వారు మాట్లాడేది భాషకాదు అనే అపనిందను మోపారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ భాషా అస్థిత్వాన్ని ప్రత్యేకతను చాటేందుకు తెలంగాణ మలిదశ ఉద్యమ సందర్భంలో 2003 సంవత్సరంలో తెలంగాణ ప్రాంతంలో వాడుక పదాలను సేకరించి మొదట ఏడువేల పదాలతో తెలంగాణ పదకోశాన్ని నిర్మించారు. 2016లో మరో మూడువేల పదాలను కలిపి పదివేల పదాలతో రెండవ ముద్రణగా తీసుకొచ్చారు. తెలంగాణ పదకోశాన్ని తీసుకొచ్చారు. ఈ రకంగా తొలి మాండలిక నిఘంటు కర్తగా ఘనత సాధించాడు. తెలంగాణ ప్రాంతంలో ఉచ్ఛరించే భాష అర్థవంత మైనదని నిరూపించేందుకు కొన్ని పదాలను ఉదాహరించాడు.

**అర్థవంతమైన భాష తెలంగాణ భాష నిరూపణ :**

తెలంగాణలో 'దర్జీ'ని మేర అని వ్యవహరిస్తారు. దర్జీ అనే పదం ఉర్దూ పదం. మేర పదాన్ని వివరిస్తూ మేరల అనగా హద్దుల మేరకు గుడ్డల్ని కత్తిరించి కుట్టేవ్యక్తి మేర అని స్పష్టంగా తెలిపారు. అలాగే కాపోల్లు, కాపుదనపోల్లు అనే పదాల గురించి వివరిస్తూ పంటపండిరచి ఆ పంటకు కాపు (కాపలా) గా ఉండేవాళ్ళు కాపోళ్ళు అని వివరిస్తూ దీనికి సమానార్థంలో ఇంతర ప్రాంతాలవారు రైతులు అని పిలుస్తారని తెలియజేశాడు. (రైతు ఉర్దూపదం)

తెలంగాణలో తలక్రింది పెట్టుకునే దిండును మెత్త అంటారు. తలకింద మెత్తగా పెట్టుకునేది కాబట్టి మెత్త అయిందని వ్యుత్పత్తి అర్థం చెప్పాడు. అలాగే వాన పామును తెలంగాణలో ఎర్ర అంటారు. ఎర్రగా ఉండేది

ఎర్ర అని, మజ్జిగను చల్ల అంటారు చల్లగా ఉండేది చల్ల అని, అంగాన్ని (శరీరాన్ని) కప్పి ఉంచేది అంగీ అని, లాగుతూ వేసుకునేది లాగని, ఖాళీగా ఉండేది గుల్ల (గంప) అని, జిహ్వాకు (నాలుకకు) రుచి కలిగించేవి జిమ్మలు (చేపలు) అని, కంకుతూ తినేది కాబట్టి కంకి (పొత్తు) అని రోగమువచ్చినపుడు వేసుకునే మాత్రను గోలీ అంటారు గోళంగా (గుడ్రంగా) ఉండేది గోలీ అని అంటాం. అంతేగాకుండా మరికొన్ని పదాలను అర్థాలు తెలుపుతూ కాపాయం అంటే కాపు ఆయం కాపాయం అనగా పొదుపు అని ఇందులో ఆయం అంటే ఆదాయం అని, ఈ ఆయాన్ని కాపు చేసుకోవడం అంటే కాపాడుకొని పొదుపు చేయడమే కాపాయం అని అంతేకాకుండా పూస పేరోల్లు పూసలు, పేరులు (దండలు), అద్దాలు, దువ్వెండ్లు మొ॥ అమ్ముకునేవాళ్ళు. పేర్నాల వెట్టుడు. పేరులు నామాలు పెట్టి నిందించడం.

తెలంగాణా ప్రాంత ప్రజలకు పాట ఎంత ఇష్టమో మాట కూడా అంతే ఇష్టం. లయబద్ధంగా మాట్లాడుకునే తీరు భాషకు ఎక్కడా లేని బలాన్ని తీసుకొచ్చింది.

తెట్టాన తెల్లారుడు (భళ్ళున తెల్లారింది)
చెట్టాలున చెంపదెబ్బ
అతులా కుతలం (బ్రతుకు ఆగమైంది అని చెప్పుడు)
ఇచ్చుకోం పుచ్చుకం (ఇచ్చి పుచ్చుకోవడం)
కలిగా పులగం (కలగూర గంప అంటూ)
శ్వాసాలు నాదాలుగా మారడం
వాన్ని గొట్టుడు (వాన్ని కొట్టుడు)
వీన్ని దిట్టుడు (వీన్ని తిట్టుడు)
కూరగాయలుజి
ఇర్గవడుడు (చాలామంది ప్రజలు ఒకేసారి ఎగ పడడం)

**తెలంగాణ భాషలో ధ్వనుల మార్పులి :**

తెలంగాణ భాషలు ధ్వనుల మార్పు అనగా ఒక ధ్వనికి మారుగా మరొక ధ్వనిని వాడే పదాలు. ఇవి పదకోశంలో అచ్చుల్లోను, హల్లులోను కనిపిస్తాయి. ఈ ధ్వనుల మార్పు తెలంగాణ భాష ప్రత్యేకతను తెలియజేస్తాయి. డా॥. నలిమెల భాస్కర్ తెలంగాణ భాష ప్రత్యేకతను తెలియజేస్తాయి. డా॥. నలిమెల భాస్కర్ తెలంగాణ పదకోశంలో ధ్వనుల మార్పు చెందిన పదాలను వివరించడం జరిగింది.

**పదాది అచ్చు కలిగిన మార్పు :**

ఉదా॥. ఇసుక - ఉసుక (ఉస్కె)
ఇకు బదులు ఒ కారం వాడడం
పిల్ల - పొల్ల

**పదాలలో అచ్చుల్లో ఆ కలిగే ధ్వని మార్పు :**

'అ' కు బదులు 'ఎ'
పదిలం - పదిలెం
అ ఎ
వదిన - వదినె
అ ఎ
బిడ్డ - బిడ్డె, ఓపిక - ఓపికె
అ ఎ

## హల్లుల్లో కలిగే ధ్వని మార్పులు :

**పదాని హల్లుల్లో కలిగే ధ్వని మార్పులు :**

'జ'కు బదులు 'ద'కారం జడసుకొను - దడసుకొను
త కారం బదులు - య కారం వాడడం వేప - యాప
ద కారం బదులు - డ కారం వాడడం దొప్ప డొప్ప
మ కారం బదులు - న కారం వాడడం మిర్పకాయ - నిర్పకాయ

**అపదాది హల్లుల్లో కలిగే మార్పు :**

క కు బదులు గ కారం ఇక - ఇగ, ఒకడు, ఒగడు
ఒ కారం బదులు వ కారం గాబర - గావర
ర కారం బదులు న కారం రాత్రి - నాత్రి
ల కారం బదులు న కారం చాల - చాన
వ కారం బదులు గ కారం పిల్లవాడు బదులు - పిల్లగాడు.
వ కారం బదులు ఈ కారం వీపు - ఈపు, వీరయ్య - ఈరయ్య, వీరమ్మ, ఈరమ్మ
వకారం బదులు - ఎ కారం వెండి-ఎండి, వెనుక -ఎనక

**పరుషాళకు బదులు సరళాలు ఉపయోగించడం :**

చూడు - సూడు, చక్కగా - సక్కగా, చెంబు -, సెంబు, చావు - సావు, చుక్క-సుక్క

**దీర్ఘలోపం :**

నవ్వుతారు - నవ్వుతరు, ఉంటాడు, ఉంటడు, బాగానె - బాగనె

**వర్ణలోపం :**

(వర్ణనాశం) ఊరికె-ఊకె, ఇదిగో-ఇగో, అక్కడ--ఆడ, బతుకుతాడు-బత్తాడు

**వర్ణాగమన పదాలు :**

వ్యాకరణంలోని త్రికముల (అ, ఈ,ఏ) లోని ఆ, ఈ ఏ అనే సర్వనామ శబ్దాలతో ఏర్పడే పదాల ముందు 'గ' కారం ఆగమంగా చేరడం తెలంగాణ భాషలోని ప్రత్యేకం

ఉదా॥ అప్పుడ-గప్పుడు, ఆయన-గాయన, ఇక్కడ-గిక్కడ, ఇది-%-%గిది, ఇందుకు-%-%గిందుకు, ఆపుస్తకం-గాపుస్తకం.

**కారడ్డం మాటలు :**

అనగా వెటకారపు మాటలు అని అర్థం నిజానికి ఇది కాలడ్డం మాటలు. కాలు అడ్డుపెట్టబడిన మాటలు. కాలు అడ్డు మాటలే కాలొడ్డే మాటలయ్యాయి.

ఇట్లా అనేక పదాలకు సముచితమైన అర్థవివరణ ఇచ్చారు. తెలంగాణ పదాల ఉచ్చారణ భావస్పష్టతను చేకూరుస్తాయని ఆయా పదాలను ఒక్కొక్కటిగా అర్థ వివరణ ఇచ్చాడు.

తెలంగాణ భాష మాధుర్యమైనదని అందమైదని నిరూపిస్తూ కొన్ని పదాలను వివరించాడు.

**చీమిడి కారడం :**

చిన్న పిల్లల ముక్కులోంచి చీమిడి కారినపుడు ముక్కు వచ్చింది తియ్యండి అంటారు.

**కళ్ళకలక :**

కళ్ళకలక అనే జబ్బు వచ్చినపుడు కండ్లొచ్చినయి అని పిలవడం పరిపాటి.

**శిల్కనవ్వు :**

అమ్మాయి నవ్వినపుడు ఆ అందమైన నవ్వును ఉపమానంగా శిల్కనవ్వు (చిలుకనవ్వు) అనడం తెలంగాణలో పరిపాటి. అందమైన అమ్మాయిని రామసక్కదనం అమ్మాయి అని చెప్పడం తెలంగాణ భాషలోని సౌందర్యం.

తెలంగాణ భాష ఆత్మీయమైన భాష: తెలంగాణ భాష ఆత్మీయమైనది సౌందర్యమైనది అనడానికి డా॥. నలిమెల భాస్కర్ కొన్ని పలకరింపు పదాలను ఉదహరించారు.

అన్నా ఎటుపోతున్నావే! (అన్న ఎటుపోతున్నడో తెలుసకునేటపుడు)

ఓ అవ్వ జెర బువ్వయ్యరాదె (అన్నం పెట్టమని అమ్మను అడిగినపుడు)

తమ్మి జెర పైలం (జాగ్రత్తగా, భద్రంగా వెళ్ళు అని చెప్పేటపుడు)

ఈ నడ్మల జెర నిగ నిగ అయినవ్ (అందంగా తయారైనావు చెప్పటానికి బదులు)

మర్దలు పిల్లా (భార్య చెల్లెలిని పలకరించేటపుడు)

నాయినా! నా మొర ఏ దేవుడికి ముడతదో (ముసలి వాళ్ళు తమ కష్టాల గురించి ఇతరులకు చెప్పేటపుడు)

చెల్లే బావ బతుకమ్మ పండుగకు పంపలేదా! (చెల్లి బతుకమ్మ పండుకకు రానపుడు అన్నగానీ, అక్కగాని చెల్లెను అడిగే విధానం బావు బాయి కాడికి పోయినావే)

ఇలాంటి అప్యాయమైన వాక్యాలు వావివరసలు సహజాతి, సహజాలు తెలంగాణ భాషలో మిళితమై ఉంటాయి. ఈ భాష గ్రాంథికానికి, కావ్యభాషకి చాలా దగ్గరైనా భాష. సృజనాత్మకమైన, సుసంపన్నమైన భాష అని నిరూపించారు.

తెలంగాణ భాషను నాదమయం చేయడంలో 'పూర్ణానుస్వారా' పాత్ర ఉంటుంది తెలంగాణలో దీనిని ఎక్కువగా వాడతారు.

విచిత్రంను ఇచ్చంత్రం (హల్లులకు బదులు అచ్చులు పలకడం)

నాగుపాముకు బదులు నాగుంబాము

తాబేలు-తాంబేలు

పొద్దుగూకేదాక-పొద్దుందాక

సరిగా -సరింగా

లక్ష్మీదేవి-లచ్చిందేవి

చేదతాడు-చేందాడు

రాగా-రాంగా

పోగా-పోంగా

తెలంగాణ భాష లయబద్ధం కావడానికి ద్విత్వక్ష రాలను ఇక్కడి ప్రజలు ఉపయోగిస్తారు.

(దయగల తల్లి-దయగల్లతల్లి)
ఆత్మగల చెయ్యి ఆత్మగల్లచెయ్యి)
మిట్ట మిట్ట చూసుడు
లట్ట లట్ట తాగుడు
పిస్స పిస్స మాట్లాడుడు. (జగిత్యాల నిజామాబాద్ ప్రాంతంలో పిచ్చి పిచ్చిగా బదులు పిస పిసా అంటారు)
కిస్స కిస్స నవ్వింది
గొర్ర గొర్ర గుంజకుపోవడం
బర్ర బర్ర గోకుడు

## తెలంగాణ భాషను స్థిరీకరించిన వ్యాసాలు-బాణం

**బాణం వ్యాసాల సంపుటి :**

డా॥. నలిమెల భాస్కర్ 2008 జులైలో ఆరు వ్యాసాలతో 'బాణం' సంపుటిని వెలువరించారు.

తెలంగాణ తెలుగు నిఖార్సైన తెలుగు తెలుగన్నల తెలంగాణ అచ్చ తెలుగు ఖజానా-ఇంత ఖజానా మనదగ్గరుంచుకొని ఇతరులే ధనికులనుకోవడం ఎంత దౌర్భాగ్యం. బంగారాన్ని వదిలిపెట్టి మెరిసే లోహాన్ని బంగారం అనుకోవడం ఎంతటి అమాయకత్వం అంటూ తెలంగాణ భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాడు.

తెలుగు పదం పూర్వరూపం గురించి చెపుతూ ఒకప్పుడు తెలుగు పదంలో తెలు అనే రెండు అక్షరాల తర్వాత అరసున్న లేదా నిండుసున్న ఉండేదని తెలుంగు పదం తెలంగాణ అనే పదంలోనే మిళితమై ఉందని స్పష్టం చేశాడు.

తెలంగాణాలో ప్రచారంలో ఉన్న సామెతల శక్తిని, ఔన్నత్యాన్ని, వివరిస్తూ తొందర చేసే పనుల వల్ల ప్రమాదం ఉంటుందని చెపుతూ 'తొందర పడితే బొందల పడతావురా' అనే తెలంగాణ సామెతను ఆంధ్రాలో దీనికి సమానార్థంగా 'ఆత్రానికి గిన్నెలో చెయ్యి పట్టదు'అని సామెతను చెప్పాడు. అలాగే ఈ రెండు సామెతలకు సమానార్థంలో ఆంగ్లంలో 'లుక్ బిఫోర్ యు లీవ్' అనే సామెతను తీసుకొని తెలంగాణ సామెతకున్న శక్తి, ప్రభావం వేరే భాషలకు లేదని చెబుతూ ఉదహరించాడు. తొందర, బొందల పదాల వల్ల సామెతకు ప్రాసతో పాటు నాదసౌందర్యం ఏర్పడిందంటాడు. ఏ భాషకైనా జవజీవాలు జాతీయాలు, సామెతలే. తెలంగాణ వాసుల పలుకుబడులతో నుడికారం ఉంటుంది. రచయిత తెలంగాణ జాతీయాల ప్రస్తావన గురించి వివరిస్తూ ఒక వ్యక్తి చాలా ఇబ్బంది పడిన సందర్భంలో మాట్లాడే జాతీయాన్ని ఉదహరిస్తూ 'కాట గలసినట్లయింది నా బతుకు' అని జాతీయంలోని కాట అనే పదం కాడు అనే పదం నుండి వచ్చిందని కన్నడ, తమిళ భాషల్లో నేటికి కాడు అంటే అడవి అనే అర్థం ఉందని అన్నారు. (టకు బదులు డ వాడతారు అటవి-అడవి) తెలుగు ద్రావిడ భాష కుటుంబానికి చెందింది. కాబట్టి కాడు పదం తెలంగాణ జాతీయంలో స్థిరపడి పోయిందని అందుకే తెలంగాణ భాషకు ద్రావిడ భాషకు దగ్గరి సంబంధం ఉందని తెలియజేశాడు. తెలంగాణ భాష దాని మూలాల్ని కాపాడుకుంటూనే ఇతర భాషా పదాల్ని కన్నడ, మరాఠీ, ఉర్దూ, తమిళం మొదల్కెన భాషా పదాల్ని తనలో కలిపేసుకుని తద్భవ తద్ధవ పదాలతో వైభవంగా విర జిల్లుతున్నది తెలంగాణ భాష.

వెనుకబడిన ప్రాంతంలోని భాషలు, ఆచారాలు, వేషభూషలు అంత త్వరగా తమ కుదుళ్ళను వదిలించు కోవన్నది జగమెరిగిన సత్యం. ధరలు మిన్నంటుతున్నాయి. ధరలు చుక్కల్లోకి చేరాయి. లాంటి ఆంధ్రుల అభివ్యక్తికి ఏ మాత్రం తీసిపోని అత్యంత సహజమైన పలుకబడి తెలంగాణ ప్రజల నోళ్ళల్లో నానుతున్నదివి. అక్కడ 'ఏది కొన్నామన్నా అగ్గిల చెయ్యి పెట్టినట్లున్నది' అంటారు. దేన్ని కొనాలన్న అగ్గిలో చెయ్యిపెట్టినట్లు అనడాన్ని మించిన అనుభవైకవేద్య భావప్రకట ఉంటుందా? ఎండలు మండిపోతున్న సందర్భంలో ఎండ కొర్రాయోలో కొడు తుంది, ఎండ చంద్రనిప్పులు చెరుగుతున్నట్లున్నది లాంటి వాక్యాలను మాట్లాడుతారు.

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

అయిష్టమైన పనులు చేస్తున్నపుడు 'ముండ్ల మీదున్నట్లు' భావిస్తారు. ఎక్కువ కష్టానికి గురిచేసే సందర్భంలో మా బ్రతుకులు పల్లేరు కాయలల్ల బొర్లిచ్చి నట్లు వుంటుంది. బట్టగాల్చి మీదపారేస్తే (నీలాప నిందలా) గట్లకు కుక్క మొరిగినట్లు (అరణ్య రోదనంలా) పోలికలు ఒకే తీరుగా ఉన్న సందర్భంలో నోట్లెకెల్లి ఊడిపడ్డట్లు ఉన్నారంటారు. ఒకరికి మరొకరి సారూప్యం చెప్పేటపుడు వీడు వాని జుట్లకెల్లి ఎల్లిండు. తెలంగాణ భాష సంగీతానికి దగ్గరి సంబంధం ఉన్నట్లు ఉంటుంది. మాట మాట్లాడితే చాలా ఏదో ఒక సంగీతరాగం జాలు వారుతున్నట్లుంటుంది.

1. తల్లాలిని తిట్టినా తాళం తప్పదురా
2. కోతి అయినా కొమ్మ తప్పిదుంకదు.

లయబద్ధంగా మాట్లాడుకొనే మాట తీరే తెలంగాణ పాటకు, మాటకు ఎక్కడలేని బలాన్ని తీసుకొచ్చింది.

తెలంగాణ భాషకు సంబంధించి రచయిత నాలుగు వ్యాస సంపుటాలను వెలువరించాడు. అవి 1. బాణం 2. తెలంగాణ భాష-దేశ్యపదాలు 3. తెలంగాణ భాష సంస్కృత పదాలు 4. తెలంగాణ భాష తమిళపదాలు తెలంగాణ భాష-అన్య భాషలతో గల సంబంధం.

ద్రావిడ భాషలైన తెలుగు తమిళం భాషల మధ్య ఎంత సాన్నిహిత్యం ఉందో తెలంగాణ భాష తమిళంతో అంతే సాన్నిహిత్యం ఉంది.

ఉదా॥. ఊరును తమిళంలో ఊర్ అలాగే, కాలు-కాల్, అక్క- అక్కా, ఇల్లు-ఇలు, నేను- నాన్, నీవు- నీ, అది- అదు, అత్త-అత్తై, అవి-అవై, ఇవి-ఇవై, ఎవి-ఎవై లుగా పిలుస్తారు తమిళంలో తంబి క్రమంగా తమ్మిగా మారి ఆతర్వాత తమ్ముడు అయినాడని తమిళ తంబికి తెలంగాణ తమ్మికి దగ్గర సంబంధం ఉందని వివరిస్తూ తెలంగాణలో గడ్డపారను తమిళంలో కడప్పారై అని అలాగే

సరికిసరి-సిరక్కుసరి
చిరుతపులి-చిరుత్కెపుల
తొడగొట్టి సవాల్ చేయడం-తెడ్కె తట్టుదల్
పట్టగొలుసులు-పట్టెకొలుసు
అపనమ్మకం-అవనంభిక్కె
పులుపు-పుళిప్పు, మరచెంబు-మరైచ్చెంబు
మిరియాళచారు-మిళగుచారు
మొదటి రకం-మొదల్ రకం, దొర-దురై
దొరసాని-దురైసాని పగొడు-పగైవన్, పైనం కట్టుడు - పయణం కట్టుదల్
విలవిలలాడటం-విలవిత్తల్, చూలు-చూళ్
కష్టం అనే మాట తమిళంలో కట్టం అయింది. తెలంగాణలో కష్టాన్ని కట్టం అంటారు.
వరంగల్లు అనే పదం నిజానికి ఓరుగల్లు.
తమిళంలో ఓరు అంటే ఒకటి కల్ అనగా రాయి అని అర్థాలున్నాయి. ఓరుగల్లును ఏకశిలానగరం అని కూడా పిలుస్తారు. ఈ రకంగా తెలంగాణ భాషపై తమిళ ప్రభావం ఎంతో ఉంది.

**తెలంగాణ భాష దేశ్య పదాలు:**

చిన్నయసూరి ప్రకారం త్రిలింగ దేశ వ్యవహార సిద్ధం బగు భాష దేశ్యంబు. ఈ దేశ్య పదాలలోనే అసలుసిసల్కైన తెలుగు దాగి ఉంది. దేశ్యమంటే సంస్కృతాది పదాలు లేని తెలుగు. బహుజనపల్లి సీతారామచార్యుల 'శబ్ద రత్నాకరం' నిఘంటువులోని అనేక తెలుగు దేశ్య పదాలను గుర్తించిన నలిమెల భాస్కర్ తెలంగాణ తెలుగు భాషలో నేటికి అరుద్కైన దేశ్యపదాలు వ్యవహారంలో ఉన్నాయని తెలియజేస్తూ అనేక పత్రికలకు వ్యాసాలు రాశాడు. ఆ వ్యాసాల సంపుటియే 'తెలంగాణ దేశ్య పదాలు' ఈ సంపుటిని 2017లో ముద్రించాడు. కొన్ని పదాలను గమనించినట్లయితే

అచ్చు-ముద్ర, అంగూర్లు-ద్రాక్ష, అత్తరం-తొందర, బిత్తర-చంచలం, అవిటి-అంగవిహీనుడు, అసలు - మూలధనం, ఆడబిడ్డ,- కూతురు.

తెలుగు ఆటపట్టులు-తెలంగాణ పల్లె పట్టులు, అనే వ్యాసంలో రచయిత తెలంగాణాలో ఉచ్చరించే దేశీపదాల అర్థాలను క్షుణ్ణంగా వివరించాడు. చెడు అనే పదానికి కనబడకపోవు, కుల్లిపోవు, నశించు అని శబ్ద రత్నాకరం అర్థాలను ఇచ్చింది. కాని తెలంగాణాలో దీని అర్థం. నీటిలో

బాగా తడ్వడం వల్ల స్త్రీలకు గానీ, పురుషులకుగానీ కాళ్ళు చెడుతాయి అనగా నీళ్ళ వలన తడిసి ఉబ్బి పగుళ్ళు రావడం అంటూ పదం యొక్క అర్థాన్ని వివరించాడు.

'కావలికాడు' అనే పద అర్థాన్ని గురించి చెబుతూ కావలి పదం తమిళ కావల్ నుంచి కాపలా చేసే వ్యక్తి కావలివాడు అయ్యిందని దీనికి దృష్టాంతంగా 'నేరటి కాడు' అని ఉదహరించాడు. ఒర్రుడు అనే పదానికి అర్థం అడవడం ఈ పదం, 'ఒరలు' మాతృక నుండి పుట్టింది. అసలు దీని అర్థం విలపించు అని అయినప్పటికి అర్థపరిణామం వలన అది అర్వడంగా మారిపోయిది. అంతేగాకుండా మరికొన్ని పదాలను కూడా ఉదహరిస్తూ తెలంగాణలో వ్యవహరించే 'కాపాయం' పదం కాపేయం అనే పదంగా శబ్దరత్నారకంలో ఉంది. దీనికి నిఘం టువులో 'కృపణత' అని అర్థం చెప్పారు. కృపణ అంటే లోభత్వం కాపాయం ఎక్కువ అయితే లోభత్వవే కదా అని అర్థవంతమైన దేశ పదాల ప్రయోగం తెలంగాణ భాషలో కనిపిస్తుందంటాడు. తెలుగు భాషలోని 'చామన ఛాయ'కు బదులు తెలంగాణాలో సాయనలుపు అని వ్యవహరిస్తారు అయితే రచయిత ఈ రెండు పదాల్లోని చామ, సామ ఒక్కటే అని అన్నారు. ఇందులో సామ అనేది సామగింజ కొంత నలువుగా ఉంటుంది. కనుక అది సామనలుపు అయింది అని తెలిపాడు.

తెలంగాణాలో చెరుకు గడల్ని చెరుకుకట్టెలు అంటారు. ఆ గడలకు కట్టెలకు, మధ్య మధ్య కణుపులుంటాయి. వీటిని తెలంగాణకలో గేనెలు అంటారు. ఈ గేనలకు మూల రూపాలు తెలుగు భాషలోని గనుపు, కనుపు, గనియ అని ఉంది. గనెల కట్టెలు అంటే తెలంగాణాలో చెరుకు కట్టలేకాదు ఆ మోస్తారు కణపులున్న వెదురు కర్రలు అని కూడా వ్యవహరిస్తారని వివరించాడు.

బాయి నుండి వీటిని తోడుకోవడానికి ఉపయోగించి 'సాధనం'ను 'బొక్కెన' అంటారు. కాని ఆదిలాబాద్ ప్రాంతంలో 'కోరా' అంటారు. ఈ కోర దేశిపదానికి నిఘం టువులో గిన్నె, కల్లుతాగే గిన్నె, తట్ట అనే అర్థాలను ఇచ్చింది.

బావి నుండి నీళ్ళు పైకి తోడుకునే పనిముట్టును గిన్నె లేదా తట్ట వంటి పాత్రయే కదా! అని వివరించాడు. ఈ రకంగా తెలుగు, తెలంగాణ ప్రాంతాలలో ఉచ్చరించే దేశీపదాల బేధ సాదృశ్యాలను అర్థవంతంగా విశ్లేషించారు.

**తెలంగాణ భాష-సంస్కృత పదాలు :**

ఈ వ్యాస సంపుటిని 2019 సంవత్సరంలో వెలువరించారు. సంస్కృత భాష రాజభాషగా, అధికార భాషగా ఉన్నపుడు అది దేశభాషలమీద ప్రభావాన్ని చూపింది. అలాగే తెలుగుభాషలో అనేక సంస్కృత పదాలు మిళితమైనాయి.

'వేలిముద్ర' అనే మాట సమానార్థంగా 'అంగూట్ ఒత్తుడు' ఒత్తుడు అనే సమాసం వాడుకలో ఉంది. అంగూట్ అంటే ఏమిటి అంగుష్టం అనే సంస్కృత పదం నుండి వచ్చింది. దీనికి 'బొటనవేలు' అని అర్థం వేలిముద్రలో ఏ వేలు అనే స్పురణలేదు. వేలు పదం తమిళపదం విరల్ అనే పదం వ్రేలు అయ్యి పిదప వేలుగా మారింది. వేలి ముద్రలో ముద్ర సంస్కృతం పదం. అలాగే అంతరం అనే పదాన్ని తీసుకుంటే దీని అర్థం 'నడిమిచోటు' అని, తెలంగాణాలో ఈ పద ప్రయోగాన్ని గమనించినట్లైతే రెండు అంత్రాల బస్సు, వాడు నాలుగు అంత్రాల ఇల్లు గట్టిండు, వీడు నడు మంత్రపోడు మొదల్కెన మాటల్లో అంత్రమూ అనే పదం సంస్కృత పదమేనని ఎత్తిచూపాడు. మరియు ధ్వనుల మార్పులతో తెలంగాణ వ్యవహారంలో ఉన్న సంస్కృత పదాలు గమనించినట్లైతే జ్ఞాపకం-గ్యాప్కం, దు:ఖం-దుక్కం, దృష్టి-దిష్టి, ధైర్యం-ధైర్యం, ఇలా అనేక పదాలు నిఘంటువులో పొందుపరచబడి ఉన్నాయి.

**సంస్కృత సంయుక్తాక్షరాలు-ద్విత్వాక్షరాలుగా మారడం :**

ఆజ్ఞ-ఆగ్గె, అక్షరం-అచ్చరం, అన్యాయం-అన్నాలం
లగ్నం-లగ్గం, లక్ష్మీ-లచ్చి, ముత్యం-ముత్తెం
ఇష్టం-ఇట్టం, పక్షి-పచ్చి, రాక్షసులు-రాచ్చసులు

ఇలా సంస్కృత పదాలు అనేకం కలిసి తెలంగాణా వ్యవహారంలో కలిసినాయి.

తెలంగాణ ప్రాంతంలో ఉచ్చరించే పోరీ, పోరడు పదాలను వలసవాదులు నిందార్థంలో ఉన్నాయని ఎత్తి

చూపారు. అయితే వీటికి సమానార్థంలో పోర్‌గీ, పోర్‌గా, అనే పదాలు సంస్కృత వ్యవహారంలో ఉన్నాయని అంటారు. ఇక 'సహించు అనే అర్థానికి సైసు అనే పదం తెలంగాణ వాడకంలో ఉంది. ఇది యించు కా గమనం తెలుగు ద్రావిడ భాషల నుండి విడవడుతున్న సందర్భంలో వచ్చింది. నేటికి సహించు అర్థానికి సమానార్థకంగా కన్నడంలో 'ఇసు' వ్యవహరించడం ఈ ప్రాంతంలో ఉందని రచయిత విస్తృతమైన భాషా పరిజ్ఞానంతో ద్రావిడ భాషలోని పదాలు ఏ రకంగా తెలంగాణా భాషలో ఇమిడిపోయాయనే విషయాన్ని వివరించాడు. అంతే గాకుండా తెలంగాణలోని కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో కుక్కను తరిమివేయడాన్ని 'అడీ అడీ' అని వ్యవహరిస్తారు అడీ అంటే తమిళంలో కొట్టు అని అర్థం ఉందని చెప్పాడు. అలాగే పుస్తకాన్ని తెలంగాణాలో వయ్యి అని అంటే మరాఠీలో వహీ అని బెంగాళిలో బయి అని అంటారని, ఈ రకంగా తెలంగాణ భాషలో అర్థవంతమైన అన్య భాషపదాలు చేరాయని నిరూపించాడు. అంతేగాకుండా తెలంగాణాలో ఉచ్చరించే రాండ్రి, పోండ్రీ అనే పదాలు కన్నడంలో రాండ్రికి బదులు బన్రి, పోండ్రికి బదులు హగ్రి అని రావత్తు ( అనేది గౌరవర్థాంలోనూ, బహువచనంలో పిలవడం కనిపిస్తుందని ఆంధ్రులు మాత్రం రావత్తును వదిలేసి రాండ్రికి బదులు రండి పిలవడం ఎంత తప్పిదమో గమనించాలంటాడు. ఈ విధంగా తెలంగాణ భాషలోని అర్థాలను వివరిస్తూ వాడుకలో వాటి భావస్పష్టతను, ఎరుకచేస్తూ శాస్త్రీయంగా ఆ పదాల మూలాలు ఎక్కడ ఉన్నాయో వాటిని తెలియజేశాడు.

**అన్యదేశాలు :**

ఏ భాషలోన్కైన ఆదాన ప్రదానాలు ఉంటాయి. తెలంగాణ ప్రాంతంలో కుతుబ్‌షాహీలు, అసప్‌జాహీలు, పరిపాలన చేయడం వలన తెలంగాణ భాషలో ఉర్దూ, అరబిక్, పర్షియన్ భాషా పదాలు మిళితమైనాయి. తలాయించడం (ఫైచేయడం) చెద్దర్ (బెడ్‌షీట్) పర్ధ (కర్టెన్) సతాయించడం (ఇబ్బందది పెట్టడం) తహసీల్దార్ కార్యాలయం (రెవెన్యు ఆఫీసు) వంటి ఉర్దూ పదాలు అలాగే అమీన్ (ఎస్.ఐ) హరమ్‌కోర్(ద్రోహి) ఇసాబ్ (లెక్క) అవ్వల్‌దర్జాగా( చాలా చక్కగా) శికాయెత్ (ఫిర్యాదు) కాస (స్వయానా) మజాక్(తమాషా) శెర్తు(పందెం) శర్బత్ (నిమ్మరసం) సందూక్ (పెట్టె) ఇనాం (కానుక) వకీలు(ప్లీడర్) మునాప (లాభం) బ్కెస్ (వాగ్వివాదం గొడవ) వంటి ఉర్దూ పదాలు మరియు లాల్ (ఎర్రని) ఖానా( అన్నం) కీసా (జేబు) శికార్ (వేట), శరం (సిగ్గు) దుశ్మన్ (శత్రువు) పరేశాన్-చికాకు వంటి పర్షియన్ పదాలు తెలంగాణ వాడుక భాషలో ఉన్నాయి.

ఈ రకంగా తెలంగాణ పదకోశంలో సామాజిక, చారిత్రక, సాంస్కృతిక, వస్తు సంస్కృతికి సంబంధించిన సమస్త పదజాలాన్ని, ఏర్చి కూర్చినాడు డా॥. నలిమెల భాస్కర్. అస్తిత్వ వేదనలోంచి రూపొందించబడిన తెలంగాణ పదకోశం ఇతర మాండలికాలతో సరిపోల్చ డానికి ఇతర ప్రాంతాలవారు తెలంగాణ భాషను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేలా తెలంగాణ భాష ఔన్నత్యం నిలిపేలా తెలంగాణ పదకోశాన్ని నిర్మించారు.

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1. తెలంగాణ పదకోశం- డాక్టర్ నలిమెల భాస్కర్, తెలంగాణ రచయిత వేదిక జులై 2003, 2010
2. నల్గొండ జిల్లా మండలిక పదకోశం, ఆచార్య రవ్వా శ్రీహరి 1986
3. బాణం(తెలంగాణ భాషను స్థిరీకరించిన వ్యాసాలు) జూలై 2018, తెలంగాణ రచయితల వేదిక.
4. తెలంగాణ భాష దేశ్య పదాలు- డాక్టర్ నలిమెల భాస్కర్, సాహితీ సోపతి, డిసెంబర్ 2017
5. తెలంగాణ భాష సంస్కృత పదాలు -డాక్టర్ నలిమెల భాస్కర్, సాహితీ సోపతి, డిసెంబర్ 2019.
6. తెలంగాణ భాష తమిళ పదాలు- డాక్టర్ నలిమెల భాస్కర్, సాహితీ సోపతి, ఆగస్టు 2020
7. తెలంగాణ భాష సంస్కృత పదాలు- డాక్టర్ నలిమెల భాస్కర్
8. నవనీతం- నగునూరి శేఖర్ సంపాదకత్వం సాహితీ సోపతి, సెప్టెంబర్ 2013

★

# తెలంగాణ కథా ప్రక్రియలో కాలువ మల్లయ్య కథలు

– **జీరెల్లి కృష్ణవేణి,** తెలుగు ఉపన్యాసకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తొర్రూర్.

తెలుగులో అత్యధిక కథలు రాసిన రచయిత కాలువ మాల్లయ్య సాహిత్యమే తనను బతికిస్తుంది. నడిపిస్తుందని హృదయపూర్వకంగా నమ్మి గత నాలుగున్నర దశాబ్దాలుగా సాహితీ సృజన చేస్తున్న అవిశ్రాంత రచయిత. కథ, నవల, కవిత, వ్యాసం, పరిశోధన ప్రక్రియ ఏదైనా మానవతా పరిమళం గుభాళించే రచనలు చేయడం ఈ రచయితకు వెన్నతో పెట్టిన విద్య. ప్రపంచ కథలకే ఆధ్యుడన దగిన గుణాఢ్యుడు. కలం పట్టిన తెలంగాణ( కరీంనగర్ జిల్లా కోటిలింగాల) నుండి వచ్చిన ఈ రచయిత కలం నుండి అనేక ప్రసిద్ధ రచనలు వెలువడ్డాయి.

కాలువ మల్లయ్య గారు ప్రాధమికంగా కథకులు. అదే కాలువ మల్లయ్య గారితో నడుస్తుంది. ఆయన కథల్లో సజీవ పాత్రలు మనతో నేరుగా సంభాషిస్తాయి. తెలుగు బాషలో ఆయన రాసినన్ని కథలు మరే కథకుడు రాయ లేదంటే అతిశయోక్తి కాదు. ఆయన వెయ్యి కథలకు చేరువలో ఉన్నారు. కొవ్వలి వెయ్యి నవలలు రాశారు. కాలువ మల్లయ్య వెయి కథలకు దగ్గరలో ఉన్నారు. ఆయన కథల్లో తెలంగాణ బతుకు చిత్రం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన వాడే భాష, యాస, శైలి అన్నీ ఆయనను ఒక ప్రత్యేక కథకుడిగా నిలుపుతాయి. కథలే కాకుండా తొమ్మిది పదుల తెలంగాణ కథ (వ్యాస సంపుటి)నూట పదేళ్ళ తెలుగు కథ - విభిన్న దొరణులు, తెలంగాణ కథ- తెలుగు కథ, అంటరానితనం అంబేద్కర్, చెప్పుల తయారి, మన జాతిపిత - సంస్కరణ వాది వీరేశలింగం వంటి పుస్తకాలను వెలువరించిన ప్రతిభా వంతులు కాలువ మల్లయ్య.

కాలువ మల్లయ్య గారి కథల్లో అట్టడుగు వర్గాల కష్టాల, కన్నీళ్ళు వారి దుఃఖాలు అన్నీ కనిపిస్తాయి. అనుభవాల నుంచి జీవితాల నుంచి, సమాజ మూలాల నుంచి వచ్చే సాహిత్యమే మంచి, గొప్ప సాహిత్య మవుతుంది. సాహిత్య జీవిత వృక్షానికీ పూసే పువ్వు అన్న కొడవగంటి కుటుంబరావు మాటలు జ్ఞాపకం పెట్టు కోవాల్సిన అవసరముంది అంటారు కాలువ మల్లయ్య. ఇది అక్షర సత్యం. చూసిన ప్రపంచం అనుభవించిన జీవితం, తారసపడ్డ వ్యక్తులు, వ్యక్తుల కష్టాలు, బాధలు అన్నీ సాహిత్యంగా మారుతాయి. అలాంటి సాహిత్యమే నాలు కాలాల పాటు నిలిచి ఉంటుంది. అలా నిలిచి వుండే సాహిత్యాన్నే కాలువ మల్లయ్య గారు భుజాని కెత్తుంటారు. గుండెకు హత్తుకుంటారు.

గురజాడ దిద్దుబాటు కథకు ముందే తెలుగులో కొన్ని కథలు వచ్చాయని కథా నిలయం వారు ప్రచురించిన తొలి తెలుగు కథ (ఏడు అభిప్రాయాలు అనే కథా సంకలనం వల్ల అర్థమవుతుంది. ఈ సంకలనంలో భండారు అచ్చమాంబ రాసిన ధనత్రయోదశి (హిందు సమాజం) 1902 నవంబర్ సంపుటం, స్త్రీ విద్య అనే కథలు అచంట సాంఖ్యాయన శర్మ రాసిన లలిత (కల్పలత 1903 నవంబర్) విశాఖ (కల్పలత 1904) అపూ ర్వోపన్యాసం( కల్పలత 1903 నవబంర్) కథలతో పాటు దిద్దుబాటు (ఆంధ్రభారతి 1910 ఫిబ్రవరి) మాడపాటి హనుమంతరావు హృదయ శల్యం (ఆంధ్ర భారతి జనవరి 1912) కథలున్నాయి. అంటే గురజాడ కథకు ముందు కనీసం ఐదు కథలు వచ్చాయని అర్థమవు తుంది. అయినా గురజాడ కథనే మొదటి కథ అనాల్సిన అవసరమేముంది ? భండారు అచ్చమాంబనో, ఆచంట సాంఖ్యాయన శర్మనో మొదటి కథకులుగా గుర్తిస్తే గురజాడకు జరిగే నష్టమేం లేదు అంటారు మొదటి వ్యాసంలో. ఇక్కడ గురజాడ ప్రతిభను మల్లయ్య గారు తక్కువ చేసి మాట్లాడినట్లుగా మనం భావించకూడదు. చరిత్రను కులంకుషంగా పరిశీలించి తేదిల వారిగా వచ్చిన కథలను ఈ వ్యాసంలో చూపిస్తూ భండారు అచ్చమాంబ రాసిన కథలే తెలుగులో మొదటి కథలని నిరూపించారు. కాలువ మల్లయ్య. అంటే మొదటి కథలు తెలంగాణ నుండే వచ్చాయని మనమిక్కడ గ్రహించాలి.

తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ కథకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇక్కడ కథ సమస్యల నుండే పుట్టింది. కోస్తా, రాయలసీమ ప్రాంతాలలోని కథలకంటే తెలంగాణ కథ భిన్నంగా అన్పిస్తుంది. అందుకు కారణం చారిత్రకంగా కొన్ని వందల సంవత్సరాలుగా ఈ ప్రాంతం లోని ప్రజలు నిత్యం సంఘర్షణలకు లోనవుతూ పరాయి పాలనలో మగ్గిపోవడమే, ఇక్కడి వాతావరణ పరిస్థితులు, సంస్కృతీ సంప్రదాయాలు, జీవనవిధానం, ఆచార వ్యవహారాలు మిగతా ప్రాంతాల కంటే కూడా భిన్నంగా ఉంటాయి. 'పేదరికం, నిరక్షరాస్యత, భూసమస్య, వెట్టి చాకిరి, చాలీచాలని వ్యవసాయం, అణచివేత మొదలైన ప్రాంతీయ సమస్యలు తెలంగాణ కథకు మౌలిక లక్షణాలు' అందువల్లనే తెలంగాణా కథ సామాన్య మానవుని జీవితానికి వాస్తవికతా దర్పనంగా రూపొందింది.

వర్తమానంలో జీవించడానికి చరిత్రను తెలుసు కోవలసిన అవసరం ఉంది. తద్వారా ఆనాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత తరానికి చరిత్ర ఒక ప్రేరణను కలిగిస్తూ మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ రోజు తెలంగాణలో ఏ బస్సు ఎక్కినా, ఏ గ్రామం వెళ్ళినా ఏ మనిషిని కదిపినా ఒక విషాద స్వరంతో, వీరత్వంతో ఏదో ఒక కథ మన కళ్ళకు సాక్షాత్కరిస్తుంది. తెలంగాణ లోని ప్రతి ఇల్లు కథలకు పుట్టిల్లు, ప్రతి జీవితం ఒక కథాలయం, ఇది ఈనాటి తెలంగాణ కథ పరిస్థితి. 'తెలంగాణలో అపారమైన వస్తు సంపద ఉంది ఈనాడు. కాని దానికి తగినంత వాఙ్మయసంపద ఎదగలేదు' ఇందుకు కారణం తెలంగాణ అనేక రంగాల్లో ఎన్నో ఏళ్ళుగా వెనుకబడిన ప్రాంతంగా ఉండటమే. ఇక్కడి ప్రజలు భూమికొరకు, భుక్తి కొరకు, విముక్తి కొరకు పోరాటాలు చేశారు. 'భారత దేశానికే పోరాటాల వారసత్వాన్నందించిన నేల తెలంగాణ, నిరంకుశ నైజాం వ్యతిరేక పోరాటాలు, భూపోరాటాలు తెలంగాణాలో తీసుకొచ్చిన మార్పులు గణనీయమైనవి' ఉద్యమాలు తెలంగాణా రచయితలతో అనివార్యంగా కలం పట్టించి నాయి. తెలంగాణా కథకులెప్పుడు నేలవిడిచి సాము చేయలేదు. వారు అన్ని ఉద్యమాలను, సామాజిక మార్పులను, విధ్వంసమవుతున్న విలువలను, జీవిత సమస్యలను, పల్లెపట్టణాల జీవిత చిత్రణను కథా వస్తువుగా తీసుకుని రాయడం విశేషం.

సమాజ చరిత్ర సాహిత్య రూపం తీసుకున్నప్పుడు అది ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సమాజ చరిత్రతో పాటు మరింత బలంగా ఉంటాయి. సైన్సు, టెక్నాలజీ, పారిశ్రామికీకరణ ద్వారా "అభివృద్ధి" చెందిన వారి పరిణామాల గురించి ఎంతో సాహిత్యం వచ్చింది. ఇది "అభివృద్ధి" తాలూకు మరోవైపును చీకటి కోణాలను చూపే కథలు చాలా వచ్చాయి. తెలుగు నేలలో 150 ఏళ్ళుగా పరిశ్రమలు, రైల్వేలు, భారీ నీటి పారుదల ప్రాజెక్టులు విస్తరిస్తున్నాయి. లక్షలాది మంది నిరాశ్రయు లైనారు. నిరుద్యోగులైనారు. జీవితాలు కోల్పోయారు. నమ్ముకున్న నేలను కోల్పోయారు. శతాబ్దాలుగా నమ్ము కున్న పల్లెలు, గూడేలు వలస పోవడంవల్ల నిర్మానుష్యమై పోయాయి. సిమెంటు దుమ్మువల్ల భూగర్భ జలాలు అడుగంటడంవల్ల, వాగుల రసాయనాలతో కలుషిత మవడంవల్ల పంట భూములు, బీడు వారాయి.

కాలువ మల్లయ్య కథల్ని కొన్ని ప్రత్యేకంగా పేర్కొనడం అవసరం. ఆయన రాసిన 'వెలి' కథ చాకలి వాళ్ళ జీవితం చిత్రిస్తే. 'దొరసాని చీర' కథలో చాకలి వాళ్ళపై భూస్వాములు చేస్తున్న దౌర్జన్యం చిత్రించింది. బట్టలు ఉతకటానికి ఇచ్చిన చీరలోంచి ఒక మంచి చీర ఒక పూట కట్టుకోవడం చూసి, దొరసాని చీర కట్టుకొన్న నువ్వు కూడా నాకు అంటూ దొర చాకలి పడుచును దారుణంగా మానభంగం చేసిన విధానం ఇందులో కనబడుతుంది. ఫ్యూడలిస్టిక్ వ్యవస్థలో వున్న దౌర్జన్యం ఈ కథ ద్వారా కళ్ళకు కట్టించారు. 'అడవికాచిన వెన్నెల' అనే కథలో గొల్లల జీవితాన్ని యదార్థంగా చిత్రించారు. గొర్రెలను ఆదాయ మార్గంగా ఎంచుకోవడంలో ఎన్ని కష్టాలు వున్నాయో వాటిని ప్రాణపదంగా చూసుకుంటూ కాపాడు కుంటానికి ఎన్ని ఇబ్బందులు పడాలో విశ్లేషించిన ఈ కథలో గొల్లల భాష వాస్తవికంగా నిక్షిప్తం చేశారు. 'స్వతంత్ర దినం', 'భూమి కోసం', 'ఓ గొల్లకథ', 'వానరావాలె' లాంటి అనేక కథల్లో తాను పుట్టి పెరిగిన గొల్లల జీవితాన్ని కాలువ

మల్లయ్య సజీవంగా చిత్రించారు. 'ఎదురుచూపు', 'నిరీక్షణ' లాంటి కథల్లో పద్మశాలీల, చేనేత కార్మికుల దీనమైన జీవితం, వలసలు పోవాల్సిన అనివార్యత భీవండికిగాని, గల్ఫ్ దేశాలకు గాని పోయిన క్రమం, పడిన బాధలు, అనుభవించిన వేదన, భీవండిలో జరిగిన మత కలహాల్లో మృత్యువాత పడ్డ యువకులు మొదలైన అనేక చారిత్రక అంశాలు ఈ కథల్లో కనబడతాయి. 'ఊరుమ్మడి బతుకు' కథలో గౌడులు కల్లమ్ముకుంటూ బతికే జీవితంలోని విషాదం, దొరలు వాళ్ళపై చేస్తున్న దౌర్జన్యం, వాళ్ళు పడుతున్న అవమానాలు వృత్తిలోని సాధక బాధకాలు చిత్రించారు. కుమ్మరి కులవృత్తిలో ఎదుర్కొన్న సమస్యలు గురించి 'ఈ భూమినాది' కథలో కుమ్మరి బ్రతుకుల యదార్థ జీవిత యదార్థ గాథ చిత్రించారు. తన భూమిలో కుండలు చేసుకుంటానికి మట్టిని తవ్వు కోవడానికి కూడాహక్కు లేని దుర్మార్గపు పద్ధతి చిత్రించడం జరిగింది. అలాగే పరాధీన కథలో చేనేత కులం నుంచి ఒక అమ్మాయి మూడు తరాల్లోని కూతురుగా, భార్యగా, తల్లిగా ఒక్క పట్టుచీరను కొనుక్కోలేని దుస్థితిని వర్ణించడం జరిగింది. అయితే చేపలమ్ముకోవడంలో వాళ్ళను హీనంగా చూడటంలాంటి అనేక విషయాలు ఇందులో కనబడతాయి. అడ్డాల నాడు కథలోను, 'గోరుకాలు' కథలో మంగళి వారి జీవితం చిత్రణ వుంది. కొడుకును చదివిస్తే పైకి వస్తాడనుకొని చదివించిన తర్వాత తనకు కాకుండా పోయిన దీన దృశ్యాలు ఈ కథల ద్వారా తెలుసుకోవచ్చు. మంగళి వృత్తిలోని విషాదాన్ని, వాళ్ళను హీనంగా చూడడాన్ని ఈ కథలో చూడవచ్చు.

కాలువ మల్లయ్య గతాన్ని ప్రేమిస్తారు. అంబేద్కర్ ను అభిమానించినప్పటికీ ఆయనది మౌలికంగా గాంధీ మార్గం. గాంధీజీ వలె కాలువ మల్లయ్య పల్లెలను ప్రేమిస్తారు. కులవృత్తులను ప్రేమిస్తారు. పట్టణాల నుండి, నగరాల నుండి తిరిగి గ్రామాలకు వెళ్ళాలని తన కథల్లో పిలుపునిస్తారు. గ్రామం ప్రశాంతంగా వుంటుందని, పర్యావరణం, చక్కని ప్రకృతి, మానవీయ సంబంధాలు వుంటాయని తన దళిత, బహుజన కథల్లో చిత్రించారు.

ఆడెపు లక్ష్మిపతి 'త్రిభుజపు నాల్గోకోణం' కథలో పద్మశాలి జీవితాల్లో కులవృత్తులు కోల్పోయి అనేక ఇతర వృత్తులు, వ్యాపారాలు చేపట్టి, నష్టాలు సంభవించి జీవితాలు, కుటుంబాలు ఎలా శిథిలమవుతూ వస్తున్నాయో చిత్రించారు. బీసీ కులాల నుండి మధ్య తరగతిగా ఎదుగుతున్న జీవితాలలోని సంఘర్షణను, సంక్లిష్టతను శిల్ప వైవిధ్యంతో చిత్రిస్తున్నారు. 'అసందిగ్ధ కర్తవ్యం'లో కుల మతాల కారణంగా ప్రమోషన్ ఇవ్వాల్సి ఉ ండగా ఇవ్వకుండా అడ్డుకుంటూ అగ్రకులాల వాళ్లు, అధికారులు ఎలా వక్రమార్గాలు పడతారో, తద్వారా బాధితుల మానసిక సంఘర్షణ ఎలా ఉంటుందో చిత్రించారు. 'విధ్వంస దృశ్యం' కథలో నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాలు, గ్లోబలైజేషన్ పరిణామాల్లో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ విలువలు చిత్రించారు.

సాహిత్యానికి సమాజానికి మధ్య ఎప్పుడూ విడదీయరాని సంబంధమే ఉంది. సమాజం లేకుండా సాహిత్యం లేదు. ఏ కాలంలోని సమాజం గూర్చి తెలుసుకోవాలన్నా ఆ కాలంలో వెలువడిన సాహిత్యమే ఎక్కువ ఉపయోగపడుతుందన్నది నిజం. అందుకే సమాజ దర్పణం సాహిత్యమన్నాడు మాక్సిమ్ గోర్కీ. సాహిత్య గ్రంథాల ఆధారంగానే ఆంధ్రుల వేయేళ్ళ చరిత్రను 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'గా రాసాడు సురవరం ప్రతాపరెడ్డి గారు. మంత్రాలకు చింతకాయలు రాలనట్టు కేవలం సాహిత్యం వల్లే సామాజిక మార్పు సాధ్యం కాకున్నా సామాజిక మార్పు కోసం అన్ని శక్తులూ కేంద్రీకరించుకోవడానికి నైతికంగా మరింత ఐక్యంగా నిలబడటానికి సాహిత్యం ఉపకరిస్తుంది.

వాళ్ళు కోరిన విశ్వమేదైనా, వాళ్ళు కాపాడదలచుకున్నదే వర్గ ప్రయోజమైనా మన ప్రాచీనులు విశ్వశ్రేయస్సు కోసమే కావ్యమన్నారు ఏదో విధంగా విశ్వ శ్రేయస్సు నాశించిన కావ్యాలే కాల గర్భంలో కలిసిపోకుండా నిలిచాయి. మొదటి తరంలో తెలంగాణ నుంచి తక్కువ కథలే వచ్చినా వచ్చిన కథలన్నీ సమాజ శ్రేయస్సును, మార్పునభిలషిస్తూ వచ్చినవే. సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి రంగాచార్య, కాళోజీ, తిరునగరి, సురమౌళి,

యశోదారెడ్డి, సి.వి.కృష్ణారావు, పొట్లపల్లి రామారావు లాంటి వాళ్ళెంతో మంది తెలంగాణ కథను అభ్యుదయ పథంలో నడిపించారు.

తెలంగాణ ప్రత్యేక పరిస్థితులకు, సంఘర్షణలకు, పోరాటాలకు, గ్రామాల్లో వస్తున్న మార్పులకు ప్రతిస్పందన గానూ చక్కని కథలొస్తున్నాయి. తాడిగిరి పోతరాజు, బి.యస్.రాములు, అల్లం రాజయ్య, వుప్పల నరసింహం, దేవరాజ మహారాజు, కాలువ మల్లయ్య, భూపాల్ లాంటి ఎంతోమంది రచయితలీ పనిని సమర్థవంతంగా నిర్వ హిస్తున్నారు. ఇలా తెలంగాణ కథ సామాజిక నిబద్ధతకే పెద్దపీట వేస్తూ అన్ని కోణాలనూ స్పృశిస్తున్నది. అన్ని రకాల ప్రజా జీవితాలకూ స్వంతం చేసుకుంటుంది. అన్ని వస్తువు లనూ కథా సత్తువుగా స్వీకరించింది. గ్రామీణ జీవిత చిత్రణ, పల్లెసీమల సౌందర్యాలు, పల్లె ప్రజల ఆత్మీయానురాగాలు, పోరాటాలు, ఆరాటాలు, మారుతున్న విలువలు, జరుగుతున్న సంఘర్షణ అన్నీ తెలంగాణ కథల్లో చోటు చేసుకున్నాయి. సామాజిక బాధ్యతను గుర్తెరిగి రాసే రచయిత తన కథలు ఏ ప్రజల దగ్గరికయితే పోవాలని కోరుతాడో ఆ ప్రజల యొక్క భాషను స్వీకరింపక తప్పదు. మాండలిక భాషా రచనలకు అత్యధిక ప్రాచుర్యం గత పది, పదిహేనేళ్ళ నుంచి వచ్చినా మాండలిక భాషలో రచనలు రావడం మనకెప్పుడో మొదలైంది. మాండలికం గురించి ఇప్పటికే చర్చలు జరుగుతుండటం చూస్తుంటాం. తెలంగాణ రైతాంగ పోరాట కథను సుసంపన్నం చేసారు.

తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమ కథలను విరివిగా రాస్తున్నాడు అల్లం రాజయ్య. ఈతని కథలను ఉద్యమ కథలకు ప్రతినిధి కథలుగా చెప్పవచ్చు. తెలంగాణ పోరాట కథ ఒరవడిని ముందుకు తీసుకెళు తూ ఉద్యమ కథను సుసంపన్నం చేసిన వాళ్ళు బి.యస్.రాములు,రామ్మోహన్ రాజు, వుప్పల నరసింహం, సాహు, గోపి, రఘోత్తమరెడ్డి, కాలువ మల్లయ్య, యాదగిరిలాంటి వాళ్ళెంతోమందున్నారు. తెలుగు కథను ఉద్యమ కథగా మళ్ళించడమే భూషణం, అల్లం రాజయ్యలు సాధించిన కథా విప్లవం. ఇలా తెలంగాణ కథ సామాజిక నిబద్ధతకు ఎప్పుడూ దూరం కాలేదు. కథా రచయితలు సాహిత్య ప్రయోజనాన్నెప్పుడూ మరిచిపోలేదు.

కాలువ మల్లయ్య తరువాత ఉధృతంగా కథలు రాసిన వారిలో కె.వి.నరేందర్ ఒకరు యువరచయితల్లో ఆయన రాసినంత వస్తు వైవిధ్యం, శిల్ప వైవిధ్యం మరొకరిలో కనపడదు. అమ్మ గురించి విభిన్న కోణాల్లో 14 కథల్లో "అమ్మ" కథల పుస్తకం వెలువరించారు. సైనికుల జీవితాల గురించి 5 కథలతో యుద్ధం కథల సంపుటి వెలువరించారు. బాల కార్మికుల గురించి 5 కథలతో బురదలో జాబిల్లి కథల సంపుటి వెలువరించారు. 15 కథలతో పల్లెల్లో శిథిలమౌతున్న వృత్తుల గురించి వారి జీవితాల గురించి కాలుతున్న పూలతోట కథల సంపుటిలో గ్రామీణ సమాజంలో వస్తున్న పలు పరిణామాలను అద్భుతంగా చిత్రించారు.

సామాజిక దృక్పథంతో బహుముఖాలుగా విస్తరిస్తున్న కె.వి.నరేందర్ కథలు : ఒకే విషయంపై ఒకే వస్తువు గురించి వివిధ పార్శ్వాల గురించి నాన్న కథల సంపుటిని వెలువరించారు. కె.వి.నరేందర్ నాన్న గురించి నాన్న కథల సంపుటిలో మ్యాచ్ ఫిక్సింగ్, కొడుకు నేర్పిన పాదం, మట్టి మనసు, డియర్ ఫా, నాన్న డైరీ, డాడీ డాడీ, తెగిపోయిన పాట, నాన్నని పంచుకుందాం, నాన్నగది, నాన్న తప్పిపోయాడు మొదలైన కథలలో గత పదేళ్ళలో నాన్న కుటుంబంలో ఎదుర్కొంటున్న సమస్యలను

నాన్నా స్థానాన్ని చిత్రించిన తీరు, సామాజిక పరిణామక్రమాన్ని చరిత్రను చిత్రించిన తీరు అపూర్వం . తెలుగు సాహిత్యంలో ఈ పని మరెవరూ చేయకపోవడం రచయిత దృక్పథాన్ని చెప్పకనే చెప్పుతుంది.

అయితే కొందరికి ఉద్యమ కథలు తప్ప మిగతావి కథలేకావు. మరి కొందరి దృష్టిలో ఉద్యమ కథల్లాంటివి కథలే కావు. ఈ రెండు ధోరణులూ తప్పే సామాజిక నిబద్ధతతో రాయబడిన ఏ కథయినా మంచి కథే అవు తుంది. సమాజాన్ని ప్రతిబింబించేది కథయినప్పుడు ఆయా ప్రాంతాల్లో వస్తున్న ఉద్యమాలు పట్టించుకోకుండా ఉండటం సామాజిక బాధ్యత గుర్తెరిగిన రచయితకెలా

కథావస్తువు కానక్కర్లేదు. ఒకప్పటికి ఇప్పటికి తెలంగాణ లాంటి ప్రాంతాల్లోనూ మధ్య తరగతి గణనీయంగా పెరిగింది. వాళ్ళ సమస్యల స్వరూపమూ మారింది. గ్రామాల్లో రకరకాల సంఘర్షణుంది. వివిధ ఉద్యమాల ప్రభావమూ ఉంది. ఇవన్నిటినీ పట్టించుకొని కథలు రాయాల్సిన అవసరముంది. రాస్తున్నారు కూడా. సామాజిక మార్పును అభిలషిస్తూ ఈ విషయాలన్నిపై వచ్చే కథలూ మంచి కథలే అవుతాయి.

అలాగే స్త్రీవాదం, దళిత వాదం ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో బలమైన పునాదులతో ముందుకొస్తున్నాయి. స్త్రీవాదమంటే పురుష ద్వేషమనో, దళిత సాహిత్యం దళితులే రాయాలనో కాకుండా వాటి ఉద్దేశాన్ని, అవసరాన్ని గుర్తిస్తే ఆయావాదాలకు మద్దతుగా మరెన్నో గొప్ప కథలు వచ్చే అవకాశముంది. సామాజిక నిబద్ధత కల్గిన రచనలంటే రా.వి. శాస్త్రిగారు చెప్పినట్టు 'అయ్యో అయ్యో' కథలు మాత్రం కావు. వీలైతే పరిష్కారాన్ని చూపడం కూడా అవసరం. అట్లని వాస్తవ విరుద్ధమైన, ఆవేశ పూరితమైన పరిష్కారాలను చూపడమూ సరి యైంది కాదు. ఇప్పుడు తెలంగాణ కథ భాషా పరంగానూ, విషయ పరంగానూ నిబద్ధతతోనే వస్తుంది. ఏ భాషా సాహిత్యానికి తీసిపోని మంచి కథలెన్నో తెలుగులో వస్తున్నాయి. సామాజిక నిబద్ధత ధ్యేయంగా వచ్చిన తెలుగు కథా సాహిత్యాన్నంతా ఒక గుది గుచ్చినట్టు పేర్చుకుంటూ పోతే ఆ కథలతో తెలుగు ప్రజల సామాజిక చరిత్ర రాయొచ్చుననేది అక్షరసత్యం. ఇప్పుడు వస్తున్న తెలుగు కథ మరింత వస్తు వైవిధ్యాన్ని సంతరించుకొని ఇదివరకెప్పుడూ స్పృశించని విషయాలను స్పృశిస్తూ వస్తున్నదన్నమాట నిజమే. ఈ దశాబ్దంలో ఉదృతంగా కథలు రాసిన వారిలో కాలువ మల్లయ్య ప్రథములు. ఇప్పటివరకు 1000 పైగా కథలు రాసారు. ఇందులో ఆంధ్రప్రభ దిన పత్రికలో వచ్చిన అవ్వతోడు గిది తెలంగాణా, ప్రజాతంత వార పత్రికలో వస్తున్న తెలంగాణా మట్టి కథలు, ఇంకా తన కథల్లో విద్యార్థుల చదువుల సమస్యల గురించి, స్త్రీల సమస్యల గురించి సగటు మధ్య తరగతి మనిషి గురించి, కార్మికుల గురించి, వ్యవసాయ దారుల గురించి, తెలంగాణా గురించి, మేధావుల గురించి, దళితుల గురించి, మానవ సంబంధాల గురించి, విప్లవవాదం గురించి కథలు రాసారు.

వలస బతుకుల వ్యథలు: డబ్బు సంపాదించుకొని వచ్చిన తర్వాత మస్కట్ మల్లయ్యను అందరు గౌరవిస్తూ తమను కూడా అరబ్బు దేశాలకు పంపుమని కొరుతుంటే మస్కట్ మల్లయ్య తాను కోల్పోయిన యవ్వనాన్ని పడ్డ కష్టాల్ని ఎవరూ గమనించకపోవడం గురించి ఆవేదనని చిత్రిస్తుంది. కర్రోడు కథలో నలుపు వల్ల సమస్యలు ఎదుర్కొంటూ ఎదిగిన తర్వాత తాను తమ హోదాతో, అహంతో ఇతరులను తిరిగి కష్టపెట్టే తీరును చిత్రించింది. నా తెలంగాణా కథలో చెప్పులు కుట్టే మాదిగలోని చైతన్యాన్ని హీన వ్యక్తిత్వంతో బతికే ఇంజినీర్ ని తెలంగాణా ఉద్యమ పరిణామాలను చిత్రించారు. ఆస్థి ఉందని నమ్మిస్తేనే కొడుకులు, కోడళ్లు, బిడ్డలు చివరిదాకా మంచిగా చూసుకుంటారని నమ్మిన వృద్ధు రాలు గిల్టునగలను అసలు నగలుగా నమ్మకం కలిగించి సుఖంగా వెళ్లిపోయిన తీరును అమ్మమీది సొమ్ములు కథలో చిత్రించారు. భద్రత యుద్ధభూమి కథల్లో తెలంగాణా మధ్యతరగతి జీవితానికి భద్రత లేదని యుద్ధభూమిగా పరిణమిస్తున్నదని చిత్రించాయి.

గత దశాబ్దంలో 200ల పైగా కథలు రాసిన కాలువ మల్లయ్య కథలకు ఒక జీవనది. ఆయన కథల గురించి ఒక ప్రత్యేక అధ్యయనం అవసరం. 1990 నుండి కాలువ మల్లయ్య కథలు వివిధ సంకలనాల్లో 25 దాకా చేరాయి. ఇన్ని సంకలనాల్లో ఇన్ని కథలు చేరిన రచయిత కాలువ మల్లయ్యగారొక్కరే. సుమారు 12 పిహెచ్. డిల్లో కాలువ మల్లయ్యగారి కథలు పరిశీలనాంశాలై పోయాయి. పైన పేర్కొన్న సమీక్షకులు కాలువ మల్లయ్య పదేళ్ళ కథల కృషిని వాటి వైవిధ్యాన్ని పట్టుకోలేకపోయారు. ఇది వారి కొంచెపు బుద్ధిని తెలుపుతుందే తప్ప జ్ఞానాన్నికాదు. తెలంగాణ కథా సాహిత్యంలో కాలువ మల్లయ్య-కె.వి.నరేందర్ సామాజిక వైవిధ్యం: కాలువ మల్లయ్య స్త్రీల సమస్యల గురించి గలుమ, నిరీక్షణ, దగా దగా మొదలైన కథలను, సగటు మధ్యతరగతి గురించి జీవచ్ఛవం,

అల్లమురబ్బా, చావు మొదలైన కథలను, కార్మికుల జీవితాల గురించి ప్రస్థానం, మళ్లీ తల్లి ఒడిలోకి, అన్న కథలను, వ్యవసాయం చేసే రైతుల గురించి సృష్టికర్త అనేదాని నేలతల్లి సృష్టి కర్తలు చిరునామా, టెలిఫోన్ పల్లె వలసల గురించి అడవిగాచిన మల్లయ్య, బోధి వృక్షం, మస్కట్ మల్లయ్య కథలను, మేధావుల తీరు తెన్నుల గురించి గుప్పెడు నా తెలంగాణ, ఎంగిలిచేలో, అగ్ని అంశం, మానవ సంబంధాలు, ఆర్థికాంశాల గురించి నిరుడు కురిసిన హిమ సమూహములు, రూపాయి రూపాయి, అమ్మ మీది సొమ్ములు, విప్లవం గురించి ఆంబోడు, భద్రత, యుద్ధభూమి

మొదలైన కథలను రాశాడు. వస్తు విస్తృతిలో కాలువ మల్లయ్య తెలుగు సాహిత్యంలో అనేక కథలు రాశారు, రాస్తున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. కాలువ మల్లయ్య, అడవి గాచిన వెన్నెల, కాలువ మల్లయ్య కథా సంపుటి, 1999
2. కాలువ మల్లయ్య, అడవి గాచిన వెన్నెల, కాలువ మల్లయ్య కథా సంపుటి.
3. కాలువ మల్లయ్య, ధిక్కారం, అభ్యుదయ పత్రిక, ఫిబ్రవరి, 1989,
4. కాలువ మల్లయ్య, దొరసానిచీర, ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు? కథా సంపుటి, 1991

★★★

# జీవితం బ్రతుకు లోతును చిత్రించిన బి.ఎస్. రాములు కథలు

– **డా॥. సంగాల కోమల,** అధ్యాపకులరాలు, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు.

ప్రతి మనిషికి బతుకు అంటే ఒక పోరాటం, ఆ పోరాటంలో ఎన్నో కష్టాలు, ఎన్నో ఇబ్బందులు ఎదురైనా, ధైర్యం అనే ఆయుధంతో ఏదో సాధించాలనే తపనతో జీవితాన్నే గెలుచుకోవాలనే ఆశావహ దృక్పథంతో అక్షరాన్ని ఆయుధంగా మలుచుకొని అనేక రచనలు చేస్తూ అనేక మంది ఆదర అభిమానాలు సంపాదించుకున్న గొప్ప సాహితీవేత్త బి.ఎస్. రాములు గారు. సంపాదకుడిగా, సిద్ధాంతకర్తగా, కథకుడిగా, నవలాకారుడిగా, ఉద్యమ కారుడిగా అనేక కోణాల్లో ప్రతిభ చూపించిన ప్రజ్ఞాశాలి బి.ఎస్. రాములు గారు. సాహితీ కృషీవలుడు మాత్రమే కాదు, నిత్య కృషీవలుడు. 75 ఏళ్ల వయసులో కూడా చెరగని చిరునవ్వుతో మనసునిండా ఆత్మీయతతో ఎంత ఎదిగినా, ఒదిగి ఉండాలనే సూక్తికి నిలువెత్తు నిదర్శనంలా ఎప్పుడూ హంగులు, ఆర్భాటాలు లేకుండా నిరాడంబరంగా కనిపిస్తూ మనసుకు హత్తుకునే మాటలతో పలకరిస్తాడు. సామాజిక, సాహిత్య, తాత్విక రంగాల్లో ఎన్నో సేవలను అందించడమే కాకుండా తెలంగాణ ప్రజల యొక్క జీవన విధానాన్ని, సంస్కృతిని ప్రతిబింబించేలా అనేక రచనలు చేశారు. అంతేకాకుండా తెలంగాణ సాధనలో భాగంగా అనేక ఉద్యమాల్లో ముందుండి బంగారు తెలంగాణ నిర్మాణ సాధన కోసం నిరంతరం శ్రమించి, తెలంగాణ కల సహకారంలో తనవంతు బాధ్యతను ప్రదర్శించిన తెలంగాణ ఉద్యమ శీలి, సాహితీ దిగ్గజం బి.ఎస్. రాములు గారు నేటి యుగానికి, సాహితీవేత్తలు అందరికీ స్ఫూర్తి దాయకుడు, ఆదర్శప్రాయుడు బి.ఎస్. రాములు గారు.

బి.ఎస్. రాములు గారి 75వ జన్మదిన వేడుకల్లో భాగంగా బి.ఎస్. రాములు గారి కథలు "చికాగోలో నానమ్మ" కథ సంపుటిని పరిశీలించి వ్యాసం రాయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. బి.ఎస్.రాములు గారు కథలు సమాజానికి చాలా దగ్గరగా మానవీయ సంబంధాలకు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తాయి. ఈ పుస్తకంలోని ఒక్కో కథ ఎంతో ఆలోచింపజేసేదిగా మనసు లోతుల్లో దాగిన జీవిత సత్యాలను బయటపెట్టేవిగా ఉన్నాయి, ఆధునిక జీవన విధానం మనుషుల్లో అన్ని సంబంధాలను తెంపివేయడమేగాక, మానవీయ సంబంధాలను దెబ్బతీసి మనిషికి మనిషికి మధ్య అగాధాన్ని సృష్టిస్తుంది. మానవ జీవన విధానంలో మానవ సంబంధాలన్నీ క్రమం దెబ్బతింటున్నాయి అంటూ కవి ఆర్ద్రంగా, ఆత్మీయంగా రాసిన కథా సంపుటి "చికాగోలో నానమ్మ" ఈ కథా సంపుటిలోని కథల్లో ప్రత్యక్ష జీవితానుభవాలు తడిమిన జీవితాలు ఆధునిక మానవ జీవితంలోని సామాజిక సంబంధాలు, కుటుంబ సబంధాలు, మానవీయ సంబంధాలు, మానవ స్వభావాలు ఉన్నాయి. బి.ఎస్. రాములు కథలు యదార్థమైన పాత్ర చిత్రణతో ఉంటూ, జీవితాన్ని స్పష్టంగా చూపించినట్లే ఉంటాయి. ఈ కథలు ఊహల్లో, కల్పనల్లో పుట్టినట్లు కాకుండా జీవిత అనుభవాల్లో నుంచి పుట్టినట్లే అనిపిస్తాయి.

## చికాగోలో నానమ్మ :

"చికాగోలో నానమ్మ కథ"లో భూదేవి పాత్ర ద్వారా తను పుట్టి పెరిగిన ఊరు పట్ల ఉన్న ప్రేమను ఆత్మీయతలు అనుబంధాల యొక్క గొప్పతనాన్ని బి.ఎస్. రాములు గారు వ్యక్తం చేశారు. భూదేవి కొడుకు, కోడలు, మనమడు, మనమరాలు వీరంతా చికాగోలో ఉద్యోగం చేస్తూ స్థిరపడిపోయి భూదేవిని కూడా అక్కడికే తీసుకెళ్లి గ్రీన్‌కార్డు కూడా ఇప్పిస్తారు. కానీ భూదేవికి మాత్రం చికాగోలో ఉండడానికి ఇష్టం లేక తన ఊరును బంధువులను గుర్తు చేసుకునేది.

"ఉన్న ఊరు కన్నతల్లితో సమానం" అన్నట్లు "తన జీవితమంతా అక్కడే గడిచింది". చావు కోసం ఎదురు

చూడడం తప్ప ఇక్కడేముంది, అక్కడైతే చుట్టాలు బంధువులు అందరూ ఉంటారు. వాళ్ళంతా ఎలా ఉన్నారో చూడాలని అనిపించింది భూదేవికి, ఇక్కడ ఉంటే ఏమి తోస్తలేదు ముచ్చట పెట్టడానికి ఎవరూ లేరు, గంప కింద కోడిని కమ్మినట్లు, ఇండ్ల దిండ్లనే తిరగాలి అనుకుంటూ బాధపడేది. నానమ్మ గతాన్ని తలచుకొని బాధపడుతుందని గ్రహించిన మనమరాలు స్వప్న ఇండియా గురించి నీకు యాదికున్నది అంతా చెప్పు నేను టీవీ సీరియల్ తీస్తా. ఇక్కడ ఒక అసోసియేషన్ పెట్టిన కష్టపడి పైకి వచ్చిన వారి జీవితాలను రికార్డ్ చేసి భవిష్యత్ తరాలవారికి తెలియజేస్తా అన్నది. గడిచిన కష్టాలు గతం జ్ఞాపకం చేసుకుంటే బాగానే ఉంటుంది. కానీ అనుభవాలు ఎదురైతే భరించలేమంటాడు మనవడు భరత్. భూదేవి ద్వారా స్వప్న తెలుసుకున్న గతంలో పేదరికం కష్టాలు, కొట్లాటలు చిన్న కొడుకు ప్రభాకర్, కోడలు సుశీల ఆశ్చర్యపోతారు. ఇవన్నీ స్వప్నకు ఎందుకు చెప్పినావే అమ్మ అని కొడుకు ప్రభాకర్ ప్రశ్నించిన విధానంలో మానవుల నైజాన్ని కవి గారు నిరూపించారు". నిజానికి కష్టాలతో కన్నీళ్ళతో ఒడిదుడుకులతో ఎదిగిన మనుషులు తర్వాత కష్టాలను బాధాలను తలచుకోవడానికి ఇష్టపడకపోగా ప్రతిదానికి తమ స్వయంకృషి అని గర్వపడుతూ ఉంటారు. నేటికాలంలోని యువత స్వభావానికి అద్దం పట్టేలా ఉంది కథ. పుట్టి పెరిగిన ఊర్లో అనేక సౌకర్యాలను పొంది, విద్య ద్వారా జ్ఞానాన్ని పొంది, ఎన్నో ఉన్నత విద్యల్ని అభ్యసించి, మన జ్ఞానాన్ని మన శ్రమను మన దేశానికి కాకుండా పరాయి దేశ అభివృద్ధికి ఉపయోగించే యువత స్వభావం ఈ కథలో కనిపిస్తుంది. డబ్బు కోసం, పేరు కోసం పాశ్చాత్య దేశాలలో యాంత్రిక జీవితాన్ని అనుభవిస్తున్న మరమనుషులకు ఈ కథ ఉదాహరణగా నిలుస్తుంది. కానీ భూదేవి మాత్రం తన జీవిత చివరి క్షణాల్లో కూడా తన సొంత ఊరిలో ఉండాలని భావించి తన ఊరు గురించి, బంధువుల గురించి, తన ఊరిలో జరుపుకునే పండుగలు గురించి, ఆలోచిస్తూ తన గతాన్ని ప్రేమిస్తూ ఉంటుంది. కానీ కొడుకు, కోడలు, మనుమడు మాత్రం గతాన్ని వదిలేయమంటారు. కానీ గతం లేకపోతే వర్తమానమే లేదని సత్యాన్ని వారు మర్చిపోయి యాంత్రిక జీవితానికి అలవాటు పడిపోయి మానవ సంబంధాల గొప్పతనం తెలియక ఆ విధంగా మాట్లాడుతున్నారని భూదేవి చాలా బాధపడుతుంది. కొడుకు, కోడలుకు మానవ సంబంధాల విలువ తెలిసినప్పటికీ మరమనుషుల్లా తెరచాటునే బ్రతికిస్తున్నారని ఎంతో ఆవేదన చెందుతుంది.

**పాత చీర :**

'పాత చీర' కథలో సమాజంలో రోజురోజుకీ పతనమవుతున్న మానవ సంబంధాలను గూర్చి, కాలగర్భంలో కలిసిపోతున్న మానవీయ విలువల గురించి బి.ఎస్.రాములు గారు కథలో తెలియజేశారు. ఈ కథ చదువుతున్నంత సేపు ఒకప్పటి కుటుంబ పరిస్థితులు ప్రస్తుత మారుతున్న కుటుంబ పరిస్థితులు కళ్ళ ముందు కదలాడాయి. ఒకప్పుడు ఇంట్లో అత్తమామలు పెత్తనం పెద్దరికమే ఉండేది, కానీ పరిస్థితులు అన్నీ మారిపోయి ఇంటి యజమానులుగా ఉండవలసిన వారు పేరును పెత్తనాన్ని పెద్దరికాన్ని కోల్పోయి, ఇంట్లో మూలన పడి ఉంటున్న దయనీయ స్థితిని కవి కథలో చూపించారు. "ఈ కథలో రాజేశ్వరమ్మ లింగయ్య ప్రధాన పాత్ర ధారులుగా కనిపిస్తారు. రాజేశ్వరమ్మ మేనమామ వీరయ్య చిన్నకోడలు కళావతి చిన్న కొడుకు విశ్వనాథం మొదలైన పాత్ర నన్ను ఎంతో ఆకర్షించాయి. ఇంట్లో ఉండే "పాత సామానుకు విలువ లేనట్టే, పాత మనుషులకు కూడా విలువ" లేని పరిస్థితులు కవి కథలో వివరించారు. ఒకప్పుడు మన చుట్టాలు, బంధువులు, ఎవరో మన పెద్దవారు తరతరాల వారికి తెలియజేసేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా చూస్తే ఎవరికి ఏమవుతారో తెలియని పరిస్థితి". కాలక్రమేణా చుట్టాలంతా పాత చుట్టాలుగా మారిపోతున్నారు. కుటుంబంలో ఉండే పిల్లలకు బంధాలు, సంబంధాల విలువ తెలియకుండా పోతుంది. ఎవరికి ఏమవుతారో వావి వరుసల్ని కూడా తెలుసుకోలేని పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయి.

ఆడపిల్లలకు సంబంధాల కోసమో, లేదంటే ఏదైనా పెళ్ళిళ్లకు, శుభకార్యాలకు, వేడుకలకు తప్ప బంధువుల జాడ కనిపించదు. మన వారెవరో, పరాయి వారెవరో తెలుసుకోలేని అజ్ఞానంలో జీవిస్తున్న కాలమాన పరిస్థితులు ఈ కథలో కనిపించాయి.

రాజేశ్వరమ్మ చిన్న కోడలు కళావతి ఇల్లు శుభ్రం చేస్తుండగా అటవ మీదున్న పాత సూట్‌కేసు విరిగిపడి అందులో నుంచి పాత చీర బయటపడింది. ఆ చీరను చూడగానే రాజేశ్వరమ్మకు ఎన్నో జ్ఞాపకాలు కళ్ళముందు కదలాడాయి. నిజానికి ఇంట్లో ఉండే పాత సామాను అంటే పెద్ద వాళ్ళ అనుభూతులు, అనుభవాలు, జ్ఞాపకాలు. కానీ నేటి సమాజంలో వారు పాత సామాను అంటే పనికిరాని సామనుగా భావిస్తారు. చిన్న కోడలు కళావతి ఇంట్లో పాత సామానంతా పనికిరాదని భావించి, బయట పడేసినప్పుడు వారి అనుభూతులు, అనుభవాలు జ్ఞాపకాలన్నీ ఎవరో ఊడ్చిపారేసినట్టు అనిపించాయి. రాజేశ్వరమ్మ ఆ పాత విరిగిపడిన సూట్‌కేసులో నుండి పాత చీరను తీసి చేతిలో తీసుకొని ఎంతో మురిసిపోయింది. ఎన్ని చీరలు ఉన్నా ఆ చీర అంటే రాజేశ్వరికి ఎంతో ఇష్టం. ఆమె మేనమామ వీరయ్య స్వయంగా తన చేతులతో నేసి ఇచ్చిన 60 నెంబర్ 9 గజాల జరీ చీర. ఎన్నో పండుగలకు, పెళ్లిళ్లకు, వేడుకలకు ఆ చీర కట్టుకున్నది, ఆ చీర నేడు పాతబడిపోయింది. వారిలాగే చీర కూడా ఎవరికీ పనికిరాకుండా పోయిందని రాజేశ్వరమ్మ బాధపడింది. ప్రస్తుత సమాజంలోని కోడళ్లకు వస్తువులు పాత పడ్డట్టే, మనుషులు కూడా పాతబడి పనికి రాకుండా పోతున్న పరిస్తితులు ఈ కథలో కన్నీళ్లు తెప్పించాయి. రాజేశ్వరమ్మ మేనమామ వీరయ్య అనారోగ్యంతో ఉన్నానని హాస్పిటల్లో చూపించి మందులు ఇప్పించమని అడిగినప్పుడు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితికి రాజేశ్వరమ్మ ఎంతో దుఃఖించింది. ప్రస్తుతకాలంలో ప్రతి దానికి డబ్బు ముడిపడి ఉంది. మేము మా కుటుంబం అని స్వార్థంతో, గిరిగీసుకొని బ్రతుకుతున్నారు. కుటుంబంలో కొత్త వ్యక్తులకు స్థానం లేదు. జీవితం అనేది స్వార్థమయమై పోయిన విధానం కథలో కనువిప్పు కలిగించింది. మనిషికి మనిషే సహాయం చేసుకోలేని స్థితిలో నేడు మనం జీవిస్తున్నాం. తన పుట్టు వెంట్రుకలు తీసిన మేనమామ, తన కాళ్లకు వెండి గొలుసులు చేయించిన మేనమామ, తన పెళ్లి ముందుండి జరిపించిన మేనమామ, ఇండ్లల్లోకి వచ్చినప్పుడు తొమ్మిది గజాల జరీ చీరలు నేసి ఇచ్చిన మేనమామ ఈరోజు దీనంగా సహాయం కోసం అర్థిస్తుంటే జాలి వేసింది. మామయ్య నేసి ఇచ్చిన చీర పాత పడ్డట్లే, మామయ్యతో ఉండే బంధాలు, అనుబంధాలు పాతబడ్డాయి, మానవీయ సంబంధాలు కూడా పాత పడ్డాయి. మనిషి తత్వము, మానవత్వం పాతబడిపోయినట్లు అనిపించింది నాకు ఈ కథ చదువుతున్నంత సేపు.

**వరుసలు :**

'వరుసలు' అనే మరో కథలో దూరమవుతున్న సంబంధ బాంధవ్యాలు గురించి ఏ పండుగకో, పబ్బానికో, వేడుకకో, పెండ్లికో కలుసుకున్నప్పుడు పెనవేసుకున్న బంధుత్వాల గురించి ఎవరికీ ఏమవుతారు అని వరుసలు తెలుసుకునే విధానం ఈ కథలో కనిపిస్తుంది. మారుతున్న సమాజంలో ఆధునిక సాంకేతికత పెరిగింది. జనాభా పెరిగింది. బంధాలు, బంధుత్వాలు పెరిగాయి. కానీ బంధువుల, బంధుత్వాల విలువ మాత్రం నానాటికి తగ్గిపోతుంది. వలస జీవితాలు ఎక్కువవుతున్నాయి, మనుషుల మధ్య దూరాలు కూడా ఎక్కువవుతున్నాయి, అనే సత్యాన్ని ఈ కథలో బి.ఎస్. రాములు గారు చాలా చక్కగా వివరించారు. ఒకప్పుడు ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి బ్రతికేవారు. కానీ పరిస్థితులు మారాయి. వ్యవసాయాన్ని చేయడానికి ఎవరు ఇష్టపడడం లేదు. ఉన్న పొలాలన్ని అమ్ముకొని పట్టణాల్లో స్థిరపడిపోతున్నారు. తద్వారా మనుషుల మధ్య సంబంధాలు, రక్త సంబంధాలు, ఆత్మీయతలు, అనురాగాలు, పలకరింపులు, పరిచయాలు అన్ని అంతరించిపోతున్నాయనే సత్యాన్ని ఈ కథల్లో చాలా చక్కగా చూపించారు బి.ఎస్. రాములు గారు. ఒకప్పుడు చుట్టాల మధ్య నమస్కారాలు ఉండేవి కావు. కానీ

నవ్వుతూ ఎదురొచ్చి ఎప్పుడొచ్చినావు అనే పలకరింపులే ఉండేవి. ఇప్పుడు మాత్రం నమస్కరించి పలకరిస్తే తప్ప పలకరించడం లేదు. అంటూ ప్రస్తుత జీవనశైలిని కవి గారు కథలో చూపించారు. ఒకప్పుడు బంధువులు అంటే తరతరాల వరకు తెలిసేవారు పెద్దవాళ్లు తెలియ చెప్పేవారు నాన్న తరపు చుట్టాలతో అమ్మ తరపు చుట్టా లతో అసలు తీరికే ఉండేది కాదు, కానీ ఇప్పుడు సమాజా నికి బంధువులు ఎవరో తెలియదు ఎవరికి ఏమవుతారో తెలియదు. ఎవరికి ఎవరు అవసరం లేదు అనే దస్థితి నేడు సమాజంలో కనిపిస్తుంది. "పూర్వం వ్యవసాయ పనులు చాలా ఉండేవి, నూనెలలో నువ్వుల నూనెను మాత్రమే వాడేవారు. నువ్వుల నూనె గానుగలు కట్టేవారు, ఇప్పుడు కొత్తగా ఆయిల్ మిల్లులు వచ్చాయి, నువ్వుల నూనె బదులు పల్లి నూనె వాడకంలోకి వచ్చింది. నువ్వుల నూనె వాసన కమ్మగా రుచిగా అద్భుతంగా ఉంటుంది. కానీ ఇప్పుడు నువ్వుల నూనె చేదుగా పల్లి నూనె కమ్మగా అనిపిస్తుంది. కొత్తగా నూనె మిల్లులు కూడా వచ్చాయి. నువ్వుల నూనె వ్యాపారంలో రాజాల బ్రతికిన కుటుంబాలు కొత్త వృత్తులు వెతుక్కోవాల్సి వచ్చింది. ఒకప్పుడు బట్టలు నేయడం కులవృత్తిగా ఉండేది. కాలక్రమేణా బట్టలు నేసేవారు కనుమరుగయ్యారు. బట్టల మిల్లులు ప్రత్యక్షమయ్యాయి. అంటే మనిషి పాతదనాన్ని విడిచిపెట్టి కొత్తదనాన్ని కోరుకుంటున్నాడు. అనే జీవన వాస్తవికతను కవి గారు చాలా చక్కగా ఈ కథలో వివరించారు". నేటి సమాజంలోని మానవులు యాంత్రిక జీవితానికి అలవాటు పడి సమయానికి డబ్బుకు మాత్రమే విలువనిస్తూ, మనుషులకు మానవీయ సంబంధాలకు విలువనీయకుండా ఎవరికి ఏమవుతారో అనే "వరుసలు" కూడా తెలియకుండా భావితరాల వారికి తెలియచెప్పకుండా ఉన్న పరిస్థితులు నేడు కథలో కనువిప్పు కలిగించాయి.

**తులసి :**

తన పిల్లలే తన సర్వస్వం అని జీవితాన్ని ధారపోసిన తల్లిదండ్రులు పట్ల నేటి సమాజంలోని యువత ప్రవర్తిస్తున్న తీరును "తులసి" కథ ద్వారా బి.ఎస్. రాములు గారు తెలియజేశారు. ఈ కథ నేటి యువత స్వభావానికి నిలువెత్తు నిదర్శనంలా కనిపిస్తుంది. ఈ కథ చదువుతున్నంతసేపు నా కళ్ళు చెమ్మగిల్లాయి. కథలో పిల్లల ఆదరణ, ఆప్యాయత నోచుకోని తల్లిదండ్రుల దయనీయ స్థితి కనిపించింది. "నవ మాసాలు మోసం తమ రక్తాన్ని చెమటగా మార్చి కష్టం చేసి, సర్వస్వాన్ని వాళ్ళ కోసం ధారపోసి, వాళ్ళ ఎదుగుదలను చూసి మురిసి పోతూ, వారిని చదివించి, పెళ్ళిళ్లు చేసి వారి పిల్లలకు పురుళ్ళు పుట్టు వెంట్రుకలు అంటూ అనేక కార్యక్రమాలు చేసిన తల్లిదండ్రుల వయసు మీద పడగానే వారి అవసరం తగ్గిపోతుంది, వారిని చిన్నచూపు చూసే విధానమే ఇంట్లో కనిపిస్తుంది. వారిని ఇంటివారుగా కాకుండా ఇంటికి పని మనుషులుగా చేసే విధానం గుండెను తాకి మనసు లోతుల్లో దాగిన దుఃఖాన్ని బయటకు తీసి నన్ను ఎంతో ఆలోచింపజేసింది". తల్లిండ్రులు లేదా అత్తమామలుగా ఉన్న వారి మనస్తత్వా లను తులసమ్మ పాత్రలో కవి చాలా బాగా చిత్రించారు. ఈ కథలో తులసమ్మ కొడుకులను పెంచి పెద్ద చేసి ఒక ఇంటి వారిని చేసి వారికి పిల్లలు పుడితే మురిసిపోయి, అన్ని తానై వారికి సేవలు సపర్యలు చేస్తూ, క్రమంగా ఇంటి పని మనిషిలా మారిపోయినటువంటి పరిస్థితిని ఈ కథలో చూడవచ్చు. ఇంట్లో ఉండే కొడుకు మనుమడు ఆమెను పనిమనిషితో పోల్చి మాట్లాడే మాటలు సన్నివేశాలు ఎంతో బాధని కలిగించేవిగా ఉ న్నాయి. వయసు పైబడిన తర్వాత పెద్దవాళ్లు తమ పిల్లలనుంచి ఏం కోరుకుంటారో ఏ విధంగా ఉండా లనుకుంటారో లాంటి విషయాలు నన్ను ఎంతో ఆలోచింపజేశాయి. ఇంట్లో ఉండే తల్లిదండ్రులను లేదా అత్తమామలను మాటలతో వేధిస్తూ, చేతలతో సాధిస్తూ వారి మనసును గాయపరిచే నేటితరం యువతను ప్రతిబింబించేలా ఉంది ఈ కథ. ఈ కథలో తులసి ముదిమి వయసులో నిజంగా తను కోరుకునేది పట్టు చీరలు కాదు, డబ్బు కాదు, ఇంట్లో పెత్తనం కాదు,

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

పెద్దరికము కాదు, కానీ ఇంట్లో వాళ్ళు ఆత్మీయత అనురాగాలు ప్రేమగా మాట్లాడే మాటలు పలకరింపులు మాత్రమే అని తెలియ చెప్పింది ఈ కథ.

నానాటికీ మానవీయ సంబంధాలు దెబ్బ తింటున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య కూడా సంబంధం బాంధవ్యాలు సన్నగిల్లుతున్నాయి. తల్లి దండ్రుల అవసరాలతో ఎదిగిన పిల్లలు చివరకు వారిని అనవసరమైన వారిగా భావిస్తున్న విధానం చూసినపుడు చాలా బాధనిపించింది. తల్లి తండ్రి రక్తసంబంధం అనే బంధానికి కూడా నేడు సమాజంలో, కుటుంబంలో చోటు లేదు. ఇంట్లో ఉన్న పెద్దవాళ్లకు మనము విలువ ఇవ్వకపోగా మన పిల్లలు కూడా సంస్కారం నేర్పటం లేదు. పెద్దవాళ్ళను గౌరవించాలని సాంప్రదయాన్ని పాటించడం లేదు, పిల్లల నుంచి పెద్దల వరకు ఇంట్లో ఉన్న పెద్దవాళ్లను, బ్రతికున్నా మాటలతో చేతులతో చంపేస్తూ, జీవచ్ఛవాలుగా బ్రతికే పరిస్థితికి తెస్తున్నారు. బంధాలకు అనుబంధాలకు జీవితంలో చోటులేనట్లే, మనిషికి మనిషితత్వానికి మానవత్వానికి ఏమాత్రం చోటు లేనటువంటి పరిస్థితులు ఈ కథలో కనిపించాయి. నేటి యువతకి కనువిప్పు కలిగించేలా ఉంది కథ.

### పంజరం :

"పంజరం" అనే కథలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు అనుబంధాలు ఆప్యాయతలు ఉండేవి. ఇప్పుడు అవి కనబడడం లేదు. అందరిలో స్వార్థం మాత్రమే ఉంటుంది. కుటుంబం విచ్ఛిన్నమైనపుడు పిల్లలు తల్లిదండ్రులను కుటుంబ సభ్యులను మాత్రమే ప్రేమిస్తారు. కానీ బంధువులు ఆత్మీయులను కాదని కుటుంబ వ్యవస్థ అంతా స్వార్థానికి కేంద్ర బిందువై పోయిందని తెలియచెప్పిన కథ పంజరం. ప్రస్తుత కాలంలోని ప్రజల జీవన విధానం అంతా పంజరంలోని పక్షుల మాదిరిగానే ఉంది. నాది అనే స్వార్థం పెరిగి పోయింది. మనుషులంతా కుటుంబం అనే బంధనంలో బతుకుతున్నారు. ఆ కుటుంబంలో వారికే తప్ప కొత్తవారికి స్థానం ఇవ్వటం లేదు, తల్లిదండ్రులుగా ఎన్నో కష్టాలను, ఒడిదుడుకులను, ఎదుర్కొని పైకి వచ్చిన తర్వాత ఆ కష్టాలను, వారు అనుభవించిన పేదరికాన్ని పిల్లలకు చెప్పడానికి అసలు ఇష్టపడడం లేదు. స్వేచ్ఛ పేరిట పిల్లలని ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. వారికి బయట ప్రపంచంలో బ్రతికే ధైర్యాన్ని ఇవ్వకుండా కుటుంబంలోనే అన్ని సమకూరుతాయనే స్వార్థ దృష్టిని కూడా తల్లి దండ్రులే కలిగిస్తున్నారు. క్రమంగా పిల్లలకు మానవ సంబంధాల విలువ కూడా తెలియడం లేదని ఈ కథలో బి.ఎస్. రాములు గారు చాలా చక్కగా తెలియజేశారు. కుటుంబం అనే జైలులో పిల్లల్ని బంధిస్తున్నారు. "మానవీయ విలువలో నైతిక విలువలు నేర్పించే తీరిక కూడా తల్లిదండ్రులకు లేదు. పిల్లలు కోరిందల్లా తెచ్చిస్తే వారికి వారిపై ప్రేమ ఉందని అనుకుంటారని, పిల్లల ప్రేమ పొందడానికి వస్తువులను లంచంగా ఇస్తున్నారు అనే నగ్న సత్యాన్ని కవి కథలో నిరూపించారు. పిల్లలకి ఏదంటే అది కొనిస్తే వారికి వాటి విలువ తెలియదు. కష్టంతో సాధించిన దాని విలువ ప్రత్యేకంగా ఉంటుంది. మనం సాధించుకున్న స్వాతంత్ర్యం కూడా అంతే కదా. ఎన్నో త్యాగాల ఫలితంగానే స్వాతంత్రం వచ్చింది కాబట్టి దాని విలువ ప్రతి ఒక్కరికి తెలుసు, పిల్లల కోరికలు తీర్చడం వారిని సముదాయించడం చక్రవర్తులకైనా సాధ్యం కాని పని. కానీ పిల్లల్ని మన పరిధిలో మనకున్న దాంట్లో సంతృప్తికరంగా విలువల్ని నేర్పిస్తూ పెంచడం మాత్రం ప్రతి ఒక్కరికి సాధ్యమే, కానీ అలా పెంచడం నేడు అందరికీ కష్టమవుతుంది. స్వేచ్ఛ పేరిట పిల్లల్ని గాలికి వదిలేస్తున్నారు. అలా పెరిగిన పిల్లల్లో సమాజం యొక్క గొప్పతనం తెలియదు. సమాజం కోసం నిస్వార్థంగా వారు పనిచేయరు, తల్లిదండ్రులు పిల్లలకు స్వార్థం నేర్పడం ద్వారా గర్వమనే బంధనంలో వారి విర్ర వీగుతారని, ప్రతిదానికి స్వార్థపూరితంగా ఆలోచిస్తారని, చివరకు తల్లిదండ్రులు కూడా లెక్కచేరయని ఫలితంగా కుటుంబ వ్యవస్థలన్నీ అంతరించి పోతాయని ఈ పంజరం అనే కథలో బి.ఎస్. రాములు గారు చాలా చక్కగా వివరించారు". కుటుంబం పిల్లలకు సమాజాన్ని

ప్రేమించే సంస్కృతిని నేర్పిస్తే, కుటుంబం విచ్ఛిన్నం కాదు. మనుషుల మధ్య దూరం ఉండదు. మానవ సంబంధాలకు కొదువ ఉండదు. అప్పుడు మానవజీవనమంతా పంజరం నుంచి బయటికి వచ్చిన స్వేచ్ఛపూరిత పక్షుల మాదిరిగా అందమైన ప్రపంచాన్ని వీక్షిస్తుందని ఈ కథలో తెలియచెప్పారు.

**నానమ్మ :**

"నానమ్మ" కథలో "ఇంట్లో పెద్ద మనుషులు ఉంటే ఆ ఇల్లు తీరే వేరుగా ఉంటుంది. అమ్మమ్మ నానమ్మ, తాత వంటి పెద్ద మనుషులు ఇంట్లో ఉంటే ఆ ఇల్లు ఎంత హూందాగా, ముత్తయిదువతనంతో, నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది అని బి.ఎస్. రాములు గారు నానమ్మ కథ ద్వారా ఇంట్లో పెద్దవాళ్ల గొప్పతనాన్ని తెలియజేశారు". ఇకప్పుడు ఇంట్లో పెద్దవాళ్ళు ఉంటేనే ఆ ఇల్లు అందంగా ఆనందంగా ఉండేది, కానీ నేడు పరిస్థితులు మారిపోయాయి. తల్లిదండ్రులను పెద్దవాళ్ళను ప్రస్తుత సమాజం నిర్లక్ష్యం చేస్తుంది. ఇంటికి భారంగా భావించి వారిని ఇంట్లో ఉంచుకోవడానికి ఇష్ట పడక వృద్ధ ఆశ్రమాలలో వారిని ఉంచడానికి ఇష్ట పడుతున్నారు. ఇంట్లో పెద్దవాళ్ళు ఉంటే వారి నుంచి మనవళ్లు, మనుమరాళ్లు ఎన్నో మంచి విషయలు నేర్పుకుంటారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు టీవీలు, సెల్‌ఫోన్‌ల ధ్యాసలో పడి తమ ఆరోగ్యాలను తమ సమయాన్ని పాడు చేసుకుంటున్నారు. కానీ ఇంట్లో పెద్దవాళ్ళు ఉంటే వారి చెప్పే కథలు మంచి మాటలు, వారి ఆటపాటల ద్వారా పిల్లలు ఎంతో మంచి నడవడికను నేర్చుకునేవారు. ఈ కథలో నానమ్మ ఎన్నో కథలు  చెప్పేది. ఎంతో కష్టపడి పనిచేసేది, ఏ పని మీద పోయినా పెండ కనపడితే అరచేతులతోనైనా తెచ్చేది గాని వదిలేది కాదు. అంటూ నానమ్మ గుణగణాలను కవి తెలియజేసే తీరు ఎంతో బాగుంది. నానమ్మ, అమ్మమ్మలు అనుభవించిన కష్టాలు బాధలు వారు సమస్యలు  ఎదుర్కొన్న తీరు నేటి సమాజానికి ఎంతో ఆదర్శం స్ఫూర్తిదాయకం. కథలో నానమ్మ పాత్ర ద్వారా ఆమె పడిన కష్టాన్ని కవి ఈ విధంగా వివరించారు. "నానమ్మ చీరే గోసి బోసి పిరిసిట్టి కట్టుకట్టిందంటే దేవత లెక్క కనబడేది, నానమ్మ తెల్ల వెంట్రుకలు వెండి తీగల తీరు ఎంత ముద్దుగా ఉండేవో" "నానమ్మ రాట్నం వడుకుతూ ఉంటే ఓ ఫోటో తీసి గాంధీతాత రాట్నం వడికే బొమ్మ పక్కన పెట్టాలనిపిస్తుండే.. రాట్నం వడుకుతున్నపుడు గాంధీ తాత కన్నా నానమ్మ రూపే ఎంతో బాగుండేది. అంటూ నానమ్మ రూపే ఎంతో బాగుండేది. అంటూ నానమ్మ పాత్ర చిత్రణ సంభాషణలు నన్ను ఎంతో ఆకర్షించాయి". నానమ్మ కథలో కుటుంబ వ్యవస్థలో మానవ సంబంధాలు సన్నగిల్లుతున్నాయని, ఇంట్లో పెద్దవాళ్ల ఆధిపత్యం కనుమరుగవుతుందని, "చెప్పేవారు లేక చెడిపోయినట్లు" ఇంట్లో తప్పు చేస్తే హెచ్చరించేవారు లేకుండా ఇష్టానుసారంగా జీవిస్తున్న పరిస్థితులు ఫలితంగా పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు విఫలం అవుతున్నారని, పిల్లలకు పెద్దవాళ్ల గొప్పతనం తెలియడం లేదని, పిల్లలకు పెద్దవాళ్ళతో ఉండే అనుబంధాలు తగ్గిపోతున్నాయని మంచి మానవీయతకు తావు లేకుండా పోతుందని, పెద్దవాళ్ళు ఇంట్లో ఉంటే మంచి మంచి విషయాలు చెప్పేవారు, సమయానికి ఇంట్లో మంచి పౌష్టిక వంటకాలు చేసి పెట్టేవాళ్ళు, చాలా కథలు చెప్పి నిద్రపుచ్చేవారు. కానీ నేటి సమాజంలో ఇప్పుడు పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. ఇంట్లో చేసి పెట్టేవారు లేక ఫాస్ట్‌ఫుడ్‌లకు అలవాటు పడి అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారు. కాలక్షేపం కోసం సెల్‌పోన్ ఆటలకు వీడియోలకు టీవీలకు ఆకర్షించబడి వ్యసనపరులుగా మారుతున్నారనే సత్యాన్ని బి.ఎస్. రాములు గారు కథలో నిరూపించారు. పై కథలను నేను చదివి పరిశీలన చేసినంత సేపు మానవీయ సంబంధాల గొప్పతనాన్ని విలువను తెలుసుకోగలిగాను, ఆత్మీయతలు అనురాగాలు బంధాలు అనుబంధాలు ప్రాముఖ్యతను తెలుసుకున్నాను, నేటి సమాజం పోకడ ఏ విధంగా ఉందో రోజురోజుకీ దిగజారిపోతున్న మానవ సంబంధాలను గురించి తెలుసుకున్నాను. బి.ఎస్. రాములు గారు

రాసిన ప్రతి కథ మానవ జీవన వాస్తవికతను తెలియజేస్తూ జీవితం బ్రతుకు లోతును తెలియజేసేదిగా ఉంది. నేటి సమాజానికి బి.ఎస్. రాములు గారి కథలు రచనలు ఎంతో ఆదర్శవంతం స్ఫూర్తిదాయకం, బి.ఎస్. రాములు గారి కథలు రచనలు ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసేవిగా సమాజం మనస్తత్వాలను ప్రతిబింబించేవిగా, మానవీయ సంబంధాలకు అద్దం పడుతున్నట్లుగా అనిపించింది నాకు, ఉన్న ఊరుగో పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధాల గొప్పతనం, సాటి మనిషిని మనిషే గౌరవించలేని పరిస్థితులు, ఇంట్లో పెద్దవాళ్లు ఆదరణకు నోచుకోలేని విధానాలు, నా అనుకున్న వాళ్లు, పరాయివాళ్ళుగా మారే పరిస్థితులు మొదలైనవి నేడు సమాజంలో జరుగు తున్నటువంటి పరిణామాలను చాలా దగ్గర సంబంధంగా అనిపించింది. బి.ఎస్. రాములు గారు వ్రాసిన "చికాగోలో నానమ్మ" కథ సంపుటిలోని ప్రతి కథ నన్ను ఎంతో ప్రభావితం చేసింది. నా హృదయాన్ని ఆలోచింపజేసింది. చలింపచేసింది. నాలో మానవీయ విలువల్ని మేలుకొల్పి చైతన్యవంతం చేసింది. నిజంగానే బి.ఎస్. రాములు గారి కథలు జీవితంలోని బతుకు లోతును చిత్రించేవిగా ఉన్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. బి.ఎస్. రాములు కథలు (చికాగోలో నాయనమ్మ సంపుటి) - బి.ఎస్. రాములు.
2. బి.ఎస్. రాములు - మమతలు మానవ సంబంధాలు - బి.ఎస్. రాములు.

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 10, October 2024

భావవీణ

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన

- డా॥. బానోత్ స్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

అనాగరిక మానవుడు నాగరిక మానవునిగా మారుటకు కొన్ని వేల ఏళ్ళు పట్టింది. ఆహార సేకరణ నుండి ఆహారోత్పత్తి చేసే దశకు చేరటానికి సుమారు మూడు లక్షల సంవత్సరాలు పట్టింది. చారిత్రకంగా మన దేశంలో అయిదు వేల సంవత్సరాలకు పూర్వం అందరూ ఆహార సేకరణ మీద ఆధారపడి జీవించిన సంచార జీవులే. దొరికిన ఆహారాన్ని ఏరుకొని లేదా వేటాడి సంపాదించి స్థిర నివాసం లేకుండా సంచరిస్తూ ఉండేవారు. ఆ తర్వాత క్రమంగా గుహలలోనో, చెట్లకొమ్మల గుబురుల లోనో, నివసించేవారు. ఆనాడు దేశమంతా అడవుల మయం. క్రూర జంతువులు విచ్చలవిడిగా తిరిగేవి. వేటాడిన జంతువుల చర్మాలను, చెట్టు పట్టను, విశాలమైన ఆకులను ఒంటికి చుట్టుకున్నారు.

గిరిజన జాతి పరిచయం: గుహలలోను, నేలను త్రవ్వి మట్టి గోడలు కట్టి, కొమ్మలతో పందిరి వేసికొని జీవించే వారు. ఈ భూమి మీద మానవుడు తిరుగాడటం మొదలు పెట్టి దాదాపు అయిదు సంవత్సరాలైంది. అప్పటికి ఇప్పటికి మానవుల మధ్య జీవితంలో ఎంతో మార్పు కనిపిస్తుంది. ప్రకృతిలో లభించే కాయ కసరులు, దుంపలు, పళ్ళు, వేళ్ళు తిని జీవించేవారు. పచన క్రియ తెలియదు. ఇల్లు బట్ట ఎరుగనే ఎరుగరు. భాష తెలియదు. సంకేతాలు, అరుపుల ద్వారానే కాలం గడిపేవారు. కరువు కాటకాలకు వానా వరదలకు రోగాలకు రొచ్చులకు గురై ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొన్నారు. క్రూర జంతువుల బారి నుండి తప్పించుకోవడానికి రాయీ రప్పా మలచి చేసుకొన్న ఆయుధాలతో పదిమందితో కలసి వాటిని నిగ్రహించేవాడు.

వారి అధిక జీవిత భాగమంతా తిండిని వెతుక్కుంటూ తిరగడం లోనే గడిచింది. క్రమంగా పనిముట్లు మెరుగు పరచుకొని బతుకు చెరువును బాగు పరుచుకొన్నాడు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడం జంతువులను మచ్చిక చేసుకోవడం, తనకు మిగిలిన దానిని ఇతరులకు ఇచ్చి పుచ్చుకోవడాలు తెలుసుకొన్నాడు. ఆదిమ వాసులు వాడిన పనిముట్లు, ఆయుధాలు, ఎముకలు, ఆభరణాలు, బొమ్మలు వీటిని పరిశీలిస్తే వీరి తిండి అలవాట్లు ఆచార విశ్వాసాలు గుర్తించవచ్చు. క్రమంగా మానవుడు రాయి కన్న ఇనుము శ్రేష్టమైందని గ్రహించాడు. ఇనుమును కరిగించడం వాటితో పనిముట్లను తయారు చేయడం నేర్చాడు. జనం సుస్థిర జల ప్రదేశాలకు చేరసాగింది. పోడు వ్యవసాయ స్థానంలో నాగలి వ్యవసాయం వచ్చింది. పశువుల పెంపకాన్ని పంటలు పండించడాన్ని ఇళ్ళ నిర్మాణాన్ని బట్టలు తయారు చేయడాన్ని ఎన్నో నేర్చాడు. జీవిత పోరాటంలో మతాన్ని తోడుగా తెచ్చుకున్నాడు. చదవడం వ్రాయడం నేర్చాడు. ఇక జట్లు జట్లుగా మారిన మానవులు క్రమంగా జాతులుగా తెగలుగా రూపొందారు. ఆదిమ తెగలలో కొన్ని విశ్వాసాలు పాతుకు పోయాయి.

### గిరిజన శబ్ద విచారం :

ఆహారాన్ని సేకరించి లేక వేట జీవించే మానవులు చిన్న చిన్న గుంపులుగా ఏర్పడినారు. ఈ గుంపు వ్యవస్థీకృతమైనపుడు ఒక కుదురుగా ఏర్పచేసుకున్నారు. ఇట్టి గుంపు మొత్తం ఒక సహకార సంఘం వలె, ఆహారాన్ని సమిష్టిగాసేకరించి దాన్ని అందరు సమంగా పంచుకునేవారు. ఈ ఆటవిక కుదురు నాగరిక సమాజా నికి లోబడటం తర్వాతి కాలపు మార్పు. వీటి సహజ పరిణామంలో మొదటి మార్పు కొన్ని కుదుర్లు కలిసి ఒక తెగ లేక ఒక గణం (ట్రైబ్) గా ఏర్పడటం జరిగింది. ఆటవిక జీవితం నుండి నాగరిక సమాజం ఉద్భవిం చింది.

సంఘ జీవితంలో ఒక్కొక్క మార్పు ఒక కొత్త పరిణామా నికి దారితీసింది. ఈ మార్పులు రావటానికి కొన్ని వేల సంవత్సరాలు పట్టాయి.ఆటవిక మాతృస్వామిక వ్యవస్థ ఉండేది. స్త్రీలే వ్యవసాయం చేసి పంటలు పండించి

సంపదలు సృష్టించారు. వేదకాలం నాటి ఆర్యుల దృక్పథం పురుష ప్రధానమైనది. వ్యవసాయం అభివృద్ధి చేసిన ఆదిమ ఆటవిక సామాజిక వ్యవస్థలో స్త్రీ ప్రముఖస్థానం వహించింది. పితృస్వామిక కుటుంబం అచ్చ సమాజానికి మూలం. ఆశ్రమ ధర్మం నాటి ఆచారం సమాజంలో వర్గాలు కలవు, కాని వర్ణ వ్యవస్థలేదు. మేధావి వర్గం, పాలక వర్గం, భూస్వామ్య వర్గం, కర్షక వర్గం, ఈ వర్గాలే వృత్తులుగా మారి మలివేద కాలం నాటికి చాతుర్వర్ణాలుగా పరిణతి చెందాయి. మలివేదకాలంలో సమాజం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు విభక్తమైంది. వర్ణాల మధ్య సాంఘిక అసమానతలు చోటు చేసు కున్నారు. ప్రకృతిలో దొరికే ఆహారాన్ని సేకరించిన మానవులు చిన్న చిన్న గుంపులుగా ఏర్పడుతారు.

ఈ గుంపు వ్యవస్థీకృతమైనపుడు ఒక కుదురు (క్లాన్) అవుతుంది. కొన్ని కుదుర్లు కలిసి ఒక తెగ లేక గణం (ట్రైబ్) గా ఏర్పడుతుంది. తెగ అంటే మనం ఇంగ్లీషులో వాడే ట్రైబ్ అన్న పదానికి సమానార్థకం. కొండల మీదనే తొలుత నుండి నివాసం కలిగి ఆటవిక సంపదనే తమ జీవితానికి ఉపాధిగా గ్రహించిన వారిని, కొండల్లో ఉండే కొద్దిపాటి చదును ప్రదేశాలను, ఏటవాలైన మెత్తని మట్టితో కూడిన ప్రదేశాలను గుర్తించి అక్కడ పెరిగిన చెట్లను కూల్చి పోడు వ్యవసాయం చేసుకునే వాళ్ళను కొన్ని తెగలుగా ప్రభుత్వం గుర్తించింది. వీళ్ళంతా గిరి జనులు. ఇలాంటి గిరిజనులు దాదాపు దేశం మొత్తం మీద 212 తెగలవారు ఉన్నారని అంచనా వేయవచ్చు. వీటిలో 73 తెగలు మహారాష్ట్రలో, 33 తెగలవారు అవిభక్త ఆంధ్రదేశంలో ఉన్నారు.

## ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజనుల వివిధ ప్రస్తావనలు :

### సంస్కృత వ్మాయం :

తెలుగు సాహిత్యంలో గిరిజన ప్రస్తావనలు ఉన్న కవుల రచనలుచాలా ఉన్నాయి. సంస్కృత వాఙ్మయంలో కూడా గిరిజన ప్రస్తావన ఉంది. వేదాలలో పంచములు అనే పదం లేదు పంచములు అంటే గిరిజనులు అనే ఉంది. పంచజనులకు, పంచాక్షరితులకు, వేదభాష్యకర్త సాయణులు అని అర్థం. ఋగ్వేదంలో పంచజనులు, పంచాక్షరితులు, పంచక కృషులు, అనే మాటలు అనేక చోట్ల కనిపిస్తుంటాయి. ఆంధ్రులు చుంచులు, మద్దులు వీరికి అరణ్యంలోనే మృగాలను హింసించడం వృత్తిగా చెప్పబడింది. గిరిజన శబ్దానికి తుల్యంగా నిషాద శబ్దం సంస్కృత వాఙ్మయం లో చెప్పబడింది.

ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజన ప్రస్తావన కావ్య ప్రబంధాలను 18వ శతాబ్దము వరకు పరిశీలించడం జరిగింది. తెలుగు పరిశోధకుల మతానుసారంగా పురాణా లకు సంబంధించిన ఇతివృత్తాలు గల భారత భాగవత, రామాయణదూలను కావ్యలలోనే లోనే చేర్చడం జరిగింది. 16వ శతాబ్ది ప్రారంభం నుండి వచ్చిన గ్రంథాలను ప్రబంధాల వరుసలో చేర్చడం జరిగింది. ఈ కావ్య ప్రబంధాల పరిచయం కవుల కాలాలను అనుసరించి వరుసక్రమంలో తెలుగు సాహిత్యంలో రాయబడింది.

భారతంలో గరుడపాఖ్యానంలో గరుత్మంతుడు తల్లికి నమస్కరించి వెళ్లే సమయాన ఆహారంగా బ్రాహ్మణులను స్వీకరించరాదని తల్లి చెప్పి పంపిస్తుంది. ఉన్నత కులం వారు భారత కాలం నాటి నిషాదులను నీచ కులజుగా అపవిత్రులుగా భావించేవారు. ఉన్నత కులం వారు నీచ కులాలను వివాహమాడటం బట్టి నిమ్న జాతిలో పుట్టిన పురుషుడు నిమ్న జాతిలో ఉండే స్త్రీలను వివాహం చేసుకోవాలి. స్త్రీలు మాత్రం అవకాశాలను బట్టి అగ్ర జాతి వారిచేత వరింపబడి వర్ణత్పత్తిని పొందేవారు.

ఏకలవ్యోపాఖ్యానం లో రాజులకు బ్రాహ్మణులకు తప్ప నాటి గురువులు అన్ని కులాల వారికి విద్య బోధన చేయలేదు. హిరణ్యదన్యడను ఎరుకల రాజకుమారుడు ఏకలవ్యుడు ఇతను విలువిద్య యందు ఆసక్తి గలవాడు. కౌరవ, పాండవుల గురువు ద్రోణుని విద్యాబోధనకై తనను శిష్యునిగా స్వీకరించాలని ప్రార్థిస్తాడు.

ద్రోణుడు ఏకలవ్యుని నిషాదుల పుత్రుడని స్వీకరించ లేదు. సకల శాస్త్ర అధ్యయనం చేసి బ్రహ్మణ, క్షత్రియ శక్తులను ప్రదర్శించిన పరాశురామ ద్రోణాది మహా మేధావుల ఆనాటి కట్టుబాట్లకు లోబడి నిమ్న జాతులు వారికి తమ విద్యను నేర్పలేదు. నిమ్న జాతుల వారు

ఒకవేళ గురువులను మోసం చేసే విద్యను నేర్చుకున్న వారికి పలింపలేదు.

భారతంలో కర్ణ వృత్తాంతం ఇందుకు ఉదాహరణ. ఏకలవ్యుడు మట్టితో ద్రోణుని రూపాన్ని నిర్మించి అతి భక్తితో మొక్కి ఏకాగ్రత, పట్టుదల, స్వయంకృషి దీక్ష, దక్షతతో నిరంతర అభ్యాసం చేసి భక్తితో అస్త్రవిద్య రహస్యలను పొంది చిన్న కులంలో పుట్టిన పెద్దమనిషితో సంస్కార హృదయాన్ని ప్రదర్శించాడు. గిరిజనులు మెచ్చిన చోటా విశ్వసించిన చోటా ధన ప్రాణాలను ఇచ్చేందుకు వెనుకడుగువేయరని స్పష్టం అవుతుంది.

నలదమయంతో పాఖ్యానంలో నలుడు దమయంతి సహితుడై అడవికి వెళ్తాడు. కలిచేత అకుష్టుడైన నలుడు విఘాతకరునుడై ధమయంతిని విడిచి వెళ్తాడు. భయంతో అడవిలో సంచరిస్తున్న దమయంతిని అజగారం ఒకటి పట్టుకుంటుంది. దీనిని చూసిన కిరాతకుడు ఒకడు ఆమెను రక్షించే వన్య స్వాధు ఫలాలను సమకూరుస్తాడు.

పండితారాధ్య చరిత్రలో శ్రీశైల వేద జంగం యాత్రికులకు చెంచులు, కమ్మలు, యుగ దండాలు, గుత్తి పంచలు, గరితిత్తులు, వెదురు, గంధం, చిప్పలు, విభూది పూసలు, రుద్రాక్షలు మొదలైన వస్తు సంచయాన్ని సమకూర్చినట్లు మాత్రమే ఉంది కానీ వారి జీవిత విశేషాలు ఇక్కడ కనబడలేదు.

బసవ పురాణం కావ్యం లో అనేక శివ భక్తుల కథలు చెప్పబడ్డాయి. ఈ కథలలో తిన్నని కథఒకటి, ఈ సందర్భంగా గిరిజనుల వేట విధానం, మాంసం ఉడికించే విధానం మొదలగు విషయాలు బసవపురాణంలో వర్ణించబడ్డాయి. వరాహ పురాణం ఇందులో అనేక ఉపాఖ్యనాలు ఉన్నాయి. వాటిలో గిరిజన జీవన విధానాలు, వృద్ధి విధానాలు, చెప్పబడ్డ ఇందులో రులో ధర్మ వ్యాధుని ఉపఖ్యానం ఒకటి. దూర్చేయుని వేట సందర్భంలో అనేక వలలు, ఆయుధాల వివరణ ఉంది. వీరి ఆహారపు అలవాట్లు చెప్పబడ్డాయి. హరవిలాసంలో మహాకవి శ్రీనాధుని దృష్టి శోకని వస్తువు గాని, కవిత్వం గాని, అతడు చెప్పిన విషయం కానీ లేదు. శివ విలాసాలు చెబుతూ అతని లీలాలకు సంబందించిన కిరతర్జుని ఘట్టాన్ని చిత్రించాడు. ఈ సందర్భంలో శబరకాంతుల జీవన విధానాలు అలంకరణలు వర్ణించబడ్డాయి.

కిరాతుల వేషం నగలు వేట విధానాలువేటలో వాడే జంతువులు ప్రస్తావించబడ్డాయి నాటి సమాజం గిరిజనులను హీనంగా చూసిందని శ్రీనాథుని వర్ణనలు తెలుపుతున్నాయి. శివుని మహత్యాన్ని అతని భక్తవంశ కరత్వన్ని వర్ణిస్తుంది. దత్త యజ్ఞ సుశీల బ్రాహ్మణ దంపతుల కుమారుడు కులం చెడినవాడిగ మరొక ఉపాఖ్యానం, చండాల కన్యా తో కాపురం చేయడం శబరులతో సహ జీవనం గడపడం, ఈ సందర్భంలో శబరుల జీవితం, ఆహారపు అలవాట్లు, వేట పద్ధతులు, వారి సంగీతప్రియత్వం మొదలగు విషయాలు ప్రస్తావించబడ్డాయి.

జక్కన్న రాసిన విక్రమార్క చరిత్రలో విక్రమార్క మహారాజును చెంచులు దర్శించారు. ప్రభువుకు వారు తెచ్చిన కానుకలను ఇచ్చారు. కవి ఈ సందర్భంలో వారి వేష భూషణాలను వర్ణించడు. వన్య మృగాలనూ వేటాడేందుకు చెంచులు రాజును ఆహ్వానించారు. వేట పద్ధతులను, ఆయుధ విశేషాలను వేటాడిన జంతువులను గురించి ఈ కావ్యంలో వర్ణించబడింది.

కొరవి గోపరాజ సింహాసన ద్వాత్రింశిక కావ్యంలో విక్రమాదిత్యుని పరాక్రమాలను సాలభంజికలు వర్ణించే కావ్యం ఇది. ఇందులో దీమాపువేట, దమేనవేట, తెరవేటలు మొదలైన వేట బేధాలు చెప్పబడ్డాయి. పందుల వేట విధానం ప్రత్యేకంగా ఇందులో వర్ణించబడింది. సుఖసప్తతి పాలవేకారికదారిపతి కావ్యం లో అనేక కథలు ఉన్నాయి. అందులో గిరిజన ప్రస్తావన గల కథ ఒకటి ఉంది. కమలాకరపురాన్ని పాలించే రాజు మని మాండనుడనే రాజు సభ జరుగుతున్న సమయాన చెంచుడు ఒకడు వచ్చి అతను వేటకు ఆహ్వానించాడు. ఇందులో చెంచు ఆహారం, వేట సాధనాలు వర్ణితం, ఈ వేటలో కుక్కలను ఉపయోగించారు.

**ప్రబంధాలు :**

అలసాని పెద్దన్న రాసిన మన చరిత్రలో విస్తృత వర్ణానలు పెద్దన్న నుండిప్రారంభించబడ్డాయి. స్వరోచి

వద్దకు శబరుడు ఒకడు వచ్చి శబరుని వేషా భాషలు, అతనికి ఇచ్చిన కానుకలు, వేట వర్ణిత విధానాలు, ఆయుధాలు, నమ్మకాలు, కుక్కల పేర్లు, -వైద్యం, మంత్ర ప్రయోగం, విస్తృత విషయ వర్ణనలు ఉన్నాయి. గిరిజన జీవనం ఈ కావ్యం కన్నా భిన్నంగా కానీ, ఎక్కువగా కానీ చెప్పబడ్డ కావ్యం ప్రబంధాలలో అరుదనే చెప్పాలి. గిరిజన జీవనాన్ని సమగ్రంగా పరిశీలించిన వారిలో ఈ కవి ఒకతను.

ధూర్జటి శ్రీకాళహస్తి మహత్యం ఈ ప్రబంధంలో మూడభక్తి తత్పరుడైన తిన్నని కథ ఉంది. చెంచుల జీవనం, ఆహారం, ఆచారం, ఆహార్యం, వేట, మాంస పచనం, వస్త్రధారణ, గృహాలంకరణ, వ్యవసాయం, సాంఘిక జీవనం, ఆటలు, జాతరలు, వినోదాలు, మద్య పానం, నైవేద్యం, జంతుబలి, మూఢనమ్మకాలు, మూఢా చారాలు, వేట సాధనలు పలు విస్తృత వర్ణనలు ఉన్నాయి. విస్తృతంగా గిరిజన వర్ణనలు కలిగిన ప్రబంధాలలో శ్రీకాళహస్తి మహత్మ్యం ఒకటి.

అయ్యల రాజు రామభద్ర కవి రామభ్యుదయం లో వేటపద్ధతిలో సాధనాలు చెప్పబడ్డాయి. ఇందులో ఏనుగులు వేట గురించి వర్ణింపబడింది. తెనాలి రామకృష్ణ కవి పాండురంగ మహత్యంలో నిడుమాశర్మ పాఖ్యానం ఒకటి. నిగమా శర్మ బ్రాహ్మణుడైన బోయ జాతిలో కలిసిపోయి కిరాతని వలె వేటడటం, ఈ సందర్భంలో కొంత బోయ జీవితం గురించి వివరించడం జరుగు తుంది. మొల్ల రామాయణంలో రాముని రెండుసార్లు గంగా నదిని దాటించిన గుహుని పాత్ర ఒకటి. గుహుడు రాముని అవతార పురుషునిగాభావించిన గిరిజన రాజు.

**యాక్షగానలు :**

చేరివిరాల భాగయ్య రాసిన కిరాతర్జినియంలో కథ ప్రసిద్ధమైన అర్జునుడుపాశుపతదానుల సంపాదన ఎందుకు ఇలాంటి పనిచేశారు. శివపార్వతులకు కిరాత రూపంలో వస్తారు. చెంచుల వేషభాషలు ఇందులో వర్ణితాలు.భాగయ్య రాసిన చెంచులక్ష్మి పరిణయంలో ఈ అక్షరాలని కథ ప్రసిద్ధమైన నరసింహస్వామి చెంచు లక్ష్మిని వివాహమాడుట, ఎరుకలజీవితం, ఎరుక వర్ణిత, వేట సాధనలు చెప్పబడ్డాయి.. మానవత్తుల పుల్లయ్య వాల్మీకి చరిత్ర ఈ యక్షగానంలో విష్ణు లోకంలో వాకడు అనే బోయవాని విషయంలో విష్ణుకు యముని వాదం జరుగుతుంది. క్రూడైనా వాకడుని చంపుటకు విష్ణువు యమునికి ఆజ్ఞాపిస్తాడు. వాకడుని చోర వృత్తి, ఆయుధాలు, బాటసారుల హింసిచడం మొదలైన విషయాలు ఇందులో ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో కావ్య ప్రబంధాలను పరిశీలించిన తర్వాత గిరిజన జీవన విషయాలు ప్రత్యేకంగా తెలిపేవి లేవనిపిస్తున్నప్పటికీ, చాలా యక్షగానాలలో గిరిజన వేశ, భూష వర్ణనలు ఉన్నాయే తప్ప, గిరిజన జీవన విషయ వివరణలు తక్కువగా తెలుగు సాహిత్యంలో ఉన్నాయి.

**సాంస్కృతిక అంశాలు :**

**వృత్తులు :**

ప్రాచీన తెలుగు సాహిత్యంలో గిరిజనుల జీవన విధానాన్ని పరిశీలిస్తే అధికభాగం వారు వేటాడి జీవించి నట్లు తెలుస్తుంది. వేటే వీరి ప్రధాన వృత్తి. ఆహార సేకరణను వేట ద్వారానే చేసేవారు పచనక్రియ ఎరిగిన మీదట, జంతువులను మచ్చిక చేసుకొన్న తర్వాత అప్పుడప్పుడు వ్యవసాయాన్ని కూడ చేసారు. అడవుల్లో దొరికే పండ్లు, దుంపలు, తేనెలు, జంతు మాంసాలు వీరి భోజన పదార్థాలు. రాజులను దర్శించటానికి వెళ్లిన గిరిజనులు ఆయా రాజులకిచ్చిన కానుకలను పరిశీలిస్తే వాటిని వారెలా సేకరించారో వారేంతిన్నారో, వారి వృత్తులు ఏమిటో అర్థం కాక మానదు.

గిరిజనులు జీడిపళ్ళు, తేనెలు, చాఆపప్పు వెదురు బియ్యాల వంటకాలు, నేయి, పెరుగు, పాలు, మూడు ప్రొద్దులు ముచ్చటగా ఆరగించారు. వీటిని బట్టి చూస్తే జంతువుల పెంపకంతో పాటు అడవుల్లో దొరికే పళ్ళు తేనెలు చాఆపప్పులను తృప్తిగా తిన్నారు. సుదక్షిణా పరిణయంలో బోయడొకడు దిలీపునికి హరి భల్లూక వరాహ శార్దూలపాకాలను సమర్పించినట్లు కస్తూరి మెకాలను, ఏనుగు దంతాలను, చమరీ మృగాలను తెచ్చిచ్చిన వర్ణనలు ఉన్నాయి. దీని వలన వేటాడి మాంసాలను సేకరించేవారనేది స్పష్టమవుతుంది.

**వేషభూషణాలు :**

కొండ కోనల్లో సెలయేటి తీరాల్లో నివసించే గిరి జనులు చిత్ర విచిత్రంగా అలంకరించుకునేవారు. ఎఱ్ఱని వెంత్రుకలను కొప్పుగా చుట్టి లేత ఆకులను, తీగలను, తురిమి, గురివింద దండలు ధరించి, నెమలి ఫించాలను వస్త్రాలుగా చుట్టుకొని పయ్యెదలకు మారుగా పారు టాకులు ధరించారు. తిలకంగా చాదుబొట్టు పెట్టుకొని చిగురాకులను కర్ణాభరణాలుగా ధరించారు. కురుల్లో కుసుమ పూవుల ధూళిని ధరించారు. నుదుటి భాగాన గైరికాద్రవ్యాన్ని పూసారు. ఎఱ్ఱని కళ్ళు నల్లని ఒళ్ళు కలిగి ఉన్నారు.గిరిజన స్త్రీలు చందనపు కమ్మలు భుజాలకు తగిలేటట్లు వ్రేలాడదీసారు. కుంకుమ చెట్టు పూల పొడిని పాపట్లో ధరించారు. ఇప్పటి నాగరికులు ఎఱ్ఱని కుంకుమను ధరిస్తారు. భాగ్యవంతులైనా పట్టు చీరల బదులు పారుటాకులను ధరించారు. మాణిక్యాలం కారాలున్నా గురి వింద పూసల దండలనే ధరించారు. గోండుల తలలపై కొమ్ముల నలంకరించుకునే ఆచారం నేటికి ఉంది.

క్షత్ర బంధోపాఖ్యానంలోని చెంచు తలపై కొమ్ము ధరించినట్లు చెప్పబడింది. కుఱుచ చెవులు, హీన జాతి లక్ష్మణ పెద్ద చెవులు మహా పురుష లక్షణం. గిరిజనులు గద్దలు ఈకలతో వస్త్రాలు అల్లుకొని ధరించారు. పికిలి పిట్ట తోక క్రింద ఉండే ఎఱ్ఱని తూళికలతో చుట్టిన సంకుల పేర్లను ధరించారు. కోరెందుతీగతో (దీనిని సంస్కృతంలో ఆధారి అంటారు). చేసిన పూసలను ధరిం చారు. కోరింత దగ్గు తగ్గేందుకు కోరెందు తీగల దండలు పిల్లలకు బుధ ఆదివారాల్లో వేసేవారు.

**లంబాడీ స్త్రీ వర్ణన :**

లంబాడి స్త్రీ పాపిట తీసి తలను రెండు పాయలుగా దువ్వి, రెండువైపుల జడలు అల్లుకొని బట్ట పేళికలతో ముళ్ళు వేసి, చెవులకు టోప్లేలు వ్రేలాడదీసి, గూగ్రీలు, ఆడ్కాటులు జడలకు తొడిగి క్రిందికి గొలుసులు జారు నట్లుగా చెక్కి ఆలంకరించుకొని ముక్కునకు పెద్ద పోగు ధరించి, మెడకు పెద్దదైన లావుపాటి వెండి కంఠికను ధరించింది. సూది కుట్టుతో కుట్టిన అలంకరణగల ముదురు ఎఱుపు రంగుగల చోళి మరియు గగరా ధరించి కాళ్ల కడియాలు మల్లుషుల్లు మనగా ఒక లంబాడీ స్త్రీ వచ్చింది. ఇట లంబాడీ స్త్రీ వర్ణన, వేషభూషలు కళ్ళకు కట్టినట్లు ఉంది.

**గృహనిర్మాణం :**

ప్రాచీన మానవులు చెట్ల తొర్రల్లో కొండ గుహల్లో నివసించారు. చెంచుల, యానాదుల జీవన విధాన పద్ధతులు పరిశీలిస్తే వీరిని పాతరాతియుగ ప్రజల సంతానంగా చెప్పొచ్చు. కావ్య ప్రబంధాల్లో ఆచారాలు వేషభాషలు వర్ణింపబడ్డా వీరు నివసించిన గృహ వర్ణనలు మాత్రం ఎక్కడ వర్ణించలేదు.

**మతము – జాతరలు :**

గిరిజనులకు హిందూ మతంపై విశ్వాసం మెండు భద్రాద్రి రామన్న, శ్రీశైల మల్లన్న, అహోబిల నరసింహ వీరి ఆరాధ్య దైవాలు బోనా లెత్తి తప్పెటలతో దేవత వద్దకు వెళ్ళి నైవేద్యంగా కోళ్లను బలిఇస్తారు. ముత్యా లమ్మ, మైసమ్మ పోశమ్మ ఎల్లమ్మ, తోకయ్య వీరి దేవతలు, వేటాడుటకు ముందు కాటిరేని పూజ జరిపేవారు.

**వివాహము :**

వర్ణ వ్యవస్థ పకడ్బందీగా నడుస్తున్న రోజుల్లో వివాహాలకు సంబంధించి కులాల మధ్య వివాహాలను మనుస్మృతి ఈవిధంగా తెలిపింది. శూద్రునకు శూద్రకన్య, వైశ్యునకు శూద్రకన్య, స్వజాతి కన్య, క్షత్రియునకు శూద్ర వైశ్య స్వజాతి కన్యలు, విప్రునకు శూద్ర, వైశ్య, క్షత్రియ స్వజాతి కన్యలు శ్రేష్ఠులు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు తప్ప లోకంలోని మిగతా వారంతా శూద్రులందు చేర్చ బడ్డారు.

అగ్ర వర్గాల వారు, క్రింది వర్గాల వారిని వివాహ మాడ వచ్చును కాని, క్రింది వర్గాల వారు పై వర్గాల వారిని వివాహ మాడరాదు. క్రింది వర్ణాల వారు అగ్ర వర్గాల వారిని వివాహ మాడితే వారికి స్మృతులు అనేక రకాల శిక్షలు వేసాయి. శ్రీకృష్ణుని జాంబవతితో వివాహం, వేంకటేశ్వరుని బీబీనాంచారీల వివాహం, నృసింహస్వామి

చెంచు లక్ష్మీల వివాహం నాటి అనులోమ వివాహాలకు ఉదాహరణలుగా చెప్పాలి.

**ఆహారము :**

ఎవరి ఏ వృత్తైనా భోజన సంపాదన కొరకే. అడవుల్లో దొరికే పళ్లు, వేటాడి తెచ్చే మాంసం, పండించుకొనిన ఆహార పదార్థాలు గిరిజనుల భోజన పదార్థాలు, వేటలో గిరిజనులు నిర్దయులై మృగాల పట్టి చంపి మాంసాన్ని సేకరించేవారు. జంతువుల తిత్తులొలిచి మెత్తని మోటు కత్తులతో తునియలు చేసి ఆకులలో గుత్తంగా పొత్తరలు కట్టి ఉంచేవారు. క్రొవ్విన పందులను చంపి తెచ్చి మంటల్లో వేసి కమరేలా కాల్చి పెంకులతో ఆ కాలిన తోలును మాత్రం పోయేటట్లు చేసేసి, ఎఱ్ఱ మన్ను దళంగా పూసి మళ్ళీ నిప్పులతలో ద్రవమంతా ఇగిరి పోయేటట్లు కాల్చి ముక్కులుగా కోసేవారు. ఆ ముక్కలను సన్నని సలాకలకు గ్రుచ్చి చమురు కారేటట్లు కాల్చి తినేవారు.

**ఆచారాలు :**

ప్రతి మతంలో కొన్ని విశ్వాసాలు, ఆచారాలు, అనూచానంగా. కొనసాగింపబడుతున్నాయి. ఒక్కొక సారి ఈ ఆచారాల నెందుకు ఆచరిస్తున్నామో, అవిఎలా కొనసాగింపబడుతున్నాయో తెలియదు. మన జీవితాలలో మనం కొనసాగిస్తున్న ఆచారాలు అనాది మానవుడా చరించి మనకు అందించినవే కాకపోతే కాలం గడిచేకొలది మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

రాజులను దర్శించే గిరిజనులు అడవులలో వారికి అందుబాటులో ఉన్న వస్తు సంచయాన్ని కానుకలుగా తెచ్చిచ్చినట్లు అనేక కావ్య ప్రబంధాల్లో వర్ణితాలు. రాజు దైవ స్వరూపుడు, దైవం దగ్గరికి పిల్లలున్న ఇంటికి ఒట్టి చేతులతో పోరాదన్నది ఇప్పటికీ ఆచరింప బడుతున్న ఆచారం ఈ గిరిజనుల కానుకల సాంప్రదాయమే క్రమంగా నాగరికులలో దైవం దగ్గరికి, బంధువుల దగ్గరికి రిక్త హస్తలతో పోరాదనే నియమంగా రూపొందింది.

**ఆటలు :**

నేడు మనం ఆడే ఆటలకు ప్రాచీన కాలంలో వఆడిన ఆటాలకు కొన్ని భేదాలు ఉన్నాయి. మరి కొన్ని ప్రాచీన కాలాన ఆడిన ఆటలే ఆడబడుతున్నాయి. 300 లేక 400 సంవత్సరాలకు పూర్వంఆడిన అట వివరాలు స్వరూప స్వభావలు మనకు తెలియని స్థితికి చేరాయి. వెన్నెలకుప్ప, బిళ్ళగోడు, గుడుగుడుగుంచాలు, గచ్చకాయలు, అప్పళాలు, గీరానగింజలు, చిట్లపొట్ల కాయ, ఉప్పెనబట్టెలు, పిల్లాదీపాలంకి, రాసిన సాహిత్యం లో వర్ణింపబడిన కొన్ని ఆటలు వివరాలు తెలిసినప్పటికీ నిఘంటువులో సైతం క్రీడా విశేషాలు ఉన్నాయి. అందులో కొన్ని ఆటల వివరాలు కూడా ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో క్రీడా వినోదాలు వడ్ల సుబ్రహ్మణ్యం రచయిత వివరించారు.

రాజనీతిలో గిరిజనుల స్థానం: మహాభారతంలో ధర్మరాజు ద్రాక్షుడు రాజనీతిని బోధిస్తూ రాజు ఏ నియమాలను పాటించారో ఎలా జారుకుడై మెలగాలో తెలిపారు. అట్టి సందర్భంలో గిరిజనుల్లోని యోధులకు రేవు వద్ద కొలువు ఇవ్వమని భారత కర్త తిక్కన చెప్పడం వృత్తి నిర్వహణలో గిరిజన యోగ్యతను సూచిస్తుంది.

అముక్తమాల్యదలో యమునాచార్యులు పాండ్య రాజులకు నీతులను బోధిస్తూ రాజనీతిని కూడా చెప్పారు. ఎంతటి శత్రువు వచ్చినా వెనుతిరగారదని వారిని ఎదిరించి, అవసరమైన బల స్తోమతలను సమకూర్చు కోవాలని గిరిజనుల గురించి తెలిపారు.

**వైద్యం :**

అడవుల్లో తిరిగే గిరిజనులకు అనేక జంతువులతో చెట్లు చేమలతో పరిచయం ఉంది. మూలికా వైద్యంలో నైపుణ్యం సంపాదించారు. జంతువుల వైద్యం నుండి తీసే పసుపు పచ్చని పదార్థాన్ని చేదుకట్టు అంటారు. ఈ రసాన్ని మందుల్లో ఉపయోగిస్తారు. ఎఱుకు రేడగు 'స్వరోచికి' చెంచులు నక్కకొమ్ము, గోరోజనం, తేనె పెఱజున్నులను కానుకలుగా ఇచ్చారు. తేనెపెర వాతహారమగు పదార్థం సామాన్యంగా లభించని వస్తువిది.మొసలిలో ఉండే గోరోజనాన్ని క్రొవ్వును పక్షవాతం రాకుండా మందుగా ఉపయోగించేవారు ఆహారం సులభంగా జీర్ణం కావడానికి రాతిబదనికల చూర్ణాన్ని భోజ్య పదార్థాలపై చల్లేవారు. పులిజున్నును ఔషధంగా వాడారు.

శిశువులకు దగ్గు దమ్ములు రాకుండా 'ఏదుపొట్ట' ను ఉపయోగించేవారు. దుప్పి కొమ్ముని నూరి శివువులకు త్రాగిస్తే గొంతు వాపులు తగ్గేవి. కుందేలు పాలపొట్ట (ఇది చిన్న కుందేళ్ళ కుంటుంది) వలన శిశువుల సమస్త జీర్ణ కోశ సంబంధ రోగాలు తగ్గుతాయి. ప్రసవించిన స్త్రీలు కాయం అనే వేడిని కలిగించు పదార్థాన్ని తినేవారు. వేప చిగుళ్ళు, యాకెళ్ళి పాయలు, కుంకుమ పూవు కలిపి ముద్దగా నూరి శనగగింజంత పరిమాణంలో మాత్రలు చేస్తారు. దీనినే కాయం అంటారు. ప్రసవించిన స్త్రీలు రోజు కొకటి చొప్పున మూడు దినాలు నేటికీ వాడు తున్నారు. వాత హరణార్ధం వసకొమ్ముల పూసలను ధరించే వారు. సులభ మలవిసర్జనానికై పుట్టిన శిశువులకు ఆముదాన్ని త్రాగించేవారు. ఆరోగ్యంగా ఉండేందుకు మందుల తాయితలను కట్టుకునేవారు. శివుని కంటి నుండి రక్తం స్రవించగా తిన్నాడు చేసిన వైద్యం నాటి గిరిజన వైద్యంగా భావించాలి మీది వస్త్రాన్ని పొట్లం చూసి ఆవిరి వచ్చేటట్లు నోటితో గాలిని ఉది కోకతో ఒత్తేవారు. చేతుల రాపిడి వల్ల కలిగే వేడుకలపై ఉంచేవారు. ప్రాచీన సాహిత్యం లో గిరిజనులు రాజులకి ఇచ్చిన కానుకలు వైద్యానికి పనికి వచ్చేవిగా ఎక్కువగా కనిపిస్తాయి.

**భాష యాస :**

జానపద దశ నుండి నాగరికత పురోగమించిన మానవుల భాష యందు మార్పులు జరుగుతూ భాష కలగలుపు ఎక్కువ ఉంటది అగ్ర జాతులలో వైష్ణవు లందరూ తమిళ పదాలు, శైవుల యందు కన్నడ పదాలు, కురువలలో కన్నడ పదాలు, లంబాడిలో మరాఠీపదాలు ఎక్కువగా కనిపిస్తాయి. ప్రాచీన సాహిత్యంలో అగ్రజాతుల వారి భాషకు నిమ్న జాతుల వారి భాషకు ఎంతో స్పష్టమైన భేదం ఉంది.

అగ్ర జాతుల వారి భాషల పదాలు సంపూర్ణలై ఉచ్చరణ స్పష్టంగా, ఉండగా నిమ్న జాతుల వారి భాషలో వ్యంగ్య వ్యవహారాలు ఉన్నాయి. తదుపరి కాలం తరువాత అగ్ర జాతుల భాషలో ఎటువంటి పలుకు బడులు, ఊతపదాలు సమకూర్చుకున్నాయో, గిరిజన భాషలో కూడా అట్టి పలుకుబడులు, ఊతపదాలు కుదురుకున్నాయి.

ప్రాచీన కావ్యాలో గిరిజన భాష: ప్రాచీన కావ్య ప్రపంచమంతా రాజు నాయకమే కానీ సామాన్యులకు, అందులో గిరిజనులకు స్థానం లభించలేదు. రాజు ఆస్థాన కూలీలుగా, వినోదాలలో, వేట సందర్భంలలో మాత్రం కొందరు సామాన్యులకు, గిరిజనులకు స్థానం లభిం చింది. నన్నయ్య గారి మార్గకవిత పుంజుకొని దేశికవిత వెనుకబట్టక నన్నెచోడుడు దానిని రంగానికి కొని వచ్చాడు. అట్లాగే పాల్కూరికి సోమన సంస్కృత రచనలనకు ఎదురు తిరిగి దేశ రచనలపై ఎక్కువ మక్కువ కనబరిచాడు.

దేశీయ పదాలతో పాటు ఆటవికులు పెట్టుకున్న పేర్లు కూడా శుద్ధ దేశ్యాలుగానే, అవి ఏ జంతువాచకాలు గాను, వృక్ష వాచకాలుగా కనిపిస్తుంటాయి. కాటిరేడు, కంభమయ్యా, పోతురాజు, గంగమ్మ, మలమమ్మ, అక్కలమ్మ, ఈ పేర్లు గిరిజన తెగలలో ఈనాటికీ వ్యవహారంలో ఉన్నాయి.

**ముగింపు :**

ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన చాలా తక్కువ అప్పటి గిరిజనులు సంచార జీవులుగా జీవిస్తూ ఎక్కువగా అరణ్య ప్రాంతాల పాత్రలో నిషేధం అవు తున్నాయి కానీ స్థిర నివాసం ఎక్కడా కనబడలేదు దీనికి మూలం సంచార జీవనంతో పాటు ఆటవిక జీవితానికి అలవాటు పడి అరణ్యంలో నివసించడం. ప్రస్తుతం నేటికీ కూడా కొన్ని గిరిజన తెగలు ఆధునిక కాలానికి దూరంగా అరణ్యాలలో జీవిస్తూ ఉన్నాయి దానికి ప్రధాన కారణం విద్యా సామాజిక అవగాహన సాంకేతిక పరిజ్ఞానం లోపం నూతన చైతన్య స్రవంతి లేకపోవడం.

ప్రాచీన సాహిత్యంలో ఎక్కడ చూసినా గిరిజన పాత్ర లను అసంపూర్ణంగానే వివరించారు. ఆనాటి చాతుర్వర్ణ వ్యవస్థలో గిరిజనులు కూడా జీవించినప్పటికీ వారికి సముచితమైన స్థానం ఇవ్వకపోగా, గిరిజన సాహిత్యం పై సమగ్రమైన రచన చేయలేదు. దానికి ప్రధాన సమస్య నిమ్న జాతులుగా సంచరించడం అప్పటి సంస్కృత విద్యను అందిపుచ్చుకోకపోవడం. ఆధునిక తెలుగు సాహిత్య ప్రపంచంలో నేటికీ కూడా గిరిజన సాహిత్యానికి సముచితమైన స్థానం ఇవ్వకపోగ సాహిత్య సృష్టి జరగలేదు. 18వ శతాబ్దం తర్వాత కథకు, నవలకు

తదుపరి కాలంలో వచ్చిన కవిత ప్రక్రియకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తు రచనలు కొనసాగాయి. ప్రపంచీకరణ, ప్రభావం తర్వాత 19, 20 శతాబ్దాలలో స్త్రీల, దళిత, బీసీవాద, మైనారిటీవాదాల సాహిత్యాలు తమ అస్తిత్వాన్ని రాసు కున్నాయి, కానీ గిరిజన సాహిత్యం ఆశించిన మేర సాహిత్య రచన జరగలేదు, దానికి ప్రధాన కారణం అక్షరాస్యత వైఖరి, ఆటవిక జీవనానికి అలవాటు పడిన గిరిజన తెగ సామాజిక చైతన్యం లేకపోవడంతో పాటు, ప్రాచీనసాహిత్యంలో ఆధార గ్రంధాలు ఎక్కువగా లేకపోవడం. కాబట్టి ప్రస్తుతం పరిశోధన రంగంలో గిరిజన సాహిత్యంపై చాలా లోతైన సమగ్ర విశ్లేషణ జరగాలని కాంక్ష.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. ఎన్. అర్ వెంకటేశంబుడగజంగాలుభాషసాహిత్య,సాంస్కృతికపరిశీలన,1995.
2. గోనా నాయక్, భారతదేశంలోబంజారాలు,కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2005.
3. గోనా నాయక్,సుగాలి సంస్కృతి భాషాసాహిత్యం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2005.
4. చీనియ నాయక్, బంజారా చరిత్ర సంస్కృతి- ప్రగతి, అనంతపురం, ఆంధ్ర ప్రదేశ్ 1998.
5. చెన్నయ్య, జే తెలంగాణ గిరిజన భాషా సాహిత్యలు,ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్, 2017.
6. జగన్నాథం, పెర్వరంఅధునిక సమాజంలో గిరిజన భాషా సంస్కృతి,ద్రవిడ విశ్వవిద్యాలయం కుప్పం, 2012.
7. ముత్యం, తెలంగాణ భాష, తెలుగు భాష, గిరిజన భాషలు,శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్, 2016
8. రామాచార్యులుబి, తెలుగు కావ్యాల్లో గిరిజనుల సంస్కృతి,2001
9. వేణుగోపాల్, విట్ట, ప్రాచీనాంధ్ర సాహిత్యంలోగిరిజన జీవన చిత్రణ,ఉస్మానియా విశ్వవిద్యాలయం, 2008.

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 10, October 2024
భావవీణ
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# జానపద కళారూపాలు – పరిచయం, ప్రత్యేకత

– **మేకల శిరీష**, తెలుగు అధ్యాపకురాలు, తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల,
షిర్డి సాయి నగర్, కోదాడ, సూర్యాపేట జిల్లా.

పూర్వ కాలంలో గ్రామీణ ప్రజలు నివసించే ప్రాంతాన్ని జనపదం అని పిలిచేవారు. ఈ జనపదాలల్లో నివసించే వారిని జానపదులు అంటారు. జానపదులకు తెలిసినటు వంటి ఆచార సాంప్రదాయాలను, ఆహారపు అలవాట్లు, వైద్యపరమైన అంశాల సమాహారాన్ని వారి యొక్క జీవన విధానాన్ని జానపద విజ్ఞానం (Folk Lore) అని వ్యవహ రించడం జరిగింది. ఈ Folk Lore అనే పదం Folk Lehre అనే జర్మన్ భాషా పదం నుండి వచ్చింది. Folk Lore అన్న పదానికి "నిరక్షరాస్యులైన కర్షకులు" అని జానపద పండితుల అభిప్రాయం.

Folk అనే పదానికి సమూహం, గ్రామవాసులు, సామాన్యులు, అనాగరికులు, నిరక్షరాస్యులు, వ్యవసాయ దారులు, వెనకబడిన వర్గం వారు అని చెప్పవచ్చు. జానపదం అనే పదాన్ని అమరసింహుడు తన అమర కోశంలో, వ్యాసుడు తన భారతంలో ఉపయోగించారు. ఎర్రన తన భారతారణ్య పర్యశేషంలో "జానపదుల్ పురీజనుల్" అని ప్రయోగించారు. ఫోక్ అన్న పదానికి అర్థం కుటుంబం, సమావేశం కావచ్చు అని ఆర్.వి.యస్. సుందరం పేర్కొన్నారు.

మానవుని యొక్క సంఘ సంస్కృతిని, జీవన విధానాన్ని ప్రాచీన సంస్కృతిని, ప్రతిబింబించే దర్పణం వలే ఈ జానపద విజ్ఞానం నిలుస్తుంది. పూర్వకాలంలో జన పదాలల్లో నివసించేటటువంటి జానపదులంతా పగటి సమయంలో తమ తమ వృత్తులకు తగినట్లుగా కష్టపడి పనిచేసేవారు. తాము పడిన కష్టమును మరచిపోయే ఉద్ధేశ్యంలో భాగంగానే వివిధ రకాల సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహించి ఆనందించేవారు.

సామెతలు, పొడుపుకథలు, ఇతిహాసాలు, జానపద కథలు మొదలైన జానపద సాహిత్యంలోని అంశాలను ఎలాంటి అక్షరజ్ఞానం లేని నిరక్షరాస్యులైన జానపదులు ఒకరితో ఒకరు చెప్పుకుంటూ, తమ కష్టాన్ని మరచి పోయేంతగా సంతోషంగా జీవించేవారు. జానపదుల యొక్క ఆచార వ్యవహారాలు, సంస్కృతిని సాంప్ర దాయాలు, సామాజిక, నైతికపరమైన అంశాల గురించి వివరించే సాహిత్యాన్ని జానపద సాహిత్యం అని వివరించ వచ్చు. ప్రధానంగా జానపద సాహిత్యం వస్తు రూపంలో గానీ, ప్రదర్శన రూపంలో గానీ కనిపిస్తుంది. ఈ జానపద సాహిత్యం దేశీ కవితా శాఖకు చెందినది. ఈ జానపద సాహిత్యాన్ని చర్చించటంలో భాగంగా జానపద సాహిత్యాన్ని మౌఖిక సాహిత్యం, వస్తు సంస్కృతి, జానపద, సాంఘిక ఆచారాలు, పండుగలు, నోములు, వ్రతాలు, ఆటలు, జానపద ప్రదర్శన కళలు మొదలైనవిగా వర్గీకరించడం జరిగింది. ఈ జానపద సాహిత్యంలో జానపద కళా రూపాలైన బయలాట, పగటి వేషాలు, బొమ్మలాటలు, వీధి భాగవతం లేదా చిందు భాగవతం, కూచిపూడి భాగవతం, యక్షగానం మొదలైనవి ప్రముఖ పాత్రను సంతరించుకున్నాయి.

**ఉద్ధేశ్యం :**

జానపద సాహిత్యంలోని అన్ని విభాగాలతో పాటు జానపద కళారూపాలు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి. ప్రపంచీకరణ ప్రభావం వల్ల అంతరించిపోతున్న పల్లెల్లో కనుమరుగైపోతున్న జానపద కళారూపాలను పరిచయం చేస్తూ వాటి యొక్క ప్రత్యేకతను వెలికితీసి వివరించడమే ఈ పత్రం యొక్క ప్రధాన ఉద్ధేశ్యం.

**జానపద కళారూపకాలు :**

జానపద సాహిత్యంలో మమేకమై ఉన్నటువంటి జానపద కళారూపాలయిన బయలాట, పగటి వేషాలు, వీధి భాగవతం, చిందు భాగవతం, కూచిపూడి భాగవతం, యక్షగానం లాంటి ఎన్నో కళారూపాలు మనకు కని పిస్తాయి.

**బయలాట :**

బయలల్లో ఆడే ఆటను బయలాట అంటారు. దీనిలో

పౌరాణిక గాథలు ఎక్కువ ఉంటాయి. ఇవి వీర, రౌద్ర, భయానక రసాలతో ప్రదర్శించబడతాయి. బయలాట అనేది కర్ణాటకలోని దక్షిణ భారత ప్రాంతంలో కనిపించే యక్షగాన రూపంతో సహా అన్ని బహిరంగ థియేటర్ రూపాలకు సాధారణ రూపం. ఈ బయలాట భారతీయ ఇతిహాస కవిత్వం, నృత్యం మరియు నాటకంగా అందించ బడిన పురాణాల నుండి కథలను కలిగి ఉంది. బయలాట అంటే ఓపెన్ థియేటర్ డ్రామా మరియు పంటకాలం ముగింపును సూచిస్తుంది. బయలాటకు అత్యంత ప్రజాదరణ పొందిన ఇతివృత్తం కోటి మరియు సెన్నయ్య కథ. సాధారణంగా ఐదు రకాల బయలాటలు ఉన్నాయి. దశరథ్, సన్నత, దొడ్డట, పరికథ మరియు యక్షగాన పారిజాతం మరియు యక్షగానాలు ఒకే సూత్రధారిచే వివరించబడ్డాయి. బయలాటలో రాజుల పాత్రలు, దేవతల పాత్రలు, రాక్షసుల పాత్రలు, హాస్యపాత్రలు ప్రధాన ఆకర్షణగా కనిపిస్తాయి. సంగీత సాహిత్య సంభాషణ, నృత్యకళా సమ్మిళితమైన బయలాటే వీధినాటకం. ఇదే కాలక్రమంలో బయలాట, యక్షగాన ప్రక్రియగా రూపుదిద్దుకుందని జి.యస్. మోహన్ పేర్కొన్నారు. బయలాట ప్రదర్శనలో భాగంగా మొదట విఘ్నేశ్వర స్తోత్రం, ఆపై గురుస్తోత్రం, ఆ తర్వాత శారద స్తోత్రము, చివరిలో మంగళం పాడుతారు. అనంతపురం జిల్లాలో నిర్వహించే బయలాట లోని సూత్రదారుడును అయ్యవారు అంటారు.

ఏ బయలాటలోనైనా గోపాలకృష్ణుని పాత్ర తప్పని సరిగా ఉంటుంది. సారథి అనే పాత్ర హాస్య ప్రధానంగా ఉంటుంది. పద్య గద్యమయమై నాటకీయతతో ఉం డడం వల్ల జానపద నాటకం అని, గీత రూపకమనీ జి.యస్. మోహన్ అన్నారు. బయలాటలో వార నిషేదం ఉంది. ఆది, మంగళ వారాల్లో తూర్పుముఖంగా ప్రదర్శిం చరు. బుధ, గురు వారాల్లో దక్షిణ ముఖంగా, శుక్ర, శని వారాల్లో పశ్చిమ ముఖంగా ప్రదర్శిస్తారు. రాయలసీమ ప్రాంతంలో బయలాట ప్రదర్శనలు అధికంగా కని పిస్తాయి. కనకతార, లవకుశ, వాలి, సుగ్రీవుల కథ, వీరాభి మన్యు, ద్రౌవదీ వస్త్రాపహరణం మొదలైనవి బయలాటలో ప్రదర్శిస్తారు.

**పగటి వేషాలు :**

పగటి పూట వేషాలు వేసి ప్రదర్శించడం వలన పగటి వేషాలు అనే పేరు వచ్చింది. దీన్ని పైటేషాలు, పగిడేషాలు అని, కన్నడంలో హగలు వేష అని అంటారు. వీరినే బహు రూపులు వారు అని కూడా అంటారు. పగటి వేషాలు ప్రజా వినోదం ప్రధాన ఆశయంగా, ప్రజల ఆశలకూ, ఆశయాలకూ దర్పణంగా మన దేశంలో బహుళ ప్రచారం పొందాయి. ప్రత్యేకంగా పగటి పూట ప్రదర్శించే వేషాలు కావడం వల్ల వీటికి 'పగటి వేషాలు' అని నామకరణం వచ్చింది. పగటి వేషాలలో ఉండే గొప్పతనం ఇతరుల్ని నమ్మించడం, ఒకనాటి పరిపాలకుల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకు రావటం చాలా జానపద కళా రూపాలు మత పరంగానో, కుల పరంగానో, వాయిద్యాల పేరుతోనో పిలువబడితే కేవలం ప్రదర్శనా సమయాన్ని బట్టి పిలువబడేది పగటి వేషాలు. పగటి వేషాలు జానపద కళారూపాల్లో ప్రముఖమైనవి. యక్షగానం, వీధి నాటకాల నుండి "బ్రోకెన్ డౌన్ మిత్" అన్న వాదం ప్రకారం వీధి నాటకాలే పగటి వేషాలుగా మారాయని పరిశోధకుల అభిప్రాయం.

జన వ్యవహారంలో ఉన్న కథలను బట్టి పగటి వేషాలు రాజు కళింగ గంగు కథ, సంబెట గురవరాజు కథ, విజయ నగర రాజుల కథలు ప్రస్తావనలోకి వస్తాయి. పగటి వేషాలకు చారిత్రకాధారాలున్నాయి. భిక్షుక వృత్తిగా ప్రారంభమైన ఈ కాలక్రమంలో ఒక సంక్లిష్ట రూపంగా మారింది. శాతవాహనుల పరిపాలనా కాలయు నుండే ఈ కళారూపం ఉందని, హాలుని గాథా సప్తశతిలో దీని ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తుంది. మార్గ, దేశి, శిష్ట సాహిత్య లక్షణాలన్ని మూర్తీభవించిన కళ పగటి వేషాలు భారతదేశం సర్వేశ్వర శతకం, పండితారాధ్య చరిత్రలలో పగటి వేషాల వివరణ కనిపిస్తుంది. భారతదేశంలో స్వతంత్ర, సామంత రాజుల పాలనలో ఈ పగటి వేషాలు చాలా ప్రచారంలోకి వచ్చాయని అంటారు. రకరకాల మారువేషాలు ధరించి గూఢచారులుగా వీరు సమా చారాన్ని అందించేవారని చరిత్ర చెబుతుంది.

**పగటి వేషాలు – వర్గీకరణ :**

పగటి వేషాలు ఒకప్పుడు దాదాపుగా 64 ఉండేవని కాని ఇప్పుడు 32 వేషాలుగా ఉన్నట్లు జానపద చరిత్ర కారులు నిర్ణయించారు. ఇతివృత్తం ఆధారంగా పగటి వేషాలను ఐదు విధాలుగా విభజించారు.

**1. మతపరమైనవి :** ఆది బైరాగి వేషం, చాతాది వైష్ణవ వేషం, కొమ్ము దాసరి వేషం, హరిదాసు వేషం, ఫకీరు వేషం, సహెబుల వేషం.

**2. కుల పరమైనవి :** బుడబుక్కల వేషం, సోమ యాజులు - సోమిదేవమ్మ వేషం, బోడి బ్రాహ్మణ స్త్రీ వేషం, వీరబాహు వేషం, గొల్లబోయిడు వేషం, కోయవాళ్ళ వేషం, దేవరశెట్టి వేషం, దేవాంగుల వేషం, ఎరుకల సోది వేషం వంటివి.

**3. పురాణ పరమైనవి :** జంగం దేవర వేషం, శక్తి లేదా శూర్పణఖ వేషం, అర్ధనారీశ్వర వేషం వంటివి.

**4. జంతు ప్రదర్శన పరమైనవి :** గంగిరెద్దుల వేషం, పాములోల్ల వేషం.

**5. ఇతరములు :** పిట్టల దొర వేషం, చిట్టి పంతులు వేషం, కాకికావిళ్ళ వేషం వంటివి.

**పగటి వేషాలు – ప్రదర్శన రీతులు :**

పగటి వేషాల్లో కొన్నింటిలో సంభాషణలకు ప్రాధాన్యత ఉంటే మరి కొన్నింటిలో పద్యాలకు, అడుగులకు, వాయిద్యాలకు ప్రాధాన్యత ఉంటుంది. బుడబుడకల వేషం, ఎరుకలసాని వేషం, బోడి బ్రాహ్మణ స్త్రీ వేషం వంటి వాటిలో సంభాషణలకు ప్రాముఖ్యత ఉంటుంది. పురాణ వేషాల్లో హార్మోనియం, తబలా వంటి వాయిద్యాలతో పాటు యక్షగాన శైలిలో ప్రదర్శన ఉంటుంది. కుల సంబంధమైన పగటి వేషాలు సంఘంలోని అనేక కులాల వారి జీవన విధానాన్ని వ్యంగ్యంగా ప్రదర్శిస్తాయి. ప్రతి కులాన్ని గుర్తిస్తూ ఆ కులాలపై సమాజం యొక్క అభిప్రాయాలను విమర్శిస్తాయి.

పగటి వేషాలు లక్ష్యమే వ్యంగ్యం. వీరికి రంగస్థలం ఉండదు. ఇంటి గడప, వీధులు, సందులు, గొందులు అన్నీ వీరి రంగస్థలాలుగా చెప్పవచ్చు. ప్రదర్శన సమయాల్లో ప్రేక్షకులు, ప్రదర్శకుల మధ్య వ్యత్యాసం ఉండదు.

పగటి వేషాలల్లోనే ప్రత్యేకత, ప్రావీణ్యత కలిగిన వేషం అర్ధనారీశ్వర వేషం. ఒక వ్యక్తి మధ్యలో తెర కట్టుకొని ఒక వైపు నుండి పార్వతి, మరో వైపు నుండి శివుడుగా అలంకరణ చేసుకొని ప్రదర్శినలిస్తాడు. తెర మార్చు కుంటున్నపుడు ఒక వైపు నుండి చూస్తే శివుడు మరో వైపు నుండి చూస్తే పార్వతిని చూసిన అనుభూతి కలుగుతుంది. తెర మార్చుకోవడంలోనే వీరి నైపుణ్యమంతా దాగి ఉంటుంది.

రాయలసీమ ప్రాంతంలో పగటి వేషగాళ్ళను పగలేసి గాళ్ళని పిలుస్తారని తన "జానపద కళా సంపద"లో తూమాటి దోణప్ప గారు ఉదహరించారు. వీరు కూడా విప్ర వినోదులు లాంటివారు. దొర వేషం, దొరసాని వేషం, వడ్డెరవాడు, బ్రాహ్మణ వితంతువు మొదలైన వేషాలను ధరించి చమత్కారమైన మాటల తీరుతో ప్రజలను ఆనందింప చేస్తారు. వీరికి ఒక ఊరు వాడా అని ఉండదు. దేశ సంచారం చేస్తూ సంవత్సరానికి ఒకసారి వార్షికంగా వచ్చి ప్రదర్శనలిచ్చి పారితోషకాలు పొంది వెళతారు.

**3. బొమ్మలాటలు :** బొమ్మలాట అతి ప్రాచీన కాలం నుండి ప్రదర్శిస్తున్న కళ. క్రీ.పూ. 3వ శతాబ్ధంలో శాతవాహనుల కాలం నాటికే ఆంధ్ర దేశంలో బొమ్మలాట ప్రదర్శన ఉన్నది.

**పండితారాధ్య చరిత్ర :**

భారతాది కథల జీర మురుగుల ఆరంగ బొమ్మలు ఆడించువారు కడు అద్భుతంగా... అని తోలు, కొయ్య బొమ్మలాటని ప్రస్తావన ఉన్నది.

**పల్నాటి వీరచరిత్ర :**

ప్రతిమలాడగ బట్టినయట్లు అని ఉంది.

**ఉత్తర హరవంశం :**

యంత్రకు దాడించు అవని ద్రోచిన వాలు బొమ్మల గతి రథ పూగములను... అని ప్రస్తావన ఉన్నది.

**1. కొయ్య బొమ్మలాట** : ఉత్తర భారతదేశంలో ప్రాచుర్యంలో ఉన్న క్రీడ కొయ్య బొమ్మలాట. దీనిని అక్కడ దీనిని కట్ పుత్లీ అని సూత్ర క్రీడ అని కూడా అంటారు. హిందూపురం సమీపంలో కొయ్య బొమ్మల తయారీ కేంద్రం కలదు. చిత్తూరు జిల్లాలోని సంత వేలూరు ఈ ఆటకు చాలా ప్రాచుర్యం పొందినది. వీరు రామనాటకం లేదా సంత వేలూరు కుశలవ నాటకం ప్రదర్శిస్తారు. అలాగే వరంగల్‌లో కూడా ప్రదర్శకులు ఉన్నారు.

**2. తోలు బొమ్మలాట** : మానవుడు తయారు చేసుకున్న తొలి జానపద కళారూపం తోలు బొమ్మలాట. తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు వ్యాపింప చేసినది. సమాహార కళ అయిన తోలు బొమ్మలాట సినిమాకి మొదటి రూపం. ఇది ఆంధ్రదేశంలో పుట్టిందని కొందరు, మహారాష్ట్రలో పుట్టిందని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడినారు. మట్టి వెంకటరమణ దీనిపై పరిశోధన చేసి తోలు బొమ్మలాట ఆంధ్రదేశంలోని పుట్టిందని నిర్ణయించారు. తూర్పు గోదావరి జిల్లాలో తోలు బొమ్మలాట బృందాలు కలవు. ప్రధాన పాత్రకు జింక చర్మాన్ని, మిగిలిన పాత్రలకు మేక, గొర్రె, గాడిద చర్మాల్ని వాడుతారు. తోలు బొమ్మలాట ప్రదర్శన కారుల ఇంటి పేరు ఎక్కువగా ''తోట'' అని కలదు. ఆధునిక కాలంలో యమ్.వి. రమణ తోలు బొమ్మలాటను ప్రదర్శించి అభివృద్ధి చేశారు. తోలు బొమ్మలాట విఘ్నేశ్వర ప్రార్థనతో ప్రారంభమవుతుంది. తోలు బొమ్మలాట కళారూపంలో బంగారక్క, కేతిగాడు, జట్టు పోలిగాడు, అల్లాటప్ప గాడు, కొంటె కోణంగి పాత్రలు కల్పిస్తాయి. ఈ ఆట ప్రదర్శించే మరాఠి వారిని తెలుగు రాష్ట్రాలల్లో చర్మ నాటకులని, బొమ్మలాట వారని అంటారు. ఈ బొమ్మలాటలు ఆడించడం వల్ల గ్రామాల్లో వానలు కురుస్తాయని నమ్మకం. దీని కోసం ఉత్తర గోగ్రహణాన్ని ప్రదర్శిస్తారు. వీరు తోలు బొమ్మలాటలో భాగంగా రామాయణ, భారత, భాగవత కథలను ప్రదర్శిస్తారు.

**4. వీధి భాగవతాలు లేదా వీధి నాటకాలు** : ఈ కళా రూపాన్ని వీధి భాగోతమని, వీర భాగోతమని, బయలాట అని అంటారు. వీధి భాగవతమే కొన్ని ప్రాదేశికమైన మార్పులతో యక్షగానమని, చెంచునాటకమని, బయలాట అని పిలువబడుతుంది. వీధి భాగవతాన్ని కర్ణాటక కోలార్‌లో ''కేళిక'' అంటారు. పాల్కురికి సోమనాధుడు ఉపయోగించిన కేళిక పదం బహుశ ఈ వీధి భాగోతమే కావచ్చు అని జానపద పరిశోధకులు అభిప్రాయ పడ్డారు. వీధి భాగవతం ప్రార్థనతో ప్రారంభమై, గొబ్బి నృత్యంతో ముగుస్తుంది. యక్షగానానికి, చిరతల భజనకు, చిందు భాగోతమునకు వీధి భాగోతమనే మాట స్థిరంగా నిలిచిందని డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి నిర్ణయించారు. వీధి భాగవతం అనే కళా రూపకంలో చెంచిత, ఎరుకత, పిట్టలోడు, ఫకీరు, రామరోగి, జంగందేవర, కాటిపాపడు, భట్రాజు, గంగిరెద్దులవాడు మొదలైన పాత్రలన్నీ కథా సందర్భాన్ని బట్టి ప్రవేశిస్తారు. దీనిలో మాధవి, చోపుదారు అనే హాస్య పాత్రలు కనిపిస్తాయి.

వీధి భాగవతంలో 12 నుండి 15 పాత్రలు కలిగి ఉండి గేయం, సంగీతం, నృత్యం, అభినయం సమ్మిళితమై కనిపిస్తాయి. దీనిలో గేయ, వచన, పద్య అని మూడు భాగాలు వుంటాయి. ఈ వీధి భాగవతం అనే కళారూపంలో హరిశ్చంద్ర, గయోపాఖ్యాన్యం, సారంగధర, ఉషా పరిణయం, విరాటపర్వం, రామనాటకం, చంద్రహాస మొదలైన కథలు ప్రతిబింబిస్తాయి.

**5. చిందు భాగవతం** : భారతదేశంలోని తెలంగాణలో విస్తృతంగా ప్రదర్శించబడే నాటక కళ చిందు భాగవతం. ఈ కళా రూపం దక్షిణ భారతదేశంలోని ఇతర ప్రాంతాలలోని కట్టైక్కుట్టు, తెరుక్కుట్టు, యక్షగానం రకానికి చెందిన జానపద థియేటర్ కళారూపకాలకు చాలా దూరంగా ఉన్నది, చిందు భాగవతం మాదిగల్లో ఒక తెగవారు ఆడే నాటకం. వీరు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో నివసిస్తున్నారు. వీరు పగటి పూట ప్రదర్శించడం వల్ల దీనిని పగటి భాగోతం అంటారు. చిందు అనగా అడుగు. వీరు ప్రదర్శన ఇచ్చే ముందు గోసంగి వేషం, ప్రదర్శన తర్వాత ఎల్లమ్మ వేషాల్ని వేస్తారు. చిందు భాగవతం ప్రదర్శనలో భాగంగా పగటి పూట చెంచులక్ష్మి, వీరాభి

మన్యు, సతీ సావిత్రి, జాంభవ పురాణం మొదలైన అంశాలను ప్రదర్శిస్తారు. ప్రదర్శన తర్వాత చిందు తెగ వారు మాదిగ కులం వారి నుండి పుచ్చుకునే డబ్బును "త్యాగం" అని అంటారు. చిందు, డెక్కలి వారిని మాదిగ కుల ప్రజలకు ఆశ్రిత కులాలుగా చెప్పవచ్చు. చిందు భాగవతాలను సమాజంలోని అట్టడుగు వర్గం వారు ప్రదర్శించే కళారూపంగా చూసినప్పటికి, వారు తమ మూలాన్ని జాంబ మహాముని ద్వారా గుర్తించారని మరియు వారి వంశం అత్యంత పురాతనమైన శాఖ అని నమ్ముతారు.

"అందుకే మా చాలా నాటకాలు ఎక్కువని మరి పలుకబోకుమురా, ఎక్కువ తెలిసి పలుకుమురా" (ఎక్కువగా మాట్లాడకండి, ఎవరు ఉన్నతమైనవో తెలుసుకుని మాట్లాడండి) అనే ప్రారంభ పల్లవితో జాంబ పురాణంతో తెరుచుకుంటారు.

**6. కూచిపూడి భాగవతం :** ఆంధ్రదేశంలో ప్రఖ్యాతి వహించిన వీధి భాగవతాలలో కూచిపూడి వీధి భాగవతం గొప్ప పేరు ప్రఖ్యాతి సంపాదించుకున్నది. గొల్ల భాగవతులు, యానాది భాగవతులు, మాల భాగవతులు మొదలైన వారు కూడా భాగవతాలను ప్రదర్శించారు. భాగవతమంటే కృష్ణ సంబంధమైన కథలను కేళిక చేయడమే. ఇందులో కృష్ణా సత్యభామల ప్రణయ కళహం ముఖ్యమైనది. దీనినే కృష్ణ పారిజాతమనీ, భామా కలాపమనీ వ్యవహరిస్తారు. ప్రారంభంలో సిద్ధేంద్ర యోగి భాగవత సంబంధమైన ఈ భామాకలాప రచన చేసి ప్రచారం చేశాడు. భామా కలాపం, సిద్ధేంద్ర యోగి రచనను కూచిపూడి వీధి భాగవతులు అధిక ప్రచారంలోకి తీసుకు వచ్చిన విషయం అందరికీ తెలిసిందే. అయితే సిద్ధేంద్రుల వారి పారిజాతాపహరణానికి తూర్పు వారు ప్రదర్శించే భాగవతానికి వ్యత్యాసం ఉంటుంది. కూచిపూడి భామా కలాపంలో కనిపించే దరువులు మొదలైనవి. వీరి భాగవతాలలో తక్కువగా కనిపిస్తాయి.

తూర్పు వీధి భాగవత కలాపంలో కథా వస్తువు ఒక ముచ్చటైన సంఘటన మాత్రమే. తన మందిరం నుండి అలిగి వెళ్ళిపోయిన శ్రీ కృష్ణుని, సత్యభామ రాయభారం పంపించి, మళ్ళీ తన ఇంటికి రప్పించుకున్న సంఘటనే ఈ కథా వృత్తాంతం. కథ చిన్నదే అయినా ఇందులో అష్ట విధ నాయకుల వర్ణనలూ, అవస్థలూ, విప్రలంబ శృంగారంతో నిండి ఇది ఒక పెద్ద ప్రబంధమై పోయి, వరుసగా ఈ భాగవతాన్ని ప్రారంభంలో తొమ్మిది రోజులు ప్రదర్శించేవారట. అటువంటిది కాలానుగుణంగా మూడు రాత్రులకు కుదించినారు. అయితే ఈనాడు ఈ కథను ఒక్కరాత్రే పూర్తి చేస్తున్నారు. శాస్త్రయుక్తంగా ప్రదర్శించే భామాకలాపం తరువాత, గొల్ల కలాప ప్రదర్శనాన్ని కూడా జనరంజకంగా ప్రదర్శించేవారు. అయితే గొల్ల కలాపం, దేశీ సాంప్రదాయానికి సంబంధించిన కళారూపంగా ప్రదర్శించేవారు. బ్రాహ్మణులు, విశ్వ బ్రాహ్మణులు, కొప్పు వెలమలు, దాసర్లు, పంచములలో కూడా ఈ కళాకారులు ఉన్నారు. ఈ భాగవతాలలో పాత్రలు ధరించే వారందరూ పురుషులే. అయినా యాభై సంవత్సరాల క్రితం, ఒకే ఒక స్త్రీ, భామ వేషం ధరించి ఆనాటి ప్రజానీకాన్ని ఆశ్చర్య పరిచిందట. ఆమె తెర్లాం గ్రామానికి చెందిన కాలిగుంటి వెంకటస్వామి కుమార్తె. గ్రామాలలో సహజంగా ఉండే నమ్మకాలను బట్టి ఆమె పేరు పొయ్యి బుగ్గి. ఎనభై సంవత్సరాల వయస్సులో తినటానికి తిండి లేని దీనావస్థలో కాలం గడిపింది. విశాఖపట్నం జిల్లాలో కూడా కూచిపూడి భాగవతాన్ని ప్రదర్శించే కళాకారులు ఉండే వారు. ఈ విధంగా ఒకప్పుడు విజయనగరం, బొబ్బిలి, మాడుగుల, కళింకోట, మందసా చోడవరం, చీకటి కోట, ధారా కోట, సాలూరు, పార్వతీపురం మొదలైన సంస్థానాలు, జమీందారులు, ధనవంతులు, పండితులు, మహా విధ్వాంసులు, ఈ కళను ఎంతగానో ఆదరించి పోషించారు. ప్రజలు ఆదరించారు. హర్షించారు, పోషించారు. కానీ ప్రస్తుతం నేటి ప్రపంచీకరణ ప్రభావం వల్ల గొప్ప ప్రాచుర్యం పొందిన కూచిపూడి భాగవతం ఆదరణ లేక అంతరించి పోయే ప్రమాదంలో నెట్టివేయబడుతుంది.

కానీ ప్రస్తుత కాలంలో ఆర్.వి.యస్. సుందరం గారు కూచిపూడి భాగవతాన్ని జానపదకళగా అంగీకరించక పోవడం మనమంతా ఆలోచించవలసిన విషయం అని చెప్పవచ్చు.

**7. యక్షగానం :** యక్షగానం కళారూపం నృత్య, నాటక, సంగీత, వేష, భాష అలంకారాలు సమ్మిళితంగా ప్రదర్శించబడుతుంది. ఇది ఒక శాస్త్రీయ శైలి. ఇది కర్ణాటక రాష్ట్రంలోని అతి ప్రాముఖ్యమైన శాస్త్రీయ కళ. కరావళి జిల్లాలైన ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాలలోనూ శివమొగ్గ. కేరళలోని కాసరగోడు జిల్లాలు. యక్షగానానికి పట్టుగొమ్మలుగా చెప్పవచ్చు. యక్షగాన ప్రదర్శన సాయంత్రం వేళలలో మొదలవుతుంది. ఊరికి తెలియజెప్పడానికి ఆటకు మొదలు దాదాపు రెండు గంటల పాటు డప్పు కొడతారు. నటులందరూ మెరిసే దుస్తులు, రంగులు పూసిన ముఖములు, తలపై సవరం ధరించి ఉంటారు. ఈ ప్రదర్శనలు ఎక్కువగా పురాణ గాథలను వివరిస్తుంటాయి. కథకుడు కథ చెబుతుండగా వెనుక సంగీతం వినబడుతుంది. వర్ణనలకు అనుగుణంగా నటీనటులు నృత్య ప్రదర్శనలు చేస్తుంటారు. నటులకు సంభాషణ అతి స్వల్పంగా ఉంటుంది. ఈ విధంగా దాదాపు మరుసటి రోజు సూర్యోదయం వరకు యక్షగానం సాగుతుంది. ఎన్నో సంవత్సరాలుగా కేలిక, ఆట, బయలాట, దశావతార మొదలగు పేర్లతో ప్రదర్శించబడే ఈ కళకు 200 సంవత్సరాల క్రితం యక్షగానమనే శాస్త్రీయ నామం ఇవ్వబడింది. భక్తి ఉద్యమం జరిగే సమయంలో ఉన్న శాస్త్రీయ సంగీతం. ఇంకా నాటక కళ యక్షగానంగా పరిణితి చెందాయన్నది ఒక నమ్మకంగా చెప్పవచ్చు. గత కొద్దికాలంగా బెంగుళూరులో యక్షగానం బాగా ప్రజాధారణ పొందింది. ముఖ్యంగా వర్షాకాలంలో కోస్తా ప్రాంతాల్లో యక్షగాన ప్రదర్శనలు జరుగుతాయి.

యక్షగానం వ్యుత్పత్తి ప్రకారం ఒక యక్షుడి పాట (గానం). ఇక్కడ యక్షుడంటే ప్రాచీన భారత దేశంలో నివసించే అడవి జాతి మనిషి అని అర్థం వస్తుంది. యక్షగాన నేపథ్యంలో హిమ్మెళ (హిందె+మేళ) నేపథ్య సంగీత సమూహం ఇంకా ముమ్మెళ (ముందె+మేళ) నృత్య, సంభాషణ గుంపు ఉంటాయి. ఈ రెండు గుంపుల సమన్వయయే యక్షగానం. హిమ్మెళలో ఒక భాగవత గాయకుడు ఇతనే దర్శకుడు - ఇతనినే మొదలనే వేష (మొదటి వేషగాడు) అంటారు. మద్దెలవారు, హార్మోనియం (హార్మోనియం స్థానంలో పుంగి అనే వాయిద్యాన్ని వాడేవారు) వాయించే వ్యక్తి, ఇంకా చండె (పెద్ద ధ్వని చేసే డప్పులు) వాయించేవారు ఉంటారు. సంగీతం మట్టు, యక్షగాన తాళాలతో రంగరించిన కర్ణాటక సాంప్రదాయ రాగాలపై ఆధారపడి ఉంటుంది. యక్షగాన తాళాలే తరువాతి రోజుల్లో కర్ణాటక సంగీత తాళాలుగా మార్పు చెందాయన్నది ఒక మాన్యత.

యక్షగానములో ఏదైనా ఒక కథను ఎంచుకొని దాన్ని ప్రేక్షకులకు గాన, అభినయ, నృత్య రూపాలలో ప్రదర్శిస్తారు. ఇలా ఎంచుకొన్న కథను ఉపాఖ్యానమని పిలుస్తారు. కన్నడలో "ప్రసంగ" అంటారు. ఉదాహరణకు మహాభారతములో భీముడు, దుర్యోధనుని మధ్య గదా యుద్ధకళను ఎంచుకున్నచో దానిని "గధా యుద్ధ ఉపాఖ్యానము" (కన్నడలో గదా యుద్ధ ప్రసంగ) అంటారు. పౌరాణిక ఉపాఖ్యానాలనే ఎంచుకున్నా, యక్షగానమందు ఉపాఖ్యానం/ఉపకథ/కథనము పౌరాణికమే అవ్వాలనే నియమము లేదు. అది ఐతిహాసికము లేక సామాజికము కావచ్చును.

**యక్షగానం - పాత్రలు :**

ఉపాఖ్యానంలో వచ్చు కథకు అనుగుణంగా అభినయించు, నర్తించు నటులను / నర్తకులను పాత్రధారులు అంటారు. ఉపాఖ్యానంలోని కథానుసారం నాయకుడు, దుష్ట నాయకుడు, హాస్యగాళ్ళు, స్త్రీ పాత్రలు ఇత్యాదులను ఆయా పాత్రలకనుగుణంగా ఎన్నుకుంటారు. నృత్యం, అభినయం మనస్సును హత్తుకునే చతుర సంభాషణలతో కథాంశమును ప్రేక్షకుల మనస్సుల్లో హత్తుకు పొయ్యేలా చేసే గురుతర బాధ్యత పాత్రధారులదే.

**యక్షగానం - వస్త్రధారణ/వస్త్ర అలంకరణ :**

యక్షగానంలోని ప్రముఖ విభాగం బయలు ఆట (వీధి భాగోతం) లో పాత్రధారులు ధరించు వస్త్రధారణం చాలా ప్రాముఖ్యమైనది. ఉదాహరణకు రాజు (కథానాయకుడు), దుష్ట నాయకులు ధరించు కిరీటం, ఇతర పాత్రధారులు ధరించు కిరీటం కన్న విభిన్నంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. అలాగే స్త్రీ పాత్రధారులు ధరించు కిరీటం చాలా చిన్నదిగా ఉంటుంది. అంతేకాకుండా

దక్షిణ కన్నడ ప్రాంతంలోని యక్షగాన పాత్రధారుల వస్త్రధారణ, ఉత్తర కన్నడ ప్రాంత పాత్రధారుల వస్త్రాలంకరణ కన్న భిన్నంగా ఉంటుంది.

**యక్షగాన ప్రదర్శన - భాగవతారు :**

యక్షగాన ప్రదర్శనలో భాగవతారు పాత్ర అత్యంత ముఖ్యమైనది. ఒక విధంగా ఈ గాన ప్రక్రియకు నిర్దేశకుడు వంటివాడు. కథనమును భాగవతారు పాట రూపంలో శ్రావ్యంగా పాడుతాడు. ఈ విధంగా పాడే గాయకుని "భాగవతారు" అంటారు. భాగవతారు ఆలపించు పాటకు అనుగుణంగా ఇతర పాత్రధారులందరు నృత్యరూపంలో ముఖాభినయం చేస్తారు. పాటకు అనుగుణంగా చేయు నృత్యంలో పాటలోని అర్థమునకు తగినట్లు పాత్రధారులు భావాభినయం చెయ్యడం అత్యంత కీలకంగా యక్షగాన ప్రదర్శనలో ఉంటుంది. ఈ విధంగా ప్రేక్షకుల మనస్సులను ఆకర్షిస్తూ చాలా గొప్ప కళారూపంగా యక్షగానం ప్రజాధరణ పొందింది.

**ముగింపు :**

ఈ "జానపద కళారూపాలు పరిచయం, ప్రత్యేకత" అనే పత్రంలో జానపద కళారూపాలయిన బయలాట, పగటి వేషాలు, బొమ్మలాటలు, వీధి భాగవతాలు లేదా వీధి నాటకాలు, చిందు భాగవతం, కూచిపూడి భాగవతం, యక్షగానాలను పరిచయం చేస్తూ, వాటి యొక్క ప్రత్యేకతను వివరించడం జరిగింది. నేటి ప్రపంచీకరణ ప్రభావం వల్ల అంతరించిపోతున్న వృత్తి, జానపద కళా రూపాలయిన పైన పేర్కొన్న వాటితో పాటు, వృత్తి, ఒగ్గు కథ, పంబకథ, అసాధి కథ, బైండ్ల కథ, కొమ్ముల కథ, పాండవ కథ, రుంజ కథలు. అదేవిధంగా పిట్టలదొర ప్రదర్శన, సంక్రాంతి హరిదాసు వాలకం, పాండవుల కథ, గొల్లసుద్దుల కథ మొదలైన జానపద కళారూపాలను పరిచయం చేస్తూ వాటి చారిత్రక నేపధ్యాన్ని, ప్రత్యేకతను వెలికితీసి, సాహితీ ప్రపంచానికి, భావితరాలకు అందించవలసిన బాధ్యత మనందరిపై ఎంతైనా ఉంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. సుందరం ఆర్.వి.యస్., జానపద సాహిత్యం
2. ఆచార్య నాయిని కృష్ణకుమారి ప్రధాన సంపాదకురాలు : తెలుగు జానపద విజ్ఞానం - సమాజం - సంస్కృతి - సాహిత్యం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

★★★

# రెండు కళ్ళు మూడు కాళ్ళు నవల - బిచ్చగాళ్ళ దీన స్థితి

- డా॥. పురుషోత్తం గుంట, తెలుగు పరిశోధకులు, తమ్మినాయుడుపేట, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో చాలా ప్రక్రియలు ఆంగ్ల ప్రమేయంతో తెలుగులోకి వచ్చినవి. సాహిత్యం అనేది సమాజహితాన్ని కోరేది. సమాజంలో జరిగే సంఘటనలు కవి లేదా రచయిత తమ రచనల్లో ప్రతి బింబిస్తాడు. రచయిత ఊహించి రచించిన రచనలు. సమాజంలో జరిగే సత్యాలను తెలియజేస్తాయి. కవిత్వం, ఖండకావ్యం, శతకం, నాటకం, నాటిక, ఏకాంక, కథానిక మొదలగునవి కాలానుగుణంగా తెలుగు సాహిత్యంలోకి వచ్చి సమాజాన్ని చైతన్యం చేసినవే. ఇవి విప్లవాత్మక మార్పులను సమాజంలోకి తీసుకొని వచ్చాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో అటువంటి విప్లవాత్మక మార్పును తీసుకొచ్చిన ప్రక్రియ నవల.

నవల అనేది ఆధునిక సాహిత్యంలో బహుజనాధరణ పొందినది. నవల అనే పదం నోవెల్ అనే ఆంగ్లపదం నుండి తెలుగులోకి వచ్చింది. "రచనా కాలము నందలి వాస్తవికములగు జీవితాచార వ్యవహారములను చిత్రించినది నవల" బొడ్డపాటి వెంకకుటుంబరావు.

"సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్యప్రబంధం నవల" - మొదలి నాగభూషణ శర్మ.

"సమాజంలో వ్యక్తుల యదార్థ జీవన విధానమును కళాత్మకంగా చిత్రించుటకు సంఘంలోని వ్యక్తుల ఆచార వ్యవహారాలను సహజంగా వర్ణించుటకు నవల చక్కని సాహిత్య సాధనమని చెప్పవచ్చును. - జి. నాగయ్య.

ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలో నవల అత్యంత ప్రజాధారణ పొందింది. అటువంటి అనేక నవలలు రచించిన వ్యక్తి ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు. ఇతను నవలా సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించారు. అతను రచించిన నవలలో ఒక ముఖ్యమైన నవల "రెండు కళ్ళు - మూడు కాళ్ళు" ఈ నవల చదివిన ప్రతీ ఒక్కరిని ఆలోచింపజేసే మహోత్తర శక్తివంతమైనది. ఈ నవలలో కొలకలూరి ఇనాక్ గారు బిచ్చగాళ్ళ జీవితాన్ని అత్యంత దగ్గరగా చూసి పరిశీలించి రాసినట్లు అని పిస్తుంది. అసలు బిచ్చగాళ్ళ పరిస్థితి దయనీయమైనది. ఇంకా వికలాంగులైన బిచ్చగాళ్ళ బాధ అత్యంత భయంకర మైనది. నిత్య జీవితంలో చాలామంది బిచ్చగాళ్ళను చూస్తుంటాము. అడుక్కోవటం వలన వీరికి ఓ మోస్తారు ఆధాయం సమకూరుతుంది, పరవాలేదు అను కుంటాము. కానీ ఈ బిచ్చగాళ్ళతో బిచ్చమెత్తించి వచ్చిన ఆదాయాన్ని దోచుకొని ఈ బిచ్చగాళ్ళని మరింత దురావస్థలకు గురిచేసే దుండగలు ఉన్నారని తెలిస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. సరిగ్గా ఈ విధమైన దోపిడిదారులే కొందరి బిచ్చగాళ్ళ జీవితాలుతో చెలగాటం ఆడటాన్ని రచయిత ఈ నవలలో మనకు కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ నవలలో సీత పాత్రద్వారా వికలాంగు రాలైన బిచ్చగత్తియొక్క దీన స్థితిని రచయిత తెలయ జేసారు. సీత ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మిం చింది. అమ్మా, నాన్న, అన్న ఇంటి దగ్గర లేని రోజు అను కోకుండా పిచ్చివాడికి, గుడ్డివాడికి అన్నం పెట్టింది చివరికి ఆమెకు తెలయకుండానే ఇంటికి దూరమై కుంటుంబ సభ్యుల ప్రేమకు దూరమై ఒక వికలాంగ బిచ్చగత్తిగా మారిపోవడం పాఠకులకు వేదనకు గురిచేస్తుంది. అదే విధంగా రఘురామ్ అనే మూడేళ్ళ బాలుడు తల్లి దండ్రులతో తన ఊరినుంచి నగరానికి వస్తాడు. నగరంలో తల్లిదండ్రుల నుండి తప్పిపోతాడు. తాను ఎంతో ఆశతో నగరం చూడాలని అనుకుంటాడు. చివరికి తాను చూడాలనుకున్న కళ్ళనే పోగొట్టుకొని బిచ్చగాడిగా మారిపోతాడు. ఈ సంఘటన కన్న తల్లిదండ్రులకు ఎంత దిగ్భ్రాంతిని కలిగించిందో! ఈ విధంగా అమాయకులైన బాలురలను, బాలికలను, ఏ సంఘ విద్రోహక శక్తులో వారిని కుంటివారుగాను, గుడ్డివారుగాను చేసి బిచ్చ గాళ్ళుగా మార్చి వారిచే బిచ్చం ఎత్తించేటట్లు చేస్తున్నాయి.

అన్నీ ఉండి కూడా విధివంచితలై తల్లిదండ్రుల ప్రేమకు, చదువుకు, ఆర్యోగకర పరిస్థితులకు దూరమై అనాధల్లా బ్రతకడం ఎంతో శోచనియమో కదా. ఆ బాధని అనుభవించిన వారికే తెలుస్తుంది. రచయిత అటువంటి చిన్నారుల ఆక్రందనలను చూపిస్తూ వారు ఎన్నోకష్టాలు అనుభవిస్తూ పెద్దవారు అవుతూ వారికి ఈ పరిస్థితి కలిగించిన దుర్మార్గులని అంతమొందించడం ఈ నవలలో రచయిత చూపించాడు.

వికలాంగులైన బిచ్చగత్తెను కూడా ఒక పురుషుడు తన చూపులతో ఏ విధంగా వంచించడం జరుగుతుందో ఈ నవల చదివిన వారికి తెలుస్తుంది. బిచ్చగాళ్ళందరికి ముసాఖాన్ అధినేత ఇతనికి కళ్ళు, కాళ్ళు ఉండి కూడా అమాయకులైన బిచ్చగాళ్ల యొక్కడబ్బులను వసూలు చేసుకుంటుంటాడు. బిచ్చగాళ్ళందరికీ ఒక సత్రం ఉం టుంది. ముసాఖాన్ యొక్క అధినేత బెనర్జీ ఇతనికి ఒక పెద్ద బంగ్లా ఉంటుంది. ఇతనికి ఏ వికలాంగ బిచ్చగత్తె నచ్చితే ఆమెను పొందుటకు ప్రయత్నిస్తాడు. సీత, రఘురామ్ అనే ఇద్దరు బిచ్చగాళ్ళు. సీతకు ఒక కాలు లేదు, రఘురామ్‌కి కళ్ళు లేవు వీదిర్దరూ ఒకరికొకరు సహకరించుకొంటూ నడచుకుంటారు. అమ్మా ధర్మం, తల్లీ ధర్మం అంటూ బిక్షాటనం చేసుకుంటారు. బిక్షగాళ్ళు అందరూ ఒక లారీ పై వెళ్ళి బిక్షం ఎత్తుకొని తిరిగి లారీపై సత్రంకు వస్తారు. ప్రతీ రోజూ వీళ్ళు తెచ్చిన డబ్బులను ముసాఖాన్ వసూలు చేసుకుంటాడు. గిరి అనే కుంటి బిక్షగాడు సీతను పొందాలని చూస్తాడు. చివరికి సీతచే దెబ్బలు తింటాడు. తరువాత గిరి సీతను చూస్తూ రోడ్డు ప్రమాదంలో మరణిస్తాడు. తోటి బిక్షగాడు గిరి చనిపోవడంపై సరిగా స్పందించని ముసాఖాన్ బెనర్జీ లకు వ్యతిరేకంగా బిక్షకులందరూ బిక్షాటనకు వెళ్ళ కూడదని నిర్ణయించుకుంటారు. కానీ ముసాఖాన్ వచ్చి బిచ్చగాళ్ళందరినీ కొట్టి బిక్షాటనకు పంపిస్తాడు. తరువాత తమ తోటి బిక్షగాడు మరణించినా ఒక రోజుకుడా వారికి స్వేచ్ఛ లేకపోవడం పై బిచ్చగాళ్ళు ఆందోళన చెందుతారు. ఈ దుండగుల చేతిలో చిక్కుకున్నందుకు దు:ఖిస్తారు ఎలాగైనా విముక్తి పొందాలని ప్రయత్నిస్తారు. వందల కొలది ఆదాయం సంపాదించినప్పటికి కనీసం బస్సు చార్జిలు కూడా లేని దీనస్థితి వారిది మొదటి నుంచి ఆప్యాయతో కలసి బిక్షాటనం చేసిన, సీత, రాములు వారి అంగవైకల్యం కూడా పంచుకున్నారు వారిద్దరికి కలిపి “రెండు కళ్ళు, మూడు కాళ్ళు” అనగా రాముకు కళ్ళు లేవు కానీ రెండు కాళ్ళు ఉన్నాయి. సీతకు ఒకే కాలు ఉంటుంది రెండు కళ్ళు పనిచేస్తాయి. ఈ విధంగా ఇద్దరికీ దారిచూపి నడిపించేవి రెండు కళ్ళు, మూడు కాళ్ళు ఆ దుర్మార్గులచర నుండి ఈ పాపిష్టి వృత్తినుండి బయట పడటానికి రెండు సార్లు ప్రయతించి విఫలమౌతారు. వీదిద్దరు కలసి పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసు కున్న ముసాఖాన్, బెనర్జీలు రఘురామ్ సీతలకు పెళ్ళిచేసి వారు పారిపోకుండా కట్టడి చేస్తారు. వారిని ఇబ్బంది పెట్టడానికి పెళ్ళిచేసినప్పటికి ఇద్దరు మనసులు కలిసాయి కాబట్టి ఆ ఇబ్బందులో కూడా సుఖాన్ని వెతుకున్నారు. కొన్నాళ్ళకి వారికి కవల బిడ్డలు జన్మిస్తారు. సీతను నిండు గర్భినిగా ఉన్నప్పుడు కూడా బిక్షాటనుకు పంపిస్తారు. ఆమె ఆ బాధని, ఆక్రదనను దిగమింగుకుంటూ గత్యంతరం లేక వారు చెప్పినట్లు నడుచుకుంటుంది. ఆ దుర్మార్గు లకు తమ సంపాదన తప్పా గర్భిణి అనిగాని, పసిబిడ్డ అనిగాని, రోగి అని కాని, వృద్ధుడు అని కాని తారతమ్యం లేదు వారందరిచేత బిక్షం ఎత్తించడం వచ్చిన దాన్ని వీరు లాగుక్కోవడం. ఇది వరకే పెళ్ళిముందు ఒక సారి సీతను చెరచిన బెనర్జీ ప్రసవానంతరం నెలల బాలింత అనికూడా చూడకుండా మరోసారి అనుభవించడానికి సీతకి కబురు పెడతాడు. సీతకు కట్టలు తెంచిన ఉద్రేకం కలుగుతుంది. భర్తకు చెప్పిబయలుదేరుతుంది. ఈ దుర్మార్గుల పీడ ఎలాగైన వదిలించుకోవాలని మనసులో అనుకొని చేతికర్రల సాయంతో, కడుపునిండా కోపంతో బెనర్జీ ఇంటికి వెళ్లే “కారు ఎక్కింది పది నిమషాల్లో కారు బంగ్లా ముందు ఆగింది ఆమె గుండెల్లో స్థైర్యం, రూపంలో దైర్యం కారు వెళ్ళింది. ఆమె లోపలకు పోయింది పడక గదిలో విలాసంగా పడుకున్నాడు బెనర్జీ రాం సీతా! రా! వచ్చావా? ఆమె నవ్వింది ముళ్ళుగుచ్చుకున్న మల్లెమొగ్గ విచ్చుకున్నట్లు నవ్వింది. రా! ఆప్యాయంగా పిలిచాడు

ఆమె వెళ్ళలేదు. చంక కర్రలు రెండు నేల మీదమోపి వంగి మొఖంలోకి చూసి ముసిముసి నవ్వులు విర జిమ్మింది. బెనర్జీ పందిరి మంచం మీద నుంచి లేస్తుంటే గుప్పున వాసన వచ్చింది. దిగుతుంటే పడిపోతాడేమోనని అపించింది. తూలుతూ దగ్గరకు వస్తున్నాడు. ఒంటి కాలుమీద నిలబడి రెండు చంక కర్రలు తీసి ఒకటిగా చేసి రెండు చేతులతో పట్టుకుంది. దగ్గరకు వచ్చాడు. ఒకటైన రెండు కర్రలు నెమ్మదిగా పైకి లేపి బలంగా శక్తి కొద్దీ, తరతరాల స్త్రీత్వం కసియంతా కర్రలో చేర్చి తల మీద కొట్టింది. బెనర్జీ అరవలేదు నేల మీద పడి పోయాడు. పిచ్చెక్కినదానిలాగ, తల చిట్లిపోయేటట్లు దెబ్బమీద దెబ్బ అలసట వచ్చేదాక కసి తీరిందాకా చేతులు నొప్పిపుట్టేదాక కొట్టింది''. బెనర్జీ చనిపోయాడని తెలుసుకొని బయటకు వచ్చేసింది. సీత ఇంట్లో లేదని తెలిసిన ముసాఖాన్ పిల్లల్ని ఎత్తుకుపోదాం అనే ఉద్దేశంతో సీతారాముల ఇంటికి వెళతాడు. ఇంటికి వచ్చినది సీతే అని, రాము 'సీతా, సీతా' అని పిలుస్తాడు. పిల్లలు ఏడుపు విని ఎవరో వచ్చారని అర్థం చేసుకొని ఎవరో నా పిల్లన్ని ఎత్తుకుపోతున్నారని అనుకొని వచ్చిన వాడిపై కసితీరా గట్టిగా కర్రతో కొడతాడు ఆ దెబ్బలకి ముసాఖాన్ మరణిస్తాడు. ఆ రోజు బిచ్చమెత్తడానికి తీసుకెళ్ళే లారీ రాలేదు. ఆ బిచ్చగాళ్ళ సత్రంలో సూర్యోదయం అయ్యింది. బిచ్చగాళ్ళకు విముక్తి లభిం చింది. ఇన్నాళ్ళు ఎంతో మందిని కుంటి వాళ్ళుగా, గుడ్డి వాళ్ళుగా చేసి వారి పబ్బం గడుపుకున్నారు దుర్మార్గులు, ఆ బిచ్చగాళ్ళ చేతిలోనే అంతం అయినారు. ఏ జీవినైన శృతిమించి హింసిస్తే అది ఎదురు తిరుగుతుంది. ఆ హింసా వాదిని అంతమొందిస్తుంది. స్వతంత్రాన్ని పొందుతుంది. ఈ చరిత్ర చెప్పిన సత్యాన్ని కొలకలూరి ఇనాక్‌గారు తన నవలలో మరోసారి నిరూపించారు.

**ఆధార గ్రంథాలు :**

1) ఆంధ్రనవలా పరిణామం - బొడ్డపాటి వెంకట కుటుంబరావు

2) తెలుగు నవలా వికాసము - మొదలి నాగభూషణ శర్మ

3) తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య

4) నవలా సాహిత్యం - సమాజ సందర్శనం - కొలకలూరి ఇనాక్ (3వ సంపుటి)

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 10, October 2024

భావవీణ

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# ఆదివాసీ జీవితం - జీవిత సమస్యలు

- **లాలం అచ్చియ్యమ్మ**, తెలుగు అధ్యాపకులు, విశాఖపట్టణం.

## సంక్షిప్త పరిచయం :

పచ్చని ప్రకృతిబడిలో అడవి తల్లినే నమ్ముకుని తరతరాలుగా జీవనం సాగిస్తున్న అడవి బిడ్డలే ఆదివాసీలు. మన దేశంలో ఎన్నో కులాలు ఉన్న విషయం మన అందరికి తెలిసిందే. తెగలు, జాతులు కూడా ఉన్నాయి. కొండల మీదనే తొలినుండి నివాసం కలిగి ఆటవిక సంపదనే తమ జీవితానికి ఉపాధిగా గ్రహించిన కొండల్లో ఉండే కొద్దిపాటి చదును ప్రదేశాలను, చెట్లను కూల్చి పోడు వ్యవసాయం చేసుకునే వాళ్ళను కొన్ని తెగలుగా ప్రభుత్వం గుర్తించింది. వీళ్ళంతా గిరిజనులు. వీళ్ళలో సంచార జాతులకు చెందినవారు కూడా ఉన్నారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సవాళ్ళు గురించి సమాజానికి అవగాహన కల్పించటం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

వెనుకబడిన దేశాలలో పేదరికం, వివక్ష మరియు ఆరోగ్య సంరక్షణ, విద్య అందుబాటులో లేకపోవటం మనం చూస్తూనే ఉన్నాం. మనదేశంలోని ఈ పరిస్థితి ఉంది. భారత ఉపఖండంలోని తొలి నివాసులు మరియు ఒకప్పుడు ప్రస్తుతం ఉన్న దాని కంటే చాలా పెద్ద ప్రాంతాలలో నివశించే వారు. ప్రపంచ జనాభాలో ఆదివాసీలు 5 శాతం ఉన్నారు.

3000 సంవత్సరాల క్రితం ఇండో-ఆర్యన్ తెగల దండయాత్రల తరువాత చాలామంది కొండ ప్రాంతాలకు నెట్టబడినట్లు కనిపిస్తున్నప్పటికీ వారి చరిత్ర చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. తమ భూమిపట్ల లోతైన బంధం మరియు ప్రకృతి పట్ల గౌరవంతోపాటు విభిన్న భాషలు, మతాలు స్వపరిపాలన రూపాలు కలిగి ఉన్నారు. ఆదివాసీలకు సాంప్రదాయ ఔషధాలపై విస్తారమైన జ్ఞానం ఉంది. మరియు మూలికలు, వేర్లు, చెట్టు బెరడులను ఉపయోగించి వ్యాధులకు చికిత్స చేస్తారు.

వీరు శాంతిని ఇష్టపడేవారు. ప్రకృతిని ప్రేమించి సంతోషకరమైన వ్యక్తులు. భారతదేశంలో 705 జాతులు షెడ్యూల్ ట్రైబ్స్‌గా గుర్తించబడ్డారు. పర్యావరణ పరిరక్షణ వంటి మెరుగైన ప్రపంచాన్ని రూపొందించటానికి ఆదివాసీల కృషి ఎంతో ఉంది. వీళ్ళ గురించి గుర్తించగలగాలి.

## ముఖ్యాంశాలు :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో గిరిజనులు ఉన్నారు. కాని తక్కువ గిరిజన అక్షరాస్యత రేటు కలిగి ఉంది గిరిజనులు భూముల్లోకి వలసలు నాటకీయంగా పెరిగాయి. తమ భూములకు పట్టాలను కోల్పోవటం. అడవులను తీవ్రంగా దోచుకోవటం అనేది తరచూ బయట వ్యక్తులు పెద్ద ఎత్తున చెట్లు నరికివేయటాన్ని అనుమతించటం. రిజర్వ్ చేయబడిన అటవీ భూములను సమర్ధవంతంగా వినియోగించటానికి గిరజనేతులు స్థానిక అధికారులకు తరచుగా లంచాలు ఇస్తూ ఉంటారు. అనేకమంది ఆదివాసీలపై కొనసాగుతున్న ఆర్థికపరాయీకరణ మరియు దోపిడీ జరుగుతున్నట్లు మనం గుర్తించగలగాలి.

పేదరికం, నిరక్షరాస్యత, వ్యాధులు మొదలగు దుర్భరమైన పరిస్థితుల నుండి వీరు బయటపడాలి. వీరికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని భావిస్తున్నాను. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను, కళలను పరిరక్షించవలసిన బాధ్యత ఎంతైనా ఉంది అని భావిస్తున్నాను. కనీస అవసరాల కోసం వీరు చేసే పోరాటాలు వర్ణనాతీతం.

గిరిజనులు ప్రకృతి, వన్యప్రాణులను దైవంగా కొలిచే వీరు వేడుకలను జరుపుకుంటారు. కట్టుబొట్టు వ్యవహారం ఎంత భిన్నతంగా ఉంటుందో వారి పద్ధతులు కూడా అంతే వైవిధ్యంగా ఉంటాయి. అడవుల్లో కొండల్లో గుట్టల నడుమ అక్కడక్కడ విసిరేసినట్లు గిరజన గూడాలు ఆ గూడాల నుండి వినిపించే గోండు, గుస్సాడి, థింసా నృత్యాలు రేలా పాటలు మనసులను మయమరిపిస్తాయి.

అభివృద్ధికి అక్షరాస్యతకు దూరంగా కొండల గుట్టలు నడము గూడాల్లో ఉండే గిరిజనులు ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు.

విద్యా, వైద్యం, వ్యవసాయంతోపాటు తాగు, సాగునీరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుకుంటున్నారు. ఏదిఏమైనా ఏళ్ళు గడుస్తున్నా తరాలు మారుతున్నా వారి కట్టుబాట్లు, ఆచార సాంప్రదాయాలను కాపాడుకుంటూ సంస్కృతి పరిరక్షణకు పాటుపడుతున్న గిరిజనులను అభినందించాల్సిందే. ఈ విషయంలో వీరిని చూసి నేర్చుకోవలసిందే.

ఆదివాసీలు భారతదేశంలో వివిధ సమూహాలుగా అడవులే అమ్మఒడిగా కొండకోనలే తోడుగా జీవిస్తారు. గిరిజనుల సమూహాలకు ప్రత్యేక మత విశ్వాసాలు, ఆరాధన పద్ధతులు ఉంటాయి.

ప్రతి తెగ సజాతీయ సమాజం కలిగి ఉంటుంది.

వీళ్ళ కడవలు నెత్తిన పెట్టుకుని
ఎంతదూరం గమ్యం తెలియక
వైద్యం లేక డోళిలమోతతో
బ్రతుకుబారం ఎన్నాళ్ళో...

ప్రకృతి విలయతాండవం చేస్తుంటే రహదారులు కనుమరగవటం దారి తెలియక వాళ్ల బాధలు చెట్లు, కొండలకు తెలియాలి. అడవి బిడ్డల ఆక్రోశం ఎన్నాళ్ళు ఈ జీవన గమనం...

తరాలు మారుతున్న మారుమూల ప్రాంతాలలో అభివృద్ధి లేకపోవటం మనం గమనిస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఎ.ఐ) వచ్చేస్తుంది, కంప్యూటర్ యుగం అంటున్నాం. మరి వీళ్ళ జీవితాలలో వెలుగులు కనిపించటం లేదు. సుదూర ప్రాంతాల అభివృద్ధి చెంది నట్లు అయితే కొండల్లో నివశించే గిరిజన గూడాలు అన్నీ రంగాలలో రాణిస్తారు అని భావిస్తున్నాను. విలువైన ప్రకృతి ఇచ్చిన సంపదను ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడు కుంటూ వస్తున్న ఆదివాసీలకు న్యాయం, ధర్మం చేకూరాలి అని భావిస్తున్నాను.

ప్రపంచ జనాభాలో 5% కన్నా తక్కువగా ఉన్నప్పటికీ వారి హక్కులు, శ్రేయస్సుపై దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది అనుకుంటున్నాను.

### కళలు - నృత్యాలు :

గిరిజనులు నృత్యాలు ఎంతో ప్రసిద్ధి చెందినవి. పేరుగాంచిన నృత్యాలలో థింసా ఒకటి చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఈ నృత్య కార్యక్రమంలో పాల్గొం టారు. గ్రామీణ ప్రాంత ప్రజలు మధ్య సఖ్యతను మంచి భావాన్ని పెంపొందిస్తుంది. ఈ థింసా నృత్యం స్త్రీ, పురుషుల సాంప్రదాయక ఆభరణాలు ధరించి అలం కరించుకుని చూడచక్కని నృత్యం మనసుకు ఆహ్లాదాన్ని స్తుంది. అనేక రకమైన పండుగలు, నృత్యాలు వీళ్ళ సంస్కృతిలో భాగం.

### ముగింపు :

ఆదివాసీలు నిజాయితీకి, ప్రేమకి, సహనానికి, ప్రతి రూపులు ముఖ్యంగా ప్రకృతినే సర్వస్వంగా కటిక చీకటిలో వెన్నెలను చూసుకుని, మట్టిని మాణిక్యంగా భావించి, గంజినీళ్ళనే అమృతంగా సేవించి ఏ కష్టాన్నైనా భరించి బ్రతుకును ఈడ్చే అడవి బిడ్డలకు అభివృద్ధి అందాలని ప్రభుత్వాన్ని కోరుకుందాం. వాళ్ల జీవితాలలో వెలుగులు రావాలని భగవంతుని ప్రార్థిద్దాం.

### ఉపయుక్త గ్రంథసూచి :

1. గిరిజన సాహిత్యం, తెలుగు అకాడమీ - ఎం. గోనా నాయక్.
2. తెలుగు కావ్య కళా పరిచయం - నాయని కృష్ణకుమారి.
3. భారతీయ గిరిజనులు - నదీం హస్నైన్.
4. జానపద విజ్ఞాన వ్యాసావళి - జి.ఎస్. మోహన్.

★★★

# దాశరథి రంగాచార్య జీవితం - రచనలు

- ప్రసన్న లక్ష్మి మాదిరాజు, పరిశోధక విద్యార్థిని

తెలంగాణాలో 1938కి ముందు నిజాంల పరిపాలన విధానం, వారు ప్రవేశపెట్టిన సంస్కరణలు, నాటి వ్యవస్థలో బానిసత్వ చిహ్నంగా ఉన్న వెట్టిచాకిరి, దయనీయమైన విద్యావ్యవస్థ, ప్రజలకు విజ్ఞానం పంచిన గ్రంథాలయోద్యమం, పత్రికలు, సాంస్కృతోద్యమంగా ప్రారంభమైన ఆంధ్రోద్యమం, ఆంధ్రమహాసభ సమావేశాలు, యువకుల్లో రాజకీయ భావాలు పెంపొందించిన ఆర్యసమాజం, మత మార్పిడుల కోసం ఏర్పడ్డ ఇత్తేహాదుల్ ముస్లమీన్ తదితర అంశాలు చర్చించాను. ఇవన్నీ రంగాచార్య జననం నాటికి ఉన్న రాజకీయ, సామాజిక పరిస్థితులు. సంప్రదాయానికి కట్టుబానిసలుగ ఉండే ఆ రోజుల్లోనే రంగాచార్య తాత, తండ్రులు సంప్రదాయానికి ఎదురీదడం, పిల్లలకు ఆధునిక విద్య చెప్పించడం కోసం చిన్నగూడూరు నుంచి ఖమ్మానికి మారడం మొదలైన విషయాలు వివరంగా పేర్కొన్నాను.

రంగాచార్య విద్యార్థిగా అనేక ఉద్యమాలు నిర్వహించారు. పాఠశాలలో వందేమాతరం పాడారు. విద్యార్థులంతా కుచ్చుటోపి ధరించాలని నిజాం జారీ చేసిన ఫర్మానాకు వ్యతిరేకంగా విద్యార్థులచేత సమ్మె చేయించారు. విజయం సాధించారు. కానీ, పాఠశాల నుంచి బహిష్కరణకు గురయ్యారు. తర్వాత యువకుడిగా కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులయ్యారు. ఆంధ్ర మహాసభలో, సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. పోలీస్ చర్య తర్వాత ఉద్యమం నుంచి బయటకు వచ్చారు. అప్పటికే కలుషితమైన రాజకీయాల్లో ఇమడలేకపోయారు. నాటి బ్లాక్ మార్కెట్ పరిస్థితులపై పత్రికలకు రాసేవారు. ఆంధ్రాయునివర్సిటీ నుంచి మెట్రిక్యులేషన్ ప్రైవేటుగా రాసి పాసయ్యారు. టీచరుగా ఉద్యోగం సంపాదించారు.

తెలంగాణాలో 1938 తర్వాత రాజకీయ ఉద్యమాలు బలపడ్డాయి. స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తీవ్రమైన వందేమాతర ఉద్యమం, నిజాం సంస్థానంలో ఇతర ప్రాంతాలకు విస్తరించడం, ఆంధ్రమహాసభలో అతివాదులు, కమ్యూనిస్టులు, ఆంధ్ర మహాసభ నేతృత్వంలో ఒక్కటైన ప్రజలు, చారిత్రాత్మకమైన సాయుధ పోరాటం, గ్రామాల విముక్తి, గ్రామ స్వరాజ్యాల ఏర్పాటు, రజాకార్ల దురాగతాలు, హైదరాబాద్‌పై పోలీస్ చర్య, మిలిటరీ పాలన, వెల్లోడి మంత్రివర్గం తదితర అంశాలు పరిశీలించాను. వట్టికోట ఆళ్వారుస్వామి సాన్నిహిత్యంలో రచనా జీవితలో తొలి అడుగులు వేశారు. తెలంగాణా జన జీవితాలను చిత్రించే నవలలకు శ్రీకారం చుట్టారు. తొలి నవల 'చిల్లరదేవుళ్ళు'తో సంచలనం సృష్టించారు. తొలినవలకే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. స్వయంగా తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గన్న రంగాచార్య, ఎక్కడున్నా అన్యాయాన్ని సహించలేరు. తాను పనిచేసే మునిసిపల్ కార్పొరేషన్‌లో కింది స్థాయి ఉద్యోగుల వెతలు ఆయన్ని బాధించాయి. కార్మికుల శ్రేయస్సుకోసం ఒక యూనియన్ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో, దేశ స్థాయిలో మునిసిపల్ కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చారు. సమావేశాలు నిర్వహించారు. అది ఒక గాడిలోకి వచ్చాక, దాని వదిలి, రచనలకు అంకితమయ్యారు. రంగాచార్య 1988లో పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత ఆయన సాహిత్య జీవితం కొత్త పుంతలు తొక్కింది.

ఈ కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో, జై తెలంగాణా, జై ఆంధ్రా వేర్పాటువాద ఉద్యమాలు ఒకటి తర్వాత ఒకటి వచ్చాయి. వాటి లక్ష్యం నెరవేరకుండానే అవి చల్లారిపోయాయి. నక్సల్‌బరీ ఉద్యమ స్ఫూర్తితో శ్రీకాకుళ రైతాంగ పోరాటం ప్రారంభమయింది. అది నక్సలైట్ ఉద్యమానికి దారి తీసింది. ఇక సాహిత్య రంగంలో విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించింది. దిగంబర కవితోద్యమం విరసంలో విలీనమయింది. ఇక ఈ

కాలంలో రంగాచార్య సాహిత్య సృజన శిఖర స్థాయికి చేరుకుంది. 'మాయాజలతారు, మోదుగుపూలు, జనపదం, రానున్నది ఏది నిజం?, పావని, శరతల్పం, మానవత, సీతాచరితం, నల్లనాగు (కథల సంపుటి), ప్రేమ్‌చంద్ జీవితం-సాహిత్యం, అనువాదాలు' ఈ కాలంలో వచ్చిన తదితర రచనలు ఇందులో పరిశీలించారు. ఈ కాలంలో రంగాచార్య హైదరాబాద్ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా, ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయిత సంఘానికి కార్యదర్శిగా పనిచేశారు. తనకాలంలో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించారు.

తెలుగు ప్రాంతం, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతం అత్యధిక కాలం ముస్లింల పాలనలో కొనసాగింది. అందుకే ముస్లింల వేష, భాషలు ఈ ప్రాంతంపై ప్రభావం చూపాయి. నాటి అధికార భాష ఉర్దూ. వ్యవహారాలన్నీ ఉర్దూలోనే సాగేవి. అందుకే ఆ భాషా ప్రభావం తెలంగాణా ప్రాంతంపై అత్యధికంగా కనిపిస్తుంది. ప్రజలు ఏ మతంవారైనా, వారి నిత్యవ్యవహారంలో ఉర్దూ భాగమై పోయింది. తెలంగాణా జన జీవితాల్ని నవలలుగా మలిచిన రంగాచార్య, తెలంగాణా మాండలికంలో రచనలు చేశారు. నాటి ఉర్దూ ప్రభావానికి లోనైన తెలుగును తన పాత్రల సంభాషణల్లో చిత్రించారు.

మోదుగుపూలు, జనపదం, మాయజలతారు, రానున్నది వంటి నవలలు వ్రాశారు. దాశరథి గారి నవల్లో ప్రధానంగా తెలంగాణా సామాజికాంశాలె యితివృత్తాలైనాయి. స్వయంగా చూసిన పరిణామాలు, అనుభవించిన కష్టనష్టాలు, సంఘటనలు, పరిసరాలు. అన్నీ వారి నవలలకు కేంద్ర బిందువులు అయ్యాయి. పాశవిక ఫ్యూడల్ వ్యవస్థలోనె అసాంఘిక ఆచారమైన 'ఆడబాప' విధానం బాల్యంలోనె దాశరథి రంగాచార్యులు గారిని కలచివేసింది. వారి చిల్లరదేవుళ్ళు నవల్లో ఆ ఆడబాప విధానం. ప్రవేశపెట్టడం జరిగింది. చిన గూడూరులో వారి ఇంటి పక్కన అమృతపాణి అనే ఆడబాప కూతురు ఫ్యూడల్ పాశవికానికి బలి అవ్వడం మరచిపోలేక చిల్లరదేవుళ్ళు నవల్లో 'వనజ' పాత్రగా తెలియజేశారు. ఆ పిల్లతల్లి పేరుతో 'అమృతపాణి'గా జనపదంలో చోటు చేసుకుంది. దాశరథి గారు పుట్టిన వరంగల్ జిల్లా 'చినగూడూరు' గ్రామం చిల్లరదేవుళ్ళు నవలా తెలంగాణా సమాజంలో గ్రామీణ ఫ్యూడల్ శక్తులు, దొరలయిష్టారాజ్యాలు, ప్రజల భూమి హక్కు పోరాటాలు, వెట్టి నిర్మూలన, నిజాం వ్యతిరేక పోరాటాలు అన్నీ దాశరథి రంగాచార్యులు గారి నవలల్లో జీవం పోసుకున్నాయి. ఫ్యూడల్ సమాజంలో 'మతం' ఒక అభివ్యక్తిగానూ, స్వార్థ చింతనగానూ, ఒక దుర్మార్గంగానూ, ఒక విశ్వాసం గానూ, అందించిన విషయాల పరంగా తెలంగాణా గ్రామీణ సమాజం ఏ విధంగా బలైంది 'చిల్లరదేవుళ్ళు' నవల్లో దాశరథి రంగాచార్యులు గారు దర్శనీయం చేశారు.

దాశరథి రంగాచార్య రచనా శిల్పరహస్యాలు తెలిసిన వాస్తవికతావాద రచయిత, వాస్తవికతావాదాన్ని శిలహితంగా ప్రతిపాదించినపుడు ఆ రచన శుష్కంగా తయారవుతుంది. రచయిత తన శిల్ప నిర్మాణ సామర్థ్యాన్ని కూడా దానికి జోడిస్తే అదొక అద్భుత రచనగా రూపుదిద్దుకుంటుంది. శిల్ప విన్యాసంతో కూడిన వాస్తవికతా చిత్రణ నవలా రచయితగా రంగాచార్య సాధించిన ప్రత్యేకత. తెలంగాణ సామాజిక రాజకీయ స్థితిగతుల్ని చిత్రించే నేపథ్యంలో ఈ లక్షణం ప్రస్ఫుటమవుతుంది. రంగాచార్య సృష్టించిన దళిత పాత్రలు కేవలం కల్పనల ద్వారా మాత్రమే ఆవిర్భవించలేదు. వాటి మూలాలు తెలంగాణ సమాజంలోనే ఉన్నాయి. ఆయా పాత్రల్ని తీర్చిదిద్దిన తీరు రచయిత సునిశిత పరిశీలనా ప్రజ్ఞకు ప్రతీకగా నిలుస్తుంది.

హైదరాబాద్ నగరంలో తొలుత కొన్ని మురికివాడలు పుట్టాయి. ఇక్కడ బీద ఆర్థిక వర్గాలకు చెందిన వారు గూడు చూసుకున్నారు. నగరంలోని మురికివాడల నేపథ్యాన్ని లోతుగా విశ్లేషిస్తూ రంగాచార్య నవలా రచన చేశారు. రంగాచార్య రచించిన నవల పేరు 'మాయ జలతారు'. నగరంలోని మురికివాడల స్థితిగతుల్ని, వాటి ఆవిర్భావ నేపథ్యాన్ని గురించి ఇంత చక్కగా విశ్లేషించిన నవల తెలుగులో మరొకటి లేదు. నగరానికి వచ్చేవలసల ద్వారా మురికి వాడలు ఏర్పడ్డాయి. ఇట్లా గతంలో వలస

వచ్చిన తెలంగాణ వారిలో ఎక్కువ మంది దళితులు, నిమ్న సామాజిక వర్గాల వారు. పొట్టచేతపట్టుకొని వారు పట్నం రావడానికి గ్రామాల్లోని భూస్వామ్య కర్కశత్వమే కారణమని రంగాచార్య విశ్లేషించారు. బాలయ్య కుటుంబ నేపథ్యం దీనికొక ఉదాహరణ.

'బాలయ్యకు తన పల్లె, సొరతీగ పాకిన గుడిసె, ఇంటి ముందర బంతి చెట్లు గుర్తుకు వచ్చాయి. బాలయ్య తండ్రి వెట్టిమాదిగ. దొరలకు అధికారులకు వెట్టి చేస్తూనే కన్ను మూశాడు. బాలయ్య అతడి అన్న కొమురయ్య అదేవృత్తి అనుభవించారు. ఊళ్ళో ఏదో 'సంఘం' పెట్టారు. వెట్టి చేయరాదన్నారు. దొరల దౌర్జన్యం నశించాలన్నారు. అన్న దమ్మలందులో చేరారు. వెట్టిమానారు. కూలిపని చేసుకొని జీవిస్తున్నారు. భూములు పంచుతామని వచ్చారు కొందరు. బాలయ్య తుపాకి పట్టుకొని రంగంలోకి దూకాడు. దొరలుపారిపోయారు వాళ్ల ఇండ్లు దోచు కున్నారు. పొలాలు పంచారు. బాలయ్య నేల చెక్క వాడయ్యాడు. పోలీసులు వచ్చారు. బాలయ్య పారి పోయాడు, కొమురయ్యను పట్టుకొని హింసించారు తుదకు తుపాకీతో కాల్చి చంపేశారు. బాలయ్య పొలం ఊడింది. దొరలు పల్లెకు చేరారు. బాలయ్యను పట్టుకొని జేలుకు పంపారు. జేలు నుండి తిరిగివచ్చి తల్లినీ, పెళ్లాన్ని తీసుకొని పట్నం వచ్చేశాడు. ఒక్క కొడుకునూ, ఇద్దరు కూతుళ్ళనూ కని క్షయవ్యాధితో కన్నుమూసింది బాలయ్య భార్య. తల్లి కేన్సరై చనిపోయింది ఈ మధ్యనే కొడుకు రామారావు ఇరవై సంవత్సరాల వాడు. ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. కాస్త సోగ్గాడు. ఈ మధ్యనే రొమాన్సులో పడ్డాడు. పమయ్య కూతురు శారదను ప్రేమిస్తున్నాడు'.

తెలంగాణ సాయుధపోరాటం ఉధృతస్థాయిలో జరిగిన జిల్లాల్లో పోరాటం అనంతరం చోటు చేసుకున్న పరిస్థితుల్ని ఈ క్రమంలో దళితుల వలసల్ని బాలయ్య కథ స్పష్టంగా చెబుతోంది.

అయితే దళితులు ఆవాసాన్ని ఏర్పర్చుకున్న నగరపు మురికివాడల్లో వారి పట్ల ఎవరికీ ప్రత్యేకమైన శ్రద్ధ ఉండదు. నాయకులకందరికీ వారి ఓట్లమీద ప్రేమ. తమను గురించి ఎవరూ పట్టించు కోరనే సత్యాన్ని రచయిత మురికివాడ వాసిమనోగతం ద్వారా ఇట్లా చెప్పించాడు.

'గరీబోల్లు బతకాలని ఎవరనుకుంటాన్రే నీ పిచ్చిగాని గిదంత ఉన్నోల్ల దున్యే. మోటార్ గాడిలోల్ల కోసం సడాకు లేస్తాను. బిజ్లిగోలలుపెడ్తాను. నల్లలు మోరిలేస్తాను, మరి, గరీబోల్లకేం పెడతాన్రో చెవ్వు? గుడిసె లేసుకున్నందుక్కు రంగుపూస్తే, లంబర్సేసి పోయే మున్సి పాల్టివోడు. టెస్కులు గుంజుతాండే. ఒక నల్లపెట్టిండా? ఒక్క బిజ్లిగోల పెట్టిండా? టెస్కులేమో ఈడగుంజె, బిజ్లిగోలలాడపెట్టె'

తెలంగాణలోని పల్లె సీమల్లో స్వాతంత్ర్యానంతర కాలంలో కూడా అస్పృశ్యత కొనసాగింది. అస్పృశ్యతను పాటించడం నేరమనే విషయం ఆనాటికి దళితులకు తెలియదు. భూస్వామ్య వర్గీయులు దళితులను తమ అదుపు ఆజ్ఞాలలో పెట్టుకునే లక్ష్యంతో తీవ్రమైన అస్పృశ్యతను అమలు పరచారు. ఇది దళితుల్లో నిషాగరు స్థితికీ, నిర్వేదానికీ, అత్మన్యూనతకూ దారితీసింది. తమ జీవితాలు ఏనాటికీ మారకపోవచ్చుననే అంచనా వారిలో కలిగింది. ఇదంతా 1956 తర్వాత కూడా కనిపించిన పరిస్థితి. 'పావని' నవలలోని దళితుల సంభాషణల ద్వారా దాశరథిరంగాచార్య నాటి వాళ్ళ మన్ఃస్థితిని ప్రతిధ్వనింప జేశారు.

'అంటరాని వాండ్లమమ్మ వేంఇట్ల దూరంగా కూలబడ్తంలే' అంటారు వెంకయ్య 'ఎంకిగాన్ని బాంచెన్ మీ కాళ్ళ కాడ పడుండేటోళ్ళం' ఇది కూడా వెంకయ్య మాటనే, ఇందులో అక్షరాక్షరం ఆత్మన్యూనత ధ్వనిస్తోంది.

'తాతా అన్యాలమేమన్న చేసినానే, న్యాలమే చెప్ని గద' అన్నది దళిత పోచయ్యమాట, 'న్యాలమైనా అన్యాలమైనా దొరలే చెప్పాలె. మనం ఇనాలె ఇట్లనే గడిచింది ఇంత కాలం' అన్నది ధర్మయ్య అనే మరో దళితుడి మాట.

'ఒరే పోచిగా, మనం బాంచెలోల్లంరా బాంచె లోల్లంగానే బతకాలె బలం చూపిస్తే బతకలేంరా, బతికితే బాంచెలోలే బతకాలే' ఇది కూడా ఆత్మన్యూనత నుండే వచ్చిన ధర్మయ్య మాట, దళితుల బతుకులు మురికి బతుకులని వ్యాఖ్యానించే జగన్నాథంలో దళిత వ్యతిరేక

దృక్పథం స్పష్టం. గతంలో ప్రతి తెలంగాణ గ్రామంలోనూ ఎవరో ఒకరు ఇటువంటి వారు ఉండేవారు. జగన్నాథం వారి ప్రతినిధి. 'పావని' నవల తెలంగాణలోని దళిత జీవన స్థితిగతుల్ని గ్రామ పరిధిలో వ్యక్తీకరించింది. 'మాయ జలతారు' నవల తెలంగాణ నుండి నగరానికి వలస వచ్చిన దళితులు, బడుగు జీవులు మురికి వాడల్లో అనుభవిస్తున్న దుస్థితిని వివరించి చెప్పింది. ఈ రెండు నవలలతో పోల్చినపుడు 'జనపదం'లో దళిత వస్తు వర్ణన తక్కువగానే ఉంది. అయితే 'మాయ జలతారు' 'పావని' నవలల కంటే ఎంతో ఉదాత్తంగా దళిత జీవన సంస్కార క్రమాన్ని చూపించిన నవల 'శరతల్పం'. ఇది మరో 'మాలపల్లి'. 'శరతల్పం' నిడివి తక్కువ అయినందువల్ల దీనిపై చాలా మంది దృష్టి ప్రసరించలేదు. రంగాచార్య నవలల్లో అత్యంత ఆర్ద్రమైనది 'శరతల్పం'. ఒక నిరక్షరాస్యుడైన దళితుడు సత్సాంగత్యం కారణంగా ఉత్తమ సంస్కారాన్ని పెంపొందించుకొని అత్యున్నత ఆధ్యాత్మిక మానసిక స్థితిని చేరుకోవడం 'శరతల్పం' నవలలో చిత్రించబడింది.

ఉదాత్తీకరణ పొందిన దళిత పాత్రకు గురవయ్య ప్రతినిధి. అతడు గ్రామీణ సమాజంలో అంటరానివాడు. అనుకోకుండానే నారాయణస్వామి అనే బ్రాహ్మణుడి సాహచర్యం అతడికి లభించింది. అది క్రమేణ గురుత్వంగా వికసించింది.

'వదిన గారూ పారే నీళ్ళల్లో ఎక్కన్నుంచో రెండు కట్టెలు కొట్టుకొస్తాయి. వరదలో రెండూ కలుస్తాయి. జర దూరం పోతాయి అటెన్క ఏరు పడుతాయి. ఏది ఎక్కడికి పోతదో ఎవరికెరుక?' అని మరణ శయ్యపై కూడా వేదాంతాన్ని పలికిన గురువయ్య పాత్ర శరతల్పానికే కొత్త శోభను తీసుకొని వచ్చింది.

'మాలపల్లి' నవలలోని రామదాసు 'శరతల్పం'లో గురువయ్య ఒకేస్థాయిని కలిగిన వేదాంతులుగా కన్పిస్తారు. అయితే అస్పృశ్య సమాజంగా బాధలు అనుభవించిన దళిత వర్గంలో కూడా అత్యున్నతస్థాయి వేదాంతి ఆవిర్భవించగలడా? అన్నప్రశ్నకు అవుననే జవాబును చెప్పుకోవచ్చు. తెలంగాణలోని కొన్ని గ్రామాల్లో దళిత వర్గీయులైన వేదాంతులు ఉండేవారు. వారు జీవితంపట్ల తీవ్రమైన నిర్వేదాన్ని ప్రకటించేవారు. ఈ నిర్వేద భావనల్ని కొన్ని కార్మిక గేయాలను పాడడం ద్వారా వ్యక్తపర్చే వారు. ఇప్పటికీ తెలంగాణ సీమల్లో ఇటువంటి నిజమైన వేదాంతుల్ని గుర్తించవచ్చు.

తెలంగాణ ప్రాంతంలో మానవ సంబంధాలు వెల్లి విరిసిన తీరునూ, అందులో ఏర్పడిన అంతరాయాల్ని రంగాచార్య నవలలు సూచించాయి. వీటిలో సహజత్వం ఉంది. సునిశిత పరిశీలనా దృష్టి దానికి తోడుగా నిలిచింది. 'జనపదం' నవలలో అన్నింటినీ డబ్బుతో కొనవచ్చననుకునే రామయ్యతో సైదయ్య అనే అతడి అనుచరుడు మాట్లాడిన తీరు మానవ సంబంధాల విశిష్టతను చాటి చెపుతోంది. కొత్తగా ధనవంతులైన వారు దళారీలు నిక్కమైన మానవ సంబంధాలకు అణావంతు కూడా విలువ ఇవ్వరని రామయ్య స్వభావం చెబుతోంది. ఘనమైన మానవ సంబంధాలు బీదల బస్తీల్లో కన్పిస్తాయని 'రానున్నది ఏదినిజం' 'జనపదం' 'మాయజలతారు' నవలల ద్వారా రంగాచార్య చిత్రించి చూపారు. 'శరతల్పం' నవలలో గురవయ్య నారాయణ స్వామిల మధ్య ఏర్పడినది అపూర్వమైన మానవ సంబంధం.

'పసుపురంగు పైత్యానిది
నలుపురంగు చీకటిది
ఎరుపురంగు ఆకలిది
కాలే ఆకలి కార్చిచ్చు'

అంటూ శ్రీశ్రీగారు రంగులను విశ్లేషిస్తూ ఒక్కొక్క రంగుకు ఒక్కొక్క గుణాన్ని తెలియజేశారు. ఎరుపు రంగును ఆకలికి ప్రతీకగా కేవలం తెలియజేయడమే కాకుండా దాని పోలికను కార్చిచ్చుగా నిర్వచించారు. ఆకలికి గుర్తు ఎరుపు, ఆలోచనలతో కూడిన ఆవేశం దాని క్రియ విప్లవం. అదిగూడా ఎరుపే. ఎరుపు ఎక్కడైనా న్యాయాన్ని కోరుతూ అన్యాయానికి వెన్నులో భయం పుట్టేలా చేస్తుంది. ప్రశ్నలను దుశ్చర్యలపై ఎక్కుపెడ్తుంది. అందుకే ఎరుపంటే పెట్టుబడిదారితనానికి భక్ష్మీం. చీకటిని, అవినీతిని ఇష్టపడేవాళ్ళు దీనికి (ఎరుపుకు) ఆమడ దూరంలో వుండి ఆర్పేయాలని, నేల కూల్చాలని పన్నాగాలు పన్నుతారు. అది ఎంతకాలం అరచేత్తో సూర్యోదయాన్ని ఆపలేమనట్లు అన్పించినా వారి తెలివి

తక్కువతనాన్ని, దిగజారుడుతనాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. అయినా కాలం ఎప్పుడూ ఒకేరీతికాదు అన్నట్లు ఎప్పటికైనా సత్యానికి జయం లభించితీరుతుంది అన్న ఆకాంక్షను ప్రధాన ఇతివృత్తంగా దాశరథి రంగాచార్యగారు తమ 'మోదుగుపూల'ను తీర్చిదిద్దారు. ఈ నవలపై వారి అభిప్రాయాన్ని ఒక ఇంటర్వ్యూలో ఇలా తెలియజేశారు.

"నా 'మోదుగుపూలు' నవల అదొక పరిపూర్ణమైన నవల నా మిగతా నవలల్ని విమర్శించినవారు కూడా 'మోదుగుపూలు' నవల విషయంలో మాట్లాడలేక పోయారు. 'మోదుగుపూలు' నవలా వస్తువు మా కథ. మా గార్ల జాగీరు కథ" ఈ భావాలను పరిశీలిస్తేవారు ఈ నవలను కేవలం గత చరిత్ర డాక్యుమెంట్‌గాగాక ప్రపంచంలో ఎక్కడైనా ఏ కాలంలోనైనా జరిగే అసాంఘిక స్థితులకు ప్రజల నుండి ఇదే సమాధానం వస్తుందన్న విషయాన్ని సర్వ కాలాలకు స్థిర ఫలితంగా ఈ నవలను తీర్చిదిద్దినట్లు అన్పిస్తుంది. దాశరథి రంగాచార్యగారు ఆనాడు నిజాం పరిపాలనలో ప్రజలుపడ్డ బాధలు, అన్యాయాలు, అక్రమాలు, అధికారుల నిరంకుశత్వం, ప్రజల నిస్సహాయత మొదలైన వాటికి ఈ 'మోదుగు పూలు' నవల్లో దృశ్యమయం చేశారు.

నిజాం పాలన, రెండవ ప్రపంచ యుద్ధం అటు ప్రపంచానికి యిటు తెలంగాణాకి దుర్దశలుగా దాపురించాయి. మీర్‌ఉస్మాన్ ఆలీఖాన్ పాలనలో ఒక జాగీరు. ఆ జాగీరులోని ప్రజల జీవితాలు వాళ్ళవికావు. జాగీర్‌దార్లవి. బ్రతుకే భయంగా ఉన్నప్పుడు అక్కడి మనిషికి హక్కులు లేవు, స్త్రీలకు రక్షణలేదు. ప్రశ్నకు తావులేదు. ఎదురు తిరిగే ధైర్యం లేదు. శిక్షలకు తలవంచాలి, వెట్టి చాకిరీని భరించాలి. అవిద్య, అజ్ఞానం ప్రజలను జాగీర్లకు బానిసల్ని చేసింది. యువకులు సైతం ఆ జాగీర్‌లో బానిసలే. రఘు మాత్రం తనకు జరిగిన చేదు అనుభవంతో తిరుగుబాటుకు శ్రీకారంచుడ్తాడు. ఉద్యమం రూపుదిద్దుకుంటుంది. రఘుకి మేనమామ వీరయ్య అతని కూతురు జానకి ఆ గ్రామంలోని నాగేశ్ అనే యువకుడు సాయపడ్తారు. రఘుజానకిని ప్రేమిస్తాడు. నాగేశ్ షావుకారు బిడ్డ రుక్మిణిని ప్రేమిస్తాడు. రఘు మరదలు జానకి గాని, రుక్మిణిగాని (నాగేశ్ ప్రేమించిన యువతి) వారి ప్రేమికులతో జీవితం పంచుకోకుండానే జాగీర్ల దుర్మార్గానికి ఆత్మహుతి అవుతారు రఘు హింసని ఆశ్రయిస్తాడు. ఈ విధంగా 'మోదుగు పూలు' నవల్లో బరువైనకథ, వివిధ సంస్కృతులకు చెందిన ఉపకథలు కన్పిస్తాయి.

ఈ నవల్లో రచయిత రంగాచార్యలు గారు. ఉద్యమ దృక్పథాన్ని రఘుపాత్ర చేత చెప్పిస్తూ హింసను ఈ విధంగా తెలిపారు.

'నాగేశ్'! చిరునవ్వు నవ్వుతూ భుజం మీద చేయివేసి శాంతంగా అన్నాడు 'రఘు' అర్థం చేసుకో, చంపటం, చావటం వ్యక్తులకు చెల్లుతుంది. అది ఆగడాలకు, ద్వేషాలకు, రోషాలకు, కావేశాలకు పరాకాష్ట, రక్తం చూచి రగులుతున్న ద్వేషం ఆరుతుంది. ప్రాణంతో పగతీరుతుంది. అప్పటి నుంచి మరొకరుగ మొదలై, ఆ అగ్ని కుటుంబాలను తద్వారా వంశాలను అలుముకుని నాశనం చేసి వదులుతుంది. హింస పిరికి తనానికి చిహ్నం. పలాయనానికి మరొక రూపం. అది ఉద్యమానికి బత్తిగా పనికిరాదు'. అని చెప్పిన రఘు తర్వాత విధిలేక హింసని ఆశ్రయిస్తాడు. ఆశయం, సిద్ధాంతాలు మంచివే అయినా వాటి ఆచరణలో కాలంలో ఒకే తీరైన ప్రమాణాలు వుండవని అవి మార్పులకు గురైనా వాటి ఫలితాలు శాశ్వత ప్రయోజనాన్ని ఆశ్రయించి వుంటాయని రఘు మాటల వల్ల అవగతం అవుతుంది.

'మోదుగుపూలు' నవలను పరిణామ సూత్రంతో అన్వయించి విశ్లేషిస్తూ డా॥వనం సావిత్రీనాధ్ గారు తమ పరిశోధన గ్రంథం డా॥దాశరథి రంగాచార్య రచనల్లో 'జీవిత దృక్పథం'లో యిలా తెలియజేశారు. రంగాచార్యులు గారు ఈ నవల్లో జానపదసాహిత్య సౌరభాన్ని కూడా అందించారు. అమావాస్య సాయంత్రం బద్రాయి దగ్గర జరిగిన కొలువులో బైండ్లవారి జముకు మోగింది, మాల, మాదిగలు ఊరి జనం పెద్దలు వచ్చారు. బైండ్లవాళ్ళ కథ జరిగింది అంటూ బైండ్ల పాటను ప్రవేశపెట్టడం ద్వారా ఈ తెలంగాణ సంస్కృతిలో భాగమైన జానపదకళలకు పెద్దపీట వేసినట్లనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. రంగాచార్య, దాశరథి, చిల్లర దేవుళ్ళు, దాశరథి రంగాచార్య రచనలు (సంపుటి2) హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 1998
2. రంగాచార్యులు, మాడభూషి, తెలుగు నవల ఆధునిక స్త్రీ. హైదరాబాద్: శ్రీ బాలాజీ ఆర్ట్ ప్రింటర్స్, చిక్కడపల్లి, 2001.
3. దక్షిణామూర్తి, పోరంకి, కథానిక, స్వరూప స్వభావాలు. 1998
4. ద్వానాశాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాద్, 2004
5. ఆరుద్ర, సమగాంధ్ర సాహిత్యం, నవాబులయుగం. యం.శేషాచలం అండ్ కంపెనీ, మద్రాసు, 1968.

★★★

# భాగవత కథలు - చతుర్ధ, పంచమి స్కంధాలలో భక్తి

- వి. ఎల్. నరసింహారావు, పరిశోధక విద్యార్థి

భారతీయ వాఙ్మయంలో భాగవతం ఒక మహోన్నత హిమాలయ శృఖరం. అంతేకాదు, విశ్వ సంస్కృతిలోనే విశిష్ట గ్రంథం. వివేచించి చూస్తే అప్పటికే వ్యాసుడు వేదాలను, మహాభారతాన్ని, పురాణాల్ని రచించిన వాటి పట్ల తృప్తి, మనసుకు శాంతి లేక అక్షర దాహం తీరని పరిస్థితి ఏర్పడింది. దాంతో త్రిలోక సంచారి అయిన నారదుడు సామాన్యులకు అర్థమయ్యేలాగ మహా భాగవతాన్ని రచింపమని తద్వారా నీకు మనశ్శాంతి కలుగుతుందని, ఆ భాగవతకథలు ప్రజలకు భావితరాల వారికి చదవటం, వినటం ద్వారా వారు ఎట్లా నడుచు కోవాలో తెలుస్తుంది, కళ్యాణదాయకం అవుతుందని వ్యాసభాగవానునికి నారదుడు హితబోధ చేస్తాడు. మంచి సుముహూర్తం చూచుకొని అట్లాగే చేసాడు. భారతీయ తాత్త్విక చింతనను ఆత్మశక్తిగా ఉంచి సర్వసమగ్రమైన సామాజిక కావ్యంగా భాగవతన్ని అద్భుతంగా సమ కూర్చారు. కేవలం సాహితీదృష్టితో చారిత్రక దృష్టితో భాగవతాన్ని పరికించడం తగదు బహుకోణాలలో నిర్దిష్టంగా, నిర్దుష్టంగా, సంప్రదాయ బద్ధంగా పరిశీ లించినప్పుడే ఈ మహాపురాణం వల్ల జాతికి సరి అయిన ప్రయోజనం లభిస్తుంది. ఆనాడు నన్నయ గారి తపస్సు తిక్కన గారి దీక్ష కూడ భారత రచన ద్వారా సాహితీ సామాజిక రంగాలలో సవ్యమైన మార్పును తీసుకొస్తే ఆ తరువాత పోతన భాగవతం సామాజిక నేపధ్యంలో ఆవిష్కరింపబడి తెలుగుజాతిని మరొమారు పునీతం చేసింది.

భాగవతం వేద, పురాణ, బ్రహ్మసూత్ర, మహాభారత ప్రతిపాదితార్థం యొక్క జీవసారం. విద్యావతాం భాగవతే పరీక్షా" అనే నానుడి వుంది. భాగవతం దేవీభాగవతం కంటే భిన్నమైనది. దేవీ భాగవతం తాంత్రికమతాన్ని పరాశక్తి రామ్యమును బోధించును. భాగవతమునకు నాయకుడు పురాణపురుషుడగు విష్ణువు. అనేకావతారాల్లో, అనేక యుగాల్లో, అనేక చోట్ల ప్రవర్తిల్లిన విష్ణువు లీలా విశేషాదులు, విష్ణుభక్తుల పావన చరిత్రలు భాగవతంలో గుది గూర్చబడ్డాయి. విష్ణు పారమ్యమును, భక్తిని ప్రబోధించు భాగవతానికి విష్ణు భాగవతంలో నామాంతర మేర్పడింది. పోతన భాగవతంలో చతుర్థి పంచమి స్కంధాలలో విష్ణుమహిమలను వివరించుటయే ఈ వ్యాస విశిష్టత.

భాగవతంలోని చతుర్థ స్కంధములోని కథ దక్షుని చరిత్ర. ఇది లోక ప్రసిద్ధమైనది. ప్రజాపతులు యజ్ఞము కొరకు ఏర్పాటు చేసిన సమావేశానికి దక్షుడు వస్తాడు. అతని రాకను గమనించిన వారందరూ లేచి నిలబడి అతడికి నమస్కారం చేస్తారు. దక్షుడు బ్రహ్మదేవుడికి నమస్కరించి ఉచితాన్యమును స్వీకరిస్తాడు. కాని తన రాకను గమనించక కూర్చున్న పరమేశ్వరుడిని చూసి కోపావేశపూరితుడై శివుడు తనను కావాలనే అవమానించి నాడని నానా దుర్భాషలాడుతాడు. తనకూతురును శివుడికిచ్చి ఆమె గొంతు కోసాను అంటాడు. అల్లుడు శిష్యునితో సమానుడు. మర్యాద చేయవల్సింది పోయి అవమానించాడని కోపంతో సభ నుండి వెళ్ళి పోతాడు. దక్షుడు శివుడిని నిందించినాడన్న వార్త నందీశ్వరుడికి తెలిసి 'పశువువలె ప్రవర్తించిన దక్షుని ముఖం మేక ముఖం అయిపోవుగాక' అని శపిస్తాడు. ఇలా శివభక్తులు, దక్షుని అనుచరులు పరస్పరం శపించుకొంటారు. కోపంతో శివుడు తన అనుచర గణాన్ని తీసుకొని సభ నుండి వెళ్ళిపోతాడు.

కొంత కాలం తర్వాత బ్రహ్మ దేవుడు దక్షుడిని ప్రజా పతులకు అధిపతిగా ప్రకటించగా అతని గర్వము మరింత పెరుగుతుంది. కొన్ని రోజలు తర్వాత దక్షుడు శివుడిని పరాభవింప జేయడానికి బృహస్పతి యజ్ఞమును చేయ తలపెట్టాడు. కాని తండ్రి కుత్సితపు ఆలోచనను తెలసుకోలేని సతీదేవి, పుట్టింటిపైగల మమకారంతో భర్త

ఆజ్ఞను మీరి తండ్రి యజ్ఞానికి వెళ్ళి నిరాదరణకు గురై, పరమేశ్వర దూషణను సహించలేక అగ్నికి ఆహుతి అవుతుంది. విషయం తెల్సిన మహాదేవుడు క్రోధించి, రుద్రుడై తన జటాజూటం నుండి వీరభద్రుడిని సృష్టించి దక్షయజ్ఞాన్ని భంగం చేసి రమ్మంటాడు. వీరభద్రుడు ఉగ్రుడై దక్ష యజ్ఞాన్ని ధ్వంసం చేసి దక్షుడి తల నరికి యజ్ఞగుండానికి ఆహుతిస్తాడు. దక్షుడి భార్య, బ్రహ్మాది దేవతలు, ఇంద్రుడు ప్రజాపతులందరూ మహాదేవుడిని ప్రార్థించి శాంతపర్చగా శివుడు అనుగ్రహించి దక్షునికి మేక తలని అతికించి పునరుజ్జీవితుడిని చేస్తాడు. శివుడి దయకు పాత్రుడైన దక్షుడు పరమానంద భరితుడై తన అపరాధమును క్షమించమని, యజ్ఞాన్ని పునః ప్రారంభిస్తాడు. పవిత్రమైన మనసుతో దక్షుడు యజ్ఞాన్ని కొనసాగించి శ్రీహరిని ధ్యానించగా స్వామి గరుడారూఢుడైన పురుషోత్తమునిగా ప్రత్యక్షమై దక్షుడిని అనుగ్రహిస్తాడు.

చతుర్థ స్కంధమునందు గల ధ్రువ చరిత్ర జగత్ప్రసిద్ధమైన కథ. బాలుడిగా ఉన్న ధ్రువుడిని సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడే అనుగ్రహించి ప్రత్యక్షమవుతాడు. స్వాయంభువ మనువు వంశంలో జన్మించిన ఉత్తాన పాదునకు సునీతి, సురుచి అను ఇద్దరు భార్యలు. సునీతికి ధ్రువుడు, సురుచికి ఉత్తముడు అను పేరు గల కుమారులు జన్మిస్తారు. ఉత్తాన పాదునకు రెండవ భార్యపై గల మక్కువతో ఆమె కుమారుడైన ఉత్తముడిని చేరదీస్తాడు. అది గ్రహించలేని ధ్రువుడు తండ్రి దగ్గరికి చేరగా అది గమనించిన సురుచి ధ్రువుడిని అడ్డగించి 'మీ తండ్రి అంకమున కూర్చోవలెనన్న నువ్వు నా గర్భంలో జన్మించి ఉండాల్సింది కాని అలా జరుగనందున నీకు ఆ అర్హత లేదు. నీవు భగవదనుగ్రహం సంపాదించి నీ తండ్రి వంచన కూర్చోవడానికి గాని, రాజ సింహాసనాన్ని అధిష్ఠించడానికి గాని అర్హత సంపాదించుకొని రావాల్సింది' అని పరుషం మాట్లాడుతుంది. పినతల్లి మాటలకు ధ్రువుడు ఏడుస్తూ తల్లి దగ్గరికెళ్ళి రోదిస్తాడు. సునీతి కూడా చేసేదేమీ లేక భగవదనుగ్రహం తప్ప నీకు వేరే దిక్కు లేదని హితవు పలుకుతుంది. భగవదనుగ్రహం కోసం అరణ్య మార్గాన బయలుదేరిన ధ్రువుడికి నారద మహర్షులు దర్శనం ఇచ్చి 'ఓం నమో భగవతే వాసు దేవాయ' అనే ద్వాదశాక్షర మంత్రాన్ని ఉపదేశిస్తారు. (ధ్రువుడు కఠినమైన నియమ నిష్టలతో, కఠోర తపస్సును ప్రాణాయామ పూర్వకంగా చేస్తూ భగవదనుగ్రహానికి ప్రయత్నం చేస్తాడు.

ఇంద్రియాలను జయించి ఒంటి కాలిపై నిలబడి ఏకాగ్రచిత్తముతో నిరాహారియై, భగవంతుని ధ్యానిస్తున్న ధ్రువుడికి శ్రీహరి ప్రత్యక్షమై అనుగ్రహిస్తాడు. 'నియమాలు ఎంత కఠినంగా ఉంటే ఫలితం అంత గొప్పగా ఉంటుంది' అని ధ్రువ చరిత్ర నిరూపిస్తున్నది. ధ్రువుడి ధ్యానానికి మెచ్చి శ్రీహరి ప్రత్యక్షమై అంత వరకు ఎవరికి లభించని ధ్రువలోకమును ధ్రువుడికి సృష్టించి ఇచ్చి, దీని చుట్టునే యముడు, కశ్యపుడు, ఇంద్రాదులు, నక్షత్రముల సహితముగ ప్రదక్షిణము చేయుదురని కల్పాంతము నందు ఇతర లోకములు నశించినను ధ్రువలోకము నశించదని అనుగ్రహించి ధ్రువ పదవిని ప్రసాదిస్తాడు. కొంత కాలము తర్వాత విష్ణుదూతలు వచ్చి ధ్రువుడిని విష్ణు పదము చేరుకోవడానికి శ్రీహరి విమానం పంపినాడని చెప్పగా మృత్యువు తలపై కాలు పెట్టి విమానం ఎక్కి, తన పూర్వులెవరూ చేరుకోని కైవల్య పదమును చేరుకొంటాడు. భగవదనుగ్రహం చేత పావనమైన ధ్రువుడి చరిత్ర పవిత్రమేకాక శుభకరమైనది.) యశస్సును, కీర్తిని వృద్ధి చేసి ధ్రువ పదమును, దేవత్వమును ప్రసాదించును. శ్రీ మన్నారాయణుని భక్తితో, భజనతో, తపస్సుతో కొలిస్తేనే అనుగ్రహించడం కాకుండా మరణ మయమున అష్టాక్షర మంత్రాన్ని ఉచ్ఛరిస్తే కూడా పాపాలు ప్రక్షాళన అయి, భగవదనుగ్రహాన్ని పొంద వచ్చునని షష్ఠమ స్కంధంలోని అజామిళుని కథ నిరూపిస్తున్నది.

'అనఘాత్మ! మఱి నీవు యజ్ఞరూపుం డనఁ
దగు నన్ను సంపూర్ణ దక్షిణంబు
లగు మఖంబులచేత నర్చించి సత్యంబు
లగు నిహసౌఖ్యంబు లనుభవించి

పుణ్యపురుషా ! నీవు యజ్ఞ పురుషుడనైన నన్ను

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

సంపూర్ణ దక్షిణలతో కూడిన యజ్ఞాలచేత ఆరాధిస్తావు. ఈ లోకంలోని అనంత సౌఖ్యాలను అనుభవిస్తావు. మరణ కాలంలో నన్ను మనస్సులో స్మరిస్తూ, సకల లోకాలకూ వందనీయమై, పునరావృత్తి రహితమై సప్తర్షి మండలానికిపై ఉండే నా స్థానాన్ని పొందుతావు అని భగవంతుడు ధ్రువుడు కోరిన కోర్కెలను ప్రసాదించి, అతడు చూస్తూ ఉండగానే గరుత్మంతుణ్ణి ఆరోహించి ఆనందంగా తన పట్టణమైన వైకుంఠానికి వేంచేశాడు.

'అంత ధ్రువుఁడునుఁ బంకేరుహాక్ష పాద
కమల సేవోపపాదిత ఘన మనోర

అప్పుడు ధ్రువుడు పద్మాక్ష పాదపద్మ పరిచర్యవల్ల సమధిక మనో రథాలు సంప్రాప్తించినప్పటికీ, సంతృప్తి పొందక చింతిస్తూ వెళ్లిపోయాడు.

'అని మైత్రేయుఁడు ధ్రువుఁ డ
ట్లనయము హరిచేఁ గృతార్థుఁ డైన విధం బె

ఈ విధంగా మైత్రేయ మహర్షి ధ్రువుడు శ్రీహరి నుండి వరాలు పొందిన విధం అంతా విదురునికి వినిపించాడు. అప్పుడు విదురుడు మహర్షితో సవినయంగా ఇలా అన్నాడు.

'ముని నాయక! విను కాముక
జనదుష్ప్రాపంబు విష్ణు చరణాంబురుహ

'పెక్కు జన్మంబులం గాని పొందరాని పదంబు దా నొక్క జన్మంబుననే పొందియుం దన మనంబునం దప్రాప్త మనోరథుండ నని పురుషార్థవేది యైన ధ్రువుం డెట్లు దలంచెననిన మైత్రేయుం డిట్లనియె. మునీంద్రా! కాముకులకు పొందరానిది, విష్ణు భక్తులకు పొంద గల్గినదీ అయిన నారాయణుని శాశ్వత స్థానాన్ని ధ్రువుడు పొందాడు గదా! పెక్కు జన్మలెత్తిగాని పొందరాని స్థానాన్ని ఒక్క జన్మలోనే పొందికూడా తన కోర్కె సిద్ధించలేదు అని ధ్రువుడు ఎందుకు భావించాడు? అతడు పురుషార్థాలను చక్కగా ఎరిగిన వాడు కదా !

'అనఘ! పినతల్లి దన్నుఁ బల్కిన దురు క్తి
బాణవిద్ధాత్ముఁ డగుచుఁ దద్భాషణములు

అప్పుడు మైత్రేయ మహర్షి విదురునితో ఇలా అన్నాడు. పినతల్లి ఆడిన దుర్భాషలు అనే బాణాలచేత ధ్రువుని మనస్సు బాగా గాయపడింది. అందుచేత ఆ దుర్భాషలనే అతడు మాటిమాటికీ స్మరిస్తున్నాడు. ఆ కారణంచేత హరి ప్రత్యక్షమైనప్పుడు ముక్తిని కోరలేక పోయాడు. అందుకే మనస్సులో పరితపిస్తున్నాడు.

'అంత నా ధ్రువుండు.'

'అనఘ! జితేంద్రియుల్ సుమహితాత్ములునైన సనందనాదు లెం
దనయ మనేక జన్మ సముపార్జిత యోగ సమాధిఁ జేసి యె

అప్పుడు ధ్రువుడు ఇలా చింతించాడు. జితేంద్రియులూ, మహాత్ములూ అయిన సనందనుడు మొదలయిన మునీంద్రులు మిక్కిలి భక్తితో పెక్కు జన్మల సమాధి యోగం ద్వారా ఏ మహానుభావుని చరణ కమలాలను దర్శించగలుగుతారో అటువంటి అమేయుడు, అవికారుడు, అజయ్యుడు, అద్యుడు, పరమేశ్వరుడు, అయిన శ్రీహరిని నేను ఆరు నెలలు సేవించి ఆయన పాదపద్మాల నీడలో నిలిచి కూడా భేద దృష్టి కలవాడను అయ్యాను. నేను దురదృష్టవంతుడను. సంసార బంధాలను హరించే హరిని దర్శించి కూడ అనిత్యాలైన కోర్కెలను కోరుకున్నాను. ఇలాంటి దౌర్భాగ్యం ఎక్కడన్నా ఉంటుందా? తమ స్థానాలకంటె ఉన్నతమైన స్థానాన్ని నేను పొందుతానేమో అని ఓర్వలేక దేవతలు నా బుద్ధిని కలతపరచి ఉంటారు. ఆనాడు నారదుడు ఆడిన మాట యథార్థమైనది. ఆయన మాటలను నేను సరకు గొనలేదు. నేను అధముడను. నిద్రించేవాడు కలలో దైవమాయకు చిక్కి తానొక్కడే అయినా, తనకంటె వేరుగా అనేకులను తనయందు చూస్తాడు. అలాగే నేను ఒక్కడనే అయినప్పటికీ తమ్ముడనే శత్రువును కల్పించుకొని దుఃఖం పొందాను. జగత్ స్వరూపుడూ, దయామయుడూ, సంసార వినాశకుడూ అయిన హరిని ఆరాధించి, ఆయన అనుగ్రహం పొంది కూడా ఆయుస్సు చాలని రోగికి ఔషధాలవలె కొరగాని కోర్కెలు కోరుకున్నాను.

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

మ. 'ధనమీనుండు నృపాలుఁజేరి మిగులన్ ధాటిన్ ఫలీకార మి
మ్మని యర్థించినరీతి ముక్తి ఫలదుం డై నట్టి పంకేజ ల్లో

పేదవాడు మహారాజును సమీపించి ఊకతో కూడిన నూకలను ఇమ్మని కోరినట్లు మోక్షప్రదాత అయిన పుండరీకాక్షుడు సాక్షాత్కరింపగా నేను సంసారాన్ని అర్థించాను. నావంటి మందబుద్ధులు ఈ లోకంలో మరెవ్వరూ ఉండరు అని ధ్రువుడు విచారించాడు.

సభ్యులారా! దయచేసి వినండి. ధర్మము తెలియగోరేవాడు తన మనస్సులోని అభిప్రాయాన్ని ధీరులైన సత్పురుషులకు నివేదించటం లెస్స.

ఏను నీ లోకవితానంబు నెల్లను
శాసించి భూప్రజా సంతతులను
దత్తద్విహిత వృత్తి దానంబులను జేసి

లోకాల నన్నిటినీ పరిపాలిస్తూ ప్రజానీకానికి వారివారికి తగిన వృత్తులను ఒడగూర్చి రక్షించడానికి, ధర్మం దెబ్బ తినకుండా నిలబెట్టడానికి బ్రహ్మదేవుడు నన్ను నియోగించాడు. ఇటువంటి ధర్మబద్ధమైన ప్రజాపాలనం సమర్ధంగా ఆచరించేవానికి కర్మసాక్షి అయిన భగవంతుడు సంతోషించి ఏ లోకాలను అనుగ్రహిస్తాడో అటువంటి అభీష్టదాయకాలైన పుణ్యలోకాలు సదాచారపరుడనైన నాకు లభిస్తాయి.

ప్రజలను ధర్మమార్గాన పరిపాలింపక అర్థకాంక్షతో ప్రజల నుండి పన్నులు గుంజుకొన్న రాజునకు ప్రజల పాపం సంక్రమిస్తుంది. అందుచేత ఆ రాజు తేజోహీనుడై నశిస్తాడు. కాబట్టి ప్రజలు రాజు మేలుకొరకూ తమ మేలుకొరకూ అసూయారహితులై పరమేశ్వరార్పణ బుద్ధితో ధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించాలి. మీరు ఇలా చేయడమే నన్ను అనుగ్రహించడమని భావిస్తాను. మీరు నాకు తండ్రుల వంటివారు. దేవతలవంటివారు. ఋషుల వంటివారు. అటువంటి మీరు దీనికి సమ్మతించి మీ నాయకుడనైన నాకు పరలోకంలో ఏ ఫలం కలుగుతుందో అటువంటి ఫలానికి తగిన మంచి కార్యాలను ఆచరించాలి. మీరు అలా చేసినట్లయితే నేను సంతోషిస్తాను అని పృథుచక్రవర్తి పలుకగా సభ్యులు ఇలా అన్నారు.

క. జననాయకః ప్రజ లిర వొం
దిన ధర్మము లెల్ల వాసుదేవార్పణ బు

మహారాజా! వాసుదేవార్పణ బుద్ధితో ప్రజలు ధర్మకార్యాలను ఆచరించాలని నీవు చెప్పావు. అసలు వాసుదేవుడనే వాడంటూ ఒక డున్నాడా ?

సి. అన విని వారికి మనుజేశుఁ డను నర్వ
తములార! వినుఁడయ్య తవిలి మీరు!

ఇలా ప్రజలు ప్రశ్నించగా అప్పుడు పృథు చక్రవర్తి సభ్యులతో ఇలా అన్నాడు. పరమారోగ్యులైన బుద్ధి మంతులారా! వినండి. యజ్ఞాధిపతియైన సర్వేశ్వరుడు ఉన్నాడు. మీరు అందుకు అంగీకరింపకపోతే ఆయన సృజించిన లోకం కన్నుల ముందు స్పష్టంగా కనిపిస్తున్నది కదా! వాసుదేవుడు లేకపోతే ఈ చిత్రవిచిత్రమైన జగత్తు ఎలా పుట్టింది? అందువల్ల ఈశ్వరుడు ఉన్నాడని ఒప్పుకోక తప్పదు.

క. నారాయణుండు జగదా
ధారుండగు నీశ్వరుండు; దలఁప నతనికిన్

నారాయణుడు జగత్తునకు ఆధారమైన భగవంతుడు. ఆయనతో సమానులు కానీ, ఆయనకంటే అధికులైన వారు కానీ లేరు. ఆయన మహాధీరుడు, అద్వితీయుడు.

కట్టె తగులబడుతున్నప్పుడు దాని పొడుగు, పొట్టి, వంకర మొదలైన గుణాలు కట్టెలోని నిప్పునకు కూడా సంక్రమిస్తాయి. అలాగే దేహలక్షణాలు దేహమందలి జీవునకూ సంక్రమిస్తాయి. అందుచేత అంతర్యామి దేహధర్మాలను అనుసరించియే వ్యక్తమవుతాడు. దేహం పుట్టుకకు కాలము, సంస్కారము, అదృష్టము కారణాలు. ఇటువంటి దేహంలో అంతర్యామిగా ఉండేవాడు ఆనంద మయుడు. అతడే యజ్ఞేశ్వరుడు. యాగఫలం కూడా అతడే అని చెప్పి మహారాజు మళ్ళీ ఇలా అన్నాడు. ఈ లోకంలోని నా ప్రజలు దృఢనియమంతో యజ్ఞ భోక్తలైన దేవతలకు ఆధీశ్వరుడు, సర్వగురుడు, సర్వేశ్వరుడు అయిన శ్రీహరిని సర్వదా స్వధర్మానుసారం పూజిస్తున్నారు. ఈ విధంగా వారు ఎంతగానో నన్ను అనుగ్రహిస్తున్నారు. అని విష్ణుభక్తి పరాయణులైన మహానుభావులను కొనియాడి పృథుచక్రవర్తి మళ్ళీ ఇలా అన్నాడు.

మ. 'వరసంప ద్విభవ ప్రతాప సుమహైశ్వర్యంబులం బొల్చునీ
ధరణీనాథులతేజ మంచిత తపోదాంతి క్షమా విద్యలం

గొప్ప సిరిసంపదలతోను, మహత్తరమైన ప్రతాపంతోను, అఖండమైన వైభవంతోను ప్రకాశించే రాజుల తేజస్సు తపస్సుతోను, శమదమాదులతోను, క్షమాగుణంతోను విరాజిల్లే బ్రాహ్మణులపైనా, విష్ణుభక్తులపైనా ఏ మాత్రం తన ప్రభావాన్ని చూపించ లేదు. కోపోద్రిక్తుడైన నిటలాక్షుని జట నుంచి ఉద్భవించిన వీరభద్రుని రౌద్ర స్వరూపం ఈ విధంగా వర్ణింపబడింది. పినతల్లి చేసిన పరాభవానికి పరితపించి తపస్సు చేయటం కోసం అడవికి వచ్చిన ధ్రువకుమారునికి నారద మహర్షి నారాయణ మూర్తిని ఈ సీసపద్యంలో పరిచయం చేస్తాడు.

'హారకిరీట కేయూర కంకణ ఘన
భూషణుఁ డాశ్రిత పోషణుండు

గోరూపధారిణియైన భూదేవి నుంచి పృథుచక్రవర్తి సమస్త సస్యములను పితికిన విషయ మీ క్రింది పద్యంలో తెలుపబడింది.

'మనువును దూడఁజేసి గరిమన్ నిజపాణితలంబు లీల దో
హనముగఁ జేసి యందు సకలౌషధులం బితికెం గ్రమంబునన్

ప్రణయకోపం వహించిన తన ప్రియురాలిని పురంజనుడు ఈ విధంగా బతిమాలుకుంటాడు.

'సరసోదారసుధార సోపమవచశ్చాతుర్య సౌభాగ్యమై,

ఈ ప్రకారంగా చక్కని సన్నివేశాలతో కూడి భక్తి ప్రపత్తులను ప్రబోధించే చతుర్థస్కంధంలోని కథలన్నింటినీ మైత్రేయుడు విదురునికి వినిపించినట్లు శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు వినిపించాడు. పురంజనుడు కామాసక్తుడై కామ సాధనములైన కర్మములలో తగుల్కొని బుద్ధి అనే పట్టపుదేవి చేత మోసగింపబడ్డాడు.

'పానంబు సేసినఁ దానుఁ బానముఁ జేయుఁ
గుడిచినఁ దానును గుడుచు మఱియు

పురంజనుడు రాణి త్రాగితే తాను త్రాగుతాడు. ఆమె భుజిస్తే తాను భుజిస్తాడు. నడిస్తే నడుస్తాడు. నవ్వితే నవ్వుతాడు. ఏడిస్తే ఏడుస్తాడు. పాడితే పాడుతాడు. వింటే వింటాడు. చూస్తే చూస్తాడు. కూర్చుంటె కూర్చుంటాడు. దుఃఖిస్తే దుఃఖిస్తాడు. నిలబడితే నిలబడతాడు. నిద్రిస్తే నిదురిస్తాడు. ముట్టుకుంటే ముట్టుకుంటాడు. వాసన చూస్తే వాసన చూస్తాడు. పలికితే పలుకుతాడు. పవళిస్తే పవళిస్తాడు. ఆమె సంతోషిస్తే సంతోషిస్తాడు.

ఈ విధంగా అతడు రాణి చేత మోసగింపబడ్డాడు. మరే కోరిక లేనివాడై అజ్ఞానంతో ఆటబొమ్మవలె ఆ పురంలో నివసిస్తున్నాడు.

'పంచాస్య యు క్తంబుఁ బంచ బంధనముఁ జ
క్రద్వితయములు యుగద్వయంబు

ఒకనాడు పురంజనుడు బంగారు కవచాన్నీ, అక్షయ తూణీరాలను, ధనుస్సును ధరించాడు. ఐదు గుర్రాలు, ఐదు బంధనాలు, రెండు చక్రాలు, రెండు యుగాలు, ఒక అక్షం, రెండు నొగలు, మూడు జెండాలు, ఒక పగ్గం, ఒక సారథి, ఏడు పై కప్పులు, బంగారు నగలు, ఐదు గతిప్రకారాలు, ఒక గూడు, అయిదు ఆయుధములు, ఆశువేగం కలిగిన రథాన్ని ఎక్కి పదకొండు మంది సేనాధిపతులతో కూడి వేగంగా పురం వెడలి బయలుదేరాడు. పురంజనుడు పంచప్రస్థము అనే అడవికి వెళ్ళాడు. ఆ అడవిలో విడువదగని రాణిని విడిచి పెట్టాడు. వేటాడే కోర్కెతో ధనుర్బాణాలు ధరించి మదించి విహరించాడు. అసురవృత్తిని అవలంభించి పాపాత్ముడై దయమాలి వాడి బాణాలతో అడవిలోని మృగ గణాలను చంపాడు. రాజులకు వేట విధింపబడిన ఆచారమే. అయినా లాలసతతో వేటాడరాదు. సామాన్య నిత్యశ్రాద్ధాది సమయాలలో కాక, ప్రఖ్యాతము లైన శ్రాద్ధ దినాలలో మాత్రమే మేధ్యపశువులను మాత్రమే, వనములందు మాత్రమే, రాజు మాత్రమే, కావలసినన్నిటిని మాత్రమే చంపాలి అని నియమం ఉన్నది. కాబట్టి జ్ఞాని అయిన విద్వాంసుడు నియమాన్ని బట్టి నడచుకుంటాడు. కర్మాచరణవల్ల పుట్టిన జ్ఞానంచేత ఆ కర్మను పొందడు.

అలా కాకుండా నియమం మీరి నడిచేవాడు, కర్తృత్వాభిమానాన్ని పొంది కర్మబద్ధుడై ప్రజ్ఞ చెడి సంసారప్రవాహంలో పడి అధోగతిపాలు అవుతాడు. అందుచేత సత్పురుషులు అన్ని విధాలా రాక్షస ప్రవర్తనను మానుకోవాలి.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమద్భాగవతము - శ్రీ వేదవ్యాసుడు.
2. ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు-ఆంధ్ర సారస్వత పరిషత్తు, బొగ్గులకుంట హైదరాబాదు.
3. పోతన భాగవతము-తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి ప్రచురణ1998.
4. ఉషశ్రీ భాగవతం-ఉషశ్రీ-శ్రీ మహాలక్ష్మీబుక్ కార్పొరేషన్ విజయవాడ ప్రచురణ, 2011.
5. భాగవత రహస్యోపన్యాసములు-పులిపాటి వెంకట సుబ్బయ్య.

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 10, October 2024
భావవీణ
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# పెరిక కులం పెండ్లి తంతులో సూర్య భక్తుల ప్రాధాన్యత - ఒక పరిశీలన

**- దుండె రాజేశ్వరి,** పరిశోధకురాలు, పొట్టి శ్రీరాములుతెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

పెరిక కులం వారు అన్నికులాల వారి వలె తమకు కూడా ఆశ్రిత కులాలు ఉంటాయి.పెరిక కులంలో కూడా ఉప కులాలున్నాయి.వీరిలో ఒకరు సూర్య భక్తులు, రెండవవారు బండారు భక్తులని రెండు రకాల వారున్నారు. వీరిలో పెరిక వారి వివాహన్నిచేసేవారు సూర్యభక్తులు. రేణుకా ఎల్లమ్మ కళ్యాణం కథను చెప్పేవారు బండారు భక్తులు.ఇలా రెండు ఉపకులాలు పెరికకులం వారిపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తాయి.ఈ అరుదైన సంస్కృతి తెలుగు సాహిత్యంలో జానపద ఆచారాలకు సారూప్యతున్నప్పటికి నేటి సమాజానికి తెలుప వలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని పెరికల ఉపకులాల జీవన విధానంలోని సాంస్కృతిక అంశాలను నేటి ఆధునిక సమాజానికి అందించి వారి ఆచార వ్యవహారాలను కాపాడవలసిన యున్నందున వీరి ఉపకులాల ఆవశ్య కతను ప్రస్తవించవలసి వస్తున్నది.

పెరిక కులం వారికి పెండ్లి చేసే విధానం:-భూతకాల వర్తమానంలో కూడా పెరిక కులంవారికి పెండ్లి తంతును జరిపించడానికి ప్రత్యేక పూజారులున్నారు. వీరిని సూర్యభక్తులంటారు. పెరిక వారి పెండ్లికి ముందు నిచ్చితార్థం ఉంటుంది.

## మేనరికపు వివాహాలు :

కొన్ని కొన్ని గ్రామీణ పెరిక కుటుంబాలలో మేనరికపు వివాహాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కొందరు పుట్టినప్పుడే పురుడు రోజున మేనత్త వచ్చి ఆడ శిశువును తన కొంగులో వేసుకొని ఎత్తుకొని అమ్మాయి బొడ్డు పైన కొబ్బరి నూనె పోసి మర్దన చేసి "నువ్వే నా కోడలు నా కొడుకుకు చేసుకుంటానని చెబుతోంది." దానికి ఆడ శిశువు తల్లిదండ్రులు సంతోషంగా ఒప్పుకుంటారు. ఆడపిల్ల పెరిగి పెద్దయిన తర్వాత మాట ప్రకారము మేనరికపు పెళ్లిళ్లు జరుగుతాయి. పెరిక కులంలో బాల్యవివాహాలు, మేనరికపు వివాహాలు, ఇల్లరికపు వివాహాలు ఎక్కువగా జరిగేవి. తొట్టిలో ఉన్న శిశువులకు కూడా కొన్ని సందర్భాలలో వివాహం చేసినట్లు పెరిక పెద్దలు వివరించారు. పెరకకులంలో గత రోజులలో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగేవి. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు జరిగేవి. పెళ్లి కుమారుడు పెళ్లి కుమార్తె ఒకరు ఒకరు చూసుకోకుండానే జరిగేవి. పెద్దలు చూసి సంప్రదాయాలను పరిశీలించి వారి సంబంధాన్ని కుదుర్చు కునేవారు. ఇలా వారి సంప్రదాయాచారాలలో ప్రత్యేకమైన విశేషాలున్నాయి.

## పప్పన్నం :

మేనరికం లేని వివాహాలకు మొదటగా మగ పెళ్లి వారు ఆడపిల్ల వారి ఇంటికి చుట్టపు చూపుతో వెళ్తారు. ఆడపిల్ల వారు వచ్చిన మగ పెళ్లి వారికి కాళ్లు కడుక్కో వడానికి నీళ్లు ఇచ్చి నుదుట కుంకుమ పెట్టి తన ఇంటిలోకి ఆహ్వానించుతారు. తోడుగా వచ్చిన పెద్దల సమక్షంలో వధువు వరుడు ఒకరినొకరు పెళ్ళికి ముందే చూసుకుంటాడు. వధువు వరుడు ఒకరికొకరు ఇష్టపడి నట్లయితే మర్యాదలు చేసుకుంటారు. లేనట్లయితే నీళ్లు కూడా ముట్టకుండా బయలుదేరి తిరుగు ప్రయాణం అవుతారు. (చింతల రాజేశ్వర రావు,పెరిక కుల సంస్కృతి - సాంప్రదాయాలు - ఒక అధ్యాయనం, పుట.85) ఒకవేళ నచ్చినట్లయితే మాట ముచ్చట కార్యక్రమం ఉంటుంది. తల్లిదండ్రులు మంచి రోజు చూసుకుని మగ పిల్లవాడి ఇంటికి వెళ్లి కట్నకానుకలు మాట్లాడుకుని మగ పిల్లవానికి అతని తల్లిదండ్రులకు మరియు రక్త సంబంధీకులు అందరికీ మొదట కుంకుమ బొట్టు పెట్టి ఆహ్వానిస్తారు.

**నిశ్చితార్థం :**

పెండ్లి కుమార్తె తరుపువారు పెండ్లి కుమారుని ఇంటికి వెళ్లి కట్నకానుకలు మాట్లాడుకున్న తర్వాత పెండ్లి కుమారునికి కొత్త బట్టలు ఇచ్చి పెండ్లికొడుకు తల్లిదండ్రులు పెండ్లి కూతురు తల్లిదండ్రులు ఎదురెదురుగా కూర్చుంటారు. సూర్య భక్తులలో ఒక పురోహితుడు నిచ్చితార్థమునకు సంబంధించిన మంత్రాలు చదివి పెండ్లి కుమారుని తండ్రిచే 'మీ అమ్మాయిని మా అబ్బాయికి'ఇచ్చి పెండ్లి జరిపిస్తానని సూర్యభక్తుడు అనిపిస్తాడు. ఒకరి తాంబూలాలు మరొకరు ఇచ్చిపుచ్చుకునేటట్లు చేస్తాడు. ఈ సమయంలో కాబోయే వియ్యంకులిద్దరు తమలపాకుతీసి పదార్తాలు ఒకరినొకరు తినిపించుకుంటారు ఈ కార్యక్రమాన్ని ''గట్టితట్టి'' ''వక్కాకు'' మరియు సాక్షి తాంబూలం అని పిలుస్తారు.(చరిత్ర వాహినిలో పెరికలు,కానుగంటి మధుకర్ పుట- 77) 'గతికితే అతకదు' అనే నమ్మకాన్ని వీరు బలంగా నమ్మడం వల్ల పెండ్లి చూపుల నుండి నిచ్చితార్థం వరకు ఒకరి ఇంట్లో ఒకరు భోజనం చేయరు.

సూర్యభక్తులు సూచించిన శుభదినాన పెండ్లి కుమారుని తల్లిదండ్రులు ఐదుగురు పుణ్యంగనలు అయిదు రకాల పండ్లతో పాటు పువ్వులను అమ్మాయి ఒడిలో పెట్టి దీవిస్తారు. తెలంగాణ ప్రాంతంలో అరటి పండును అమ్మాయి ఒడిలో పెట్టడం నిషిద్ధం. ఈ కార్యక్రమాన్ని పూలుపండ్లు పెట్టడం మరియు వరపూజ అని పిలుస్తారు.

**లగ్న పోటు :**

వదువు మరియు వరుని తల్లిదండ్రులు కలిసి సూర్య భక్తుని ఇంటికి వెళ్లి పెండ్లి ముహుర్తం నిర్ణయించమని కోరుతారు.సూర్యభక్తుడు అయిన పురోహితుడు ఇరువురి జాతకాలు చూసి మూహుర్తం నిర్ణయించి పెండ్తి పత్రిక రాసి ఇస్తాడు. రాసి ఇచ్చిన పెండ్లి పత్రికను ఇరువురు తీసుకుని ఆ పెండ్లి పత్రికకు పసుపు కుంకుమలు రాసి ఒకరికొకరు ఇచ్చుకుంటారు. సూర్యభక్తుడికి పత్రికను రాసి ఇచ్చినందుకు కట్నం చెల్లించుకుంటారు.అమ్మాయి తల్లిదండ్రులు అచ్చు అయిన మొదటి పత్రికను వరుడి తల్లిదండ్రులకు ఇవ్వాలి. ఆ తర్వాత మాత్రమే ఇతరులకు పంచాలి. అలా జరుగనట్లైతే అది తప్పుగా పరిగణిస్తారు. ఈ తప్పు వల్ల కొన్ని పెండ్లిళ్ళు కూడా రద్దు అవుతాయి. పెండ్లి వస్త్రాల కొనుగోలులో అయ్యే ఖర్చు వదువు వస్త్రాలు వరుడి తల్లిదండ్రులు వరుడి వస్త్రాలు వదువు తల్లిదండ్రులు కొనుగోలు ఖర్చు భరించాలి.(సంగ రాజలింగం, ధనిశెట్టి లింగయ్య, అల్లంపల్లి గ్రామ పెరికలు ఇచ్చిన వివరాలు)

**పెళ్లి పందిరి :**

మంగళహారతులతో డప్పు చప్పులతో ఊరేగింపుగా సమీప ఊరు బయట అడవిగాని పచ్చని చెట్ల కొమ్మలు కొన్ని కర్రలు నరికి తెచ్చి, మామిడాకులు తెచ్చి, ఇంటి ముందు పెళ్లిపందిరి వేస్తారు. కొబ్బరి లేదా అరటి కొమ్మలతో ఇంటి గుమ్మానికి తోరణాలను ఏర్పాటు చేస్తారు. మామిడి ఆకులను తమ ఊరి మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి మామిడి తోరణాలుగా అల్లి తీసుకొని వచ్చి డప్పు చప్పులతో సమర్పిస్తాడు. అదే సమయంలో పెరిక కుల పెద్దలు మామిడి తోరణాలను పందిరి మధ్య మధ్య కడతారు. వివిధ రంగుల కాగితాలను అందంగా కత్తిరించి తోరణాల మధ్యలో సుందరంగా శోభాయమానంగా అలంకరిస్తాడు. (ధనిశెట్టి రత్నమ్మ, సంగ రామయ్య, లచ్చవ్వ)

ఇంతకుముందు పెళ్లి కొడుకు పెళ్లి కూతురు రక్త (ఎరుపు) చాయ వస్త్రాలను పెళ్లి సమయం ధరించేవారు. పెళ్ళికొడుకు నడుముకు కత్తిని కట్టి ఆ కత్తికి గుడ్డ చుట్టేవారు. యజ్ఞోపవీతం ఉండే ఆచారం కోస్తా జిల్లాలో ఉంటే తెలంగాణలో పెళ్ళికొడుకు చేతిలో ఆడకత్తెర ఉంచుతారు. ఒకే నక్షత్రం నుండి జన్మించిన వారిలో ఒకరు బాసిగం ధరించినప్పుడు, తన తోటి వాడు చూడ కూడదని, వారిద్దరి మధ్య వివాహాలు కనీసం ఆరు నెలల తేడా ఉండేలా చేస్తారు. దీనిని పెరిక కులంలో కొంత మంది పాటిస్తారు. మరి కొంతమంది పాటించరు. (పెరిక వాణిమాసపత్రిక, రజతోత్సవ ప్రత్యేక సంచిక, పుట -

246, 247)

**పసుపు కొట్టుట :**

ప్రస్తుతం పెళ్ళికి ముందు పసుపు కొమ్ములను రోట్లో వేసి ముత్తైదువలు రోకళ్ళతో పసుపు కొమ్ములను పసుపుగా మారేటట్లు దంచుతారు. ముత్తైదవలు పందిరిలో కూర్చుని పాటలు పాడుతూ పసుపు విసిరేవారు. ఈ తంతును 'పసుపుకొట్టుట' అంటారు. పసుపు కొట్టటం ప్రారంభం అయిన దగ్గర నుండి ఆఇంట్లో పెండ్లికి సంబంధించిన కార్యక్రమాలు మొదలవుతాయి. వారి ఇరువురి తల్లి దండ్రులకు, అక్క బావలకు, మేనత్తలకు, మేనకోడలకు బట్టలు కొనుగోలు చేసి పెట్టాలి. వధూవరులు కొనుగోలు చేసిన పెళ్లి వస్త్రాలను మొదటగా, తమ ఇష్ట దైవం వద్ద పెట్టి, మొక్కి, పూజారి యొక్క ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీ.

**పైడి ముడిచి ఇవ్వడం :**

పెళ్లి సమయంలో ప్రధానం పెట్టే ఉండేది. ఇప్పుడు కూడా ఈ విధానం ఉంది. పెట్టెలో ఒక చీర, రవికలు, కుంకుమ, పసుపు, ఆకు, వక్కలు, ఖర్జూరాలు, స్త్రీధనం, గాజులు మొదలైనవి. పెట్టి వ్యవహార దక్షత కలిగినవారిని కూతురికి ఇంటికి పంపించేవారు. పెద్దమనుషులు బేసి సంఖ్యలో పెళ్లికూతురు ఇంటికి వెళ్లేవారు. ఇప్పుడు కూడా స్త్రీలు వెళుతున్నారు. పెళ్లి జరిగేది పెళ్లి కూతురు ఇంట్లో కనుక పెద్ద మనుషులు పెళ్లి కుమార్తెను వివాహానికి తీసుకువచ్చే వారు. దీన్ని తెలంగాణ ప్రాంతంలో "పైడి ముడిచి ఇవ్వడం" అంటారు. ఇప్పుడు పెళ్లిళ్లు ఎక్కువగా వధువు ఇంటి వద్దనే జరుగుతున్నాయి. కనుక పెళ్లి కుమారుని ఇంటికి పెళ్లికి మార్చేసరపు వారు వచ్చి, పెళ్లి కుమారుని పెళ్లికి తీసుకు వెళుతున్న ఈ సాంప్రదాయం నేటికి కొంతమంది పాటిస్తారు. అయితే ఇప్పుడు పెళ్లిళ్లు కళ్యాణ మండపాలు ఫంక్షన్ హాల్ లోపు పరి మితం అవుతున్నాయి.

**మొదటి రోజు :**

అయిదుగురు సూర్యభక్తులు వేరు వేరు గోత్రాలు గల వారు ఉపవాసం ఉండి బండారి (దేవుడు) పెడ తారు. ఆ తరువాత రాళ్ళు తమ ఉపవాస దీక్షను విర మించి భోజనాలు చేస్తారు. ఆ రోజు. చేతి ఉంగరం పెడ తారు. దానితో పాటు అడకత్తెర కూడా అతని చేతికి ఇస్తారు. ఈ అడవర్తంతో అతడు పోకలు కత్తిరిస్తాడు. రోజు జరిగే తంతును "పాల పారుత" అని అంటారు.

**లగ్నం జరిగే రోజు :**

లగ్నం జరిగే రోజు ఐదుగురు సూర్యభక్తులు మరియు ఇద్దరు పుణ్యంగనలు శుచిగా తలంటు స్నానాలు చేసి నిష్టగా ఉంటారు. వ్యవహార దక్షత కలిగిన వీరు మంగలి మేళంతో బావి నీళ్ళు తోడుకు వచ్చేవారు. బావి నుండి వచ్చిన పుణ్యంగనలు పందిరిలోని వాకిట్లో మార్గాల పసుపు విసిరేవారు.ఈ సమయంలో పాటలు పాడేవారు. ఆపాటలనే 'విసురుపాట'' అంటారు. తెలంగాణ ప్రాంతంలో ఈ పాట నేటికి ప్రాచుర్యంలో ఉంది.

పసుపులూ విసిరేటి పాపన చేడె
పాపన్న చేడెకు రూపింత రూపు
రూపూరు రుద్రాక్ష పేరెంతో పేరు
పేరూరు పెట్టెల్లా సామెంత సొమ్ము
సామూరు పొన్నారి కాగెంత కాగు
కాగుకు గంధపురి చెక్కంతా చెక్క
చెక్కకు చెంబేలా దట్టింత దట్టి
దట్టికి ధరంపురి నరసింహులే సాక్షి

నీ పాట పాడుతూనే పుణ్యంగణలు పసుపు కుంకుమలు విసిరేవారు. సూర్యభక్తులు అదే సమయంలో శుభ్ర పరిచిన శ్రీబాన వంట చేసేవారు. (పెరికకులా జీవనవిధానం ఒకపరిశీలన, చింతల రాజేశ్వర రావు, పుట. 96.)

వధూవరులిద్దరూ పూజ చేసి సూర్యభక్తులు వంట చేసే శ్రీ బాన చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేస్తారు. ఆ తరువాతనే సూర్యభక్తులు శ్రీ బానలో వంట చేసేవారు. ఈ విధానాన్ని 'గంత పూజ' అనేవారు. ఈ సందర్భంగా 'వీరులకు ఎలాంటి ఆయుధాలతో హాని జరుగకుండు

గాక' అని కొన్ని మారణాయుధాలను ఈపూజలో పెట్టి దీవిస్తూ శ్రీబానలోని వంటకాన్ని వదువరులను స్వీకరించ మని సూర్యభక్తుడయిన పెండ్లి పురోహితుడు చెప్పిన తర్వాత వదువరులు స్వీకరిస్తారు.

శ్రీబానలోని వంటకం వధూవరుల వివాహానంతరం చేయబోయే కాపురానికి సంకేతమని పెద్దలు ప్రగాఢంగా నమ్మేవారు. శ్రీబానపై సూర్యుడు, చంద్రుడు, మైలార దేవుని బొమ్మలు వేసి అలంకరించేవారు. శ్రీబానలో ఉన్న ప్రకారం బియ్యం నీటిని అత్తెసరుతో వంట చేసే వారు. వంట చేసిన శ్రీబానకు పసుపు, కుంకుమ, గంధం వేసి పూజ చేసేవారు. ఈ తంతును సూర్యభక్తులయిన పురోహితులు చేసేవారు. శ్రీబాన లోని బియ్యం వేడిక్కి ఆవిరితో పై మూకుడు లేసేది. అప్పుడు నీరు పోసి బెల్లం వేసి పొంగలి పొంగే వరకు వండేవారు. వధూవరులచే శ్రీబాన చుట్టూ ప్రదక్షిణం చేయించేవారు. ఈ విధంగా తయారైన పొంగలిని సూర్యభక్తులతో పాటు వధూవరులు కూడా తినేవారు. మిగిలిన పొంగలి మరుసటి రోజులలో కూడా చెడిపోతుండా ఉంటే ఆ సంసారం చాలా చక్కడా సాగిపోతుందని నమ్మేవారు. ఒక వేళ పొంగలి చెడిపోతే దానిని అశుభంగా భావించి కొన్ని శాంతి కార్యక్రమాలను జరిపేవారు.

పెళ్లి జరిగేటప్పుడు బెల్లం జీలకర్ర ఒకరి తల మీద ఒకరు పెట్టేముందు వధూవరుల మధ్య తేరను ఉంచడం ముఖ్య ఉద్దేశం. ఒక మంచి ముహూర్తాన బెల్లం జీలకర్ర పెట్టిన తర్వాత ఒకరినొకరు చూసుకోవడానికి అడ్డు తేరను తొలగిస్తారు. అప్పుడు ఒకరు ఒకరు ముసుముసినవ్వులతో చూసుకుంటారు. ఈ సమయంలో సూర్యభక్తులయిన పురోహితులు వధూవరులను ఉద్దేశించి ఒరగా చూసు కోవదన్ది నేరుగానే చూసుకోవచ్చని నిర్దేశిస్తారు. అదే వారిద్దరి యొక్క తొలి చూపుగా ఉంటుంది. వధూవరుల మధ్య తేర అడ్డంగా ఉండే సంప్రదాయం అన్ని చోట్ల ఉన్నప్పటికీ పెరిక వారి పెండ్లి లోని అడ్డుతెర కొంత విలక్షణమైన సంప్రదాయానికి ప్రతీకగా చూడవచ్చు. తలంబ్రాలు కలిపి పెళ్ళికి ముందు కటారి ఆయుధాల పూజ ఉంటుంది. వధువు ఇంట ఐదుగురుని, ఇతర పదిగురు వివాహితులు, భార్యలు బ్రతికి ఉన్నవారు. భక్తులు అన్న పేరుతో ఒక్కపొద్దులు ఉంటారు. సత్తు పిండి, పాలు, చల్ల మాత్రమే, వారి ఆహారం. సాయంత్రం తలంటు స్నానాలు చేసి, కొత్త కుండలో పులగం లేదా పాశం వండి శివునకు గుంతల్లో వినివేదించి, వధువుకి వరునికి పెట్టి తాము తింటారు. (కానుగంటి మధుకర్,చరిత్ర వాహినిలో పెరికలు,పుట-80)

"అల్లో నేరేడి డెల్లో
అల్లో నేరడి డెల్లో
ఈ అల్ల అల్ల నేరడి అల్ల నేరాడీ అల్లో నేరడి డెల్లో
అల్లో నేరేడి డెల్లో
అల్లో నేరడి డెల్లో
ఈ అల్ల నేరడి కింద చల్లాని చెలిమె అల్లో నేరడి డెల్లో
అల్లో నేరేడి డెల్లో
అల్లో నేరడి డెల్లో" అనే పాట ఈ కులానిదే.

బియ్యంలో చెక్కి, నిలిపిన కటారుల పూజ చేసేటప్పుడు, భక్తులు ఈ పాటలు పాడుతారు. ఇతరులు గొంతు కలుపుతారు. స్త్రీల పాట అధనంగా ఉంటాయి. (అదిలా బాద్ జిల్లా, కడెం మండలంలో అలంపల్లి గ్రామం ఉన్నది మండల కేంద్రమైన కడను ఉత్తర దిశగా రోడ్డు మార్గంలో సుమారు యాభై కిలోమీటర్ల దూరంలో అల్లంపల్లి గ్రామం ఉన్నది. ఇది గిరిజన ప్రాంతం గ్రామంలో పెరిక వారి కుటుంబాలు 30 వరకు అల్లం పల్లిలో వివాహ వేడుక ప్రస్తుతం రెండు రోజులు జరుగు తుంది.)

## రెండవ రోజు :

ఎడ్లబండ్లలో పెళ్ళి కుమారుని తరపువారిని ఊరు బయట ఉంచుతారు. తరువాత బాజా భజంత్రీలతో వచ్చి పసుపు కుంకుమ బొట్లు పెట్టి, సంప్రదాయం ప్రకారం కడువల నీటితో కడిగి వారి ముఖాన తిలకం దిద్ది పూజ లతో పెండ్లి కుమారుని ఇంటికి తీసుకువస్తాడు. వచ్చిన పెండ్లి కొడుకును పెండ్లి కూతురు వైపువారు కొంత

కాలంపాటు గడప వద్ద నిలబెడతారు. అప్పుడు ఇంటి ముందు వేసియున్న పందిరిలో కొన్ని హర కొమ్మలను పెండ్లి కుమారుని, పెండ్లి కుమార్తె వద్దకు తీసుకొని వెళతారు.సూర్యభక్తులు ఉదయం వదూవరులతో పూజ చేయిస్తారు. పెండ్లి కుమార్తె తల్లిదండ్రులు, ఆమె మేనమామలు, బంధువులు బాజా భజంత్రీలతో ఎదురు వెళ్ళి వియ్యంకులు, వియ్యపురాండ్రు ఎదురెదురుగా కూర్చొని చుట్టరికాన్ని కలుపుకుంటూ ఒకరి నోట్లో ఒకరు చక్కెర పోసుకుంటారు. ఆ చక్కెర ఎంత తీయగా ఉంటే నూతన దంపతులు వారి బంధత్యం అంత ఆనందంగా ఉంటుందని వీరి ఉద్దేశం. (చింతల రాజేశ్వర రావు,పెరిక కుల సంస్కృతి - సాంప్రదాయాలు - ఒక అధ్యాయనం, పుట.85)

## ఎదుర్కోలు :

ఎదుర్కోలుకు ప్రత్యేక వస్త్రాలు ధరించుకుంటారు. పెళ్లి కుమార్తె తల్లిదండ్రులు పెండ్లి కుమారుని వేలికి బంగారు ఉంగరం తొడుగుతారు. కాబోయే మామ పెండ్లి కుమారుని పాదాలపై నీళ్లు ధారగా పోస్తూ ఉంటే కాబోయే అత్త పెండ్లి మంత్రాల నడుమ పెండ్లి కుమారుని పాదాలను కడుగుతుంది. తరువాత వివాహ వేదికపై వధువు, వరులను కూర్చేబెట్టి అందరి సమక్షంలో కట్నాలు, కానుకల విషయాన్ని ఇచ్చి పుచ్చుకునే విషయంలో సూర్య భక్త పురోహితులు పెద్దగా అందరికి వినపడేటట్లు అడుగుతారు. ఉభయుల తరపు పెద్దలు అంగీకరించిన తరువాతే వివాహం జరుగుతుందని చెపుతారు. అందరి సమక్షంలో ఉభయుల తరపు పెద్దలు తమ అంగీకారాన్ని తెలియజేస్తారు. తరువాత ఒక గ్లాస్‌లో పాలు పోసి నూతన వధూవరులు తాగుతారు. తదుపరి జీలకర్ర బెల్లం ఒకరి తల మీద ఒకరు ఉంచటం. తరువాత పెండ్లి మంత్రాలు చదువు చుండగా పెండ్లి కుమారుడు తాళి బొట్టును పెండ్లి కుమార్తె మెడలో మూడు ముళ్ళు వేస్తాడు. ఆ రోజు సాయంత్రం పిల్లవాని ఇంటికి పిల్లను పంపేటప్పుడు బావ మరది రోకలి బండతో అడ్డు వచ్చి బావను అడ్డుకుంటాడు.అప్పుడు బావమరిదిని "నీకు ఏమి కావాలి?" అని బావ అడిగితే తనకు కావలసినది ఇవ్వమని" బావమరిది కోరతాడు. అప్పుడు బావ తన బావమరిది అడిగిన కానుక ఇస్తాడు. తరువాత తన సోదరిని పంపుటకు బావమరిది అంగీ కరిస్తాడు. విశేషమేమిటంటే తన బావ మరిదికి ఆ బావ కానుకగా ఎంత ఇస్తాడో అంతకు రెండు రెట్లు మంతా బావకు బావమరిది అందజేస్తాడు. పెద్ద అరిగే రెండు రోజులు ఉభయుల తరపు పెద్దలు మధ్యం, మాంసం ముట్టరు.

పూర్వ వివాహాలు ఇంతకుముందు పెరిక కులంలో పెళ్లిళ్లు ఐదు రోజులు జరిగేవన్నీ గ్రంథంలో పేర్కొన్నాడు. వధువు ఇంటికి వెళ్లే అక్కడ కాళ్లు గోళ్లు తీసేవారు. తర్వాత నలుగు పెట్టేవారు. మొదటి రోజు ఉదయం, ఐదుగురు సూర్యభక్తులు, ఇద్దరు పుణ్యాంగనలకు గంధం పూసి, కుంకుమ బొట్లు పెట్టేవారు. సూర్యభక్తులు, పుణ్యాం గణలు పెళ్లి తంతు పూర్తయ్యే వరకు అంటే ఐదు రోజులు ఉండేవారు. రెండవ రోజున గనక గరిగబుడ్లలను కుమ్మరి ఇంటి నుండి తెచ్చేవారు. గరికమంతులను గరిగబుడ్లు అని కూడా అనేవారు. వీటిని కమ్మరి ఇంటి నుండి తెచ్చేటప్పుడు, ఒక దుప్పటిని నాలుగు పక్కల చేతితో పట్టుకోగా, మధ్యలో ఒక కర్రతో పట్టుకొని, గొడుగుల నీడని కల్పించేవారు. ఇలా పట్టడాన్ని "ఉల్లడ పట్టడం" అంటారు. గరిగబుడ్లని 'శివాహాలు' అంటారు. ఒక పెద్ద పీట, జనపనార గోతాము (గోనె సంచు), బాసింగాలు కూడా ఇతర చోట్ల నుండి తెచ్చే వారు.

## మూడవరోజు :

మూడవరోజు వదూవరులకు తలంటూ స్నానాలు చేయించి, కంకణాల పూజా ఇద్దరి చేత జరిపించేవారు. పులుసు పూసిన దారానికి, తమలపాకు కట్టి, పెళ్ళికొడుకు కుడి చేతికి, పెళ్ళికూతురు ఎడమ చేతికి కట్టేవారు. తర్వాత జరిగే విందును,' 'కంకణాల బంతి' అని పిలిచేవారు.

అయిదవ రోజు ఊరేగింపు జరిగేది. పెళ్లి వేడుకలు,

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

కూరలు, గాడి పొయ్యిలు, పచ్చ నాకు పందిళ్ళు, వీరి పెళ్లిళ్లలో సర్వసాధారణం.కోస్తాంధ్ర పసుపు నలుగు పెట్టడం, తెలంగాణలో లేదు. పెరిక వారి కన్యాశుల్కం, ఓలి లేదు. వరకట్నం 50 ఏళ్ల క్రితం వరకు 116/-లో 516/-లతో తృప్తిపడేవారు. వెయ్యి పదహారులుగా ఇచ్చేవారు. గోవుదానం తప్పనిసరిగా ఉంటుంది. మైల పూలు పెళ్లి, నాగవెల్లి, నాగబలి, జరిగేవి. వారిని తరువువాళ్ళు కన్యాదాన ఇంటికి తరలి వెళ్ళగా, మేళ తాళాలతో ఊరేగింపుతో, ఎదుర్కొని వధువు ఇంటి వాళ్ళు తోడుకొని వెళ్లి, బ్రాహ్మణ పురోహితుని వేదమంత్రా లతో, పెద్దల సాక్షిగా వివాహం జరిపించేవారు. పెరికల పెళ్ళిలో అగ్నిహోత్రం లేదు మంగళహారతి ఉంటుంది. అయిరేణి కొండలు రంగులతో అలంకరించినవి ఉండవు. తెల్లని సున్నం పోసిన పూజా బండారాలు ఉంటాయి. వాటిని శిలాహారాలు అంటారు. అవి లేని కొండలని అంటున్నారు. వాటి అర్థాలు చూసినట్లయితే, తెలంగాణ పండితులు చెప్పిన పదవి ఉత్పత్తి అయ్యేలా, శివుని కుండలు అని, గరిగబుట్టి, గరగ గౌరీకి అని ఉంటుంది. సిందూరం పసుపు, సున్నం కలిపిన, ఎర్రని నీళ్లు అందులో ఉంచుతారు. ధారానికి వాడేది ఈ సిందురమే. వీరి పెండ్లిలలో తాళి పుస్తెలకు అంత ప్రాధాన్యత ఉండదు. పెండ్లి కూతురు మెడలో పెండ్లి కుమారుడు పుస్తెల తాడు కట్టడు. ప్రధానంగా బంగారు ఉంగరం ఉంటుంది. బాసింగాలు పెద్దవి ఉంటాయి. బియ్యం, సుంకు శంకు పడతారు. (చింతల రాజేశ్వరరావు, పెరిక కుల సంస్కృతి - సాంప్రదాయాలు - ఒక అధ్యాయనం, పుట. 86)

### పెరికల పెళ్ళి భోజనం :

పెరికల పెళ్ళి భోజనంలో మాంసాహారముండదు. అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. పెరిక కులస్తులు ఎంతో నిష్టతో ఉంటారు. మాంసాహార కులస్తులైన పెరికలు పెండ్లిలో మాత్రం చాలా త నిష్టగా ఉంటారు. వివాహ వేడుక మొత్తం శాఖాహారమే భోజనం పెడుతారు. పెరికలు పాటించే ఈ నియమ నిష్టలు చెప్పుకోదగినవే కాక ఇతర కులాలేవి ఇంత కఠిన నియమాలను పాటించవు.

### పదహారు రోజుల పండగ :

వివాహం తర్వాత పదహారవ రోజున పెళ్లి జరిగిన ఇంట్లో వేడుక నిర్వహిస్తారు. ఆ వేడుకలో భాగంగా పాయసం చేస్తారు. వధూవరులు వేకువనే లేచి తలంటు స్నానం ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇష్టదైవాన్ని స్మరిస్తూ కొబ్బరికాయలు కొడతారు. దీనినే పదహారు రోజుల పండగ అని నల్లపూసలు గుచ్చే వేడుకని పెరికలు పిలుచుకుంటారు. ఈ వేడుక ముగిసే దాకా పెళ్లి పంది రి గాని అందులో వివాహ వేదికను కానీ తీయరు. విశేషం ఏమిటంటే సూర్యభక్తుడైన పురోహితుడు వచ్చి లగ్నం పెట్టి మొదలుకొని వివాహం జరిగిన తర్వాత పదహారవ రోజు వేడుక చేసే వరకు పెరిక కులస్తులు మాంసా హారాన్ని భుజించ కూడదు. అది పెరికల నియమ నిబంధనల విశిష్టత కాబట్టే వారికి సంఘంలో ఒక విశిష్ట స్థానం లభించింది. పెరికలు యజ్ఞోపవీతాన్ని ధరించక పోయినప్పటికీ చక్కటి సాంఘిక హోదా కలిగి ఉన్నట్లు వందేళ్ళ క్రితమే 'థర్స్టన్' తన గ్రంథంలో పేర్కొన్నాడు. ఆ పుస్తకంలో పేర్కొన్న దానిని బట్టి వెలమ, కాపు, ముత్తరాశి, సమాన సాంఘిక హోదాను పెరికలు కలిగి ఉన్నారు. వైశ్యులు బ్రాహ్మణులు, జంగమలు, సాతానీలు, బలిజలు, కాపుల చేతి వంటను పెరికలు స్వీకరించవచ్చు .అదేవిధంగా బ్రాహ్మణులు వైశ్యులు బలిజలు తప్ప మిగతా కులాల వారంతా పెరికల చేతి వంటను స్వీకరించ వచ్చు. ఇది ఇలా ఉండగా వివాహాది శుభకార్యాలలో గోన సంచిని పూజించడం పెరిక కులస్తుల ఆచారం. కుల దేవతతో పాటు గ్రామ దేవతలయినా కూడా పోచమ్మ ఎల్లమ్మ లాంటి దేవతలను కూడా వీరు ఆరాధిస్తారు.

భావవీణ
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

**ఉపకరించిన గ్రంథాలు :**

1. పెరిక కుల సంస్కృతి - సాంప్రదాయాలు - ఒక అధ్యాయనం, చింతల రాజేశ్వరరావు.
2. పెరిక వాణి మాసపత్రిక, రజతోత్సవ ప్రత్యేక సంచిక.
3. చరిత్ర వాహినిలో పెరికలు, కానుగంటి మధుకర్.

★★★

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# మనిషి మర్మము తెలిపే - 'తెలంగాణ రుబాయిలు'

- కళ్లెం ధనోజ, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

## పరిచయం :

ఏనుగు నరసింహారెడ్డి గారు 1968 ఏప్రిల్ 6వ తేదీన ఏనుగు కృష్ణారెడ్డి - లక్ష్మమ్మ దంపతులకు తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం కల్లోనికుంట అనే గ్రామంలో జన్మించారు. నరసింహారెడ్డి జన్మించిన మూడేళ్లకే తండ్రి కృష్ణారెడ్డి టి.బి. వ్యాధితో మరణించారు. తల్లి లక్ష్మమ్మ నరసింహారెడ్డి తీసుకుని హైదరాబాద్ (తార్నాక)కు వెళ్ళింది. అక్కడ ఇబ్బందులు ఎదురుకావడంతో చిట్యాలకు వచ్చి స్థిర పడింది. చిట్యాలలో 10వ తరగతి, రామన్నపేటలో ఇంటర్ విద్య పూర్తి చేశాడు. సికింద్రాబాద్‌లోని సర్దార్ పటేల్ కాలేజ్‌లో డిగ్రీ ప్రథమ సంవత్సరం, నల్గొండ నాగార్జున డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరములు చదివారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ చేసి తెలుగు విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ మరియు పి.హెచ్‌డి. పూర్తి చేశారు.

గజల్, రుబాయి ప్రక్రియలు పారశీభాష నుంచి ఉర్దూలోకి ప్రవేశించాయని కొందరు, అరబ్బీ నుంచి వచ్చాయని మరికొందరు అంటూ ఉంటారు. కసీదా, గజల్, కతా అనే మూడు ప్రక్రియలు అరబ్బీ, పారశీ రెండింటిలోనూ మొదటి నుంచి ఉన్నాయి. రూబాయి, మస్నవి, తర్జీయా అనే మూడు ప్రక్రియలు పారశీలోనే ఉన్నాయి.

ఉర్దూ గజళ్ళు, ఉర్దూ రూబాయిలు - అనువాదాల ద్వారానే మొదట తెలుగువారికి పరిచయమైనాయి. రుబాయి రచన ఎంత సులభమో మంచి రూబాయి నిర్మాణం అంత కష్టం. రూబాయిలో ప్రధానంగా ఒకే ఒక్క భావం ఉంటుంది. ఈ భావ ప్రసూనం నాలుగు రేకులుగా విచ్చుకుంటుంది.

1. మొదటి పాదంలో భావం మొగ్గతొడుగుతుంది.
2. రెండవ పాదంలో కొంచెం విచ్చుకుంటుంది.
3. మూడవ పాదంలో వినూత్న ప్రాసతో ఉబికి వస్తుంది. హృదయాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతుంది.
4. ఇక నాలుగవ పాదం రూబాయిలోనే అతి ప్రధాన భాగం. ఇందులో పై మూడు పాదాల సారం ఇమిడి ఉంటుంది. మొదటిపాదంలో అంకురించిన భావం సమగ్రంగా గుబాళిస్తుంది. ఈ ముగింపులోనిదే కవి ప్రతిభ, చమత్కృతి, ప్రౌఢిమ ప్రస్ఫుటం అవుతాయి. అందులో మన కవి ఏనుగు నరసింహారెడ్డి గారు వంద శాతం నెగ్గారు.

తెలుగులో తొలి గజళ్లను, తొలి రుబాయిలను రాసిన వారు దాశరథి కృష్ణమాచార్యులు. దాశరథి గారి తరువాత పట్టుదలతో తెలుగు రూబాయిలను రాసి అనేక సంపుటాలను ప్రచురించిన వారు డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యులు గారు. దాశరథి, తిరుమల శ్రీనివాసాచార్య గార్ల తరువాత అధికసంఖ్యలో రుబాయిలను రాసిన వారు ఏనుగు నరసింహారెడ్డి గారు.

తెలంగాణ సాహిత్యంలో ఉర్దూ, పారశీ భాషల ప్రభావం అధికంగానే ఉంటుంది. ఇక్కడి వాళ్లకు గజల్, రుబాయి ఖసీదా, మర్సియా, మస్నవి మొదలైన ప్రక్రియలు పరిచయమే! అందుకే డాక్టర్ సి.నారాయణరెడ్డి గారు "ఇచట తెల్గుల వాణి ఇచట ఉర్దూబాణీ కలిసి పోయినవి ముక్తా ప్రవాళములట్లు" అన్నారు.

అందువల్ల ఏనుగు నరసింహారెడ్డి రూబాయిలు రాయడం ఈ నేల స్వభావంలో భాగం. కాబట్టి నరసింహారెడ్డిని కవి అనకుండా షాయర్ అనవచ్చు. వీరు రాసిన రూబాయిల్లో అక్కడక్కడ కొన్ని ఉర్దూ మాటలను రదీపులుగా పెట్టుకున్నారు కూడా.

"ఏదంటే అదయిద్ది పాబందుంటే
ఎప్పుడంటే అప్పుడయిద్ది పాబందుంటే

మాట మీద నిలబడటం చాలా కష్టం
ఆత్మబలం వృద్ధయిద్ది పాబందుంటే"

ఇందులో అదియిద్ది, అప్పడయిద్ది, వృద్ధయిద్ది అనేవి ఖఫీయాలు, పాబందుంటే అనేది రదీఫ్. ఒకటి, రెండు, నాలుగు పాదాలకు ఈ భాఫియా, రదీఫ్‌లు తప్పకుండా ఉండాలి. ఇవి తెలుగులో అంత్యప్రాసల లాంటివి కావు. మూడవ పాదం స్వతంత్రంగా ఉంటుంది. దానికి రదీఫ్, కాఫీయాలు పాబంది ఉండదు.

కానీ ఈ ఒకటి, రెండు, నాలుగు పంక్తులను అను సంధానించేది మూడవ పంక్తి. దానితో కలుపుకుని చూస్తే రూబాయి నాలుగోపాదం తలుక్కుమని మెరుస్తుంది. ఉర్ధూ మాటలతోనే కాకుండా నికార్సైన తెలంగాణ మాటలను కూడా ఈ కవి రదీఫ్ ఖాఫీయాలుగా వాడుకున్నారు.

"వాడకుంటే గంగ్రగొడ్డలి మొండి వార్తది
దూయకుంటే విచ్చు కత్తి మొండి వార్తది
సాధనొకటే సకల కళలకు మూలశక్తి
రాయకుంటే పదునుపాలిహెూమొండిహెువార్తది"

ఈ రూబాయిని చదివినప్పుడు నా భవిష్యత్తు గుర్తుకు తెచ్చారు కవి గారు.

ఇక్కడ గొడ్డలి, కత్తి, పాళ్లు ఇకారాంత హల్లులు - ఖాఫీయాలు అయితే, మొండి వార్తది అనేది రదీఫ్. రుబాయి అనగానే తటాలున గుర్తుకు వచ్చే పేరు ఉమర్ ఖయ్యూం రాశిలో చాలా తక్కువ రాసిన వాసిలో ఎంతో గొప్పవి ఆ రుబాయిలు.

వాటిని కవికోకిల దువ్వూరి రామిరెడ్డి గారు తెలుగులో అనువాదం చేసినారు. యాదృచ్ఛికంగానే ఉన్నా వారు కూడా రెడ్డి గారు కావడం విశేషముగా చెప్పుకోవచ్చు. రామిరెడ్డి గారు ఉమర్ ఖయ్యూం రుబాయిలును పానశాల పేరుతో ప్రచురించారు.

తెలంగాణ రుబాయిల గురించి మాట్లాడుతూ తెలంగాణ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన హజ్రత్ అమ్జద్ హైదరాబాదీ రుబాయిలను తలచుకోవడం అనివార్యం.

"జిల్లా అమర్ మె చాలా మఝె మమూన్ కియా
మస్రూర్ కబీ, జార్ కబీ రంజూర్ కియా
మై ఖుద్రత్ క కభీన భాషలు హాలూ
లేకిన్ మజ్బూరియోంనేహెూమజ్బూర్‌హెూకియా"

అలాగే 'తెలియదు' అనే దానికి హజ్రత్ అమ్జద్ గారు "ఖుదాకీమర్జీ" అన్నారు. మన వేదాంతంలోనూ ఇది వున్నది. సంస్కృతంలో "తేనవినాతృణమపినచలతి" అంటే అతని ఆజ్ఞ లేనిదే గడ్డిపోచ కూడా కదలదు అని హజ్రత్ అమ్జద్ గారు అన్నది.

"తక్దీర్ సెగిలాక్యా ఖుదాకీ మర్జీ
జోకుచ్ఛీ హువా హువా ఖుదాకీ మర్జీ
అమ్జద్ హర్ బాత్ మే కహెూతక్ క్యోంక్యుం
హర్ క్యూమ్ కి హై ఇస్తే హాఖుదాకి మర్జీ"

అలాగే పుట్టడం మన చేతిలో లేదు. చావాలనుకుంటే ఎంతో గుండె ధైర్యం కావాలి. కానీ ఎప్పుడో అప్పుడు పోకతప్పదు. ఇటువంటి ఇక రుబాయీలో అమ్జద్ ఇలా అన్నారు.

"కిస్ మతన్‌కి తఫ్సీర్ హూ మాలూమ్ నహీ
కిస్ హాత్‌కి తహ్రీర్ హూ మాలూమ్ నహీ
మై హూ కె మేరే ప్రదేశ్ మే హై ఔర్ కోయి
సూరత్ హూ కె తస్వీర్ హూ మాలూమ్ నహీ"

పైన తఫ్సీర్, తస్వీర్ అనేవి ఖాఫీయాలైతే మాలూమ్ నహీ అనేది రదీఫ్. ఇలాగే నరసింహారెడ్డి గారు తెలియదు అని ఇటువంటి సూఫీ భావం గల రుబాయిని రాశారు.

"అతను ఎక్కడున్నాడో నాకు తెలియదు
మనం ఎక్కడున్నామో సైతము తెలియదు
వాడు తెలుసంటాను వీడు తెలుసంటాను
ఇంతకు నేనెవడనో ఇప్పటికీ నాకు తెలియదు"

ఇందులో అతడు అంటే భగవంతుని గురించి చెప్పడం అన్నమాట. నిరాకారుడు, నిర్గుణుడు అయిన ఆ చిదానంద స్వరూపాన్ని గురించి చెప్పేది, ఇక్కడ అతడు, వాడు, అన్ని సర్వనామాలే వున్నాయి. ఇవి మనం ఎలా అర్థం చేసుకుంటే అలా అర్థం అవుతాయి. అతడు - పరమాత్మ, నేను అనేది - జీవాత్మ. జీవాత్మ పరమాత్మలో కలిసి పోవడానికి తహతహలాడుతుంది.

అతడెక్కడున్నాడో తెలియదు, ఇంతకీ నేనెవరిని అనే ప్రశ్నకు జవాబు లేదు. నిజమే కదా తెలియదు. అందుకే అహం బ్రహ్మాస్మి అనే మహావాక్యానికి మూలం.

వైవిధ్యాన్ని, సౌందర్యాన్ని దర్శింపజేసే ప్రక్రియగా రుబాయిలకు పేరుంది. తెలుగు రుబాయిల ప్రయోక్తగా మహాకవి దాశరథి ప్రసిద్ధులయ్యాయి. ఆ పరంపరలో ఎందరెందరో కవులు రుబాయిలను రాశారు. మనకు మూల మలుపులో మిణుకుమిణుకు మనే జ్ఞాపకాన్ని పలకరించి స్పర్శించిన అనుభూతిని డా॥. ఏనుగు నరసింహారెడ్డి గారు ఆలోచనాత్మకమైన తెలంగాణ రుబాయిలుగా మలిచారు. కవి సునిశిచిత, కవిత్వ, గుణానికి ఒక్కో రూబాయి ప్రాతినిధ్యం వహించింది.

నరసింహారెడ్డి గారి రూబాయిల్లో తెలంగాణతనం ఉంది. తెలంగాణ భాష ఉంది. తెలంగాణ జన సామాన్యం వాడుకునే చాలా పదాలు ఉన్నాయి. వారు ఈ రుబాయిలు రాసే నాటికి తెలంగాణా రాష్ట్రం కోరి ఉద్యమం నడుస్తున్నది. వారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతకోరి కూడా రుబాయిలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం రచనలు చేసిన వందలాది, వేలాది మంది కవులు ఉన్నారు తెలంగాణలో. ఆ త్రోవలో నరసింహారెడ్డి గారు కూడా ఒకరు. వారు ఈ రుబాయిలకు తెలంగాణ రుబాయిలు అనే పేరు పెట్టింది ఇందుకోసమే.

ఎవరో నొచ్చుకుంటారు అనో - కవి కవితలు రాయకుండా ఉండడు. కొందరి మెప్పుకోసమని మాత్రమే కావాలని నిజమైన కవి రాయడు. ఒక సత్యాన్ని ఆవిష్కరింపచేయడమే కవిత్వం పరమ ప్రయోజనం. అందుకే నరసింహారెడ్డి గారు ఒక రుబాయిలో ఇలా అంటారు!

"అపుడెపుడో అన్నమని మనసులో పెట్టుకోకు
ఏదేదో విని ఉంటావ్ మది లోపల పెట్టుకోకు
చెప్పిన వన్నీ క్షమించేటి రోజొకటి రానున్నది
రాలే పూలమే మనం మనసు కష్టపెట్టుకోకు"

రుబాయిలు రాసి మెప్పించడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు. కానీ అందులో సఫలీకృతుడయ్యాడు నరసింహారెడ్డి గారు.

ఈ తెలంగాణ రూబాయిల్లో 536 రుబాయిలు ఉన్నాయి. అందులో కొన్ని ముత్యాలు, కొన్ని రతనాలు, కొన్ని వజ్రాలు, కొన్ని వైడూర్యాలు, కొన్ని మరకతాలు, మరికొన్ని మాణిక్యాలు. ఏకంగా 300 పేజీల విలువైన గని ఇది! ఇవి చదువుతున్నంత సేపు మనల్ని మనం చదువు కోవచ్చు. శాస్త్ర సాంకేతికత పెరిగినా కొద్దీ మనిషికి - మనిషికీ మధ్య అంతరం పెరుగుతుంది. పెరగాల్సింది అంతరం కాదు, మానవ సంబంధాల గాఢత అని చెప్తూ ఇలా అంటారు.

"మనిషిని గాయపర్చకు మళ్ళీ కలువలేం
నీతిని పాతరేయకు మళ్ళీ కలువలేం
ప్రేమించడంలో మునిగిపో ద్వేషించలేం
కరుణను జారవిడువకు మళ్ళీ కలువలేం"

నాగరికత నిర్మానంలో మనిషి మరో మనిషితో కలిస్తేనే ఇంత దూరం మనిషి ప్రయాణం జరిగింది. లేకపోతే నవనాగరికత నిర్మాణం జరిగేది కాదు అని అంటారు రెడ్డి గారు.

అక్షరాస్యత పెరుగుతున్నా కొద్దీ అవినీతి పెరగటం ఆందోళన కలిగించే విషయం. మానవ సంబంధాలు నీతి నిజాయితీపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి నీతిని పాతరేస్తే - మానవ సంబంధాల మనుగడే కష్టం అని అంటారు మరో చోట.

"శిలలన్నీ శిథిలమౌను - శిలకీర్తియే నిలుచు
కమ్మలెల్ల జీర్ణ మౌను - కావ్యావనియే నిలుచు
కుడి యెడమలకు చూడకుండా పరుగెత్తును కాలఝరి
ఆటుపోటులుబైగని మంచి తనమే నిలుచు"

ఈ వాక్యాల్లో నాకు జాషువా గారి ఫిరదౌసి కావ్యంలోని మాటలు గుర్తుకొచ్చాయి. అవి.

"రాజు మరణించు నొకతార రాలిపోయె
కవియు మరణించు నొకతార గగనమెక్కె
రాజు జీవించు రాతి విగ్రహముల యందు
సుకవి జీవించు ప్రజల నాలుకల యందు"

అన్నట్లు శిలలు కాలక్రమేనా శిథిలం అవుతాయి. కానీ శిల్పి - శిల్ప నైపుణ్యం శిథిలం కావు అంటారు. వైవిధ్య భరితం అనుభూతుల మాలఅయి మన మనస్సుల్లో ఏనుగు నరసింహారెడ్డి గారు ఈ తెలంగాణ రుబాయిలు జీవనదిలా ప్రవాహమై సాగుతూనే ఉంటాయి.

**ముగింపు :**

నరసింహారెడ్డి గారు మంచి వచన కవి, పద్య కవి, వ్యాసకర్త మరియు అనువాదకులు కూడా. తెలంగాణ రుబాయిలు నిండైన, నికార్సైన తెలంగాణా మట్టి వాసన చూసిన, ఆస్వాదించిన గ్రంథము. పుస్తకం ఆమూలాగ్రం మనిషి జీవితకాలంలో చూసిన, ఎదుర్కొన్న ఘటనలు, సన్నివేశాలు, జీవన చిత్రణ కండ్లకు కట్టినట్లుగా రాసి చరితార్థులు అయ్యారు. వారు మరిన్ని రచనలు చేసి, ఉన్నతోన్నతస్థానాన్ని చేరుకోవాలని పాఠకుడిగా మనందరం కోరుకోవడం అనివార్యం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలంగాణ రుబాయిలు (ఏనుగు నరసింహారెడ్డి).
2. పానశాల (దువ్వూరి రామిరెడ్డి)
3. దాశరథి రుబాయిలు - గజళ్ళు (డా॥. తిరుమల శ్రీనివాసాచారి)
4. ప్రపంచ పదులు (డా॥. సి. నారాయణరెడ్డి)

★★★

# వేంపల్లి గంగాధర్ నవలలు - సామాజిక విశ్లేషణ

- **జి. రత్నకుమారి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో ఒకటైన నవల సమకాలీన సామాజిక సమస్యలను చిత్రించడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. వివిధ ప్రాంతాలకు చెందిన రచయితలు వారి రచనల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమాజానికి తెలియజేస్తూ వస్తున్నారు. అలాంటి వారిలో కడప జిల్లాకు చెందిన డా॥. వేంపల్లి గంగాధర్ గారు ఒకరు. ఈయన రాసిన నేలదిగిన వాన, యురేనియం వల్లె అనే నవలల్లో రాయలసీమ ప్రాంతంలోని కరువు కాటకాలను, అణువిద్యుత్ తయారికి కావలసిన యురేనియం నిల్వలను, భూగర్భం నుండి బయటికి తీయడం వల్ల గ్రామల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇవే కాకుండా వీరు మొలకల పున్నమి, దేవరశిల, గ్రీష్మభూమి, పాపాగ్ని కథలు, పూణే ప్రయాణం, ఎర్ర చందనం దారిలో తమిళ కూలీలు మొదలగు రచనలు రచించారు.

డా॥ వేంపల్లి గంగాధర్ గారు కరువుకాటకాల గురించే కాకుండ సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను తన రచనల ద్వారా తెలియజేస్తూ సంపూర్ణ సాహిత్య కారులలో ఒకరుగా గుర్తించబడుతున్నారు. వీరు రాసిన "మొలకల పున్నమి" కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి మొదటి యువపురస్కారం, "నేలదిగిన వాన" నవలకు అంపశయ్య నవీన్ సాహితీ పురస్కారం, "దేవర శిల" రచనకు రావూరి భరద్వాజ స్మారక పురస్కారాలు అందుకున్నారు.

నేల దిగిన వాన వేంపల్లి గంగాధర్ గారి మొదటి నవల. ఇందులో రాయలసీమ ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో కరువు సంభవించడం వల్ల వ్యవసాయం మీద ఆధారపడి జీవించే రైతు పంటలు పండక, అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటాడు. తండ్రి మరణించడంతో కథానాయకుడు కుటుంబాన్ని పోషించడానికి వ్యవసాయానికి ఉపయోగించుకునే ఎద్దులను సంక్రాంతి పండుగ సందర్భంలో జరిగే బండలాగుడు పోటిల్లో పాల్గొని మొదటి బహుమతి గెలుస్తాడు. అందులో వచ్చిన డబ్బుతో తండ్రి చేసిన అప్పును తిరుస్తాడు. తన చెల్లికి మంచి సంబంధం రావడంతో డబ్బు సంపాదించడానికి ఇంట్లో ఎవరికి తెలియకుండా స్నేహితునితో కలిసి చట్ట వ్యతిరేకమైన ఎర్రచందనం చెట్లను నరకడానికి వెళ్ళి సంపాదించిన డబ్బుతో చెల్లెలు పెళ్ళి జరిపిస్తాడు. ఎర్రచందనంను తరలిస్తున్న తన స్నేహితుడు పోలీసులకు దొకిరికి జైలుశిక్షకు గురి కావడంతో అది తప్పుని తెలుసుకొని ఆ వృత్తిని వదిలేసి, చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటాడు.

సరైన కాలంలో వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయం మీద ఆధారపడి జీవించే రైతుల కుటుంబాలు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులు ఈ నవలలో కనిపిస్తాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కరువు కాటకాలు సంభవించకుండ వర్షాలు పడటానికి చేసే గంగమ్మ జాతర, కప్పసాంగ్యము, కుండసాంగ్యము చేయడం వంటి గ్రామీణ సంస్కృతీ, సాంప్రదాయలు, ఆచారవ్యవహారాలు ఈ నవలలో చిత్రించబడ్డాయి. ఇలాంటి నమ్మకాలు రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలో నేటికి కొనసాగుతున్నాయి.

భర్త చనిపోయి చిన్న పాపతో కూలి పని చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తున్న పూజారి కూతురు కాంచనను నీలకంఠం అనే తాగుబోతు అత్యాచారం చేస్తాడు. దానికి పరిష్కారంగా గ్రామ పెద్దలు అంతా కలిసి వారిద్దరికి పెళ్ళి జరిపిస్తారు. నీలకంఠం ప్రతిరోజు తాగి వచ్చి కాంచనను చిత్రహింసలు పెడుతున్నా భరిస్తూ ఉంటుంది. కానీ ఒక రోజు నీలకంఠం తాగి వచ్చి కాంచన కూతురుని చంపడానికి ప్రయత్నించినప్పుడు ప్రాణంగా పెంచుకుంటున్న కూతురుని కాపాడుకోవడానికి నీలకంఠంను చంపేస్తుంది.

పూణే సావిత్రి అనే మహిళ పల్లెల్లో ఉండే అమ్మాయిలకు డబ్బు ఆశ చూపిస్తూ పూణె తీసుకెళ్ళి వ్యభిచార వృత్తి చేయిస్తూ ఉంటుంది. కరువు వల్ల కుటుంబాన్ని పోషించుకోవడానికి వేరే దారిలేక ఆడవాళ్ళు ఆ వృత్తిలోకి వెళ్తుంటారు. అలాంటి వారిలో పూర్ణిమ అనే అమ్మాయి తన కుటుంబాన్ని పోషించుకోవడానికి కరువు కారణంగా గ్రామాల్లో ఏ పనులు లేకపోవడంతో పూణా సావిత్రితో వ్యభిచార వృత్తిలోకి వెళ్తుంది. కరువు కారణంగా కుటుంబ పోషణ కోసం ఎంతోమంది ఆడవాళ్ళు వ్యభిచార వృత్తిని ఎంచుకుంటున్నారు.

కరువుకాటకాల వల్ల కాంచన, పూర్ణి లాంటి స్త్రీల జీవితాలు ఏ విధంగా నాశనమయ్యాయో రచయిత ఈ నవల ద్వారా తెలియజేశారు.

గ్రామాల్లో ఏ పనులు లేకపోవడం వల్ల మగవారు మట్కాజూదం ఆడుతూ ఆస్తులను పోగొట్టుకుంటున్నారు. పచ్చని పంటలు పండాల్సిన పల్లెల్లో ఫ్యాక్టరీలను పెట్టి ఆ ప్రాంతం మొత్తాన్ని కలుషితం చేస్తున్నారు. నది పరివాహక ప్రాంతంలో ఉండే ఇసుకను దొంగతనంగా పట్టణాలకు తరలిస్తూ కొంత మంది వ్యాపారం చేసుకుంటున్నారు. కరువు కారణంగా బలి అవుతున్న రైతు కుటుంబాలను, నాశనమవుతున్న స్త్రీల జీవితాలను నేల దిగిన వాన నవల ద్వారా రచయిత తెలియజేశాడు.

వేంపల్లి గంగాధర్ గారు రాసిన 'యురేనియం పల్లె'. ఈ నవలలో కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని తుమ్మలపల్లె అనే గ్రామంలో నిర్మించిన యురేనియం ప్రాజెక్టు గురించి ప్రస్తావించబడింది. ఈ ప్రాజెక్టు వల్ల తుమ్మలపల్లే కాకుండా చుట్టు పక్కల పల్లేలోని రైతులు వారి భూములను కోల్పోయారు. వీరికి నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి యురేనియం ప్రాజెక్టులో ఉద్యోగం ఇస్తామని కలెక్టర్ గారు హామి ఇచ్చి వారి భూములను స్వాధీనం చేసుకున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ప్రజా సంఘ, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, పర్యావరణ నిపుణులు యురేనియం తవ్వకాల వల్ల జరిగే చెడు పరిణామాలను ప్రజలకు తెలియజేశారు.

యురేనియం కోసం గనులను త్రవ్విన తరువాత గని మూసివేసినా కూడా అప్పటికే వాతావరణంలో కలిసి పోయిన విష వాయువు వల్ల ప్రజలు విపరీతమైన హానికి గురి అవుతారని చెప్పడం మొదలు పెట్టారు. దేశంలో వివిధ అణువిద్యుత్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు ఏవిధంగా అనారోగ్యలకు గురవుతున్నారో వివరించారు. వారు తెచ్చిన కరపత్రాలను, ఫోటో ఆల్బమ్ కూడా చూపిస్తూ యురేనియం ప్రభావం పది కిలోమీటర్ల నుండి నూట యాభై కిలోమీటర్ల వరకు ఉంటుందని, భూగర్భంలో నీళ్లు కలుషితమవుతాయని, వ్యవసాయ బోర్లు ఇంకిపోతాయని చెప్పారు. అమెరికా, జపాన్, కెనడా లాంటి దేశాలే యురేనియం త్రవ్వకాలను నిలిపి వేయాలని భావిస్తున్నాయని, మన దేశంలో తవ్వకాలు చేపట్టడం మంచిది కాదని, యురేనియం తవ్వకాలను వ్యతిరేకించాలని ప్రజలల్లో అవగాహన కల్పించారు.

కొన్ని రోజులకి యురేనియం ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన వారికి విడతల వారిగా గవర్న మెంటు తరుపున డి.ఆర్.ఓ. గారి చేతుల మీదుగా చెక్కులు పంపిణి చేశారు. యురేనియం ప్రాజెక్టు ప్రారంభోత్సవం నాటి ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ఎలాంటి హడావిడి లేకుండా జరిగిపోయింది. ప్రారంభోత్సవాన్ని ముగించుకొని వెళ్తున్న ముఖ్యమంత్రి గారిని కొంతమంది విలేకరులు చుట్టుముట్టి యురేనియం ప్రాజెక్టు వల్ల ఆ ప్రాంత ప్రజలకు జరిగే ప్రమాదాల గురించి ప్రశ్నించగ.

"నా నియోజక వర్గానికి ఏదైనా ప్రమాదం జరిగే పనిని నేను ఒప్పుకుంటానా? నా నియోజక వర్గ ప్రజలకు నేను ఎప్పుడైనా అన్యాయం చేశానా? ప్రజల ఆశలు, ఆకాంక్ష లకు అనుగుణంగానే నేను ముందుకు వెళ్తాను మీలో ఉన్న అపోహలన్నింటిని వదిలి పెట్టండి అని చెప్పి వెళ్ళిపోయాడు.

ప్రాజెక్టు అధికారులు నష్టపరిహారం చెక్కులను ఇచ్చారు. కానీ ఉద్యోగాలు ఇవ్వకపోగ గనుల్లో రెండవ మైనింగు పనులు మొదలు పెట్టాలనుకుంటున్నారని తెలిసి ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ గారిని కలిసి మైనింగ్

పనులను ఆపమని చెప్పు భూగర్భంలో నీరు ఇప్పటికే ఇంకిపోయాయని తాగడానికి, పశువులకూ, వ్యవసాయ పంటలకు నీళ్లు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలని గ్రామస్తులు తమ గోడును వెల్లడించారు. ప్రాజెక్టులో పనిచేసే కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా సమ్మెలు జరిపారు. రాజకీయ నాయకుల స్వార్థం, నిర్లక్ష్యం వల్ల పంటలు పండాల్సిన వ్యవసాయ భూములు కాలుష్యానికి గురికావడంతో రైతులు ఆ ప్రాంతం వదిలి పట్టణాలకు వలసలు వెళ్ళిపోయారు. నేటికీ ఆ ప్రాంతంలోని ప్రజలు జలకాలుష్యం, వాయుకాలుష్యం వల్ల తీవ్రమైన అనారోగ్యాల పాలవుతున్నారు. కాలుష్య కారణంగా పుట్టే పిల్లలు అంగవైకల్యంతో పుడుతున్నారని యురేనియం పల్లె నవల ద్వారా రచయిత సమాజానికి తెలియజేశారు.

ఎంతమంది రాజకీయ నాయకులు అధికారంలోకి వచ్చినా యురేనియం తవ్వకాలు నేటికి జరుగుతూనే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు ఇకనైనా వారి స్వప్రయోజనాల కోసం కాకుండ పర్యావరణాన్ని, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని యురేనియం తవ్వకాల వల్ల వెలువడుతున్న కాలుష్యం భవిష్యత్ తరాల మీద ప్రభావం చూపకుండా ఉండే విధంగా నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1. నేల దిగిన వాన (నవల) - 2013
2. యురేనియం పల్లె (నవల) - 2019

★★★

భావవీణ
October 2024

BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

ISSN No. 2456-4702
RNI No. APTEL/2003/12253

स्वच्छ भारत
एक कदम स्वच्छता की ओर

# Swachh Bharat Mission (Grameen)







Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494660509.